
ISSN 0971-278X

# ప్రజాసాహితి


సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

ఏప్రియల్-జూలై, 2020
సంచిక : 436
వెల : 50/-




జనసాహితి ప్రచురణ





కవిత

# వలస కూలీలు

హిందీ మూలం : గుల్జార్

తెలుగు సేత : వేములపల్లి రాధిక


కోరలు చాచి రేగుతోంది కరోనా
నగరమంతా కార్చిచ్చులా!
రెక్కలు చాచి పరుగెడుతున్నారు ఇంటిదిక్కు
కూటికోసం వలసొచ్చిన కూలి నాలి జనం

ఇప్పుడు....
నగరాల్లోని యంత్రాలన్నీ కదలడం ఆగిపోయాయి,
కేవలం వాళ్ళ కాళ్ళూ చేతులూ మాత్రమే కదులుతున్నాయి
ఊళ్ళల్లో పాతుకుపోయిన బతుకు కుదుళ్ళకేసి!

ఇప్పటికీ ఊర్లోనే మిగిలున్న ఒకట్రెండెకరాల భూమో,
ఐదెకరాల బంజరో,
జొన్నో, మొక్కజొన్నో, గోధుమో, వడ్లో
పండీ పండని నాలుగు గింజల సాగులో
పంపకాల్లో అన్నదమ్ముల తగాదాలూ
నీళ్ళకోసం కాల్వగట్ల దొమ్మీలూ
ఒకసారటూ, ఒకసారిటూ
మెలికలు పెడుతూ
ఎడతెగని పంచాయితీలు చేసే తీర్పరులూ
తాత ముత్తాతల కాలం నుండీ
కొలిక్కిరాని కోర్టుకేసులూ
పెళ్ళిళ్ళూ, పేరంటాలు, వేడుకలూ
ఎండబెట్టే కరువులూ,
ముంచి తేల్చే వరదలూ,
తెలిబారిన ఆకాశంలో
రాలని వానచుక్క కోసం ఎదురుచూపులు
బతుకంతా ఉందక్కడే!
ఉంటే ఉంటాం; పోతే పోతాం!
మా బతుకు ఉన్నకాడికే మేం పోతాం!

వాళ్ళు....
నగరానికొచ్చిన ఆ వలస జీవులు....
కేవలం వాళ్ళ శరీరానికున్న ప్లగ్గునే
నగరపు 'సాకెట్'లో ఉంచారు....
....ఇప్పుడందరూ
ఆ ప్లగ్గును ఊడబీక్కొని తరలిపోయారు.
"పదండ్రా! అందరం ఊరికే పోదాం!
బతికితే అక్కడే బతుకుదాం!
చస్తే అక్కడే చద్దాం! అంటూ





జనసాహితి ప్రచురణ

43 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 43
సంచిక : 09-12
ఏప్రియల్-జూలై 2020

436

www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ❑ ముఖచిత్రం | : | మేడే – చిత్రకారుడు : ఎమ్. రాంబాబు | | .....01 |
| ❑ రెండవ అట్ట | : | వలస కూలీలు (కవిత) – హిందీ : గుల్జార్, తెలుగు : వేములపల్లి రాధిక | | .....02 |
| ❑ మూడవ అట్ట | : | అబార్షన్ (కవిత) – ఓ.వీ.వీ.ఎస్. లక్ష్మీకుమారి | | .....83 |
| ❑ నాల్గవ అట్ట | : | వలస పాట – ఆదేశ్ రవి | | .....84 |
| ❑ కార్టూన్లు, చిత్రాలు | : | అంతర్జాలం నుండి | | |
| ❑ సంపాదకీయం | : | కరోనా – పాలకుల విధానాలు – ప్రజలు | | .....06 |
| ❑ సమకాలీనం | : | వలస కార్మికుల గ్రామీణ అనుబంధాల..... | – దివికుమార్ | .....08 |
| ❑ మన తెలుగును రక్షించుకుందాం | : | ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమం చదువుల రద్దు | | .....10 |
| ❑ కథలు | : | పరుగు | – నౌగాపు | .....12 |
| | : | మే నెల మొదటిరోజున | – పి. లక్ష్మీకాంత మోహన్ | .....45 |
| | : | శ్రీశ్రీశ్రీ అలౌకికానందేంద్ర స్వాములవారికీ... | – శివాజీరావు | .....70 |
| ❑ వ్యాసాలు | : | జాత్యహంకారం, వివక్ష అమెరికా పెట్టుబడిదారీవ్యవస్థ... | – జి.వి.భద్రం | .....17 |
| | : | అంతర్యుద్ధం సృష్టిస్తున్న వేదనను చిత్రిస్తున్న సిరియా.... | – కొత్తపల్లి రవిబాబు | .....37 |
| | : | ప్రజల గుండెల్లో ప్రతిధ్వనించిన ఆదిధ్వని | – డా॥ భూసురపల్లి వెంకటేశ్వర్లు | .....66 |
| ❑ నివేదిక | : | విశాఖజిల్లా ఎల్.జి. పాలిమర్స్ దుర్ఘటనపై | | .....23 |
| ❑ సైన్సు సాహిత్యం | : | ప్రపంచవ్యాప్తంగా వైరస్‌ల దాడి | – డా॥ కొడవటిగంటి రోహిణీప్రసాద్ | .....24 |
| ❑ పుస్తక పరిచయం | : | కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక | – డా॥ ఆర్కే | .....26 |
| | : | నరమేధాలు–నియోగాలు–మహాభారతం ఒక పరిశీలన | – బి. విజయభారతి | .....53 |
| ❑ గల్పికలు | : | అయినోళ్ళకి కంచాలు, కానోళ్ళకి ఆకులు | – గౌరీశంకర్ | .....35 |
| | : | రాజు, రాక్షసి, ఒక రెట్టవేసిన చిలుక | – ఓ.వీ.వీ.యస్. | .....56 |
| ❑ సంభాషణ | : | కేపిటలిజం గుట్టు | స్వేచ్ఛానువాదం – బి.ఎస్.రాజు | .....41 |
| ❑ కవితలు | : | దివికుమార్ (**09**), ఓ.వీ.వీ.యస్. (**25**), సహచరి (**34**), పల్లిపట్టు (**36**), వంగర లక్ష్మీకాంత్ (**40**), అరవింద సిన్హా (**42**), రవి నన్నపనేని (**52**), నిఖిలేశ్వర్ (**63**), | | |

అనంతరావు (65), సయ్యద్ రసూల్, మౌళి (69), వై. నేతాంజనేయప్రసాద్ (72),
సూర్యప్రకాశ్ (73), అశోక్ కుంబము (74), ఎస్. శంకర్రావు (76), ఏటూరి నాగేంద్రరావు (77)

| | | | | |
|---|---|---|---|---|
| ❑ పాటలు | : | సోషలిస్టు సమాజాన్ని స్థాపించగ కదులుదాం | – రౌతు వాసుదేవరావు | .....11 |
| | : | కరోనా కాటు వేటు | – ఉప్పెన | .....25 |
| | : | తల్లీ కన్నీరు పెడుతుందో.... | – పాలేరు | .....60 |
| | : | కరోనా భూతం | – డా॥ జి.వి. కృష్ణయ్య | .....75 |
| ❑ బాలసాహితి | : | అలవర్తి వెంకట సుబ్బారావు, అక్షర | | .....43 |
| | : | ఎస్. అశ్వని, సంఘమిత్ర | | .....44 |
| ❑ సినిమా సమీక్ష | : | 'ది గ్రేట్ హ్యాక్' | – బాలాజీ కోల్‌కతా | .....49 |
| ❑ వ్యంగ్యం | : | లాక్‌డౌన్ @ యమపురి | – మనస్విని | .....63 |
| ❑ ధారావాహిక | : | ముక్కానీ నవల (16) – బెర్టోల్డ్ బ్రెఫ్ట్ | – జి.వి.భద్రం, కె.గౌరీశంకర్ | .....58 |
| ❑ ఖండన ప్రకటన | : | వరవరరావును విడుదల చేయాలి | – అఖిల భారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక | .....78 |
| ❑ ఈ నెల పుస్తకం | : | జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం | – డా॥ కొడవటిగంటి రోహిణీప్రసాద్ | .....78 |
| ❑ వివిధ | : | ఎర్నెస్టో కార్డినల్ మరణం | | .....61 |
| | : | పొత్తూరి వెంకటేశ్వరరావు స్మృతి | | .....07 |
| | : | చైతన్యవాహిని | | .....79 |
| | : | ఈ పుస్తకాలు అందాయి | | .....81 |
| ❑ శాశ్వతనిధి | : | చీడిపూడి సాంబిరెడ్డి, దీప్తినాథ్ | | .....05 |
| | : | గోరంట్ల మధుబాబు, గుత్తి సుందరమ్మ | | .....48 |
| ❑ సంతాపాలు | : | గురిజాల సీతారామయ్య | | .....11 |
| | : | డా॥ విజయం | | .....57 |
| | : | సి.ఎస్.రావు | | .....76 |
| | : | దొడ్డా హరిబాబు | | .....77 |



**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు  ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
**30–7–6,** అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – **520002.**
ఫోన్ : **7075957010** prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. **59,** రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – **532001**
ఫోన్ : **9441913829** prajasahithi1977@gmail.com

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| రెండవ, మూడవ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు మీ పేరు పైన వుంటాయి. దాని ప్రకారం చందా పూర్తికాకమునుపే, చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

## చీడిపూడి సాంబిరెడ్డిగారి 4వ వర్ధంతి



**చీడిపూడి** వేమమ్మ, సాంబిరెడ్డిగార్లది ప్రజాసాహితిని అభిమానించే కుటుంబం. వీరిది గుంటూరుజిల్లా నూతక్కి గ్రామం. వేమమ్మగారు 8-12-1999న రోడ్డు ప్రమాదంలో తన 50వ ఏట మరణించగా, 23-4-2016న సాంబిరెడ్డిగారు 75వ ఏట అనారోగ్యంతో మరణించారు. 2003లో రూ. 40వేలు 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి అందించిన వారి కుటుంబసభ్యులు సాంబిరెడ్డిగారి మొదటి వర్ధంతి సందర్భంగా మరొక 25 వేల రూపాయలు అందించారు. చీడిపూడి వేమమ్మ, సాంబిరెడ్డిగార్లను జ్ఞాపకం చేసుకుంటున్నాం.

ప్రజాసాహితి

## దీప్తినాథ్ 24వ వర్ధంతి



**26-3-1983 25-5-1996**

**దీప్తినాథ్** 26-3-1983న జన్మించాడు. చల్లపల్లి రాజా హైస్కూలులో 8వ తరగతి పూర్తిచేసాడు. తన వయసుకు తగ్గ ప్రజాఉద్యమ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవాడు.

మెదడులో **మెనింజైటిస్** వ్యాధితో– 1996 మే 25న దీప్తినాథ్ తన 14వ ఏటనే మరణించాడు.

అతని తల్లి గుత్తా నిర్మలాదేవి, తండ్రి ముప్పాళ్ళ భార్గవశ్రీ. వీరు **'ప్రజాసాహితి' శాశ్వతనిధికి** 25 వేల రూపాయలు విరాళం 2012లో అందజేశారు. వారికి కృతజ్ఞతలు. దీప్తినాథ్‌ను 24వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటున్నాం.

ప్రజాసాహితి

# సంపాదకీయం

# 'కరోనా' - పాలకుల విధానాలు - ప్రజలు

**ఉదయం** చూస్తే మంచు! మధ్యాహ్నం వరకు వడగాడ్పులు! అంతలోనే సాయంత్రం దట్టంగా కమ్ముకున్న మబ్బులు - ఉరుములు - మెరుపులు - భోరున వర్షం!! రాత్రి గడగడలాడించే చలి!!!

ఒక ఏడాది కాలంలో రావాల్సిన మూడు కాలాలూ ఒక్క రోజులోనే - కేవలం ఇరవై నాలుగు గంటల్లోనే! రుతువుల్ని ధ్వంసం చేస్తుంది ఎవరు? ప్రకృతి నియమాలను చిందరవందర చేసిందెవరు? ఎక్కడెక్కడో వైరస్‌లను తట్టి లేపుతుంది ఎవరు? పర్యావరణ విధ్వంసం ఎవరి ఖాతాలో జమ చేయాలి? ఇది పెట్టుబడిదారీ స్వలాభాపేక్ష సృష్టిస్తున్న కల్లోలం కాదా?

ఒకానొక కాలంలో ప్లేగు, ఆ తరువాత కలరా, ఆపైన స్పానిష్ ఫ్లూ, సార్స్, ఎబోలా ఇలా ఎన్నెన్నో అదుపుచేయలేనివాటిని జయించి మనిషి మనుగడ సాగిస్తున్నాడు. వేల వేల సంవత్సరాల మానవ నాగరికతనీ, సంస్కృతినీ,ప్రజారోగ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న ఆర్థిక రాజకీయ విధానాల్నీ, ఈరోజు కరోనా బోనులో నిలబెట్టి ప్రశ్నిస్తోంది. మానవ సామాజిక జీవన వ్యవస్థలన్నింటిని దుంప నాశనం చేస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు పర్యవసానంగా కరోనా విజృంభిస్తుంది.

ఈ భూగోళాన్ని తొమ్మిదిసార్లు ధ్వంసం చేయగల ఆయుధ సామాగ్రి ప్రపంచ దేశాల వద్ద ఉన్నాయి కానీ, బతికించడానికి ఉపయోగపడే వెంటిలేటర్లు మాత్రం సరిపడా లేవు. పెద్ద పెద్ద ఐరోపా దేశాలే, అమెరికాతో సహా ఈ కరోనాను అదుపు చేయడానికి తగినంత వైద్య సౌకర్యాలు అందించలేక చతికిల పడ్డాయి. ఆధునిక శాస్త్ర సాంకేతిక అభివృద్ధిని పెట్టుబడిదారీవర్గాలు తమ లాభాపేక్షకు ఉపయోగించుకుంటూ ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ఫలితమే ఈ రోజు కరోనా ముందు నిస్సహాయులమవటం. ప్రజా వైద్యరంగం పట్ల నిబద్ధత కలిగిన క్యూబా లాంటి సోషలిస్టు దేశాలు మాత్రం ఈ కల్లోల పరిస్థితుల్లో ప్రపంచానికి చుక్కానిగా నిలబడుతున్నాయి.

ముప్పై ఆరు కోట్లుగా ఉన్న అమెరికా జనాభాలో 4.4 కోట్ల అమెరికా ప్రజలకు ఆరోగ్య భీమా లేదు. వైద్య ఆరోగ్యరంగాలు ప్రభుత్వ రంగంలో ఉన్న దేశాల్లోనే ప్రజలకు తగిన వైద్య సహాయం అందుతోంది. క్యూబా, చైనా, ఉత్తర కొరియా ఇంకా మరికొన్ని మధ్య ఆసియా దేశాలు కరోనాను ఎందుకు నిలువరించ కలిగాయో కళ్ళు తెరుచుకునేలా కోవిడ్ 19 చేసింది. ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ అనే నినాదాలతో ముందుకు దూసుకుపోతున్న అభివృద్ధి నమూనా మొత్తం కుదేలైంది. సరిదిద్దుకోవడానికి, కనీసం ఆత్మవిమర్శ చేసుకోవడానికి నేటి సంక్షోభ పరిస్థితులు అవకాశం ఇవ్వటం లేదు.

ఇదే సందర్భంలో ఒక విషయం తప్పక గుర్తుకు వస్తుంది. హిరోషిమా, నాగసాకిల మీద అణ్వాయుధాలను, వియత్నాం మీద జీవ రసాయన ఆయుధాలను తొలిసారిగా ప్రయోగించింది అమెరికాయే. ఇలాంటి పరిస్థితుల్లో కరోనాను "చైనా వైరస్"అని ప్రచారం చేస్తూ, ప్రపంచపు అతిపెద్ద పోలీసుగా అమెరికా అధ్యక్షుడు క్రిమిసంహారక మందుల్ని సెలైన్ ద్వారా ఎక్కిస్తే కరోనా వైరస్ చస్తుందని అంటున్నాడు. ఇది అజ్ఞానమా? అహంకారమా? మరోపక్క చైనా ప్రపంచదేశాలను పుట్టి ముంచిందని, అంతర్జాతీయ కోర్టులో ఒక వ్యాజ్యమూ నమోదయింది.

ప్రపంచానికి ఆధ్యాత్మిక మోక్షానికి యోగా ద్వారా దారి చూపిస్తున్నాం అని జబ్బలు చరుచుకున్న భారతదేశ పాలనలో పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. భారత్‌లో కరోనా వ్యాప్తి చాప కింద నీరులా ప్రమాద ఘంటికలు మోగిస్తూనే వుంది. అమెరికా ప్రభుత్వం కరోనాకు కేటాయించిన నిధి లక్ష కోట్ల డాలర్లు. అంటే, 75 లక్షల కోట్ల రూపాయలు. భారతదేశ బడ్జెట్‌కి ఇది రెండు రెట్లు ఎక్కువ. మనదేశంలో ప్రజా వైద్యాన్ని సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల ఆదేశాలతో ఇంచుమించు ప్రైవేటీకరణ చేశారు. ఇప్పుడు ఆ స్టార్ హాస్పిటళ్ళలో కరోనాకు వైద్యం నిషేధం. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పగలనక రాత్రనక తిండి లేక నిద్ర లేక విశ్రాంతి లేక కనీస భద్రత లేని వాస్తవాన్ని ప్రశ్నిస్తే, అరెస్టులు, లాఠీలూ, అవమానాలు.... ఈ దారుణ పరిస్థితుల్లోనే సర్కారీ వైద్యులు, నర్సులు, పారిశుధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి ముందు వరుసలో ఎదురు నిలబడి శాయశక్తులా కరోనాతో అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఇక్కడే మనం గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. భారతదేశంలో కరోనా మరణాల రేటును పరిశీలిస్తే, 0.7%తో కేరళ సమర్థవంతంగా పని చేస్తోంది. అదే గుజరాత్ తీసుకుంటే కరోనా మరణాల రేటులో 6.1 శాతంతో కనిపిస్తోంది. కేరళ ప్రభుత్వం ప్రజారోగ్యం పట్ల వలస కూలీల పట్ల అనుసరించిన విధానాలని మిగతా రాష్ట్రాలు అమలుపరచలేదు.

స్వచ్ఛభారత్ అని ప్రతిష్టాత్మకంగా పరిశుభ్రత గురించి దేశవ్యాప్తంగా ఫోటో ప్రచారాలు చేసుకున్న ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ కలిసి పారిశుధ్య కార్మికులను అవుట్సోర్సింగ్‌గా, ఒప్పంద పద్ధతిపై అరకొర జీతాలతో నోటితో పొగిడి నొసటితో వెక్కిరిస్తున్నారు. అరకొర జీతగాళ్ళయిన పారిశుధ్య కార్మికులు ఈ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి రాత్రి పగలు కష్టపడుతున్నారు. వారిని పొగుడుతూ మీడియాలో వారిపై నాలుగు పాటలు అల్లి, కనీస భద్రత కూడా కల్పించకుండా చేతులు దులుపుకుంటున్నారు.

మరోపక్క లాక్ డౌనే అంతిమ పరిష్కారంగా బాల్కనీ ప్రజలకు ప్రధానమంత్రి మోడీ పిలుపునిచ్చారు. సామూహిక కరతాళ ధ్వనులు, గంటా వాయిద్యాలు, కరెంటు దీపాలు ఆపేసి చేతి దీపాలు వెలిగించడం, మహాయాగాలు చేయడం, యోగా చేయడం, అప్పటికి వినకపోతే

లారీలకు పని చెప్పడం అనే గోసాయి చిట్కాలతో, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించటమే అంతిమ పరిష్కారంగా చాటిచెబుతున్నారు.

20 లక్షల కోట్ల సహాయం అనే రాజకీయ బూటకం నడుపుతున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు, బహుళజాతి కంపెనీలకు సామాజిక సంపదలను ధారపోస్తున్న నగ్న సత్యాన్ని శ్రామిక ప్రపంచం నెత్తుటి పాదాల సాక్షిగా గమనిస్తున్నాం. పాలకవర్గాలు మాధ్యమాల ద్వారా పనిగట్టుకుని మభ్యపెడుతూ, నంగి నంగి మాటలతో, తప్పుడు లెక్కలతో, తేనె పూసిన కత్తులతో, మధ్య తరగతి సగటు బతుకుల్ని ఎల్లకాలం మోసం చేయలేవు.

దేవాలయాలు, చర్చిలు, మసీదులు మూసుకు పోయాయి. పౌరోహిత్య కార్యక్రమాలు బంద్ అయ్యాయి. ప్రధాన మీడియా కరోనా రోగుల లెక్కలు చెప్పటానికే పరిమితమయింది ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో, దాని మూలాలు ఎక్కడున్నాయో, దీని నుంచి ఎలా బయట పడాలో ఈ కీలక చర్చనంతటినీ పనిగట్టుకుని పాలకులు పక్కతోవ పట్టిస్తున్నారు. చిట్కాలు, ఆరోగ్యసూత్రాలు, కాలక్షేప కార్యకలాపాలు ఎలా నిర్వహించాలో చెప్పటంపై ఎలక్ట్రానిక్ మీడియా తలమునకలై ఉంది.

వలస పక్షులుగా, పని వెతుక్కుంటూ వెళ్ళిన గ్రామీణ బడుగు జీవితాలు పిల్లాపాపలతో వందల మైళ్లు కాళ్లు అరిగేలా నడుచుకుంటూ స్వగ్రామాలకు తిరిగి వెళుతున్నా, ఇవి ఏవీ పట్టని ప్రభుత్వ విధానాలు దేశాన్ని రెండు భారతదేశాలుగా విడగొడుతోంది. పేదవారికో నీతి, ఉన్నవాళ్లకో నీతి. అసలు భౌతిక దూరం" అనకుండా "సామాజిక దూరం" అంటూ ప్రజల మధ్య వైరుధ్యాల్ని, వివక్షలను పనిగట్టుకుని పెంచి పోషిస్తున్నాయి.

ఈ సందర్భంలోనే ఎకనామిక్ టైమ్స్ పత్రిక చేసిన వ్యాఖ్యను గుర్తు చేసుకుందాం.


"భారత్ లో వలస కూలీల శ్రమ చౌక / వలస కూలీల ప్రాణాలు కారుచౌక / అని కరోనా వైరస్ ప్రపంచానికి చాటింది.

ఈ కరోనా కల్లోలంలోనే భారతదేశంలోని 59 మంది అత్యంత ధనవంతుల దయనీయమైన కష్టాలు చూడలేక మోడీ ప్రభుత్వం వారి 69 వేల కోట్ల రూపాయల బకాయిలను రద్దు చేసింది.. అంతటితో ఆగక గుత్త పెట్టుబడిదారులకు 1.45 లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలను ఉదారంగా కల్పించారు. అంతే ఉదారంగా విశాఖపట్నంలోని ఎల్జీ పాలిమర్స్‌లో జరిగిన సంఘటన సందర్భంలో లాక్‌డౌన్ నిబంధనల్ని ఉల్లంఘించారని గ్యాస్ బాధితులను జ్యుడీషియల్ కస్టడీకి పంపమని కేసు పెట్టారు పోలీసులు. అది సరైంది కాదని, వ్యక్తిగత పూచీకత్తు మీద స్టేషన్ బెయిలు ఇచ్చి పంపమని హైకోర్టు ఆదేశించింది. ఇదే సందర్భంలోనే వలస కార్మికులను నడవకుండా ఎలా ఆపుతామని, సొంత ఊళ్లకు నడిచి వెళ్లాలి అనుకునేవాళ్ళను ఆపగలమా అని, వాళ్లను పర్యవేక్షించలేం అనీ సుప్రీంకోర్టు పెదవి విరిచింది.

అనుభవించేవాళ్ల ప్రపంచంలో అమర్చి పెట్టేవాళ్ళ జనాభాకి పట్టణాల్లోని పేదల వాడలే ఆలవాలమయ్యాయి. వీరు పని లేక, తిండి లేక, ఉండటానికి నీడ లేక సొంత గ్రామాలకు కాలి బాట పట్టారు. గుక్కెడు మంచినీళ్లు కూడా దొరకని పరిస్థితుల్లో, కాళ్లు పుళ్ళయి, కన్నతల్లి లాంటి సొంత ఊరిని చేరుకునే లోపునే అలసి రాలిపోతున్న అనాథ బాలలకు, ముసలి ముతక జనాలకు, దిక్కుమొక్కులేని మహిళలకు జనతా కర్ఫ్యూ శాపంగా మారింది. నెలరోజులపాటు వలస కార్మికుల పాదయాత్ర సాగుతున్నా పాలకులకు పట్టింపులేదు. కానీ విదేశాలలో ఉన్న భారతీయులను ప్రత్యేక విమానాల ద్వారా తీసుకువచ్చారు. సామ్రాజ్యవాద దోపిడీ ఆధిపత్య విధానాలే పేద దేశాల ప్రజల మరణాలకు కారణం అని ఈ కరోనా కాలం అర్థం చేయించింది. భారత ప్రజారోగ్య వ్యవస్థ దుస్థితిని కరోనా బట్టబయలు చేసింది.

సాహిత్యం, అందులోనూ ప్రజాసాహిత్యం – ప్రజల నుండి ప్రజలకు అనే శాస్త్రీయ గతితార్కిక దృక్పథంతో కృషిచేయాలి. నెత్తుటి పాదాల ముఖచిత్రంతో శ్రామిక భారత మరో ప్రపంచం మనం కోరుకునే మార్పు దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసమా? లేదా, దోపిడిలో భాగస్వామ్యం కోసమా? తెలుసుకోమని ప్రశ్నిస్తోంది. **30.04.2020** ✤

## పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావు మృతి



**ప్రముఖ** పాత్రికేయులు, రచయిత పొత్తూరి వెంకటేశ్వరరావు కేన్సర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో తన 86వ ఏట 5-3-2020న మరణించారు. ఆయన గుంటూరుజిల్లా పొత్తూరులో 8 ఫిబ్రవరి 1934న జన్మించారు.

అయిదు దశాబ్దాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగిన ఆయన 'ఈనాడు', 'ఆంధ్రభూమి', 'వార్త', 'ఆంధ్రప్రభ' పత్రికలలో పనిచేశారు. ఆయన జర్నలిస్టు జీవితం 1957లో 'ఆంధ్రజనత' పత్రిక సంపాదకుడిగా ప్రారంభ మయింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 'జర్నలిజం' విద్యార్థులకు 2004 నుండి 2010 వరకు గెస్ట్ లెక్చరర్‌గా పనిచేశారు. అప్పటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు రాసిన 'ఇయర్స్ ఆఫ్ పవర్' పుస్తకానికి సహ రచయితగా వ్యవహరించారు. కొంతకాలం ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గానూ పనిచేశారు. ప్రభుత్వానికి – మావోయిస్టు పార్టీకి చర్చలు నిర్వహించటంలో ప్రముఖపాత్ర వహించారు. 'నాటి పత్రికలు మేటి విలువలు' (2000), 'చింతన' (2001), 'చిరస్మరణీయులు' (2001) పుస్తకాలను రచించారు. ✤

సమకాలీనం

# వలస కార్మికుల గ్రామీణ అనుబంధాల సజీవత్వాన్ని, బలాన్ని రుజువు పరిచిన కరోనా!!

**మూడు** నెలలుగా కరోనా మహమ్మారి మానవ ప్రపంచాన్ని గిజగిజలాడిస్తోంది. మానవ సమాజంలో వర్గ వైరుధ్యాలు తలెత్తిన నాటి నుండీ సామాజిక వైరుధ్యాలే ప్రధానంగా సాగుతూండిన చరిత్ర ఆకస్మికంగా మానవ సమాజమంతా ప్రకృతి విలయమైన కరోనాపైకి ఎక్కుపెట్టాల్సిన స్థితి ఏర్పడిందా అన్నట్లు పరిస్థితులు కదలాడసాగాయి. అయితే ప్రపంచాధిపత్యశక్తులు ఈ పాప పంకిలాన్ని ఏ దేశం నెత్తిన రుద్దాలా అనే పోటీలో వున్నాయి. ప్రకృతి విధ్వంసమూ, పర్యావరణ సమస్యలు కలగలిసి ఈ మహావిపత్తుకి కారణమయినట్లు ఒక సాధారణ భావన వ్యక్తమయింది. కానీ, లాభాల వేటకై శారీరక బౌద్ధిక శ్రమశక్తిని కొల్లగొట్టటమే కాక, ప్రకృతి సహజమయిన అనేక వనరులను విధ్వంసం స్థాయిలో దోపిడీ చేస్తున్న సామ్రాజ్యవాద కార్పొరేట్‌వర్గాల అంతులేని స్వార్థపరత్వం ఈ దుస్థితికి కారణమయిందని కొద్దిమంది మాత్రమే గుర్తించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ శ్రమదోపిడీతో సంతృప్తిపడలేక, ప్రకృతి శక్తులను వైజ్ఞానిక జీవజన్య పరిశోధనలను కూడా విచ్చలవిడి దోపిడీ చేసే అమానుష ప్రక్రియకు పుట్టుకొస్తున్నవే కరోనా లాంటి ప్రాణాంతక వైరస్సులు.

మానవాళికి సంభవించే మహావిపత్తులను ఆ విపత్తులలో చిక్కుకుని వున్న కాలాలను తమ వర్గ ప్రయోజనాలకు వినియోగించుకునే రాజకీయ కళలో ఆధిపత్య పాలకవర్గాలు ఆరితేరి వున్నారని మన స్థానిక, దేశీయ ప్రపంచ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

### రక్షణ కరువైన వలస కార్మికులు! హక్కుల భక్షణలో కేంద్ర పాలకులు!!

అబద్ధాల ఫ్యాక్టరీతో నిజాల్ని అడ్డగోలుగా తల్లకిందులు చేయగలిగిన యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకున్న మోడీ ప్రభుత్వం, కరోనా లాక్‌డౌన్ ఫలితంగా బజారున పడిన కోట్లాది వలస కార్మికుల మహా విషాద, అత్యంత గంభీర మహాయాత్రను కప్పిపుచ్చలేకపోయింది. ప్రపంచ వ్యాపితంగా 200 దేశాలకు వ్యాపించిన కరోనా మహమ్మారి మరేదేశం ఎరగని రీతిలో కోట్లాది వలస కార్మికులను రోడ్లపాలు, ఎండలపాలు, ఆకలిపాలు, రక్తంవోడే గాయాలపాలు, నడిమధ్యనే ఆకలిచావులపాలు, చెట్ల నీడల్లో ప్రసవాలపాలు, గుక్కెడు నీళ్ళకై గుటకలపాలు ఒక్కమాటలో నరకయాతనలపాలు పడేట్లు చేసింది. ప్రపంచస్థాయిలో దేశ పరువు, ప్రతిష్ఠలను అత్యంత అవమానంపాలు చేసింది.

మనదేశంలో మొదటి కరోనా కేసు జనవరి నెలలోనే కనిపించినా, ఫిబ్రవరి మొదటి భాగంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించినా ట్రంపుతో ఆలింగనల కార్యక్రమాన్ని ఆర్భాటంగా మోడీ నిర్వహించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసు ప్రభుత్వాన్ని కూలగొట్టి తమ పార్టీ ప్రభుత్వాన్ని నెలకొల్పటానికి పాలకులకు కరోనా అడ్డురాలేదు. కేంద్ర ప్రభుత్వం కరోనాను ఎదుర్కోవటంలో ఎంత ఆలస్యమూ, నిర్లక్ష్యమూ వహించిందో, ఢిల్లీలో జరిగిన మర్కజ్ సమావేశానికి వెళ్ళిన ముస్లిం యాత్రికులే కరోనా వ్యాప్తికి కారణమని ప్రచారం చేయటంలో అంత చురుకుగా వ్యవహరించింది. విదేశాలలో వుంటున్న భారతీయులను ప్రత్యేక విమానాలలో తీసుకువచ్చే 'వందే భారత్' కార్యక్రమం చేపట్టిన కేంద్ర పాలకులు, 14 కోట్ల వలస కార్మికుల జీవితాలను గాలిలోకి వదిలేశారు. ఈ వలస కార్మికులలో అత్యధికులు ఆదివాసీలు, దళితులు, గ్రామాలలో బతుకులు కోల్పోయిన రైతు–కూలీలు! తమ అసమర్ధతను కప్పిపుచ్చు కోవటానికి అరక్షణం ఆలస్యం చేయకుండా చైనా సాకుని పదేపదే ప్రచారం చేస్తున్న కేంద్ర పాలకులు సందట్లో సదేమియాలాగా వందేళ్ళుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల చట్టాలను హరించి వేస్తున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో 8 గంటల పనిదినాల చట్టాలను 12 గంటలకు మార్పించారు. భాజపా – కాంగ్రెసులు రెండూ దొందూ దొందే నన్నట్లు ఆచరణలో రుజువు పరుచుకున్నాయి. రాజుగారి దేవతావస్త్రాలు లాంటి 20 లక్షల కోట్ల రూ. ప్యాకేజీ చాటున అనేక ప్రభుత్వరంగ సంస్థలను సంపన్న కార్పొరేట్‌వర్గాలకు ధారాదత్తం కావించే పలు చర్యలు చేపట్టారు. ప్రజలు బజారులోకొచ్చి సంఘటితంగా పోరాడే అవకాశాలు లేని స్థితిని తమ సామ్రాజ్యవాద యజమానుల సేవలకు, ఆదేశాల అమలుకు పూనుకున్నారు. తమ వ్యవస్థ సజావు నడవటానికి ఏర్పాటుచేసుకున్న కొన్ని సంస్థల స్వతంత్రతలను తమ నిరంకుశాధికారాలకు లోబర్చుకుంటూ వున్నారు. రాష్ట్రాలను ఉపగ్రహాలుగా, కేంద్రం గుమ్మం ముందు చిప్ప పట్టుకొని నిలబడే స్థితికి దిగజారుస్తున్నారు.

ప్రజలను బిచ్చగాళ్ళ కింద వెట్టిచాకిరీ కూలీలుగా దిగజార్చటానికి మొత్తంగా భారత పాలకవర్గాలు తమ మోసపూరిత కళలనన్నిటినీ ప్రదర్శించటంలో ఆరితేరి వున్నారు.

ఈ సందర్భంగా భారత వలస కార్మికుల దీక్ష పట్టుదల, కష్టనష్టాలను సహించి భరించి నిలువగలిగిన స్థైర్యమూ – ప్రజలు ఎంతటి త్యాగాలకయినా, నడిపిస్తే పోరాటాలకయినా తెగించగలరని, సాహసం ప్రదర్శించగలరని స్పష్టమైంది. వలస కార్మికుల గ్రామీణ అనుబంధం ఎంత గాఢమైనదో అర్థమైంది. కార్మిక – కర్షక శ్రామిక సంబంధాల సజీవత్వాన్ని, బలాన్ని కరోనా రుజువుపర్చింది.

శ్రామిక ఉద్యమశక్తుల చైతన్యవంతమైన సంఘటిత కృషి మాత్రమే పట్టణ, నగర జీవన బంధాల సాంఘిక, సాంస్కృతిక స్థాయిని ఉన్నతీ

కరించగలదు. గ్రామాల్లో బతుకులేని, పట్టణాల్లో చావలేని పరిస్థితులకు మూలమయిన అర్ధవలస – అర్ధఫ్యూడల్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానంతకాలమూ, శ్రమజీవులకు కాలు నిలదొక్కుకోలేని పరిస్థితులే మిగులుతాయి.

నేటికీ మిగిలి ఉన్న గత సంబంధాల సజీవతను కార్మిక – కర్షక ఉద్యమ బంధాలుగా పెంపొందించి బలోపేతం చేయటం విప్లవ నిర్మాణ శక్తుల కర్తవ్యం.

వలస కార్మిక ప్రజానీకంపట్ల పాలకవర్గాలు ప్రదర్శించిన నిర్లక్ష్యం అత్యంత హేయమైనది. ప్రపంచంలో మరే దేశంలో యింత అధమాధమ నిర్వహణను ఎవరూ ప్రదర్శించలేదు. అదే సమయంలో మనదేశంలో సాటి మానవులపట్ల చేయూతనందించే ఉత్తమ సంస్కారవంతులు కూడా తగినంతమంది వున్నారని తెలియవచ్చింది.

ప్రభుత్వరంగ వైద్యసేవలను నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేటు వ్యాపార వైద్యానికి చేయూతనిస్తున్న పాలకుల ప్రజావ్యతిరేక స్వభావం తేటతెల్లమయింది. అంతేకాకుండా బడా కార్పొరేట్ల దోపిడీ నిలయాలుగా వైద్యరంగాన్ని తయారుచేసిన పెట్టుబడిదారీ ప్రపంచ మార్కెట్టుశక్తుల ప్రజావ్యతిరేక తత్త్వాన్ని కరోనా బహిర్గతపరిచింది. సామ్యవాదమే ప్రత్యామ్నాయమని రుజువు పరిచింది.

పాలకుల సమస్త ప్రజావ్యతిరేక విధానాలు, చర్యలకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజలను చైతన్యపరచటం సాహిత్యకారుల కర్తవ్యం కావాలి.

## ముసుగు లేని అగ్రరాజ్య ప్రతినిధి ట్రంపు!!

ట్రంపు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇప్పటికి దాదాపు 19 లక్షలమంది అమెరికనులు కరోనా వ్యాధిగ్రస్తులై, ఒక లక్షమందికిపైగా ప్రాణాలు కోల్పోయి ప్రపంచ రికార్డుని నెలకొల్పారు. ప్రజలకు జవాబుదారీతనం నుండి తప్పించుకోవడానికి ట్రంపు అదే పనిగా చైనాను ఆడిపోసు కుంటున్నాడు. చైనాను ఏకాకిని చేసే వ్యూహంలో భాగంగా భారత్‌ను 'జి–7 దేశాల సమావేశానికి ఆహ్వానించటం అందులో భాగమే'. సామ్రాజ్యవాద ప్రపంచీకరణను (గ్లోబలైజేషన్) ప్రపంచంపై రుద్దిన అమెరికా సామ్రాజ్యవాదం, దాని పోటీలో తట్టుకోలేక తామొకనాడు నిర్దేశించిన 'వాణిజ్య – పెట్టుబడుల' స్వేచ్ఛా వ్యాపారానికి తానే గేట్లు మూసుకుంటోంది. కరోనా వ్యాప్తితో దాని సామాజిక ఫలాలను, తను తిరిగి ఎన్నిక కావటానికి (మరొక 5 నెలల్లో ఎన్నికలున్నాయి) వినియోగించుకోవటమెలా అని ట్రంపు మధనపడిపోతున్నాడు. అమెరికాలోని కరోనా పీడితులలో నల్లజాతివారు ఎక్కువ. ఇంతలో జార్జి ఫ్లాయిడ్‌ను శ్వేతజాత్యహంకార పోలీసు క్రూరంగా హతమార్చటంతో అమెరికా దేశమంతా భగ్గుమన్నది. 140 నగరాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. 40 నగరాలలో కర్ఫ్యూ విధించినా శ్వేతసౌధంపై దాడిదాకా నిరసన విస్తృతమయింది. కొనసాగుతున్న వర్ణ వివక్ష తీవ్రత పట్ల నల్లజాతుల ప్రజలు ఎంత ఆగ్రహంతో రగిలిపోతున్నారో ఈ సంఘటన బహిర్గతపరిచింది. అమెరికా ప్రజాస్వామ్యపు డొల్లతనాన్ని ఈ సంఘటన కళ్ళకు కట్టించింది. తిరిగి ఈ సంఘటనను, శ్వేత జాత్యహంకారానికి వాడుకుని తన ఎన్నికల గెలుపు పథకానికి మెట్లు వేసుకుంటున్న ట్రంపు ముసుగులేని అగ్రరాజ్య ప్రతినిధిగా రుజువు పరుచుకుంటున్నాడు. దోపిడీ, పీడనా, అణచివేతా, వివక్షా కొనసాగుతున్నంతకాలం వాటికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాట్లు చేస్తారని తేలిపోయింది. అమెరికాలోని నల్లజాతీయులు, వారితో కలిసి సాగిన అన్ని వర్గాల శ్రామిక, ప్రజాస్వామిక శక్తులూ ప్రపంచస్థాయి సంఘీభావం ప్రదర్శించి మరొకసారి చరిత్రను తిరగరాశారు.

కరోనా అనంతర ప్రపంచంపై ఆధిపత్యాన్ని నిలుపుకోవటానికి అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న దురహంకారపూరిత ప్రయత్నాలు ప్రపంచ ప్రజానీకానికి మరో విపత్తుని కొనితేనున్నాయి.

ప్రపంచ పోలీసుగా అగ్రరాజ్యాధిపత్యాన్ని చెలాయిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదం కరోనా సంక్షోభాన్నీ, తన ఆంతరంగిక జాత్యహంకార తత్వానికి వ్యతిరేకమైన ప్రతిఘటననూ చవిచూసి మరొకసారి తన నైతిక బలాన్ని కోల్పోయింది. అలాంటి అమెరికా సామ్రాజ్యవాదంతో భారత పాలకులు అంటకాగటం సిగ్గుచేటు!!

**చివరాఖరు :**

భారత పాకిస్తాను పాలకులు ఆయుధాల పోటీలో పడి, తమ ప్రజలకు వైద్య సౌకర్యాలను కల్పించటంలో విఫలమవుతున్నారు. కనుక ఉపఖండంలో ఆయుధ పోటీకి వ్యతిరేకంగా ప్రజానీకం ఉమ్మడిగా ఉద్యమించాలి. అలాగే ప్రపంచ అగ్రరాజ్యాలు తమ మిలిటరీ బడ్జెట్లకూ, యుద్ధోన్మాద ప్రయత్నాలకూ దేశ సంపదలను వినియోగించటానికి వ్యతిరేకంగా, ప్రపంచ శాంతికై ప్రజలు గొంతెత్తాలి. వైద్య, విద్యా, ఉపాధిరంగాలకు బడ్జెట్ల కేటాయింపులు బాగా పెంచాలని డిమాండు చేయాలి.

**2-6-2020** – దివికుమార్ ✤

కవిత

## పాదాలు

– దివికుమార్

పల్లెలలో బతకలేక వలసపోయిన పాదాలు
నగరాల్లో చావలేక తల్లి ఒడికై తపించి
యింటి బాట పట్టిన పాదాలు
చావుని ధిక్కరిస్తున్న పాదాలు
ఆధునిక మహాయాత్రకు
చరిత్ర నిర్మాతలైన పాదాలు
దండి యాత్రలను ఆయోధ్య జాతరలను తెర వెనుకకు
నెడుతున్న పాదాలు
ఏ శక్తి పిడికిలైతే దోపిడీశక్తులు గజగజలాడతాయో
ఏ నెత్తుటి చారికలు మరో చరిత్రకు దారి
చూపుతాయో
వేటి సంకల్ప బలానికి ప్రపంచం తల
దించుకుంటోందో
ఆ శ్రమజీవన పాదాలకు
మనసా వాచా కర్మేణా పాదాభివందనాలు!! ✤

# ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమం చదువుల రద్దు!

**"తాడిచెట్టు** ఎందుకు ఎక్కావు అంటే, దూడ మేత కోసం" అని వెనుకటికొకరు జవాబు చెప్పారట! తెలుగు మాధ్యమం రద్దు దేనికి అంటే "ప్రభుత్వ బడులలో చదివే బడుగులందర్నీ డాక్టర్లుగా, ఐ.ఎ.ఎస్. అధికార్లుగా చేయటానికి" – ఇదీ జగన్మోహనరెడ్డి ప్రభుత్వ జవాబు. ఈ సందర్భంలోని ఒక మోసపూరిత మెలిక ఏమిటంటే, తెలుగు మాధ్యమం రద్దు అనేది వినపడనీయకుండా చదువులన్నీ ఆంగ్ల మాధ్యమంలోనే అనటం! నిజానికి యిప్పటికే ప్రభుత్వ బడులన్నీ ఆంగ్లం – తెలుగు రెండు మాధ్యమాలలో సాగుతున్నాయి. ఇక నుండి ఆంగ్ల మాధ్యమంలో చదువులు అంటే, అదేమీ కొత్తగా ప్రవేశపెడుతున్నది కాదు. కానీ ఆంగ్ల మాధ్యమంలో మాత్రమేనని ప్రభుత్వం చెప్పేదాని సారాంశమేమిటి? పాత ఆంగ్ల మాధ్యమం కొనసాగుతుంది, కొత్తగా తెలుగు మాధ్యమం ఇక వుండదు అనే కదా! సారాంశంలో ప్రభుత్వ బడులలో సాగుతున్న తెలుగు మాధ్యమాన్ని రద్దుపర్చటమే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం! ఈ ప్రభుత్వానికి నిజాలు మాట్లాడే 'ఉక్కు సంకల్పం' మాత్రం లేదు!!

మాతృభాషా మాధ్యమంలో చదువులు రద్దు అనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం భారత రాజ్యాంగం ప్రకారం చెల్లదు. ఇటీవల కస్తూరి రంగన్ కమిటీ సూచించిన, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 'విద్యాహక్కు చట్టం' ప్రకారం కనీసం 8వ తరగతిదాకా బాలబాలికలకు మాతృభాషా మాధ్యమాలలోనే బోధించాలి. ఐక్యరాజ్యసమితి (యునెస్కో) గత అనేక దశాబ్దాలుగా ఘోషిస్తున్న 'తల్లిభాషలలోనే చదువులు' ప్రకారం దీనికి అంతర్జాతీయ ఆమోదం లభించదు. భారతదేశంలోనే కాదు ప్రపంచంలోనే మాతృభాషా మాధ్యమంలో చదువులు రద్దుపరిచిన సిగ్గులేని పాలకులు ఎవరూ లేరు. ప్రపంచస్థాయి భాషాశాస్త్రజ్ఞులు, మనోవైజ్ఞానికులు, విద్యావేత్తలు ఎవ్వరూ దీనిని హర్షించరు. ఎందుకంటే భాషాబోధనా శాస్త్ర ప్రక్రియకే యిది విరుద్ధమయినది కనుక!!

మరి జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఎందుకిలాంటి తల్లకిందుల నిర్ణయానికి పూనుకుంది? నిజంగా తెలుగు మాధ్యమంలో చదువులు రద్దు సాధ్యపడుతుందనేనా? లేక ప్రజలలో ఇప్పటిదాకా గూడుకట్టుకుని వున్న వాస్తవమైన అసంతృప్తులకు అసాధ్యమైన పరిష్కారాలతో బడుగులను ఆకట్టుకునే చౌకబారు ప్రయత్నమా? ఆంగ్ల మాధ్యమంలో చదువులు సాగుతూ వుండగానే, ఆంగ్లమాధ్యమంలో చదువులకు సమ్మతిని తెలుసుకోవలసిన పని యేముంది? రద్దు అవుతున్నది తెలుగు కదా! తెలుగు మాధ్యమంలో చదువుల రద్దుపట్ల అభిప్రాయ సేకరణ జరిపి వుంటే ప్రభుత్వం కొంతలో కొంత నిజాయితీని ప్రదర్శించిం దనుకోవచ్చు. దీనిని కప్పిపుచ్చటం ఖచ్చితంగా మోసపూరిత చర్య!!

"వాస్తవ సమస్యలు – తప్పుడు పరిష్కారాలు" అన్నది పాలకవర్గ సంస్కృతి. అది జగన్మోహనరెడ్డి, నరేంద్రమోడీల ప్రభుత్వాలే కాదు – ట్రంపుదాకా అదే తంతు! ప్రభుత్వ బడులలో గత 12 సంవత్సరాలుగా అమలు జరుగుతున్న ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల ఎంతమంది ఐ.ఎ.ఎస్.లు, డాక్టర్లు అయిపోయారు? నిజంగానే అందరూ డాక్టర్లు, ఐ.ఎ.ఎస్.లూ అవుతారని అనుకుందాం. వారిని ఇముడ్చుకోగలిగిన వ్యవస్థ వుందా?

నిరుద్యోగ సమస్యకు వ్యవసాయ, పారిశ్రామికరంగాలు చిక్కుకొని వున్న సంక్షోభం కారణమైతే, దానికీ చదువుల మాధ్యమానికీ ముడిపెట్టి మాట్లాడటం పచ్చిమోసం! ఆంగ్ల మాధ్యమంలోనే చదువుకున్నవారిలో అత్యధికులు రోడ్లవెంట బలాదూరు తిరగాల్సిన దుస్థితి. వారిలో అత్యధికులు ఆంగ్లంలో పట్టుమని పది వాక్యాలు తప్పులు లేకుండా రాయలేరు. దానికి కారణం ప్రైవేటు బడులతో సహా విద్యావిధానంలో నెలకొన్న మార్కుల, బట్టీయం చదువులు!! రోగమొకటీ, మందు యింకొకటీ అంటే యిదే!!

మళ్ళీ విషయానికి వస్తే.... రాష్ట్ర ప్రభుత్వపు మాతృభాషా మాధ్యమం రద్దు నిర్ణయాన్ని రాష్ట్ర హైకోర్టు చెల్లదని, చట్టవిరుద్ధమని కొట్టివేసింది. ఆశ్చర్యం! ప్రభుత్వం యిసుమంత కూడా సిగ్గుపడలేదు! పొరపాటును దిద్దుకుంటాననకపోగా సుప్రీంకోర్టుదాకా కేసును తీసుకుపోదలచుకుంది!!

ఒక్క మాతృభాషామాధ్యమం రద్దు జి.వో.నే కాదు, పంచాయితీ, ప్రభుత్వ కార్యాలయాలకు తమ పార్టీ రంగులు వేయించటమే కాదు, రాష్ట్ర ఎన్నికల కమీషనర్‌ను ఏకపక్షంగా ఒక్క కలం పోటుతో తొలగించటమే కాదు మొత్తం 52 వారాల పరిపాలనలో హైకోర్టు ద్వారా 65 అభిశంసనలు పొందిన మహా ఘనత వహించిన మరో ప్రభుత్వమేదీ వుండదేమో!!


మన తెలుగును రక్షించుకోవటానికి ఈ క్రింది డిమాండ్లతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి! రోజురోజుకీ ఆర్థిక – రాజకీయ సంక్షోభంలో కూరుకుపోతున్న నేటి సామాజిక వ్యవస్థను, దానికి ప్రజాస్వామ్యమని పేరు పెట్టుకున్నప్పటికీ, నిరంకుశ పద్ధతులలో తప్ప దానిపై అధికారాలను నిలబెట్టుకోలేని పరిస్థితులు దాపురించాయి. మన అర్ధవలస – అర్ధభూస్వామ్య వ్యవస్థకుండే లక్షణంగా దీన్ని అర్థం చేసుకోవాలి. రాజకీయ వ్యవస్థకు మిగిలిన వ్యవస్థలన్నీ లోబడే విధంగా లొంగదీసుకోగలవారినే అవి నిలదొక్కుకోనిస్తాయి. సర్వసాధారణ అవినీతికర పద్ధతులన్నిటికీ రాజకీయ చతురతగా వాటిని చిత్రిస్తాయి. సాంప్రదాయక బూర్జువా ప్రజాస్వామ్యాన్ని కూడా చేతగానితనం కిందకు మారుస్తాయి. కాలుష్యంతో సహజీవనానికి అలవాటు చేస్తున్నట్లుగా, అలనాటి బ్రిటీషు పాలకులకు కూడా సాధ్యం కాని మాతృభాషా మాధ్యమం రద్దుకి ప్రజామోదాన్ని కూడా పొందుతాయి! ఇప్పటికైనా జగన్మోహనరెడ్డి ప్రభుత్వం విద్యావ్యవస్థలో నెలకొన్న అస్తవ్యస్తతలను సరిదిద్దటానికి పూనుకోవాలి. ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాలి. నిరక్షరాస్యత నిర్మూలించాలి. ప్రజలభాషలో పరిపాలన అమలుచేయాలి. తల్లకిందుల పరాయి మాధ్యమం చదువుల ఆలోచనను విరమించుకోవాలి!! అందరికీ ఒకే విద్య (కామన్ స్కూల్ సిస్టమ్) ప్రభుత్వమే అందించాలి. ✤

## పాట సోషలిస్టు సమాజాన్ని స్థాపించగ కదులుదాం

- రౌతు వాసుదేవరావు

నేల నీరు గాలి వెలుగు ఆకాశలన్నిటిని
మలినం చేసిన పాపం చుట్టుకొనగ మనిషినీ
కరోనా వైరస్సై కమ్ముకొనెను నేడురా
మృత్యుఘోష పెడుతున్నది మానవాళి చూడరా ॥ నేల ॥
గ్రామ స్వరాజ్యం వదిలి నగరీకరణం చేసిరి
రసాయనాలెదజల్లి విషం కుమ్మరించిరి
కాలుష్యపు కోరల్లో వనరులన్ని విలపించగ
వింత వింత రోగాలతో లోకాన్నే ముంచిరి ॥ నేల ॥
ప్రపంచమె కుగ్రామం అనే కుటిల బాటలో
బహుళజాతి కంపెనీల లాభాల వేటలో
ప్రజల నోట మట్టి కొట్టి కార్పొరేటు పరంజేసి
సేవారంగాలనెల్ల గాలికొదిలె పాలకులు ॥ నేల ॥
డబ్బుతోనె జబ్బు కూడ గ్లోబలైజు అయిపోయెను
కంటికి కనిపించనెన్నో వైరస్సులు వికటించెను
కార్పొరేటు ఆసుపత్రి లాక్‌డౌన్ అయ్యెనంట
ప్రజారోగ్యం వ్యవస్థకటి దిక్కాయెను మనకంట ॥ నేల ॥
పుట్టెడు కష్టాల తోడ బ్రతుకు బారమయ్యేటోడు
పుట్టిన ఊరును వదిలి వలస బాట పట్టినోడు
ఎంత గుండె గాయమయినో సొంతూరికి పయనమయ్యి
ఏలికలను వెక్కిరిస్తు వేల మైళ్లు నడిచినాడు ॥ నేల ॥
మార్కెట్టు మాయలో పడి విలవిలలాడిన రైతు
కార్మిక సోదరుని పాలి వికటించిన చట్టాలు
కొనుగోలు శక్తిలేక చిరుద్యోగి నిరుద్యోగి
ఉద్దీపన పేకేజ్ ఉసురున బడుచున్నారు ॥ నేల ॥
ప్రాణాలను ఒడ్డి సేవలందించే వారలు
వైద్యులు, నర్సులు, సఫాయిలు, పోలీసులు
రక్షణ సామగ్రి లేని నిర్లక్ష్యపు విధానాలు
చప్పట్లు, దీపాలు పూలతో సరిపెట్టినారు ॥ నేల ॥
పాదయాత్ర బృందాలను ఆదుకునే హృదయాలు
తమ చెంతన పేదలకు చేయూత నిచ్చువారు
లోకములో మానవత మిగిలుందని చాటినారు
పాలకుల దృష్టి కొంత మారినట్లు చేసినారు ॥ నేల ॥
సంపద సృష్టించే మాకు ఈతి బాధ లెందుకని
ఆకర్షక పథకాలతో మా బతుకులు మారవని
సకల రుగ్మతలు తోడ, వైరస్సుల నధిగమించె
సోషలిస్టు సమాజాన్ని స్థాపించగ కదులుదాం ॥ నేల ॥


## హేతువాది గురిజాల సీతారామయ్య మరణం



**గురిజాల** సీతారామయ్యగారు గుంటూరుజిల్లా తెనాలి తాలూకా కూచిపూడి గ్రామంలో 18 అక్టోబర్ 1929న జన్మించారు. ఆయన 29 ఏప్రిల్ 2020న తన 91వ ఏట విజయవాడలో మరణించారు.

సీతారామయ్యగారు చిన్ననాటి నుండి హేతువాద భావాలతో వుండేవారు. త్రిపురనేని రామస్వామి, గోరా భావజాలంతో ప్రభావితులయ్యారు. ఆవుల గోపాలకృష్ణమూర్తికి సన్నిహితులు. ఎమ్.ఎన్.రాయ్ భావాలకు ఆకర్షితుడైన ఆయన తన ఇంటికి ఎమ్.ఎన్.రాయ్ భవన్ అని పేరు పెట్టారు. తెనాలిలో 'సెంట్రల్ కేఫ్' అనే హోటల్‌ను నడిపేవారు. విమానం మేడ ఆయన ఇల్లు. ఆయన ఇంట్లో నిరంతరం నాస్తిక హేతువాద సమావేశాలు సభలు నిర్వహిస్తుండేవారు. ఆయన నమ్మిన ఆశయాలను ఆచరిస్తూ కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించారు. మత సాంప్రదాయాలకు వ్యతిరేకంగా నిలబడ్డారు. తమ కుటుంబసభ్యులకు ఆదర్శ వివాహాలు జరిపించారు. కవిరాజు పార్కులో సీనియర్ సిటిజన్ ఫోరం కార్యక్రమాలను నిర్వహణలో భాగస్వాములు, ప్రజాసంఘాలకు ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలందించేవారు. ఎమర్జెన్సీ కాలంలో ఎమర్జన్సీకి వ్యతిరేకంగా సాగిన ఫ్రంట్‌లో భాగస్వాములయ్యారు.

గురిజాల సీతారామయ్యగారి మృతికి సంతాపం ప్రకటిస్తున్నాం. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాం. ✤



కథ

# పరుగు

- నౌగాపు

**అతను** పరిగెడుతూ ఉన్నాడు....

ఊపిరి ఆడడం లేదు, శ్వాస అందడం లేదు, శరీరం సచ్చు బడింది, ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదు, ఎంతవరకు పరిగెట్టాలో తెలియటం లేదు....

గతంలో ఎంతగానో పరిగెట్టాడు. ఆ అనుభూతి వేరు.

చిన్నప్పుడు ఆటలాడుతూ పరిగెట్టాడు, సంతోషం పొందాడు. ఆ పరుగులో కాలు జారి పడ్డాక బావురు మన్నాడు.

బస్సు అందుకోవటం కోసం పరిగెత్తాడు, అందుకున్నాక తృప్తి పొందాడు, అందనప్పుడు బాధపడ్డాడు.

కుక్కో, క్రూరమృగమో వెంట పడ్డప్పుడు పరిగెత్తాడు, తప్పించుకున్నాక ఊపిరి పీల్చు కున్నాడు, చిక్కుకున్నాక చికిత్స తీసుకున్నాడు.

అందలమెక్కడానికి అడ్డదారుల్లో పరిగెట్టాడు,

అక్కడకు చేరుకున్నాక, ప్రక్కోడిని సాటి మనిషన్నదే మరిచి పైశాచిక ఆనందాన్ని పొందాడు, ఎక్కలేనప్పుడు గోతులు త్రవ్వి కసి తీర్చుకున్నాడు.

కానీ ఈరోజు పరుగులో ఏ ఆనందమూ లేదు, దుఃఖమూ లేదు, తృప్తి లేదు, అసూయ లేదు... ఉన్నదల్లా ఒకటే భయం.

ఇంతకు మునుపు....

ఎండ, వానలనుండి రక్షణకు మేడలు కట్టాడు, తరతరాల విలాసాలకు సరిపడే సంపదలు కూడబెట్టాడు, శత్రువుల దాడులను తిప్పికొట్టేందుకు యుద్ధ సామగ్రిని సృష్టించాడు....

కానీ, ఇప్పుడవేవి అతనిని కాపాడ లేకున్నాయి.

అతను సృష్టించుకున్న హైటెక్ యంత్రాలు, శాస్త్రాలు, వైద్యం, మందులు... అన్నీ కర్ణుడి విద్యలా సమయానికి పనికిరాకుండా పోయాయి...

అతని ఎత్తులు – కుయుక్తులు, వ్యూహాలు – ప్రతివ్యూహాలు, మేధస్సు – మేనేజ్మెంట్‌లు అన్నీ దాసోహం.... చూపు లేదు, శబ్దం లేదు, స్పర్శ లేదు, రుచి లేదు, వాసన లేదు.... పంచేంద్రియాలకందకుండా అగోచరమై అది వెంటాడుతోంది.

వేరే మార్గం లేక,

అతను పరిగెడుతున్నాడు.

అతను వేసుకున్న అందమైన రోడ్డు పై పరిగెడుతున్నాడు....

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

అతను పరిగెడుతూ ఉన్నాడు....

బస్‌స్టాప్‌లో ఒక బిచ్చగత్తె కూర్చుని ఉంది.

ఆమెను కూడా పరిగెత్తమని అతను సైగ చేశాడు, దాడి జరుగుతోందని హెచ్చరించాడు, చచ్చిపోతావని బెదిరించాడు...

అంత భయంగా ఉంటే తన పక్కన వచ్చి దాక్కొమ్మని నిర్భయంగా చెప్పింది ఆమె.

ఆమె కళ్ళల్లో కాసింతైనా భయం కనబడలేదు.

తన పరుగును యధావిధిగా కొనసాగించాడు అతను...

ఆ రోడ్డుకు ఒకవైపు కార్లు, కంప్యూటర్లు, ఆకాశహర్మ్యాలు, రంగురంగుల విద్యుత్ కాంతులు... మరోవైపు రంగురంగుల పూలు, పొడవాటి చెట్లు, ఎటు చూసినా పచ్చదనం...

మధ్యలో అతను గీత గీసుకొని సాగుతున్నట్లు ఉంది. ఆ గీతకు ఒకవైపు వెక్కిరిస్తూ ఉంటే మరోవైపు తల్లిలా చల్లగా దరిచేర మంటోంది. కానీ ఆ చల్లదనం వైపు వెళ్లే ధైర్యం చాలటం లేదు.

అతను అదిరిన కోడిపిల్లలా బెంబేలెత్తి ఉన్నాడు....

ముందు ఈ దాడి నుంచి బయట పడాలి, బతికి బట్ట కట్టాలి... బ్రతికుంటేగా ఆ బలుసాకు కోసం వెళ్ళేది...

అతను పరిగెడుతూ ఉన్నాడు....

రోడ్డు అకస్మాత్తుగా మాయమయ్యింది...

అతను అదే వేగంతో క్రిందకు పడ్డాడు....

అంతే, అదో అగాధం...

...... ....... .......

అతను అదిరి మంచం పై నుంచి చొప్ప కట్టలా నేలపై పడ్డాడు. లోయలో కాదు పడింది, కలలో అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నాడు. కష్టాన లేచి ముందుకు జరిగాడు.

స్టూల్ అంచున బొంగరంలా తిరుగుతూ ఊగుతున్నాడు మనుమడు. ఎదురుగా కంప్యూటర్ స్క్రీన్, చేతిలో జాయిస్టిక్.... వాడిదేదో లోకం. కంప్యూటర్ గేమ్ ఆడుతూ పడిపోతాడేమోనని సందేహం వచ్చి పట్టుకో బోయాడు అతను. "తాతయ్యా! సోషల్ డిస్టెన్స్.." నాకేం కాదన్నంత ధీమాతో అన్నాడు మనవడు. "ఆ గీతేదో మనుషుల మధ్య కాకుండా, మనిషికి కంప్యూటర్‌కి మధ్య ఉంటే బాగుండేది" తాతయ్య మనసులోని మాట మనసులోనే ఉంది "వెళ్ళు తాతయ్యా! ఈ నాలుగు రోజులైనా నన్ను వదిలేయండి. ఆ తర్వాత తెల్లవారి లేచింది మొదలు, రాత్రి పడుకునే వరకు... ఆ స్కూలు, పుస్తకాలు, ట్యూషన్లు.... మళ్లీ పరుగే కదా.... ఇంత మంచి అవకాశం ఇచ్చిన ఆ వైరస్ కనబడితే గట్టిగా పట్టుకొని ముద్దుపెట్టుకోవాలని ఉంది" అత్యుత్సాహంతో శరీరాన్ని ఝులిపిస్తూ అన్నాడు మనవడు. ఆ మాటతో పిల్లిపిల్లలా వులిక్కి పడ్డాడు అతను. ఎక్కడ ఆ వైరస్ ఈ మాట విని, ఇంట్లోకి దూరేస్తుందేమోనని, ఒక్క పరుగున లేడిపిల్లలా చెంగున లేచి తెరిచి ఉన్న తలుపుల్ని మూయబోయాడు అతను.

అప్పుడే గుమ్మంలో పడింది, న్యూస్ పేపర్. కానీ ఇప్పుడది అతనికి న్యూస్ పేపర్ కాదు, బాంబు. మనుమడి మాట విన్నదేమో ఈ మాయదారి వైరస్? పేపర్ ద్వారా వచ్చి

ముద్దు పెట్టేసుకుంటే... అమ్మో?!!! తలుపులు మళ్లీ ఈదురుగాలికి పడ్డట్టు దబాలునపడ్డాయి.

అతనికి వార్తా పత్రికల ద్వారా ప్రపంచ వీక్షణం చేయందే దినం మొదలవ్వదు. కానీ ఏం చేయగలడు, ముందుకెళ్తే మహమ్మారి.. ముందు ప్రాణం, తర్వాతే ఏదైనా? అందుకే న్యూస్‌పేపర్‌కు గీయాల్సి వచ్చింది లక్ష్మణ రేఖ, నాలుగు గంటల క్వారంటైన్.

"ఏవండోయ్! అలా బోనులో పడ్డ ఎలుకలా తిరిగే కన్నా, వీధిలోకి వెళ్లి ఓ పాల ప్యాకెట్ తీసుకురాకూడదు" ఆవిడ మాట పిడుగులా పడింది అతని చెవిలో. ఆవిడ ఆర్డర్ వేసిందంటే, అతను తూచా తప్పకుండా పాటించాల్సిందే.... లేకపోతే ఆరోజు ఇంట్లో ప్రపంచయుద్ధమే. ఇలాంటి ప్రపంచ యుద్ధాల్లో అరితేరిన అతను.... ఇంట్లో యుద్ధం గురించి భయపడడం లేదు, ఇల్లు దాటి బయట అడుగుపెట్టాలంటేనే గుండెలు పగిలేలా ఉన్నాయి. బయట ప్రాణాలు తీసే కనబడని వైరస్, కనబడితే వీపు వాయించే పోలీస్... అమ్మో! మళ్లీ గుండెల్లో భయం పరుగులు.

ఇంతలో సైకిల్ బెల్ మోగింది. చిన్న పిల్లవాడికి ఐస్క్రీమ్ బండివాడు వచ్చినంత ఆనందం అతనిది. ఆపద్బాంధవుడులా పాలవాడు వచ్చాడని మరో ఆలోచన లేకుండా తలుపు తీసాడు అతను. అవును పాలవాడే.

"ఏమే! ఏం వరాల నోరే నీది, పాలు అనగానే పాలవాడు వచ్చాడు, ఏదీ ఆ గిన్నె తీసుకురా" ఆమెతో అతను అన్నమాట పూర్తవకముందే, "డబ్బు"లన్నాడు బుర్ర గీక్కుంటూ పాలవాడు. "పొగిడితే గిన్నె తీసుకొస్తుందని అలా అన్నానులే రా. డబ్బు అనగానే డబ్బేం వచ్చేయదు, తనేం ధనలక్ష్మి కాదు" పాలవానితో నెమ్మదిగా అంటూ "అవును రరేయ్... వరం కోరుకుంటే వైరస్‌ను చంపాలని కోరుకోవాలిగాని, ఈ చావు కాలంలో కూడా డబ్బు గోలేంట్రా నీకు?" యధావిధిగా రెండడుగులు ముందుకు వేసి, సోషల్ డిస్టెన్స్ గుర్తుకు వచ్చి ఆగిపోయాడు అతను.

"అయ్యా నేను అడుగుతుంది ఏ వరమో కాదు, గత నెల పాల బిల్లయ్యా.. ఈ మహమ్మారి వల్ల ఎందరు పోతారో ఉంతారో తెలీదు గాని, ఇదే పరిత్తితి కొన్ని రోజులు సాగితే మాలాటోలు ఎంతోమందిమి పుటుక్కుమని పోతారు." దీనంగా మొహం పెట్టాడు పాలతను. "అదేట్రా అలాంటి అపశకునం మాటలు మాట్లాడుతున్నావు?" అన్నాడు అతను. "అయ్యా! రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకులు మావి. రెండ్రోజులుగా తీసిన పాలు అమ్ముకోలేక, మేమే తాగాల్సి వచ్చింది. పాలేం ఊరికే రావు గదయ్యా, గడ్డి కావాలి, మేత కావాలి, మందులు వాడాలి... వీటన్నిటికీ డబ్బు కావాలి, అప్పులు చేయాలి, వడ్డీ కట్టాలి. మరాపాలు అమ్ముడైతే గదయ్యా దినం గడిచేది" పాలతను తన బాధ చెప్పుకొనేలోగా, భూమి కంపించేలా అడుగులు వేస్తూ వచ్చింది ఇంటామె.

"ఏం, నాలుగడుగులు నడిస్తే కొంపలు మునిగిపోతాయా? ఆ గిన్నేదో మీరే తీసుకో వచ్చుగా.. మంచి సీరియల్ మిస్సయినట్లుంది, పైగా బయట ఎలానూ ఉన్నారు మీరు.. మీతో పాటు ఆ మహమ్మారి మమ్మల్నీ అంటుకోవాలా ఏంటి?" చేతిలో బాంబు పడ్డట్టే స్పీడ్‌తో గిన్నె పెట్టి, మెరుపులా మాయమైంది ఆమె.

"మొగుడు పోయినా పర్వాలేదు, సీరియల్ మాత్రం పోకూడదు. ఎంతగా పరాధీనమయి పోయామయ్య" గిన్నె పాలవాని చేతిలో పెట్టాడు అతను. పాలు నింపి "అయ్యా మరి డబ్బులు" గిన్నె అందిస్తూ అన్నాడు అతను. "ఇస్తానులేరా, రేపు కనబడు" మరో మాటకు అవకాశం లేకుండా ఇంట్లోకి వెళ్లి తలుపు వేశాడు అతను.

"సార్, ఎస్సార్.... డెఫినెట్లీ సార్.." ఆ రూమ్ మీదగా వెళ్లిన అతనికి సార్ అనే మాట తప్ప మరొకటి వినబడలేదు. ఉద్యోగం చేస్తున్నాడో, ఊడిగం చేస్తున్నాడో అతనికి అర్థం కాలేదు. కొడుకుది మరీ పరాధీనం. వీడియో కాన్ఫరెన్స్, వర్క్ ఫ్రొం హోమ్.... లోపల రూమ్ లో కంప్యూటర్తో కుస్తీ పడుతున్నాడు, సాఫ్ట్ వేర్ ఇంజనీరు. ఒకప్పుడు ఎంత సాఫ్ట్‌గా ఉండేవాడు, నేడంత హార్డ్‌గా తయారయ్యాడు. కాదు కాదు అలా తయారుచేసింది ఈ కంప్యూటర్ కంపెనీ. ఎంతమంచి బట్టయినా రంగెలిసిపోయే బట్టతో కలిపి ఉతికితే ఆ రంగు అంటకుండా పోదు. ఏదడిగినా కోపం, నోరు విప్పితే బూతులు.

"హాయ్! హౌ ఆర్ యు?" ఇంకోవైపు మనుమరాలు వీడియో చాటింగ్‌లో....

కన్నీళ్లు, కేరింతలు, నవరసాలు ఒలకబోస్తూ కోడలు, అత్త టీవీ ముందు....

ఇంటి నిండా జనం ఉన్నా దేవాలయాల్లో విగ్రహాల్లా ఒకడితో ఒకడికి సంబంధం లేదు. పేరుకే ఒకచోట ఉన్నారన్నమాట గాని, మనిషి మనిషికీ మధ్య ఓ లక్ష్మణ రేఖ. సంబంధాలు మనుషుల మధ్య నుంచి మెషిన్ల మధ్యకు మారాయని ఆ రేఖ స్పష్టంగా తెలియజేస్తోంది.

అతను భారంగా అడుగులు వేస్తూ మళ్ళీ తన రూమ్‌లోకే చేరాడు.

...... ........ .......

ఇంతకీ కలలో కనబడిన ఆ బిచ్చగత్తె ఎవరు? అంత నిర్భయంగా తను ఎలా ఉండగలుగుతోంది? ఇటువంటి లాక్ డౌన్ టైంలో ఆమె దినం గడిచేది ఎట్లా?....

అవునూ, నా వద్ద డబ్బులు ఉన్నా ఆ పాలతనకు ఎందుకు ఇవ్వలేదు? పాపం ఎంత ఇబ్బంది లేకపోతే ఇంత కష్టకాలంలో కూడా తను బయటకు వచ్చాడు? తనకు ఎంత అవసరమో, నాది అవసరం కూడా అంతే గదా.... నన్ను బయటకు పోనివ్వకుండా, పోలీసుల బారిన పడకుండా కాపాడాడే....

మరి నాలోని మనిషి ఏమైనట్లు? డబ్బే ఒక మాయా? ఆ మాయే మనిషిని అలుపెరగకుండా పరిగెట్టిస్తోందా? ఆ పరుగే మనిషిని గుడ్డివాన్ని చేసి విచక్షణ కోల్పోయేలా చేస్తోందా? ఆ విచక్షణలేమి ప్రకృతితో ఆటలాడి సాటి ప్రాణుల పాలిట సంకటం అవుతోందా? ఆ సంకటమే తిరిగి మనిషి పైకి పడగై తరుముతోందా?

ఇలా పరిపరి ఆలోచనలతో అతను మంచంపై దొర్లుతున్నాడు.

"తాతయ్యా!" మనుమడు కరెంట్ వెళ్లిపోవడంతో అతని పక్కకు చేరాడు. "అదేంట్రా! ఇందాక సోషల్ డిస్టెన్స్ అన్నావు" కొంచెం దూరం జరిగాడు అతను.

"మనం బయటికి వెళ్లలేదు, బయటి వాళ్లు మన ఇంటికి రాలేదు. అలాంటప్పుడు ఆ వైరస్ మన ఇంటికి వచ్చేది లేదు. వీడియో గేమ్స్‌ని డిస్టర్బ్ చేస్తున్నావ్ అని అలా సోషల్ డిస్టెన్స్ అని డ్రామా ఆడానులే"

"అంటే ఇంత చిన్న వయసులోనే నాటకాలు నేర్చేసుకుంటున్నావన్నమాట"

"అది సరే, తాతయ్యా! ఆకలి బాధతో చనిపోయినవాళ్ళ ఆత్మలన్నీ కలిసి ఇలా ఒక్కసారిగా దెయ్యాలై దాడి చేస్తున్నాయట గదా? ఆవే వైరస్‌లంటగా.... మా ఫ్రెండ్ శీనుగాడు చెప్పాడు."

"నువ్వు అన్నట్టు ఆ దేవుడు, దెయ్యం ఉంటే..... మరి ఆ ఆకలితో బాధపడుతున్న వారి పక్షాన ఇప్పుడైనా నిలబడాలి కదా. ఎక్కువగా ఆ బీద ప్రాణాలే పోతున్నాయి.... అందుకే దాన్ని పక్కన పెట్టు. కానీ బాధ.... అన్నావ్ చూడు, అది మాత్రం ఖచ్చితంగా వైరస్ పుట్టుకకు కారణమయి ఉంటుంది"

"ఏంటి తాత అది?"

"మనిషి ప్రకృతిని బాధపెట్టాడు. ప్రకృతి ఎన్నాళ్లని ఊరుకుంటుంది? అట్టి తిన్న రాంబోతుకు ఒకటే గాలివాన అని ఊరకే అన్నారా? ఇప్పుడు తన ప్రతాపం చూపుతోంది"

"అంత బాధ ఏం పెడుతున్నాడు తాతయ్యా?"

"తన స్వార్థం కోసం అరణ్యాలపై కత్తి వేసి ఎడారి భూములుగా తయారుచేస్తున్నాడు. తన సౌలభ్యం కోసం యంత్రాల్ని సృష్టించి కాలుష్యాన్ని పెంచి భూమండలాన్ని వేడెక్కిస్తున్నాడు. క్రిమి కీటక నాశకాల్ని విపరీతంగా వాడి, ప్రకృతి అన్ని జీవాలకు ఇల్లు అనే విషయాన్ని మరిచి, మిగతా జీవులకు స్థానం లేకుండా చేస్తున్నాడు. తల్లి తన అందరు బిడ్డలు ఒకేలా చల్లగా ఉండాలని కోరుకుంటుంది. మరి తేడాలు వస్తే ఊరుకుంటుందా?"

"మనిషికి తెలివితేటలు ఉన్నాయి, మిగతా జీవులకన్నా తెలివిగా బ్రతకడంలో తప్పేముంది?"

"సోషల్ డిస్టెన్సింగని తాతయ్యతో నాటకమాడావు చూడు.... అది మీ కాలం తెలివితేటలు. తెలివిగా బ్రతకటం అంటే తోటివారితో కలిసి బ్రతకడం, ఒక్కడే పరిగెట్టడం కాదు. కలసి ఉంటేనే కలదు సుఖం అన్న విషయాన్ని మరువరాదు. ముఖ్యంగా ప్రకృతితో తెలివితేటలు చూపడం కాదు."

"తాతయ్య, ప్రకృతి ప్రకృతి అంటున్నావు, చెట్లు నాటుతున్నాం, కార్బన్ వ్యర్థాల తొలగింపుకు మీటింగులు జరుపుతున్నాం, నిధులు కేటాయిస్తున్నాం.... వీలైనన్ని పనులు చేస్తున్నాం గదా. మరది ఒంటరి పరుగు ఎలా అవుతుంది?"

"అవన్నీ ముస్తాబు చేసిన పెళ్లికూతురులా.. కాగితాలపై అందంగా కనబడుతాయి. పెళ్లిసందడిలో సన్నాయి పాటలా.... చెప్పుకునేందుకు వినసొంపుగా ఉంటాయి. కానీ వాస్తవాలు వేరు. అది తెలుసుకునేందుకు నీ తెలివితేటలు ఇంకా పెరగాలిలే. మరో విషయం.... ముఖాన యాసిడ్ పోసి చికిత్స చేస్తే ప్రయోజనం ఏముంది? ఆ మునుపటి అందం రాదుగా"

"అదేదో అర్థమయ్యేలా చెప్పండి తాతయ్య!"

"మనిషి ఈజీ మనీ ఎర్లీ మనీ మాయలో ప్రకృతి సహజ ప్రక్రియని తారుమారు చేస్తున్నాడు" అతను మనుమడి వైపు చూసి, అర్థం కాలేదు అని గ్రహించి, "అంటే ఆరు మాసాల్లో సహజంగా పండాల్సిన పంటను, జన్యు మార్పిడి చేసి రెండు మూడు మాసాల్లో పండిస్తున్నాడు. అలాగే మాంసం ఉత్పత్తిలో కూడా హార్మోన్లను సర్దుబాటు చేసి, వేగంగా అధిక దిగుబడి చేస్తున్నాడు. గుడ్లు, పాలు, నీళ్లు, నూనెలు, పండ్లు, కాయగూరలు ఇలా ఏది చూసుకున్న అన్నింటిలో తన అధిక తెలివితేటలు వాడి, తాత్కాలికంగా పొందే ప్రయోజనాలు చూసి బలుపని సంబర పడుతున్నాడే తప్ప అది వాపనే నిజాన్ని పెడచెవిన పెడుతున్నాడు. ఇలాంటి విపత్తులు కొనితెచ్చుకుంటున్నాడు." అన్నాడు.

"అధిక ఉత్పత్తులు, సులభ పద్ధతులు నేటి ప్రపంచ పరుగుకు అవసరమే కదా. దీనికి, ఈ విపత్తుకు సంబంధం ఏమిటి?"

"నీటిలో ఏ రంగు కలిపితే, నీటికి ఆ రంగు వచ్చినట్లు.... జన్యుమార్పిడిలు, హార్మోన్లలో మార్పులు తిరిగి మనిషి శరీరంలో మార్పులు తీసుకొస్తున్నాయి. రోగనిరోధకశక్తిని తినేస్తున్నాయి. అనేక రుగ్మతలకు దారి తీస్తున్నాయి. ఆఖరికి మనం గాజు బొమ్మల్లా తయారవుతున్నాం."

"సరే, మనం వీక్ అయిపోయాం. ఓకే. కానీ, ఈ మహమ్మారి ఎలా వచ్చింది?"

"ఇంతకుముందు వచ్చిన సార్స్, ఇబోలా, జికా, ప్లేగ్, నెఫా లానే ఈ వైరస్ కూడా జంతు సంబంధమైనదిగా తెలియవస్తోంది. ఇది జంతువుల్లో ముఖ్యంగా అడవుల్లో ఉన్నంతవరకు ఇబ్బందిలేదు. ఎప్పుడైతే మాంసం ఉత్పత్తులు కార్పొరేట్ రేంజ్‌కు ఎదిగాయో, ఒకే చోట జంతువుల్ని కిక్కిరిసి పెంచడం.. అలా కిక్కిరిసి పెంచడానికి ఏ సి వంటి ప్రత్యేక వాతావరణం అవసరం కావడం...., అలా ప్రత్యేక వాతావరణంకు అలవాటు పడటంతో ఆ జంతువులు కూడా గాజుబొమ్మలవుతున్నాయి. ఈ వీక్ ఇమ్యూనిటీ గల జంతువులు వైరస్‌లకు ఆశ్రయం కల్పించి, మ్యుటేషన్ ద్వారా రూపాల్ని మార్చుకొని బలాన్ని పుంజుకొనేందుకు అవకాశాన్నిస్తున్నాయి.

నిత్యం ఆ జంతువులతో మనిషి కూడా అదే చోట పని చేస్తుండడంతో ఈ వైరస్‌లు మనిషికి సోకుతున్నాయి. ఒకవైపు వైరస్ బలమౌతుండగా, మరో వైపు మనిషి బలహీన మౌతున్నాడు. అందుకే ఈ వైపరీత్యం అని కొందరి అభిప్రాయం."

"దీని వెనుక ఇంత సీక్రెట్ ఉందన్నమాట."

"అవును. పైగా ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్ళూనుకున్నాకనే ఈ అనర్థాలన్నీ. అంతకు ముందు శ్రమనే దోపిడీ చేస్తే, ఈ వ్యవస్థ ప్రకృతినీ దోపిడీ చేస్తోంది. మన పరుగు ఎలా ఉందంటే, తూనీగను పట్టుకోనేందుకు తుమ్మముల్లు తొక్కినట్టుంది."

"మరి ఇవన్నీ తెలిసే మనిషి ఎందుకు చేస్తున్నాడు?"

"ఇందాక మాట్లాడుకున్న స్వార్థమనే పరుగు. చిన్న ఉదాహరణ, ఉదయం పాలవాడికి డబ్బులున్నా రేపు రమ్మన్నాను. పాపం ఎంతో అవసరం లేకపోతే వాడు అడగడు. వాడు వెళ్ళిపోయాక ఆలోచించాను, కానీ అప్పుడే ఎందుకు ఆలోచించలేదు."

"అవును ఎందుకు ఆలోచించలేదు తాతయ్యా?"

"అప్పుడు వాడి కష్టాన్ని మన కష్టంగా చూడలేదు గనక. తర్వాత చూద్దాంలే అన్న ధీమా. మనందరం అదే చేస్తున్నాం. సరైన సమయానికి సరైన ఆలోచనలు చేయడంలేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్నాం. మన ఆరోగ్య బడ్జెట్ ఒక శాతం కూడా ఉండట్లేదు. ప్రతి సంవత్సరం మన దేశంలోనే నాలుగు లక్షలమంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారు. అంటే ఆయుధాలకు, యుద్ధాలకు ఇస్తున్న శ్రద్ధ ఆరోగ్యాలకు, జీవితాలకు ఇవ్వడం లేదు."

"అవును తాతయ్య, ఇప్పుడు మాస్కులు, మందులు, వెంటిలేటర్లు, డాక్టర్లను వెతుక్కుంటే సడెన్‌గా ఆకాశం నుంచి ఊడిపడతాయా?"

"శభాష్ మనమడా! బాగా చెప్పావు." మనమడి భుజం తట్టాడు అతను.

"నువ్వన్నట్లు మనవాళ్ళు సమయానికి స్పందించరు. జనవరి 31న WHO హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ఇప్పుడు చేసిన లాక్‌డౌన్‌లా అప్పుడే మనం మన బోర్డర్లని కట్టుదిట్టం చేసి సరైన చర్యలు తీసుకొని ఉంటే మన దేశానికి ఈ మహమ్మారి వచ్చేది కాదు. ఇప్పుడు వచ్చాక కష్టమే మరి. అమెరికా లాంటి నెంబర్ వన్ దేశాలే తట్టుకోలేక పోతున్నాయి."

"అసలీ ప్రపంచం ఇలా తగలబడి పోవడానికి కారణం ఆ అమెరికావాడే.... పెట్టుబడిదారీ వ్యవస్థను పోషించి ధనిక, పేదవాళ్ళ మధ్య అంతరాల్ని పెంచింది వాడు. కార్పొరేట్ రాక్షసిని ప్రపంచం మీదకి వదిలి ప్రజల రక్తాన్ని తాగుతున్నది వాడు. యుద్ధ సంస్కృతికి బీజం వేసి అశాంతిని సృష్టిస్తున్నది వాడు. అభివృద్ధి పేరుతో ప్రకృతిపై యుద్ధం ప్రకటించింది వాడు. ఆ ఉసురు తగలకుండా ఉంటుందా ఏంటి?"

"ఏంటి, తాతా మనవళ్ళు ఏదో డీప్ డిస్కషన్‌లో ఉన్నట్టున్నారు." సాఫ్టువేరు ఇంజినీర్ కూడా ఎప్పటికీ కరెంట్ రాకపోవడంతో వచ్చి చేరాడు.

"ఏం లేదురా.. ఈ మహమ్మారి గురించి మాట్లాడుకుంటున్నాం."

"అవును నాన్నా! ఈ లాక్ డౌన్.... ఇదే పరిస్థితి కొనసాగితే నా ఉద్యోగమూ ఊడేటట్టుంది. తుమ్మితే వైరస్ వస్తుందో లేదో గాని, ఊడిపోయే ముక్కులు మావి" సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మంచంపై కూర్చున్నాడు.

"బతికుంటే బలుసాకు తిని బతకొచ్చులేరా.... ఏదో ఒకటి చేద్దాంలే" లోలోన గుండెలు పీకేస్తున్నా, ధైర్యం చెప్పాడు అతను.

"మన వరకూ పర్వాలేదు, మరీ దర్జాగా కాకపోయినా ఏదోలా బ్రతుకు బండి లాగించేయగలం.... నాలుగు బలుసాకులు ఉన్నాయి గనక. పాపం, రోజువారి కూలీలు, వలస కూలీలు, టెంపరరీ ఉద్యోగులు, బీద జనం పరిస్థితి తలచుకుంటూనే గుండెలదురుతున్నాయి" సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

"అవునబ్బాయ్, ఎవరి ఉద్యోగాలకూ ఢోకా లేదని పైవాళ్ళు చెబుతున్నా, అసలు కంపెనీలే మునిగిపోయేలా ఉంటే ఇక ఉద్యోగాల సంగతి వేరేగా చెప్పేదేముంది? చెట్టుంటేగా పండు కోసం ఎదురుచూడగలం." అతను.

"అది డైరెక్ట్ ఎంప్లాయిమెంట్. ఇక ఇండైరెక్టుగా కొన్ని కోట్లమంది బలైపోతారు"

"ఇండైరెక్టుగా?" అర్థం కానట్టు మొహం పెట్టాడు మనుమడు.

"ఉదాహరణకు మీ డాడి ఉన్నారనుకో. మీ డాడీ కంపెనీ మూతపడిందే అనుకో.... ఖర్చు తగ్గించుకోవడం కోసం పాల వాడకం మానేస్తాం. మన బట్టలు మనమే ఉతుక్కొని ఐరన్ చేసుకుంటాం. జుట్టు కటింగ్‌లు కోసం ఆలోచిస్తాం. రోజూ వచ్చే న్యూస్‌పేపర్‌ని ఆపుచేస్తాం. పనిమనిషిని వద్దనుకుంటాం. మనం కొత్తగా కడుతున్న ఇల్లుని అక్కడితో ఆపేస్తాం. ఈ వరుసలో ఎంతమంది ఎఫెక్ట్ అయ్యారు చెప్పు" సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

"ఊ.... మిల్క్ బాయ్, వాషర్ మాన్, బార్బర్, పేపర్ బాయ్, మేసన్.." అంటుండగా, "వీళ్లతోపాటు వీళ్ల ఫ్యామిలీలు రోడ్డున పడతాయి. ఇల్లు కట్టడం ఆపేసావు అనుకో సిమెంట్ ఫ్యాక్టరీ, స్టీల్ ఫ్యాక్టరీ, ఇటుకల తయారీ కంపెనీ.... ఇలా రకరకాల పరిశ్రమలు.... వాటి కార్మికుల మీద ప్రభావం పడుతుంది. వాళ్ల ఫ్యామిలీలూ రోడ్డున పడతాయి. ఇవన్నీ ఒకదానికొకటి లింకన్నమాట. మరి మా ఒక్క కంపెనీలోనే నాలాంటి ఎంప్లాయిస్ 200 మంది ఉంటారు. అంటే ఒక్క కంపెనీ మూతపడితే కొన్ని వేలమంది పనిదొరక్క విలవిలలాడి పోతారన్నమాట. భారతదేశంలో సుమారు 94 శాతం మంది ఈ అసంఘటితరంగంలోనే పనిచేస్తున్నారు." సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

"అవున్రా! రాబోయే రోజులు తలుచుకుంటేనే భయమేస్తోంది" అతను

"తాతయ్యా! ఇంతకు ముందు ఇలాంటి వైరస్‌లు చాలా వచ్చాయి, చాలామంది చనిపోయారన్నావు కదా! మరి వీటినుంచి గుణపాఠం నేర్చుకోవాలి గదా" మనుమడు.

"ఎలక్షన్స్ అనగానే నాయకులు వచ్చినట్లు, విపత్తు రాగానే హడావుడి చేస్తారు. ఆ తర్వాత దాని గురించి మర్చిపోతారు." అతను.

"కానీ ఇప్పటి విపత్తు మానవజాతి ఎన్నడూ ఎరుగనిది. ఈసారి బుద్ధిగా ఇంట్లో ఉన్నట్టే, మునుముందు బుద్ధిగా మసలుకుంటాడు కూడా." సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

"ఏమోరా అబ్బాయి! నాకైతే నమ్మకం లేదు. ఆపద వచ్చినప్పుడు చెప్పే నీతి కబుర్లు, అందల మెక్కాక ఉండవంటారు. చూద్దాం...." చిన్న విరామమిచ్చి, "అవునూ.... తెల్లవారు ఝామున ఓ కలొచ్చింది. నేను పరిగెడుతూ ఉన్నట్టు, నన్ను ఆ వైరస్ తరుముతున్నట్టు, మనం సంపాదించి పెట్టుకున్న డబ్బు, బంగ్లాలు ఏవీ కాపాడనట్టు, అందమైన ప్రకృతి మరోవైపు పిలుస్తున్నట్టు, కానీ భయంతో ముందుకు పరిగెత్తి ఓ లోయలో పడిపోయినట్టు...." అతను.

"రోజు రకరకాల వార్తలు చూస్తున్నాము కదా, ఆ భయము,ఆందోళనలతో అటువంటి కలొచ్చుంటుంది. అంతగా భయపడవలసిన పనేం లేదులే" సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

"ఆ కలలో ఒక బిచ్చగత్తె కనబడింది. కానీ దాని ముఖంలో ఏ భయమూ లేదు, ఎటువంటి ఆందోళన లేదు.... మనిషన్నాక అంత ప్రశాంతంగా ఉండటం ఎలా సాధ్యం?" కొడుకు మాటల్ని పట్టించుకోకుండా కొనసాగించాడు అతను.

"నాన్న! తలా తోకా లేని కలల్ని జీవితాలతో పోలుస్తావెందుకు?" సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

"అది కాదురా, ఎందుకో ఆ బిచ్చగత్తె మరీమరి గుర్తుకొస్తోంది.... మన బస్టాప్ వద్ద బిచ్చగత్తె.... పాపం, ఎలా ఉందో ఏమో?! ఒక్కసారి చూడాలని ఉంది" అతను.

"గవర్నమెంట్ ఆఫీసర్స్ ఏదో ఒక షెల్టర్‌లో చేర్పించి ఉంటారులే, ఆవిడని చూడటానికి వెళ్లి పోలీసులతో తన్నులు తినే కన్నా.... ఆ విషయాన్ని ఇక్కడితో మర్చిపోవడం మంచిది" సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

"ఒరే.... ఒకవేళ ఆమె అక్కడే ఉంటే?! మామూలు రోజుల్లో అయితే ఎవరో ఒకరు ఏదో ఒకటి పెడతారు. పాపం, రోడ్లన్నీ నిర్మానుష్యంగా అయిపోయాయి, ఆమెకేం దొరుకుతుంది?" అతను.

"తాతయ్యా పద! అన్నం పట్టుకొని దాక్కొని వెళ్దాం. పోలీసులు కనబడితే వెనక్కి వచ్చేద్దాం. ఇక ఆ మహమ్మారి అంటకుండా సోషల్ డిస్టెన్సింగ్ మెంటైన్ చేద్దాం" మనుమడు.

అలానే తాతా మనుమలు కదిలారు.

..... ...... ......

ఆమె చేయి బస్ షెల్టర్ నుంచి బయటికి చాచి ఉంది....

ఆకాశాన్ని చూస్తూ ఉన్న ఆచేయి శూన్యం లోంచి ఏదో అడుగుతున్నట్లు ఉంది....

ఎన్నో రోజులు కడుపు మంటను గాలితో చల్లార్చుకున్న ఆ జీవికి ఇక ఆ మంటను భరించే శక్తి లేనట్లుంది...

కేక వేతకు బలం చాలని ఆ ప్రాణం సైగ చేస్తున్నట్లుంది...

కుల మతాల భేదాలు లేకుండా అందరూ అంటరాని వాళ్ళయిన ఈ క్షణాల్లో...

బయట కనబడితే అంతుచూస్తానని మహమ్మారి కాచుకు కూర్చున్న ఈ క్షణాల్లో....

ఆ ఆకలి ఆఖరి కేక వినబడేదెవరికి?

ఓ వీధి కుక్క మాత్రం బోరుమని ఆకాశానికి తలెత్తి విలపించింది. దాంతో నాలుగైదు కుక్కలూ అందుకున్నాయి.

తక్కువ శబ్దాల వినికిడి శక్తి గల కుక్క ఆమె ఆఖరి హృదయ స్పందనను పసిగట్టి లోకానికి వినిపించాలి అనుకుందేమో?

ఎదురుగా ఎత్తైన అందమైన భవంతులు కదలిక లేకుండా దిష్టిబొమ్మల్లా నిలబడి చూస్తున్నాయి.

నల్లని రిబ్బన్లా సాగిన అందమైన తారు రోడ్డు పరుగునాపి మూగవానిలా మౌనంగా ఉంది.

ఆమె చుట్టుపక్కల ఉన్న నాణేలు, ఇటలీ రోడ్లపై పరుగిడిన నోట్లలా కాక, గుండె బరువెక్కి అంటిపెట్టుకుని ఉన్నాయి.

కొద్ది దూరంలో పొదవాటి చెట్లు మౌనాన్ని పాటించేందుకేమో శోకశస్త్ర కోసం నిలబడ్డ జవానుల్లా తలలు దించాయి.

అంతలోనే హృదయం కలచివేసిందేమో ఆ చెట్లన్నీ ఒక్కమారుగా పైకి లేచాయి. హోరుగాలి రేగింది. ధూళి రేణువులు పైకి లేస్తూ రోడ్డు వెంబడి పరుగులు తీశాయి.

ఎవరో తెలియని ఆమె...

తన పేరు తనే మర్చిపోయిన ఆమె...

పేదరికంలో పడిలేచి, జీవన పరుగులో నోట్ల మూటలు కూడగట్టని ఆమె....

బ్రతుకుపోరులో ఓడి, ఏ ఒక్కరి గెలుపుకూ (కనీసం ఓటరుగానైన) పనికిరాని ఆమె....

యవ్వనసొంపులు పిడసగట్టుకుపోయి, ఏ పక్కకూ అక్కరకు రాని ఆమె....

ఇప్పుడెవరికి కావాలి?

కుక్కలు మొరిగినా, గాలి వీచినా, చెట్లు చేమలు అల్లాడినా, ధూళి రేగినా, ఉరుములు గర్జించినా, ఆ మహమ్మారి వెంటపడినా....

ఆ బిగి తెగిన చేతులు మరింత ఊగాలే తప్ప, నిలకడగా మళ్ళీ యాచించేనా?

మరి ఏమడుగుతోంది శూన్యంలోంచి ఆ చేయి?

ఆకలి బిగువతో ముద్దయిన ఆ శరీరానికి నాలుగడుగుల నేలైనా ఎక్కువేనని, ఆమె లెక్కల్ని తెలిసిన బస్సు షెల్టర్లోని సిమెంట్ బల్ల చెబుతుంది....

చలిలో ముద్దై, ఎండలో మండి, వానలో తడిచిన ఆ శరీరంపై సాక్షిగా ఉన్న గుడ్డ పీలికలు చెబుతాయి ఆమెది ఆకాశమంత ఆశని....

ప్రపంచాన్ని ఆడించే జగన్నాటక సూత్రధారి ఆ నాణేన్నడిగితే చెబుతుంది.... ఆమె ఏనాడూ తను ఆడించే నాటకాల్లో ఏ పాత్రా పోషించలేదని....

ముద్దై ముడుచుకుపోయిన అందాల్ని అడిగితే చెబుతాయి.... ఒకప్పుడు తాగితాగి పిప్పిచేసిన మగతనం తనకంటూ ఏమీ మిగల్చలేదని....

ఇప్పుడు ఆమె ఓ మాంసం ముద్ద. ఆశలు ఎండి, కోర్కెలు చచ్చి, అనునిత్యం చావుతో సహవాసం చేసిన ఆమెను ఈ వైరస్‌లు ఏమి చేయగలవు?

ఎంత పరుగు పరిగెత్తినా, అఖరికి చేరేది ఆ ఆరడుగుల మరుభూమికే అని నిజమెరిగిన ఆమెకు పరుగుకోసం తాపత్రయం ఎందుకు?

తనదంటూ ఏమీ లేని ఆమెకు, ఎవరో దాడి చేసి, ఏదో దోచేస్తారని భయమెందుకు?

ప్రేమ, బంధాలు అడ్డుతగిలి ఉంటే.... ఓ తల్లి ఆకలి బాధల్ని తీర్చలేక తన ఐదుగురి బిడ్డల్ని గంగానదిలో పడేసి, ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె కూడా ఆలోచించేదేమో?

ఆటాడే బాలులుండి ఉంటే.. నోటిముందు ముద్ద మృగ్యమై బీహార్‌లోని పసిపిల్లల్లా కప్పల్ని కాల్చుకుతినమని నేర్పించేదేమో ఆమె?

పనిదొరకని వలసకూలీ అయిఉంటే...

వాహనాల్ని లెక్కచేయక వేలాది మైళ్ళు నడిచి సొంతూరు చేరుకోవాలని ఆరాటపడేదేమో?

సొంతూరంటూ వుండి ఉంటే.... వందలాది మైళ్ళు నడిచి నడిచి జన్మభూమిలో ప్రాణం విడిచిన ఛత్తీస్‌ఘడ్ అమ్మాయిలా ఆమె కూడా ఆరాటపడేదేమో?

దర్జాగా బ్రతికే మిగతా మనుషుల్లా అయి ఉంటే.... హేండ్‌వాషులు, సేనిటైజర్లు, మాస్కులు, క్వారెంటయిన్లు, మందులు మాకులు పద్ధతులన్నీ పాటించేదేమో?

ఎక్కడినుంచో కబురందినట్లుంది.... ఏమీ మిగలనిచోట ఏదో దోచేసేందుకు దాడిని ప్రారంభించాయి ఈగలు ఒక్కొక్కటిగా చేరుతూ.

కంటికి కనబడని ఒక ఏక కణ జీవి, మనిషిని పరిగెట్టిస్తోంది. సూటూబూట్లు, సూట్కేసులు, ధనం దర్పం, హంగులు ఆర్భాటాలు అన్నీ ఆ పరుగులో అలసి కలుగులో ఎలుకల్లా ఇళ్ళల్లోంచి మిక్కీ మిక్కి చూస్తున్నాయి.

షేక్‌హ్యాండ్ స్థానంలో నమస్కారం, ఇంట్లోకి వెళ్లేముందు కాళ్ళు, చేతులు కడుక్కోవడం, తుమ్మినవారికి దూరంగా ఉండటం, ఫాస్ట్‌ఫుడ్డు స్థానంలో ఇంటి వంటకాలు రావడం, జీవితానికి కావలసింది డబ్బు వెనుక పరుగు కాదని.... అనేక వాస్తవాల్ని మనిషి గుర్తించేలా చేసింది సూక్ష్మజీవి.

పరుగుల్ని నిలువరిస్తూ ఏకకణ జీవి ప్రపంచ జనజీవితంలో ఎన్నెన్ని వాస్తవాల్ని, ఎన్నెన్ని దుస్సహ దృశ్యాల్ని చూపిస్తోందో.... అన్నింటినీ ఎదుర్కొంటూ.... పాల సైకిల్ గణగణగణమని ముందుకు పరుగిడుతోంది..

మడిచెక్క మీద మట్టి మనిషి పోషకాహార రచయితగా కొత్త చరిత్ర రాయడానికి..... మట్టిపుటల్ని తిరగేస్తున్నాడు.... ✤

# జాత్యహంకారం, వివక్ష, అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అనేక అత్యంత అసహ్యకరమైన, హేయమైన దుర్లక్షణాలలో కొన్ని మాత్రమే!

వ్యాసం

జి.వి.భద్రం

**మే** 25న సిగరెట్లు కొనటానికి 20 డాలర్ల నకిలీ కరెన్సీ నోటు ఇచ్చాడనే ఆరోపణతో అమెరికాలోని మినియాపోలీస్‌లో సౌవిక్ అనే తెల్లజాతి పోలీసు అధికారి జార్జి ఫ్లాయిడ్ అనే నల్లజాతి ఆఫ్రో – అమెరికన్‌ను కారులో నుంచి బయటకు లాగి, సంకెళ్ళు వేసి రోడ్డుపై బోర్లా పడుకోబెట్టి, తొమ్మిది నిముషాలపాటు మెడపై మోకాలితో త్రొక్కిపట్టి, అతడికి ఊపిరాడకుండా చేసి చంపివేశాడు. తాను ఊపిరి పీల్చుకోలేకపోతున్నానని అతడు పదే, పదే ప్రాధేయపడినా కనికరం చూపించకుండా అతడి ప్రాణాలు తీశాడు.

ఈ ఘటనను చిత్రీకరించిన వీడియో ఫుటేజి ప్రచార మాధ్యమాల్లో విరివిగా ప్రచారం కావటంతో, ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా అమెరికా అంతటా నిరసనాగ్రహావేశాలు వెల్లువెత్తాయి. ఈ ఘటన జరిగిన అమెరికాలో మాత్రమే కాకుండా ప్రపంచమంతటా యూరోపు, ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఖండాలలోని పలుదేశాల్లో కూడా తీవ్రమయిన నిరసన ప్రదర్శనలు జరిగాయి – యిప్పటికీ జరుగుతున్నాయి. ప్రపంచ మంతటా ఈ శ్వేతజాతి దురహంకారపూరితమైన జాత్యహంకారాన్నీ, నల్లజాతి నీగ్రోలపట్ల అమెరికాలో అమలవుతున్న జాతి వివక్షనూ ప్రజలు నిరసిస్తున్నారు. జాతి వివక్ష అంతం కావాలని డిమాండు చేస్తున్నారు.

కొందరు దీన్ని జాతి వివక్షగానూ, మరికొందరు దీన్ని శ్వేతజాతి దురహంకారంగానూ భావిస్తుండగా, మరికొందరు యిది అమెరికా పోలీసుల యొక్క అమానుష అణచివేత విధానంగా అర్థం చేసుకుంటున్నారు. ప్రధానంగా అనేకులు ఈ ఘటనను, లేదా గత సంవత్సరాలలో జరిగిన యిదేరకమైన తెల్లజాతి పోలీసులు, నల్లజాతి నీగ్రోలను చంపిన అనేక ఘటనలను కేవలం ఒక పరిపాలనా సంబంధమైన పొరపాటు లేదా తప్పుగా అర్థం చేసుకొంటూ, కొన్ని పరిపాలనాపరమైన చర్యలు, సంస్కరణలు తీసుకురావటం ద్వారా, పోలీసులపై ఆంక్షలు విధించటం ద్వారా ఈ సమస్యను సరిచేయవచ్చుననే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరసనను, వ్యతిరేకతలను వ్యక్తం చేస్తున్నవారిలో వివిధ రకాల రాజకీయ అవగాహనలు, అభిప్రాయాలు గల మానవతావాదులు, శ్వేతజాతి వ్యతిరేకవాదులు ఉన్నారు. వీరేగాక ఇంకా తమ వర్గ ప్రయోజనాలను, పెంపొందించుకోవాలనుకొనే పెట్టుబడిదారీవర్గంవారూ, రిపబ్లికన్ పార్టీకి వ్యతిరేకంగా ప్రభుత్వ అధికారం కోసం పోటీపడుతున్న డెమోక్రాటిక్ పార్టీవారూ, తమతమ దేశాల్లో యిదే తరహా జాతి వివక్ష కొనసాగుతున్నా కూడా, అమెరికాలో జరుగుతున్న జాతి వివక్షను వ్యతిరేకించే కొందరు దేశాధినేతలూ, కొన్ని బడాపెట్టుబడిదారీ మీడియా కార్పొరేషన్లవారూ, హాంకాంగ్‌లో 'ప్రజాస్వామ్యం' కోసం జరుగుతున్నాయనబడే నిరసనలను సమర్థిస్తున్నారు. వాటిని పోలీసులతో అణచివేస్తున్నందుకు చైనా ప్రభుత్వాన్ని అదేపనిగా యాగీ చేసిన అమెరికన్ ప్రభుత్వాన్ని, యిప్పుడు యీ జాతి వివక్ష ఘటనను ఆసరా చేసుకొని, అమెరికా యొక్క రెండు నాల్కల ధోరణిని ఎండగడుతున్న చైనా ప్రభుత్వాధినేతలు, అమెరికా అనుసరిస్తున్న యితర దోపిడీ, దుర్మార్గ, దురాక్రమణ విధానాలను ఆమోదిస్తూనే ప్రస్తుత ఘటన వరకే నిరసనను వ్యక్తం చేస్తున్న సంఘాలూ లాంటి నానా గోత్రీకులూ వున్నారు. ఈ నిరసనలు తెలుపుతున్నవారిలో ఎవరి కారణాలు వారికున్నాయన్నమాట, ఎవరి ప్రయోజనాలు వారికున్నాయన్న వారి పరిమితుల వాస్తవాన్ని గమనంలోకి తీసుకొంటూనే, యీ నిరసనలు ప్రపంచమంతటా ప్రజలు ఒక అభ్యుదయకర మార్గాన్ని చేపట్టడానికి అవసరమైన చైతన్యం పొందగలిగేందుకు అవుసరమైన ప్రేరణను కల్పించేందుకు దోహదపడతాయని అర్థం చేసుకోవలసి వుంటుంది.

ఒకవైపున ప్రపంచమంతా, ప్రత్యేకించి అమెరికాలో యీ జాతి వివక్షకు వ్యతిరేకంగా నిరసనలు, వ్యతిరేకతలు వ్యక్తమవుతూంటే అమెరికా అధ్యక్షుడు, అతడి ప్రభుత్వపాలనాయంత్రాంగం మాత్రం, మరింతగా దేశప్రజలలో జాతి వివక్షను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. నిరసనలను నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు అవసరమైన కఠిన చర్యలు తీసుకొంటున్నారు.

మరోవైపు అధ్యక్ష పదవి కోసం ఎగబడే ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ నాయకత్వం, ఈ సందర్భాన్ని రిపబ్లికన్ పార్టీని నేరస్థురాలిగా బోనులోకి నెట్టి, తాను అధికారంలోకి రావటానికి వీలుగా విమర్శలను గుప్పిస్తూ, శ్వేతేతర జాతి ఓటర్లను ఆకట్టుకొని వారి ఓట్లు దండుకోవటం కోసం ఆఫ్రికన్ అమెరికన్ల పట్ల ప్రేమ నటిస్తోంది.

అధికారంలో వున్న రిపబ్లికన్ ట్రంప్ ప్రభుత్వం యీ నిరసనలను శాంతిభద్రతల సమస్యగా ప్రచారం చేస్తూ వాటిని సైనికుల ద్వారా – నేషనల్ గార్డ్స్ అనబడే మనదేశంలోని పారా మిలటరీ దళాల లాంటి దళాల ద్వారా అణచివేయటానికి చర్యలు తీసుకొంటూనే, అమెరికన్ పౌరులను అందుకు ఒప్పించే విధంగా పలు దుష్ప్రచారాలను ముమ్మరం చేస్తోంది. అధ్యక్షుడు డోనాల్డు ట్రంప్ నిరసనకారులను నేరస్తులైన గూండాలు (థగ్స్)గా అభివర్ణించాడు. అమెరికాలో దాదాపు 150 నగరాల్లో కర్ఫ్యూను విధింపజేశాడు. 67,000 మంది నేషనల్ గార్డు దళాలను దేశంలో మోహరించాడు. ఒక రాష్ట్రంలో 'శాంతి భద్రతలను'

పరిష్కరించటం కోసమని నేషనల్ గార్డ్స్‌ను అంత పెద్దఎత్తున మోహరించటం రెండవ ప్రపంచయుద్ధం తర్వాత అమెరికాలో ఇదే ప్రథమం. 1991లో రోడ్నీ కింగ్ అనే ఆఫ్రో–అమెరికన్‌ను పోలీసులు క్రూరంగా కొట్టారు. అయితే కోర్టు ఆ పోలీసులను నిర్దోషులుగా ప్రకటించింది. అప్పుడు అక్కడ నిరసనోద్యమం చెలరేగింది. అప్పుడు కూడా నేషనల్ గార్డ్స్‌ను రంగంలోకి దింపింది ప్రభుత్వం. అంతేకాక సైన్యాన్ని కూడా పంపింది. ఈ రకంగా నిరసనలను అణచివేయ బూనుకొన్న అమెరికన్ ప్రభుత్వం, ఆ నిరసనలను అల్లర్లగానూ, హింసాయుత ఉద్యమంగానూ చిత్రిస్తూ, అసలు ఆ నిరసనలు చెలరేగటానికి గల మూలకారణాలను ప్రపంచపు దృష్టి నుండి మరలించటానికి ప్రయత్నిస్తోంది. శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు జరుపుతున్న అనేకచోట్ల పోలీసులు నిరసనకారులపై టియర్‌గ్యాస్ ప్రయోగించారు. రబ్బరు బులెట్లను పేల్చారు. పెప్పర్ స్ప్రే (కారపు నీళ్ళు) వారి కళ్ళల్లోకి జల్లారు. పలుచోట్ల అనేక వేలమందిని అరెస్టులు చేశారు. అమెరికన్ ప్రభుత్వం యీ నిరసనకారులను దేశీయ (అంతర్గత) టెర్రరిస్టులుగా అభివర్ణిస్తూ, వారే అల్లర్లను రెచ్చగొడుతున్నట్లు ఆరోపణలు చేశారు. ఈ నిరసనకారులపై మెరుపు వేగంతో శబ్దం చేసే గ్రెనేడ్లు విసిరేటందుకు ఏర్పాట్లు చేశారు, ప్రయోగించారు. మరోవైపు స్థానిక నాయకులు నిరసనకారులను, 'నిర్మాణాత్మక పద్ధతుల్లో' తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయాల్సిందిగా పిలుపులిస్తున్నారు. పోలీసుల చేత, ఏజెంటు ప్రొవకేటర్ల (శతృవర్గ గూఢచారుల)చేతా రెచ్చగొట్టబడిన కొందరు అక్కడక్కడా అల్లర్లకు పాల్పడితే వాటిని సాకుగా తీసుకొని పెద్దవి చేసి భూతద్ధంలో చూపిస్తూ, తమకు అనుకూలంగా వున్న మీడియాతో నిరసనకారులు విధ్వంసానికి పాల్పడుతున్నట్లు పెద్దపెట్టున ప్రచారం చేస్తున్నారు. ఈ రకంగా నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతూనే, చేత బైబిలును పట్టి తానొక శాంతి దూతనన్నట్లుగా నటిస్తూ అధ్యక్షుడు ట్రంప్ దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా దేశాధ్యక్షునిగా ప్రజల శాంతి భద్రతల కోసం తాను పోరాడుతాననీ, శాంతిభద్రతలను పరిరక్షించటం తన విధి అనీ, శాంతియుత నిరసనలను తాను యిష్టపడతాను అనీ, ఫ్లాయిడ్‌ను పోలీసులు పొట్టన పెట్టుకొన్న తీరు సరైనది కాదనీ, అయితే ఈ రకంగా అరాచకవాదులు అల్లర్లు చేయటం వలన, లూటీలు చేయటం వలన మరణించిన జార్జి ఫ్లాయిడ్ స్మృతికి మనం అపచారం చేసినవారమవుతామనీ, యిది దైవాపచారం కూడా అవుతుందంటూ ధర్మపన్నాలు బోధిస్తున్నాడు. మరోవైపు ఆయన భార్య మెలనియా "ప్రజలు కర్ఫ్యూ నిషేధాజ్ఞలను పాటిస్తూ శాంతియుతంగా మెలగాలి, హింసకు తావులేదు, ఫ్లాయిడ్ కుటుంబానికి నా సానుభూతి" అంటూ మొసలి కన్నీరు కారుస్తోంది.

ఈ రకంగా రాజ్యాధికారంలో వున్న రిపబ్లికన్ పార్టీ వ్యవహరిస్తుంటే జరుగబోయే ఎన్నికల్లో దేశాధ్యక్ష అభ్యర్థిగా, డెమోక్రటిక్ పార్టీ తరపున పోటీ చేస్తున్న జో బిడెన్, యితర డెమోక్రటిక్ పార్టీ నాయకులూ యిళ్ళు కాలుతుంటే బొగ్గులేరుకునేవారి చందంగా, "అమెరికా ప్రజలపై, అమెరికా దేశపు మిలటరీని ప్రయోగిస్తానన్న ట్రంప్‌ను ఓడించండి" అంటూ పిలుపునిస్తూ, అసలు సమస్య అయిన జాతి వివక్షను ఎలా రూపుమాపాలి అన్న విషయంపైనుంచి నిరసనకారుల దృష్టిని చాకచక్యంగా పక్కకు తప్పిస్తున్నారు. వాస్తవమైన 'పోలీసు సంస్కరణలు' జరగాలంటూ వారు డిమాండు చేస్తున్నారు. ఇందుకవసరమైన చర్చలను అందరితోనూ జరపాల్సి వుంటుందని అటువంటి చర్చలు జరపగల నాయకత్వం యిప్పుడు అమెరికాకు అవసరం అంటూ ప్రచారం చేస్తున్నారు. తాను అధికారానికి వస్తే తొలి వందరోజుల్లోనే వ్యవస్థీకృత జాతి విద్వేష సమస్యను పరిష్కరిస్తానని జో బిడెన్ ప్రచారం చేస్తున్నాడు.

ఈ రకంగా జాతి విద్వేష, జాతి వివక్ష, జాత్యహంకార సమస్యను అమెరికాలోని ప్రధాన రాజకీయ పార్టీలు, అధికారం (ఓట్ల ద్వారా) పొందేందుకు ఒక సాధనంగా వాడుకొంటున్నారు. మరోవైపు వ్యవస్థీకృతమైన యీ సమస్యను శాంతిభద్రతల సమస్యగా చిత్రీకరిస్తున్నారు.

పాలకవర్గ పార్టీలు యీ విధంగా వ్యవహరిస్తూండగా, అక్కడి మీడియాసంస్థలు కూడా తమ వ్యాపార ప్రయోజనాలు, పెట్టుబడిదారీవర్గ లాభాలు పెంపొందించుకొనే విధానాలు అనుసరిస్తున్నాయి. ఉదాహరణకు 'ఫాక్స్' న్యూస్ సంస్థ గ్రాఫిక్స్ ద్వారా "నల్లజాతివారిపై హింసాయుత దాడులు జరిపినపుడు స్టాక్‌మార్కెట్లు ఏ రకంగా పైపైకి పోయాయో" వివరించింది. 1968లో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యానంతరం మార్కెట్లు (స్టాక్) ఎలా పైపైకి ఎగిసిపోయాయో, 1991లో రోడ్నీ కింగ్‌ను చితకబాదిన పోలీసులను, 2014లో మైఖేల్ బ్రౌన్ మరణానికి కారణమైన పోలీసులను నిర్దోషులుగా విడిచిపెట్టినప్పుడు స్టాక్‌మార్కెట్లు ఎలా పైకి ఎగిసిపోయాయో చూపించింది. 'ఫిలడెల్ఫియా ఇంక్వైరర్' అనే పత్రిక యొక్క అత్యంత స్థాయి గల ఎడిటర్ తన పత్రికలో "నల్లజాతివారి జీవితాలు ముఖ్యం" అనే శీర్షికను ఎగతాళి చేస్తూ "భవనాలు ముఖ్యం" అంటూ శీర్షిక పెట్టి నిరసనలను, హింసాయుత అల్లర్లుగా చూపెడుతూ వ్యాసం వ్రాశాడు. అమెరికన్ కమ్యూనిస్టు గ్రూపువారూ అరాచక, ఏంటిఫా (ఫాసిస్టు వ్యతిరేక కార్యకర్తల) సంస్థకు చెందిన కార్యకర్తలూ, నిరసనలు జరుగుతున్న ప్రాంతాలకు వేన్ల నిండా రాళ్ళూ, తదితర హింసకు ఉపయోగించే వస్తువులను పంపించారనీ, పిట్టకథలు రాస్తూ హింసాయుత మార్గాన్ని చేపట్టే ఉగ్రవాదులు యీ నిరసనలను నిర్వహిస్తున్నారనే కట్టుకథలను ప్రచారం చేశారు. 'ది ఎపోటైమ్స్' అనే పత్రికా విలేఖరి అయితే "ఇప్పుడు యీ జార్జి ఫ్లాయిడ్ మరణం సందర్భంగా యీ అల్లర్లు చెలరేగి వుండకపోతే, మరోసారి జరగబోయే అల్లర్లలో పాల్గొనటానికి మనదేశంలోనే వందలాదిమంది విదేశీ శిక్షణ పొందిన ఆందోళనకారులూ, అదేరకంగా వేలమంది సుశిక్షితులైన క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు కార్యకర్తలు పొంచి వున్నారని" ప్రజలను హెచ్చరిస్తూ, కమ్యూనిస్టు భూతాన్ని (బూచోణ్ణి) చూపిస్తూ అమెరికన్ ప్రజలను భయపెడుతూ, జాత్యహంకార సమస్య గురించి ఆలోచించకుండా ప్రక్కదారి పట్టిస్తున్నాడు. మరోవైపు న్యూయార్కు యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ రుత్‌బెన్ – ఘియుత్ లాంటివారు; హింసాయుతపద్ధతులవల్ల కానీ, వామపక్షాలు వారి మిలిటెంట్ పద్ధతులవల్ల కానీ అధికారంలో

వున్నవారు నిరసనకారులపై మరింత అణచివేత పాల్పడటానికి అవకాశాలను కల్పిస్తాయంటూ, అమెరికా పౌరులను హెచ్చరిస్తున్నారు.

సోషల్ మీడియాకు చెందిన ట్విట్టర్, ఫేస్‌బుక్ తదితర సంస్థలు కూడా అసలు సమస్యా, దాని పరిష్కారం ఆలోచించే వైపుకు కాకుండా, రిపబ్లికన్ పార్టీ లేదా డెమోక్రటిక్ పార్టీల విధానాలను సమర్థించే వైఖరులను తీసుకొని, అసందర్భపు వివాదాలను ముందుకు తెచ్చి వాటి గురించి చర్చలు చేస్తున్నాయి.

తెల్లజాతేతరులైన అమెరికన్ బడా టెక్ కంపెనీలకు సారథ్యం వహిస్తున్న మైక్రోసాఫ్ట్ సత్య నాదెళ్ళ, గూగుల్ సుందర్ పిచాయ్ లేదా పెప్సీకో మాజీ సి.ఇ.ఓ. ఇంద్రానూయి లాంటివారు, లాంఛనప్రాయకంగా తామూ సమన్యాయం కోరుతున్నామనీ, నిరసనోద్యమానికి సంఘీభావం తెలుపుతున్నామంటూ ప్రకటిస్తూ తామూ ప్రగతి కాముకులమేనన్నట్లు ప్రకటించుకొంటున్నారు. తమ సంస్థల వాణిజ్య ప్రయోజనాలను పెంపొందిస్తున్నారు. గూగుల్ సుందర్ పిచాయ్ అయితే జాతివివక్షపై పోరాటానికి 3.7 కోట్ల డాలర్లు విరాళంగా యిస్తున్నట్లు ప్రకటించారు. అయితే యీ విరాళం ఏ సంస్థకిస్తారు, ఏ రకమయిన పోరాట కార్యక్రమాలను సమర్థిస్తారు అన్న వివరాన్ని చూడాల్సి వుంది. అప్పుడు కానీ ఆ విరాళం యొక్క వాస్తవ స్వభావ స్వరూపాలు అర్థంకావు.

మరోవైపు డెమోక్రటిక్ పార్టీకి చెందిన కొన్ని రాష్ట్రాల గవర్నర్లు, కొన్ని పట్టణాల మేయర్లూ తాము పోలీసు వ్యవస్థలో సంస్కరణలు చేపట్టడానికి తీర్మానాలు చేస్తున్నామనీ, పోలీసులు నిందితులను నిర్బంధించటానికి ఉపయోగించే మోకాటి బంధాలు, ఊపిరిని ఆడకుండా పీకను నొక్కిపెట్టే పద్ధతులను, ఫ్లాయిడ్‌పై ఉపయోగించే పద్ధతులను ఉపయోగించటానికి రాష్ట్ర పోలీసులకు యిచ్చే శిక్షణలను రద్దుచేయ బోతున్నామనీ ఆడంబరంగా ప్రకటిస్తున్నారు. కొందరు పోలీసులకు యిచ్చే నిధులలో కోత విధిస్తామని ప్రకటిస్తున్నారు.

మొత్తంగా చూస్తే అమెరికాలోని సకల పక్షాలవారూ, సంస్థాగతమైన ఈ జాత్యహంకార, జాతి వివక్ష సమస్యను, శాంతిభద్రతల సమస్యగానూ, పోలీసు వ్యవస్థలో సంస్కరణలు తీసుకువచ్చే సాధారణ సమస్యగానూ కుదించి చూపిస్తూ – హింసాయుత పద్ధతులు అమెరికన్ ప్రజల, దేశ ప్రయోజనాలకు హాని కలిగించేవన్నట్లుగా చిత్రీకరించి – తేల్చిపారేశారు.

వాస్తవానికి అమెరికాలో నీగ్రోజాతీయులపై సాగే వివక్షా, పోలీసుల దాష్టీకం, పోలీసులు సాగించే హత్యలూ యిటీవలే తలెత్తిన పరిణామాలు ఎంతమాత్రమూ కాదు. గత రెండున్నర శతాబ్దాలుగా యివి నిరాఘాటంగా సాగుతూనే వున్నాయి. అమెరికా దేశపు పాలనా వ్యవస్థ వీటిని అరికట్టకపోగా, తన దోపిడీ విధానాల ద్వారా నానాటికీ యివి మరింతగా పెరిగిపోయేందుకే ఉపయోగపడింది – ఉపయోగ పడ్తోంది. అది రిపబ్లికన్ పార్టీ పాలనలో కావొచ్చు, డెమోక్రటిక్ పార్టీ పాలనలో కావొచ్చు. వివిధ ప్రభుత్వ విధానాల రూపంలో ఆ అకృత్యాలు కొనసాగుతూనే వున్నాయి. పోలీసులు అమానుషంగా నీగ్రోలను చిత్రవధలను చేయటం, చంపటం అన్నది నిత్యకృత్యమయిపోయింది. వివరాలను పరిశీలిస్తే, ప్రతీఏటా పోలీసులు సగటున వెయ్యిమందిని చంపుతున్నట్లు వెల్లడి చేస్తున్నాయి. అందులో జనాభా దామాషాన చూస్తే నల్లవారే ఎక్కువమంది హతులవుతున్నారు. దీని అర్థం యిది కేవలం పోలీసుల యొక్క మితిమీరిన ప్రవర్తన అని చెప్పటానికి వీలులేనిది. ఇటువంటి పోలీసు హత్యలను (నీగ్రోల) వ్యవస్థ ప్రోత్సహించి, ఆమోదిస్తు న్నందువల్లనే యిలా జరుగుతోందని అర్థమవుతుంది. నీగ్రోలను నేరస్థ జాతివారిగా మాదకద్రవ్యాల వ్యసనానికి బానిసలుగా చిత్రీకరిస్తూ, వారిపై దమనకాండను – పోలీసు అకృత్యాలను నిరాఘాటంగా సాగించటానికి వాటిని న్యాయసమ్మతమైనవే, సరయినవే అని సామాన్య అమెరికన్ ప్రజానీకాన్ని నమ్మించి, అంగీకరింపచేయటానికి అమెరికన్ పాలకులు – పాలకవర్గాలు చేపట్టిన జిత్తులమారి విధానం అని అర్థమవుతుంది. ఇదంతా ప్రజాస్వామ్యం, ప్రజల (అమెరికన్) సంక్షేమ, సౌభాగ్యాల కోసమేనన్న భ్రమను కల్పించుతూ సాగుతున్న కుట్రగా అర్థం అవుతోంది.

అయితే "భూలోక స్వర్గంగా" ప్రపంచమంతటా అనేకులు భావిస్తున్న అమెరికాలో ఇలా ఎందుకు జరుగుతోందనేది, ఎందుకు జాత్యహంకారం, జాతి వివక్షలు కొనసాగుతున్నాయో అమెరికా దేశపు చరిత్ర నుండి పరిశీలించి తెలుసుకోవాల్సి వుంది.

నేడు అమెరికాలోని మెజార్టీ పౌరులతోబాటు, పశ్చిమ దేశాల్లోని మెజార్టీ పౌరులేకాక, ప్రపంచ దేశాల్లోని అనేకమంది ప్రజలు పెట్టుబడిదారీవ్యవస్థను అమితంగా కొనియాడుతున్నారు. ఆ పెట్టుబడిదారీవ్యవస్థను ఎన్ని ఆపదలు వచ్చినా కాపాడతానని అధ్యక్షుడు కెన్నడీ ప్రతిజ్ఞ చేశాడు. అప్పటినుండి యిప్పటివరకూ అమెరికా పరిపాలకులందరూ అదే విషయాన్ని ఢంకా బజాయించి మరీ ప్రకటిస్తున్నారు. ఎక్కువమంది అమెరికన్లు పెట్టుబడిదారీవిధానం అన్నదాన్ని ప్రజాస్వామ్యానికి సమానార్థకంగా భావిస్తారు. వారు పెట్టుబడిదారీ విధానానికి ఆవల (బయట) వున్న పాలక వ్యవస్థల్లో, తాము పోరాడి సంపాదించుకొన్న పౌరహక్కులయిన మతస్వేచ్ఛ, ఆలోచనా ప్రకటనాస్వేచ్ఛ, సమావేశస్వేచ్ఛ, పత్రికాస్వేచ్ఛ, అహేతుకంగా అరెస్టుకాబడకుండా వుండే స్వేచ్ఛలకు భంగం – ప్రమాదం ఏర్పడుతుందని నమ్ముతారు. స్వేచ్ఛ అంటే అమెరికన్ల ఉద్దేశ్యంలో తాము కోరుకొన్నది తాము చేయవచ్చుననీ, అందులో ఏరకమయిన ప్రభుత్వ జోక్యం లేకుండా వుంటుందనీ వాళ్ళు నమ్ముతారు. నిజమే! యీ స్వేచ్ఛలన్నీ అమూల్యమయినవే. కానీ దీర్ఘకాలంపాటు జరిపిన పోరాటాల ఫలితంగా, యీ స్వేచ్ఛలు పాక్షికంగా సాధింపబడ్డాయి. ఈ స్వేచ్ఛలన్నింటి కోసం, బూర్జువాలూ (పెట్టుబడిదారుల కోసం), ఫ్యూడలిజంకు వ్యతిరేకంగా పోరాడారు. పెట్టుబడిదారీ విధానం సంస్థాపితమయిన తరువాత యీ స్వేచ్ఛలను కార్మికులకు విస్తరించటాన్ని ప్రతిఘటించారు. అందువలన కార్మికులకు వారి స్వేచ్ఛలు పెట్టుబడిదారీ విధానం వలన రాలేదు. పెట్టుబడిదారీవిధానం వున్నప్పటికీ అవి సాధించబడ్డాయి. వ్యక్తిగత స్వేచ్ఛ యొక్క ప్రతీ నూతన పరిణామమూ కూడా, పెట్టుబడిదారీ సమాజాలు అదుపులో గల (పెత్తనం క్రింద వున్న) వారికి వ్యతిరేకంగా సాగిన తీవ్రమయిన వ్యతిరేకత వలన సాధింపబడ్డాయి. నేడు పెట్టుబడిదారీ విధానం యీ రకంగా కష్టపడి ప్రజలు సాధించుకొన్న హక్కులను కాపాడటానికి బదులు, వాటికి

ఒక ప్రమాదంగా పరిణమించింది. నేటి జాత్యహంకార సమస్యకు యిది కీలకమయిన తీవ్ర విరుద్ధమయిన పరిణామం.

ఫ్రెంచి విప్లవానికి పదమూడు సంవత్సరాలకు ముందే అమెరికా దేశపు వలసలు తమ వలసవాద బంధనాలను తెంచుకొని, అప్పటివరకూ గల చరిత్రలో ఒక అత్యంత విప్లవకరమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాయి. తిరుగుబాటు హక్కుపై, విప్లవం చేసే హక్కుపై, ప్రజలు న్యాయసమ్మతంగానే అమలులో వున్న ప్రభుత్వాన్ని రద్దుచేయవచ్చునన్న ప్రాతిపదికపై, అవసరమైతే బలప్రయోగం ద్వారా ఒక క్రొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చునన్న ప్రాతిపదికపై మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేయబడ్డ దేశం అమెరికా సంయుక్త రాష్ట్రాలు. అది అవలంబించిన మూలసూత్రాలు యూరోపులోని పాలకవర్గాలను భయకంపితులు చేశాయి. అవి, మానవులు అందరూ సమానంగా సృష్టించబడ్డారు. ప్రతీ ఒక్కరికీ జీవించేహక్కు వుంది, అందరికీ స్వేచ్ఛా, సంతోషాలు, ప్రభుత్వం యొక్క ఉద్దేశ్యం యీ హక్కులను రక్షించటం. ప్రజలే సార్వభౌములు - ప్రభుత్వం ప్రజల యొక్క సేవకురాలే తప్ప ప్రజల యజమాని కాదు. ఈ సూత్రాలతోపాటు ఇంకా యితర సూత్రాలను కూడా ఆ దేశం ప్రకటించింది. అవి : సంపన్నవర్గస్వామ్యం వద్దు, వ్యవస్థీకృతమైన చర్చి వద్దు. వాక్స్వాతంత్రం, పాలకులను విమర్శించే స్వేచ్ఛ, ప్రతి ఒక్కరికీ విద్య, వర్గ వివక్ష లేని సమాజం. ఇది ఒక సోషలిస్టు సందేశం కాదు కేవలం ఒక బూర్జువా - ప్రజాతంత్ర ఆశయం మాత్రమే!. ఇదీ ఆనాడు అమెరికా స్వాతంత్ర్య ప్రకటన యొక్క సారాంశం. అందువల్లనే నాడు అమెరికా వాగ్దానం చేసిన నూతన ప్రపంచం యూరోపు ప్రజలకు ఒక ఆశగా పరిణమించింది. అయితే యిటువంటి నూతన ప్రపంచాన్ని కలలుగన్న జెఫర్‌సన్, థామస్ పైన్, విట్‌మన్, ఎమర్సన్‌లు అప్పటికే అమెరికన్ సమాజంలో నెలకొని వున్న వినాశకర, ప్రమాదకరమైన దోషాన్ని గుర్తించలేకపోయారు. అదేమిటంటే : మానవులందరూ సమానమనే సూత్రంపై నిర్మించబడ్డ సమాజంలోనే ఒక బానిస సమాజం కూడా వుండటం. అంతేకాదు వారు అమెరికాలో వున్న స్థానిక రెడ్ ఇండియన్ ప్రజలపై చేసిన నిర్దాక్షిణ్యమైన ఊచకోతను ఖండించలేకపోయారు. అంతేకాదు వారు ఉత్పత్తి సాధనాలు ప్రవేటు వ్యక్తుల స్వంత ఆస్తిగా వున్నంతకాలం మానవాళిలో సమానత్వం తీసుకురావటం అసాధ్యం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు.

అమెరికా దేశపు స్వాతంత్ర్య ప్రకటనకు 150 సంవత్సరాలకు ముందే ఆగస్టు 1619లో 5,00,000 మంది బానిసలు ఆఫ్రికా నుండి తీసుకురాబడ్డారు. అప్పటికి అమెరికాలో వున్న జనాభా మొత్తం 30 లక్షలమంది మాత్రమే. ఆ రకంగా యిప్పుడు అమెరికాలో వున్న ప్రతీ ఒక్క నీగ్రో, కొద్దిమందిగా వున్న తెల్లజాతివారికన్నా ఎక్కువ పూర్వ వంశీకతను కలిగినవారుగా వున్నారు. అయితే తరతరాలుగా వారికి బానిసత్వ దాస్యం తప్ప మరో విషయం తెలియదు. బానిసత్వం నుండి నీగ్రోలకు విముక్తి లభించిందని చెప్పినప్పటికీ నేటికీ మెజార్టీ నీగ్రోల జీవిత విధానం దాస్యం మాత్రమే. కాకపోతే బానిసత్వ రూపం మారింది. నేడు న్యూయార్కు నగరంలోని హార్లెమ్ ప్రాంతంలోగానీ, చికాగో తదితర నగరాల్లోని మురికివాడల్లో నివసించే నీగ్రోల జీవితాలు నాడు వర్జీనియాలో పొగాకు తోటల్లో పనిచేసిన నీగ్రో బానిసల జీవితాలకన్నా ఏరకంగానూ మెరుగైనవిగా లేవు.

అమెరికాలోని జాత్యహంకార, జాతి విద్వేష సమస్యకు మూలాలు ఆ దేశంలోని మూలవాసులైన రెడ్ యిండియన్లను పెద్దపెద్ద గుంపులుగా నిర్దాక్షిణ్యంగా నాశనం చేసిన నాటినుండే మొదలయింది. రెడ్ ఇండియన్లను సర్వనాశనం చేయటమే అమెరికన్ నాగరికతకు చెల్లించబడిన మూల్యమయింది. ఆ రకంగా తెల్లజాత్యహంకారం అన్నది అమెరికా దేశపు ఆవిర్భావం నుండీ వుండి, అది నేటికీ కొనసాగుతోంది.

నాటి నుండి కూడా నీగ్రోలపై వివక్షను చూపించటమన్నది అమెరికా పాలకవర్గాలు అవలంబించి, అనుసరించే బుద్ధిపూర్వక, శాశ్వత విధానంగా సాగుతోంది. ఆర్థిక, రాజకీయ వివక్ష అన్నది ఆ విధానాలకు ప్రాతిపదికగా వుంది.

మానవతావాది అబ్రహాం లింకన్ అధ్యక్షుడైన తర్వాత నీగ్రో బానిస వ్యవస్థ రద్దుపరచబడింది కానీ ఆ బానిసవ్యవస్థ రద్దుకు గల కారణం వారికి తెల్లజాతివారితో సమానహక్కులు యిచ్చి, జాతి వివక్షలేని నిజమైన సమానత్వం గల ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేయటం అన్నది ఆయన ఉద్దేశ్యం కాదని అబ్రహాం లింకనే స్వయంగా 1858లో ఛార్లెస్టన్‌లో యిచ్చిన ఒక ఉపన్యాసం ద్వారా స్పష్టమవుతుంది.

"నేను శ్వేతజాతులవారి మధ్యా నల్లజాతుల వారి మధ్యా రాజకీయ, సామాజిక సమానత్వం తీసుకురావటానికి అనుకూలంగా లేను.... అంతేకాదు నేను నీగ్రోలను ఓటర్లుగానూ, జ్యూరర్లు (న్యాయ నిర్ణయాధికారులు)గా చేయాలనుకోవటంలేదు. లేదా వారిని అధికారాన్ని చలాయించే పదవులు చేపట్టడానికి అర్హులుగా చేయాలనుకోవటంలేదు. లేదా నీగ్రోలను తెల్లజాతివారితో అంతర్ వివాహాలు చేసుకోవాలని అనుకోవటంలేదు.... అధికులు, తక్కువవారు అన్న స్థాయి గల అంతరాలు వుండవల్సిందే. నేను చాలామంది కోరుకొన్నట్టుగా, తెల్లజాతివారే ఉన్నత స్థితిలోనూ, ఉన్నత స్థాయిలోనూ వుండాలన్నదానికి అనుకూలంగా వున్నవాడిని" (ఈ ఉపన్యాసాన్ని 'న్యూస్టేట్స్‌మన్' అనే పత్రిక మే 2, 1969 సంచికలో ప్రచురించింది.)

మరయితే నీగ్రోలను బానిసత్వం నుండి ఎందుకు విముక్తి చేసినట్టు? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఉత్తర రాష్ట్రాలలోని పారిశ్రామికవేత్తలకు కారుచౌకగా శ్రమశక్తిని అమ్ముకొనే కార్మికులు కావాలి. అయితే అటువంటి చౌకగా శ్రమశక్తిని యివ్వగలిగే కార్మికులు దక్షిణ రాష్ట్రాలలోని తోటల్లో (ప్రత్తి, పొగాకు మొ॥) కట్టుబడిపోయి వున్నాడు. వారిని ఆ బానిసత్వం నుండి విడుదల చేస్తే స్వేచ్ఛగా, శ్రమశక్తిని దోపిడీ చేసుకోవటానికి వీలైన పెట్టుబడిదారులకు అవసరమైన లేబర్ మార్కెట్లను వారు విస్తృతం చేస్తారు. అందుకనే బానిసత్వాన్ని అంతమొందించాలని పిలుపులో, ఉత్తరాది రాష్ట్రాల పారిశ్రామికవేత్తల యొక్క డిమాండ్లు ప్రతిధ్వనించాయి.

బానిస, ఫ్యూడల్ సమాజంలో అయితే కార్మికులు తమ బానిస యజమాని అదుపులో వుంటారు. అదే పెట్టుబడిదారీదేశాల్లో అయితే

కార్మికులకు ఏదో ఒక పారిశ్రామిక యజమాని దగ్గర పనిచేసే స్వేచ్ఛ లేదా తమ ఉద్యోగ నియామక నిబంధనలను గురించి బేరసారాలు ఆడే స్వేచ్ఛ వుంటుంది. కానీ వారికి యితర యజమానుల వద్ద పనిచేసే స్వేచ్ఛ వుండదు. అయినా నేడు అమెరికాలో పనిచేసే ఉద్యోగులందరూ ఏదో ఒక యజమానికి ధనాన్ని సంపాదించిపెట్టే సేవకులే! ఇదే పెట్టుబడిదారీవిధానంలో వున్న మర్మం. వేతన బానిసలుగా కార్మికులను కుదించటమన్నదే ఆ వ్యవస్థ యొక్క మూలసూత్రం.

ఆ రకంగా కారుచౌకగా శ్రమశక్తిని అమ్ముకొనే లేబర్ మార్కెట్ల సృష్టికి ఈ నీగ్రోలను సమిధలు చేశారు. వీరిని నిరంతరం పేదవారిగానే మిగిల్చే, వివక్షాపూరిత విధానాలను (రాజకీయ, ఆర్థిక) అమెరికన్ పాలకులు యిన్నాళ్ళుగా అనుసరించారు. ఈ నిరుపేద నీగ్రో చౌక కార్మికులను, తెల్లజాతి కార్మికులకు పోటీపెట్టి, తెల్లజాతి కార్మికులకూ – నల్లజాతివారికీ మధ్య జాతి విద్వేషం నెలకొనేలా చేశారు. ఈ విద్వేషాన్ని శాశ్వతం చేశారు. ఈ వివక్షా విధానాలు, నీగ్రోలను విడదీసి ఘెట్టోలుగా పిలువబడే పట్టణాలలోని మురికివాడల్లో విడిగా వుంచటం వలన అమెరికా దేశంలో సంభవించిన ఆర్థిక లాభాలు వారికి దక్కకుండా పోయాయి. ఈ విధానాల (వివక్షాపూరిత) యొక్క విషఫలాలే, నిరుపేద నీగ్రోలు నేరస్థులుగా మారటానికి గల మూలకారణం. కానీ నీగ్రోలను నేరస్తులుగా చిత్రీకరిస్తూ, వారు సమాజ శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్నారనే పేరిట, వారిని అణచిపెట్టే దుర్మార్గమైన పోలీసు వ్యవస్థను స్థాపించి కొనసాగిస్తోంది అమెరికా పెట్టుబడిదారీవ్యవస్థ. ఆ రకంగా 350 సంవత్సరాలుగా నీగ్రోలపట్ల వివక్ష వ్యవస్థాపరంగానే కొనసాగుతోంది.

ఎటువంటి ఆస్తిపాస్తులూ లేని కార్మికుల శ్రమశక్తిని దోచుకోవటమే ఏకైక లక్ష్యంగా వున్న పెట్టుబడిదారీ సమాజం – వ్యవస్థలు గల అమెరికాలో, తమ పరిస్థితులను మెరుగుపర్చాలని డిమాండు చేసిన కార్మికులను, లేదా అణచబడ్డ నీగ్రోలను "కమ్యూనిస్టు ఆందోళనకారులు" అంటూ ముద్రవేయటం 1890 నాటి నుండే ప్రారంభమయింది. ఆ రకంగా తమ పరిస్థితుల మెరుగుకోసం నిరసనలు జరిపే ప్రజానీకాన్ని శాంతిభద్రతల విఘాతకులుగా ముద్రవేసి, వారిని అణచివేయటానికి (అదుపుజేసే పేరిట) అవసరమైన చట్టాలను పెట్టుబడిదారులే నిర్ణయించి అమలుచేయటం కొనసాగుతోంది. ఆరకంగా అమెరికన్ పెట్టుబడిదారీ వ్యవస్థే పెద్దఎత్తున హింసాయుత పోలీసు బలగాలను ప్రయోగిస్తూ, నిరసనకారులే హింసకు పాల్పడుతున్నారంటూ బుకాయిస్తోంది. వాస్తవానికి రాజ్యం నిరసనకారులపై ప్రయోగించే హింస 1000 టన్నుల శక్తిగల బాంబు విస్ఫోటనం లాంటిదైతే, నిరసనకారులు చెదురుమదురుగా పాల్పడిన హింస ఆట తుపాకీ ప్రేలిన చప్పుడు లాంటిది.

పెట్టుబడిదారీ వ్యవస్థ విధించిన పరిస్థితులే, వివక్షా విధానాలే శాంతిభద్రతల విఘాతానికీ, ప్రజల్లో అశాంతి తలెత్తడానికి కారణాలయినా, అందుకు బాధ్యతను ఆ వ్యవస్థ అశాంతికి రెచ్చగొట్టబడిన ప్రజలపై (నిరసనకారులపై) రుద్దుతోంది.

అమెరికా యొక్క పెట్టుబడిదారీవ్యవస్థ అవలంబించిన వివక్షా విధానాల (నీగ్రోల పట్ల) వలన నేడు నీగ్రోలు విద్యాపరంగా, సామాజికంగా, ఆర్థికపరంగా అధోస్థితిలోకి నెట్టబడ్డారు. అమెరికా దేశపు ప్రగతిఫలాలు నీగ్రో జాతివారికి దక్కకుండా పోయాయి. నేడు తెల్లజాతి సగటు వార్షిక ఆదాయం 71 వేల డాలర్లయితే, ఆఫ్రికన్ అమెరికన్లది 41 వేల డాలర్లు మాత్రమే. ఆఖరికి కోవిడ్ మరణాల్లో కూడా నల్లజాతీయుల సంఖ్యే 2.4 రెట్లు ఎక్కువగా వుంది. శ్వేతజాతివారిలో నిరుద్యోగ రేటు 1.9 శాతం కాగా నల్లజాతివారిలో 8 శాతంగా వుంది. శ్వేతజాతీయుల్లో 8.1 శాతం మంది పేదరికంలో మగ్గుతుంటే, నల్లజాతివారిలో 20.8 శాతం నిరుపేదలుగా వున్నారు. నల్లజాతివారికి శ్వేతజాతీయులతో సమానంగా వైద్యసేవలు పొందే అవకాశం లేదు – ఇదీ 'ప్రజాస్వామ్య' అమెరికా దేశపు వాస్తవ ముఖచిత్రం. ఇదీ పెట్టుబడిదారీ వ్యవస్థ సమాజానికి అందిస్తున్న 'సమానత్వ', 'స్వేచ్ఛా' అవకాశాల బండారం!

దీన్ని కప్పిపుచ్చుకోవటానికి నిరంతరం, సామ్రాజ్యవాదంగా స్థిరపడ్డ అమెరికాదేశపు పెట్టుబడిదారీ వ్యవస్థ పాలకులు – పాలకవర్గాలు 'ప్రజాస్వామ్యం', 'ప్రజల వ్యక్తిగత హక్కులకు' గ్యారంటీగా నిలబడిన యోధులుగా ప్రచారం ముమ్మరంగా కావించుకొంటూ తమ బూటకత్వాన్ని కప్పిపెట్టుకొంటున్నారు. సామ్రాజ్యవాదపు నాయకునిగా వ్యవహరిస్తున్న అమెరికా తనను తాను "ప్రపంచ పోలీసుగా" నియమించుకొని, ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడం కోసం, స్థాపించటం కోసం తాము జోక్యం చేసుకొన్నామంటూ దురాక్రమణ యుద్ధాలను సాగిస్తోంది. దేశంలో అంతర్గతంగా వివక్షకు వ్యతిరేకంగా ఎగసిపడిన అనేక నీగ్రో ఆందోళనలను పోరాటాలను నెత్తుటేరుల్లో ముంచి అణచివేసింది. పోలీసు వ్యవస్థను వ్యవస్థాగతం చేసిన పాలకవర్గాలే ప్రభుత్వాల దోపిడీ విధానాలను ప్రశ్నించిన వారిని దారుణ దమనకాండతో అణచివేస్తున్నాయి.

అమెరికన్ పెట్టుబడిదారీ పాలనావ్యవస్థ విధించిన యీ విధానాలే జాత్యహంకార, జాతి వివక్ష సాగటానికి గల అసలు మూలకారణం. ఇవే రాజకీయ, ఆర్థిక వివక్ష విధానాలను నీగ్రోలకు వ్యతిరేకంగా, నల్లజాతి అధ్యక్షుడు ఒబామాతో సహా అందరూ అమెరికన్ అధ్యక్షులూ అమలుజరిపారు. ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్నది కూడా అదే!

జాత్యహంకారాన్నీ, జాతి వివక్షనూ సృష్టించిన అమెరికాదేశపు పాలకవర్గాలు, దాన్ని అంతమొందించ దలుచుకుంటే సునాయాసంగా అంతం చేయగలరు. అది వారి ప్రయోజనాలను పెంపొందిస్తుందనుకొంటే వాళ్ళు చేస్తారు. ఉదాహరణకు అమెరికా దేశ ఆవిర్భావకాలం నుండీ అమెరికా సైనిక బలగాలలో వున్న లాంఛనప్రాయమైన జాతి వివక్షను ఒక్క కలం పోటుతో, ఎటువంటి ఉపద్రవం జరగకుండానే అంతం చేశాడు అధ్యక్షుడు ట్రూమన్.

తమకున్న అపారమైన ప్రచార నైపుణ్యంతో, తమకు అందుబాటులో గల మొత్తం వనరులతో, తమకు గల బలప్రయోగం చేసే అధికారంతో, అమెరికన్ పాలకవర్గాలు "ఐక్యం చేయబడ్డ" అమెరికా అనే ఆదర్శాన్ని మూర్ఖపు పట్టుదల గల శ్వేతజాతి జాత్యహంకారులను ఒప్పించగలరు. కానీ వారు అలా చేయరు. ఎందుకంటే అమెరికాలోని కార్మికులూ, ప్రజలూ నిరంతరం విభజింపబడి వుండాలి. వారెన్నడూ ఐక్యం

కాకూడదు. వారందరూ ఐక్యమై ప్రస్తుతం అమలులో వున్న దోపిడీ పెట్టుబడిదారీవ్యవస్థకు వ్యతిరేకంగా దాన్ని సమూలంగా మార్చివేయటం కోసం ఎన్నడూ పోరాటం నిర్వహించకూడదు.

సరీగ్గా యీ లక్ష్యంతోనే, అమెరికా పెట్టుబడిదారీ పాలకవ్యవస్థ జాత్యహంకారం, జాతి వివక్షలను అమెరికా సమాజంలో శాశ్వతం చేసింది. అందుకనే సమన్యాయం కోసం నిరసన తెలుపుతున్న ఆందోళనను శాంతిభద్రతల సమస్యగా చూపెడుతూ, దానిని క్రూరంగా అణచివేసేందుకు ఆమోదపూర్వకమైన ప్రజాభిప్రాయాన్ని మలచుకొంటోంది. నిరసనోద్యమాన్ని నిర్వహిస్తున్న వివిధ రకాల ప్రజానీకంతోపాటు, అందుకు సంఘీభావం తెలుపుతున్న వివిధ ప్రజాతంత్ర శక్తులు యీ వాస్తవాలను అర్థం చేసుకోవాలి! అమెరికాలో కొనసాగుతున్న పెట్టుబడిదారీవ్యవస్థ కూలద్రోయబడకుండా ఈ జాత్యహంకారాలు, జాతి వివక్షలు అంతం కావన్న కఠిన వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి!

పెట్టుబడిదారీవ్యవస్థను రద్దుచేసే మహత్తర లక్ష్యసాధన కోసం ఐక్యమయ్యేందుకు, పోరాడేందుకు, అసమానతలకు, వివక్షలకు గురయ్యే ప్రజానీకం అందరినీ సమాయత్తం చేసేందుకు నిరంతర కృషి జరగాలి! ✤

# ముప్ఫై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

**'చీకటి** ఖండంపై మండే సూర్యుడు' ముఖచిత్రంతో 1990 ఫిబ్రవరి, మార్చి, ఏప్రియల్ మూడు నెలలు కలిపి ఒకే సంచికగా ప్రజాసాహితి వెలువడింది. "మా బాధలు మాకు నేర్పిన పోరాటం యిది" అనే శీర్షికతో వచ్చిన సంపాదకీయంలో దక్షిణాఫ్రికా నల్ల ప్రజల నేత నెల్సన్ మండేలాను 26 సం॥ల తర్వాత విడుదల చేయటాన్ని పురస్కరించుకొని దక్షిణాఫ్రికాలో సాగుతున్న దోపిడీ విధానాలు, నల్లజాతి ప్రజల పోరాటాలను వివరించారు. మండేలాకు నిండు మనసుతో ప్రజాసాహితి స్వాగతం పలికింది. 'అతని అసలు పేరు అలజడి' అన్న వ్యాసంలో నెల్సన్ మండేలా జీవిత చరిత్రను తెలియచేశారు. 'ఆంక్షలు–నిషేధాలు' శీర్షికలో – దక్షిణాఫ్రికాలో రచయితలపై, పత్రికలపై శ్వేతజాతి ప్రభుత్వ ఆంక్షలు గురించి వివరించారు. 'వివేచన' శీర్షికలో బులేలోజమానే రాయగా రహి అనువాదం చేసిన 'దక్షిణాఫ్రికాలో కథా సాహిత్య పరిణామమూ – వికాసం' వ్యాసాన్ని ప్రచురించారు. 'దేశదేశాల్లో....' శీర్షికలో ప్రజాకళాకారిణి, అమెరికన్ నల్లజాతి గాయని 'ట్రెసీ చాప్‌మాన్' ప్రజాకళా జీవితాన్ని వివరిస్తూ కె. సంజీవి రాసిన 'బలమైన నల్లగొంతు ట్రెసీ చాప్‌మాన్' వ్యాసాన్ని, ఆమె పాడిన 'చౌరస్తా' గేయాన్ని, 'తక్షణమే స్వేచ్ఛ' అంటూ నెల్సన్ మండేలాకు అంకితమిస్తూ ఆలపించిన మరోగీతాన్ని అందించారు. 'నల్ల కలువలు' శీర్షికలో 'జబులో ఎస్ డి బీలీ' రాసిన 'ఫిడేలు రాగం' కథను అయోధ్యారెడ్డి అనువదించారు. 'అంతర్మధనం' శీర్షికలో దక్షిణాఫ్రికా కవి 'డెనిస్ బ్రూటస్' అనుభవాలు 'కొండలోంచి పగటి ఆగ్రహం బుసబుసమంటోంది' అంతర్మధనాన్ని ఖాదర్ మొహిద్దీన్ అనువదించారు. 'కవితాఝరి' శీర్షికలో డెనిస్ బ్రూటస్ రాసిన 'శిథిలాల మీద సూర్యుడు', చిల్ చినీ కోకర్ రాసిన 'కవిగా నా దేశంలో', డేవిడ్ డియోప్ రాసిన 'నా తల్లికి', బ్రేటన్ బ్రేటన్ బా రాసిన 'ఓ గెరిల్లా మిత్రుని కోసం', చికాయు థామ్సీ రాసిన 'ఉనికి' 'సన్నిధి', లియోపార్డ్ సెంఘార్ రాసిన 'ఉపదేశం', జోసెఫ్ రెబరివేలో రాసిన 'దానిమ్మకాయ' – దక్షిణాఫ్రికా కవుల కవితలున్నాయి. నోబెల్ సాహిత్య బహుమతిని అందుకున్న మొదటి ఆఫ్రికా జాతీయుడు నైజీరియాకు చెందిన ఓలె సోయింకా. నోబెల్ బహుమతిని స్వీకరిస్తూ స్టాక్‌హోమ్‌లో 1986 డిశెంబర్ 8న ఇచ్చిన ఉపన్యాసంలోని కొన్ని భాగాలను 'ఈ గతం తన వర్తమానాన్ని నిర్దేశించాలి' అనే శీర్షికతో అందించారు. 'కవిత' శీర్షికలో 'మనందరం నల్లవాళ్ళమే' – కవితను కొత్తపల్లి రవిబాబు రాశారు. అవతార్‌సింగ్ పాష్ మూడవ వర్ధంతి (మార్చి 23) సందర్భంగా 'కవితా నివాళి'గా పాష్ మిత్రుడు అజ్మీర్ రోడ్ (కెనడా) 1988లో వాంకోవర్‌లో జరిగిన జాతీయ పుస్తకోత్సవం కవి సమ్మేళనంలో చదివిన కవితను కొత్తపల్లి రవిబాబు అనువదించారు. 'బలియాపాల్ కథలు'లో భాగంగా ఉదయ్ రాసిన 'మొదటి బుధవారం' కథ, 'కరపత్రాలు – కదిలే చరిత్ర' శీర్షికలో 'సాహిత్య అకాడమీలో సాగుతున్న దురాచారాలు' మీద 'రైటర్స్ ఫోరమ్' కరపత్రాన్ని, 'రేఖాచిత్రాలు' శీర్షికలో అక్టోబర్ విప్లవ వెలుగులో రష్యన్ రేఖాచిత్రాలను ప్రతి నెలా ఒకటి ప్రచురించటంలో భాగంగా 1919లో అలెగ్జాండర్ పెట్రోల్ అనే చిత్రకారుడు రూపొందించిన 'యూరల్స్‌ని రక్షించండి! ముందుకు సాగిపోండి' అనే సందేశాన్నిచ్చే చిత్రాన్ని ముద్రించారు. 'రాల్ఫ్ ఫాక్స్ గురించి – ఆయన స్పెయిన్ నుంచి రాసిన లేఖాంశాలు – యుద్ధరంగంలో ఆయన వీరోచిత మరణం' అనే వ్యాసం, నెల్సన్‌మండేలాతో పాటు యావజ్జీవ కారాగార శిక్షకు గురయిన ఎనిమిదిమందిలో భారతీయుడైన అహ్మద్ మహమ్మద్ కత్రడా గురించి వివరిస్తూ 'కేతే' కత్రడా – నెల్సన్ మండేలా కుడిభుజం' వ్యాసాన్ని ప్రచురించారు. వెనుక అట్టమీద 26 సంవత్సరాల జైలు జీవితం తర్వాత విడుదలై, ఆఫ్రికన్ నేషన్ కాంగ్రెస్ డిప్యూటీ ప్రెసిడెంట్‌గా ఎన్నికయిన 71 సం॥ల నెల్సన్ మండేలా చిత్రంతోపాటు 1976 జూన్ 16న 'బంటూ విద్యా విధానానికి' వ్యతిరేకంగా ఉద్యమించిన దక్షిణాఫ్రికా విద్యార్థి యువతరంపై పోలీసులు కాల్పులు జరపగా 13 సం॥ల హెక్టర్ పీటన్ సన్ అనే బాలుడు మృతిచెందాడు. అతని మృతదేహంతో సహాధ్యాయులు, అతని చెల్లి క్రోధంతో రోదిస్తూన్న చిత్రాన్ని ముద్రించారు. ✤

# విశాఖజిల్లా ఎల్.జి. పాలిమర్స్ స్టైరిన్ గ్యాస్ లీకేజి సంఘటన - జనసాహితి విశాఖజిల్లా శాఖ నివేదిక

**మే** నెల 7వ తేదీ తెల్లవారుఝామున విశాఖపట్టణంలో ఎల్.జి. పాలిమర్స్‌లో జరిగిన స్టైరిన్ గ్యాస్ లీకేజి సంఘటన ఒక్క విశాఖ జిల్లావాసులనేగాక, యావత్ దేశ ప్రజానీకాన్నీ తీవ్రమైన కలవరపాటుకు గురిచేసింది. సంఘటన జరిగిన రోజునే 11 మంది చనిపోగా, తదుపరి (జూన్ 4 నాటికి) మరో ముగ్గురు మరణించారు. మొత్తం 14 మంది మృత్యువాత పడ్డారు. సంఘటన జరిగిన ప్రాంతానికి చెందిన యిద్దరు గర్భవతులకు అబార్షన్స్ జరిగాయి.

విశాఖజిల్లా జనసాహితి మరియు ఓపిడిఆర్ సభ్యులు కలిసి, సంఘటన జరిగిన ఆర్.ఆర్. వెంకటాపురం గ్రామాన్ని 20-5-2020న పర్యటించారు. ఆ గ్రామంలోని వెంకటాద్రి గార్డెన్స్ అనే నివాసిత ప్రాంతంలో ప్రధానంగా పర్యటించడం జరిగింది. సుమారు 65 వరకూ గృహసముదాయాలు, వందకు పైచిలుకు కుటుంబాలు ఇక్కడ ఉన్నాయి. 7వ తేదీ తెల్లవారుఝామున స్టైరిన్ లీకేజి సంఘటనతో ఎక్కువగా ఆస్థి, ప్రాణనష్టాలకు గురైన ప్రాంతం యిదే.

పర్యటనలో ప్రజలు, ఆనాటి నరకయాతనను, కంపెనీ దురాగతాలను, ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్య ధోరణులను గురించి ఆవేదనాపూరితమైన తమ అనుభవాలను జనసాహితి బృందంతో పంచుకున్నారు. ఆనాటి తెల్లవారుఝామున మూడు మూడున్నర గంటల మధ్య నిద్రలోనే.... ఊపిరాడని, కళ్ళుతెరవలేని ఒక భయానక స్థితిని వారనుభవించారు. చుట్టూ చావుకేకలు, హెచ్చరికల అరుపుల వల్ల, కాలనీలోని మిత్రుల ఫోన్‌కాల్స్ వలన వారు చనిపోబోతున్న సంగతిని గ్రహించారు. తాము చనిపోయినా పిల్లలను కాపాడుదామని కొందరు ప్రయత్నించారు. చనిపోయేటప్పుడు ఒక్కచోటే చనిపోదామని కుటుంబీకులంతా ఒకే గదిలో కొందరు చేరిపోయారు. పారిపోదామని పిల్లల్ని కారెక్కించి స్టీరింగుపైనే కొందరు వాలిపోయారు. ఊపిరాడక - కళ్ళు కనబడక ఏం చేస్తున్నామో తెలియని అయోమయావస్థలో రోడ్లపైన, తుప్పల్లో.... చివరకు మురుగుకాల్వలలో సైతం పడి అలాగే ఉండిపోయారు కొందరు. ఐదారు గంటలు గడిచాక, ఎవరెవరో విషయం తెల్సుకుని కాపాడినవారిని కాపాడగా, 11 మంది చనిపోయారని, ఇద్దరికి అబార్షన్ అయ్యిందని, పదుల సంఖ్యలో స్టైరిన్ గ్యాస్ ఒంటికి తగిలినమేర చర్మం కాలిపోయినవారున్నారని (నాటి రాత్రికి) తెలిసింది. మరునాటికి (8వ తారీఖు) కూడా తీవ్రత తగ్గినా లీకేజీ కొనసాగుతూనే ఉందని వారు తెలిపారు.

సంఘటన జరిగిన ప్రాంతానికి అన్నివైపులా ఉన్న ఏరియాలలో ప్రజలు సైతం ప్రాణాలరచేత పెట్టుకుని పారిపోయారు. షీలానగర్, గాజువాకల వైపు, తగరపువలస వైపు, సింహాచలం, హనుమంతవాకల వైపు, సబ్బవరం, చోడవరంవైపు కూడా వేలమంది జనాలతో రోడ్లు నిండిపోయాయి.

జనసాహితి బృందంతో మాట్లాడిన ప్రజలు, ఎల్.జి. పాలిమర్స్ యాజమాన్యంపై మరియు దాన్ని వెనకేసుకొస్తున్న ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాసు లీకేజి వంటి అంశాలపట్ల, నిర్వహణాంశాల పట్ల కనీస పరిజ్ఞానం ఉన్న స్కిల్డ్ లేబర్‌ను కంపెనీ మెయింటైన్ చేయడంలేదని, కనీసం అలారమైనా మోగించలేదని అన్నారు. గ్యాస్ లీకేజి, పేలుళ్ళు తదితర ప్రమాదాలు జరిగితే ఏమిచేయాలో తెలియజెప్పే మాక్‌డ్రిల్ వంటివి ఏనాడూ చేపట్టలేదని అన్నారు. హాస్పిటల్, అంబులెన్స్ వంటి కనీసపాటి వైద్యసౌకర్యాల నిర్వహణ సైతం లేనేలేవని అన్నారు. కంపెనీ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా నివాస ప్రాంతాలపైకి వదిలేస్తున్నారని చెప్పారు.

1961లో పాలీస్టెరీన్ ఉత్పత్తి చేయడం కోసం మొదట ఈ కంపెనీ హిందుస్థాన్ పాలిమర్స్‌గా ప్రారంభించబడింది. 1978లో యునైటెడ్ బ్రువరీస్‌కు చెందిన మెక్‌డోవల్ కంపెనీతో విలీనమయ్యింది. అప్పటి నుండి 1997 వరకు, ఇక్కడ ఆల్కహాలు తయారయ్యేది. తదుపరి 1997లో దక్షిణ కొరియాకు చెందిన ఎల్.జి. కెమికల్స్ చేతులలోకి వెళ్ళింది. అప్పటి నుండి దక్షిణ కొరియా, అమెరికాల నుండి స్టైరిన్ అనబడే రసాయనాన్ని దిగుమతి చేసుకుంటూ రకరకాల కెమికల్ మరియు యింజనీరింగ్ ఉత్పత్తులను తయారు చేస్తున్నది.

ఒకవైపు క్లీన్ విశాఖ, గ్రీన్ విశాఖ అంటూ ఆకర్షణీయ నినాదాలనిస్తూ, మరోవైపు ప్రాణాంతక పరిశ్రమల దినదినగండాలలోకి విశాఖను నెట్టేస్తున్నారు. అభివృద్ధి, ఉపాధి మంత్రాలను జపిస్తూ ప్రజాజీవితాలను విషకాలుష్య కోరకు ఎరవేస్తున్నారు. తూర్పుతీర ప్రాంతాన్ని..., ముఖ్యంగా విశాఖ నుండి కాకినాడ వరకు పెట్రో ఇండస్ట్రియల్ కారిడార్‌ను.... ఇంకా కెమికల్స్, ప్లాస్టిక్స్, ఔషధాలు, అణువ్యర్థాల నిర్వహణ తదితరాలకై ప్రమాదకరంగా మార్చివేస్తున్నారు.

గోరంత ఉపాధికల్పన చూపించి...., కొండంత మానవ శ్రమను, సహజవనరులను దోచుకుపోతున్నారు. ఏ జెండాలూ, అజెండాలూ కలిగిన పాలకులైనా ఈ దోపిడికి వత్తాసు పలుకుతూ ప్రజలను పీడిస్తున్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదపు నాయకత్వాన జరుగుతున్న, బహుళజాతి కంపెనీల దోపిడి విధానాలకు లొంగిపోయిన మనదేశ పాలకవర్గాలే ఈ మారణకాండకు కారణమౌతున్నాయి. ఎక్కడికక్కడ ప్రజలంతా సంఘటితపడి ఉద్యమించి నిలువరిస్తే తప్ప ఈ ప్రాణాంతక పారిశ్రామిక విధానాలకు అడ్డుకట్ట వేయలేము. ✤

సైన్సు సాహిత్యం

# ప్రపంచవ్యాప్తంగా వైరస్‌ల దాడి

డా॥ కొడవటిగంటి రోహిణీప్రసాద్

**ఈనాడు** మనిషి ఎటువంటి క్రూర జంతువునైనా ఒక తుపాకీ గుండుతో లొంగదీసుకోగలడు. కానీ కంటికి కనబడని రకరకాల క్రిములు ఎప్పుడైనా, ఎక్కడైనా మన ప్రాణాలు తీయగలవు. ఎన్ని రకాల కొత్త మందులు కనిపెట్టినా అవి తమ స్వభావాలని మార్చేసుకుని మనమీద దొంగదెబ్బ తీస్తూనే ఉంటాయి. సైంటిస్టులు ఈ ఎడతెగని పోరాటంలో అహోరాత్రాలు శ్రమిస్తూ ఉంటారు. అందుకే కష్టాల్లో ఉన్నవాళ్ళు దేవుణ్ణి తలుచుకున్నట్టుగా ప్రపంచవ్యాప్తంగా అంటురోగాలు (లేదా, వాటి గురించిన భయం) ప్రబలినప్పుడల్లా ప్రజల్లో సైన్స్ విషయాల పట్ల కాస్త ఆసక్తి పెరుగుతుంది. ఇటీవల వార్తల్లోకెక్కిన బర్డ్ ఫ్లూ, కొన్నేళ్ళ కిందట కంగారుపెట్టిన సార్స్, దానికి ముందు పశువులకు సోకిన మాడ్ కౌ డిజీజ్ (బీఎస్ఈ) వగైరాలన్నీ ఈ కోవకే చెందుతాయి. వీటన్నిటికి రకరకాల వైరస్‌లే కారణం. ఎపిడెమిక్ రూపంలో వ్యాప్తి చెందే రోగాలు ఎల్లలూ, సరిహద్దులూ పాటించకుండా లక్షలమందిని బాధిస్తాయి. మనుషుల మధ్యగాని, దోమలూ, ఎలుకలూ వగైరా ప్రాణుల ద్వారాగాని ఒకరి నుంచి మరొకరికి పాకే భయంకరమైన రోగాలకు "ఘనమైన చరిత్ర" ఉంది. పధ్నాలుగో శతాబ్దంలో చెలరేగిన మహమ్మారి యూరప్ జనాభాలో మూడోవంతును "పొట్టన పెట్టుకుంది" 1918లో మొదలైన ఒక రకమైన ఫ్లూ ప్రపంచవ్యాప్తంగా నాలుగైదు కోట్లమందిని "బలితీసుకుంది". యుద్ధాలూ, విదేశీ సైన్యాల దాడీ వగైరాల వల్ల రోగాలకు దారితీసే పరిస్థితులు తలెత్తుతూ ఉంటాయి. ఇరవయ్యో శతాబ్దానికి పూర్వం యూరప్‌లో జరిగిన యుద్ధాల్లో ఆయుధాలతో పోలిస్తే ఎక్కువమంది రోగాల వాతపడి ప్రాణాలు కోల్పోయారు. యూరోపియన్లు అమెరికా ఖండాన్ని కనుక్కోవడమే కాక అక్కడ ఆరోగ్యంగా జీవిస్తున్న ప్రజలకు తమ భయంకరమైన రోగాలను ఉచితంగా సరఫరా చేశారు. వారికి ఇమ్యూనిటీ లేకపోవడంతో మెక్సికోలో కొన్ని ప్రాంతాల్లో స్పెయిన్ నుంచి దిగుమతి అయిన రోగాలకు 90 శాతం జనాభా చచ్చిపోయారట.

మశూచి, క్షయ, పోలియో వంటి పాతరోగాలు అదుపులో వచ్చాయనుకుంటూ ఉన్న తరుణంలో కొత్తవి మొదలయ్యాయి. 1970 తర్వాత ఎయిడ్స్, ఎబోలా, హెపటైటిస్–సి మొదలైనవి ఆవిర్భవించడమే కాక పాతవాటిలో కొన్ని మందులను నిరోధించగలిగే అవతారాలెత్తాయి. 1980లలో పశువులకు తగులుకున్న బీఎస్ఈ బ్రిటన్ నుంచి వాటి మాంసం ఎగుమతి విషయంలో పెద్ద ఉత్పాతాన్నే కలిగించింది. వైరస్ ప్రభావం వల్ల వాటి మెదడు తూట్లుపడినట్టుగా తయారయింది. ఎటొచ్చీ అది మామూలు వైరస్ వల్ల వచ్చిన రోగం కాదని తేలింది. మనం సూక్ష్మజీవులుగా పరిగణించే బాక్టీరియాకన్నా వైరస్‌లు చిన్నవైతే వాటికన్నా వందరెట్లు చిన్నవి కూడా ఉన్నాయి. వాటిని ప్రీయాన్‌లంటారు. సూక్ష్మాతిసూక్ష్మమైన ఈ కణాలు "వక్రమార్గం పట్టిన" ప్రోటీన్ కణాల వంటివి. పశువులకు పిచ్చెక్కించి ప్రాణాలు తీసేవి ఇవే. మెదడులోని నాడులమీదా, రక్తంలోని తెల్లకణాల్లోనూ, కండరాలూ, ఇతర శరీర కణాల్లోనూ ఒక రకమైన ప్రోటీన్ కణాలుంటాయి. వీటిలో కొన్ని మ్యుటేషన్‌ల కారణంగా వికృతి చెందుతాయి. ప్రీయాన్లలో 200 పైచిలుకు అమినో ఆసిడ్లు మూడు చుట్టలుగా చుట్టుకుని ఉంటాయి. మ్యుటేషన్‌ల వల్ల వీటి ఆకారం మారి చీరె కుచ్చిళ్ళలాగా తయారౌతుంది. ఇటువంటివి మామూలు కణాలకు తగులుకుని వాటి స్వరూపాలని కూడా మార్చేస్తాయి. పశువుల మెదడు కణాలన్నీ నాశనమై అది స్పాంజ్‌లాగా తయారౌతుంది. మామూలుగా ఆకులూ, అలములూ తినే పశువులకు ఏపుగా పెరగడానికని వ్యాపార దృష్టితో గొర్రె మాంసం, పంది మాంసం, కోడి మాంసం వగైరాలన్నీ తినిపించడం వల్ల ఎక్కడో వాటి ఆహారంలో ఈ రోగక్రిములు ప్రవేశించాయి. చివరకు ఈ రోగ భయం వల్ల లక్షల కొద్దీ పశువులను చంపవలసి వచ్చింది. అప్పటికే బ్రిటన్ వంటి దేశాలనుంచి ఎగుమతి అయిన గొడ్డుమాంసం తిన్నవారంతా ప్రాణాలు అరచేత పట్టుకుని జీవించారు. తరవాతి పరిశోధనలలో అది తిన్న మనుషుల ఆరోగ్యం కూడా దెబ్బతిన్నదని తేలింది. అలాగే న్యూగినీలో ఆదిమజాతుల తంతు విందుల్లో నరమాంస భక్షణ చేసిన కారణంగా కొందరికి అదే వ్యాధి సోకింది. ఇటువంటి రోగానికి గురి అయిన గొర్రెల మీద పరీక్షలు జరిపి, క్రిములను వేరు చేసిన తరువాత పరీక్షలు జరిపారు. మామూలుగా డీఎన్ఏ, ఆర్ఎన్ఏ వగైరాలను నాశనం చెయ్యగలిగిన అల్ట్రావయొలెట్ కిరణాలు వాటి మీద ప్రభావమేమీ చూపలేకపోయాయి. మరికొన్ని పరిశోధనలు చేశాక అందులో ఉన్నవి ప్రోటీన్లేనని తేలింది.

2003 ప్రారంభంలో చైనాలో తలెత్తిన సార్స్ వ్యాధికి కొంతమంది చనిపోయారు. దీని లక్షణాలకూ, పక్షుల ద్వారా ఈ మధ్య వస్తున్న బర్డ్ ఫ్లూ లక్షణాలకూ పోలికలున్నప్పటికీ వీటికి కారణమైన వైరస్‌లు ఒకటి కావు. పక్షులకు వచ్చే 15 రకాల ఫ్లూ వైరస్‌లలో హెచ్5ఎన్1 అనేది అన్నిటికన్నా తీవ్రమైనది. 22 డిగ్రీల (సెల్సియస్) ఉష్ణోగ్రతలో ఇది నాలుగు రోజులదాకా బతికే ఉంటుంది. చలి ఎక్కువైనకొద్దీ దీని ఆయుష్షు పెరుగుతుంది. కనక జాగ్రత్తగా ఉండాలి. దీనివల్ల రోగం త్వరగా వ్యాపించి చావుకు దారితీస్తుంది. కోళ్ళ పెంపకం జరిగే ప్రాంతాల్లో వాటి రెట్టల ద్వారా ఈ వైరస్ అన్ని పక్షులకూ తగిలే అవకాశం ఉంది. తక్కినవాటిలాగా కాకుండా ఇది మనుషులకు కూడా సోకే ప్రాణాంతక వ్యాధి. సార్స్‌లాగా వ్యాధిగ్రస్థులని వేరుగా ఉంచడంవల్ల దీని సమస్య తీరదు. ఎందుకంటే ఫ్లూ వైరస్‌లు అతివేగంగా మ్యుటేషన్లకు లోనవుతాయి. అటువంటిది జరిగి, దానికి మనుషులకు సోకే లక్షణాలు గనక రూపొందినట్టయితే వ్యవహారం చెయ్యిదాటిపోయే ప్రమాదం ఉంది. ఎవరికైనా మామూలు ఫ్లూ తగిలితే ఆ పరిస్థితిలో బర్డ్ ఫ్లూ వచ్చే

అవకాశం ఎక్కువగా ఉంటుంది. రెండు రకాల వైరస్‌లూ కలిసి కొత్తరకం తయారైందంటే అది తక్కినవారందరికీ అంటుకోవచ్చు. దానికి ఇమ్యూనిటీ లేకపోవడంతో వ్యాధి బాగా ముదిరి ప్రాణాలు తీయవచ్చు. పక్షుల నుంచి తిన్నగా సోకేదీ తీవ్రమైన వ్యాధి. ఒక మనిషి నుంచి మరొకరికి అంటుకున్నప్పుడు దీని స్వభావం అంత ప్రమాదకరంగా ఉండకపోవచ్చు. అణుయుద్ధాలకు కూడా వెరవని పెద్ద దేశాలన్నీ ఈ సూక్ష్మక్రిముల దాడిని గురించి ఆందోళన చెందుతున్నాయి. ఇది పెనుప్రమాదం కాకుండా అరికట్టడానికని ఈ రోగం బారినపడ్డ పక్షులన్నిటినీ చంపుతున్నారు. ఈ ప్రక్రియలో పాల్గొంటున్నవారికి వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువ. దీనికి ఉన్న ఒకే ఒక్క విరుగుడు టామీ ఫ్లూ అనే మందు తయారీ గురించి తర్జనభర్జనలు జరుగుతున్నాయి. దీన్ని కూడా రోగం వచ్చిన ఒకటి రెండు రోజుల లోపునే ఇవ్వాలట. ప్రస్తుతం దీనికి వేక్సీన్ ఏదీ లేదు. వియత్నాంవంటి తూర్పు ఆసియా దేశాల్లో ఇది మొదటగా తలెత్తినప్పుడు దాదాపు 70 శాతం రోగులు చనిపోయారు. తరువాత ఈ సంఖ్య సగానికి తగ్గింది. కాని ఇది మంచి పరిణామం కాదని శాస్త్రవేత్తల ఉద్దేశం. రోగానికి కొద్దిమంది బలైపోయినప్పటికీ రోగం వారితో బాటే సమసిపోతుంది. రోగులు కోలుకుంటున్నకొద్దీ రుగ్మత వారినుంచి ఇతరులకు వ్యాపించే అవకాశం ఎక్కువౌతుంది.

1918లో ఫ్లూ వల్ల చనిపోయిన ఒక వ్యక్తి శవం ఇటీవల అలాస్కాలో మంచులో కురుకుపోయి ఉండగా దాన్ని బైటికి తీసి, పరిశోధనల నిమిత్తమై ఆ వైరస్‌ను కృత్రిమంగా మళ్ళీ పునర్నిర్మించారు. జన్యు పరీక్షలు జరిపి ఎలుకల వంటి వాటిమీద దాన్ని ప్రయోగించినప్పుడు అది ఎలుకల్లోనూ, మనుషుల ఊపిరితిత్తుల్లోనూ అతిత్వరగా పెరిగిపో గలదని తెలిసింది. ఇలాంటి ప్రయోగాల వల్ల లక్షలమంది ప్రాణాలు తీయగలిగిన వైరస్‌ల గురించి విలువైన సమాచారం లభిస్తుంది. మనుషుల మధ్య ఎన్ని సామాజిక, రాజకీయ విభేదాలున్నప్పటికీ సూక్ష్మక్రిముల విషయంలో అందరూ ఏకమై, ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి సంస్థల ద్వారా సకాలంలో తగిన చర్యలు తీసుకోకపోతే భయంకరమైన పరిణామాలు కలగవచ్చు. కనబడే శత్రువుకన్నా కనబడని శత్రువు వల్ల ప్రమాదం ఎప్పుడూ ఎక్కువే.

జనసాహితి ప్రచురణ : 'జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం' నుండి ✤

పాట

## కరోనా కాటు వేటు

– ఉప్పెన

కరోనా కాటుకు రాలుతున్న కంఠాలు ఎన్నో
కరోనా వేటుకు తెగి పడుతున్న తనువులెన్నో
ఒక్కరా ఇద్దరా ఎందరాని చెప్పుదూ
వందలాది జనము మందలోలే కూలుతుంటే ॥ కరోనా ॥

ఎంత కష్టం వచ్చెనో ఎన్ని బాధలు తెచ్చెనో
ఇంత కష్ట కాలమూ చూడలేదు ఎన్నడూ
కన్నీళ్ళు తాగుకుంటు కాలమెల్ల దీసుకుంటు
కాలి నడకన వేల మైళ్ళు నడిచి వలస కూలి కూలే॥ కరోనా ॥

వలస వెల్లిన కొడుకు తిగిరి మల్ల వస్తడాని
రాకకోసం ఎదురు చూసే ముసలి తల్లి తండ్రులు
ఎదురు చూసి ఎదురు చూసి ఎంతకు రాకపోతే
ఊపిరాగినంక కొడుకు ఊరు చేరె శవం అయ్యి ॥ కరోనా ॥

ఇల్లు వల్లాకాడు ఆయే ఊరు బొందల గడ్డ ఆయే
పలకరించే వాడు లేడు పాడె మోసే వాడు లేక
బ్రతికిన చచ్చినట్టుగ బ్రతుకులాను గడుపుడాయే
చచ్చిన తనివి తీర ఏడుపు నిషేధమాయే ॥ కరోనా ॥

బ్రతికినోడికి తిండి లేదు చచ్చినోడికి పిండం లేదు
చచ్చినా బ్రతికినా బ్రత్కు తీరులా తేడ లేదూ
చావులేమో గోరమాయే బ్రత్కులేమో భారమాయే
కరోనా వైరస్ కత్తి కుత్కేమీద వేటు వేసెను ॥ కరోనా ॥ ✤

కవిత

## నువ్వు వేసిన బాటలో ఉన్నామా!...

– ఓవీవీఎస్

దేశం మడిలో తుపాకీ విత్తులు నాటి,
స్వేచ్ఛా పరిమళాల పూదోటలు వేద్దామనుకున్నావు
కానీ...,
అన్యాయాల కలుపు మొక్కలు చూడెలా కమ్మేస్తున్నాయో....

జనాన్ని కలిపి 'ఉంచని' తనాన్ని ఈసడిస్తూ....
మతాతీతంగా నువ్వెదిగిపోయావు....
కానీ, దురంతాల వామనపాదాల వికటాట్టహాసాలు
బోన్సాయ్ వృక్షాల అరణ్యాలై ఎలా విస్తరిస్తున్నాయో చూడు.

అస్వతంత్ర భారతంలో మృత్యువే నీ
వధువన్నావు....
గాంధారి పుత్రుల కీచక పర్వాల పుటలమై మేమెలా
రాలిపడుతున్నామో చూడు.

హోరెత్తిన యవ్వనాగ్ని కేతనమై నువు నిలిస్తే....
ట్రిమ్ముగడ్డాల, టిక్‌టాక్‌ల, బ్రేకప్పులమై
అఖండ భరత యవ్వనమూ మురుగు కాల్వలై
పారుతున్నది.

ఇప్పటికైనా....
ఉరికంబానికి ఊపిరిలూదిన నీ జీవితం
తెరచిన పుస్తకమై పిల్లల కళ్ళల్లో రెపరెపలాడాలి.
బిగిసిన నెత్తుటి పిడికిళ్ళై యువత మెదళ్ళలో నాటుకోవాలి ✤

పుస్తక పరిచయం

ఎంగెల్స్ 2వ శతజయంతి సందర్భంగా

# కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక

- డా॥ ఆర్కే



**1884లో** ఫ్రెడరిక్ ఎంగెల్స్ రాసిన ఈ మహత్తర గ్రంథం అనేకసార్లు ప్రచురించబడి, అత్యంత ప్రజాదరణ పొందింది. పలు భాషలలోకి అనువదింపబడింది. స్త్రీ, పురుష సంబంధాలు, కుటుంబం పుట్టుక, పరిణామం గురించి ఈ పుస్తకం చెబుతుంది. నేను, నాది అంటే ఏమిటో ఎరుగని మానవ సమాజంలోకి సొంత ఆస్తి ఎలా ప్రవేశించిందో తెలియజేస్తుంది. పాలకులు, పాలితులు లేని సమాజం స్థానే శ్రమదోపిడి, వర్గసమాజం ఎలా వచ్చాయో, వాటి రక్షణ కోసం ప్రభుత్వ యంత్రాంగం ఎలా అనివార్యమైందో సోదాహరణంగా వివరిస్తుంది.

135 ఏళ్లు దాటినా ఇది కాలం చెల్లిన పుస్తకం కాదు. ఎన్ని చట్టాలొచ్చినా స్త్రీ అణచివేత, పురుషాధిక్యత ఈనాటికీ కొనసాగుతోంది. ఆకాశంలో సగభాగమైనా అవకాశాల్ని అందుకోవటంలో ఆడవాళ్లు అట్టడుగున వున్నారు. 'అబల' అనే ముద్రవేసి, నెపాన్ని దేవుడిపైకి, ప్రకృతిపైకి నెడుతున్నారు. మరోవైపు నేడున్నది 'ప్రజల యొక్క ప్రజల చేత, ప్రజల కోసం' ప్రభుత్వం అంటున్నారు. కానీ ఆర్థిక వనరులు కొందరి యాజమాన్యం చేతుల్లోనే వున్నాయి. అందరూ శ్రమించి సృష్టించిన సంపద ఆ కొందరికే జేరుతోంది. ఆ చేరవేతను కాపాడటానికే ప్రభుత్వ యంత్రాంగాలు పనిచేస్తున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే సొంత ఆస్తి అనాదిగా వుందని, అది పూర్వజన్మ సుకృతమని అంటున్నారు. పవిత్రమైనదని, రక్షణ కల్పించాలని గగ్గోలు పెడుతున్నారు.

మేడిపండులాంటి ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ పొట్టవిప్పి పురుగుల్ని బయటకు లాగాలంటే ఈ పుస్తకం చదవితీరాలి. ఈ పుస్తకంలోని ప్రతివాక్యం సాక్ష్యాధారాలతో రాయబడింది. దానివెనుక ఎంతో కృషి వుంది. అంకితభావం వుంది. ఆసక్తిదాయకమైన నేపథ్యం వుంది.

## లెవిస్ హెన్రీ మోర్గన్ (1818-1881)

అమెరికా యాంత్రపాలజీ పితామహులలో ఒకడు. న్యూయార్క్ రాష్ట్ర ఎసెంబ్లీ మెంబరు, సెనేటరు. వృత్తిరీత్యా లాయరు, ఈ పుస్తకానికి స్ఫూర్తి ప్రదాత.

ఉత్తర అమెరికాలో అసలైన స్థానికులు రెడ్ ఇండియన్ తెగలు. వారిలో అతి పురాతనమైన ఒక తెగ ఇరాక్వ్యూలు. న్యూయార్క్ రాష్ట్రంలోని ఇరాక్వ్యూ తెగల భూముల్ని కాజేయటానికి ఒక రియల్ ఎస్టేట్ కంపెనీ (Ogden) కుట్ర పన్నింది. ఇరాక్వ్యూలు ప్రతిఘటించారు. అమెరికన్ ఆదివాసీలపట్ల ఆసక్తి, అభిమానం గల మోర్గన్ వారికి న్యాయ సహాయం చేయటానికి ముందుకొచ్చాడు. ఈ క్రమంలో ఇరాక్వ్యూలలోని కుటుంబ పుట్టుపూర్వోత్తరాలను గురించి పరిశోధన చేయాలనుకొన్నాడు. ఇందుకోసం 40 ఏళ్లు ఇరాక్వ్యూలతో, సన్నిహితంగా గడిపాడు, సనెకా తెగకి దత్తుపోయాడు. 1877లో 'ప్రాచీన సమాజం' అనే గ్రంథాన్ని రచించాడు.

మోర్గన్‌కి మార్క్స్, ఎంగెల్స్‌లు సమకాలికులు, చరిత్రను భౌతికవాద దృష్టితో చూచే పద్ధతిని అప్పటికి నలభై ఏళ్ల క్రితమే మార్క్స్ కనుగొన్నాడు. ఇదే పద్ధతిలో అమెరికన్ ఆదివాసీ జీవితాలను పరిశీలించిన మోర్గన్ గ్రంథం మార్క్స్‌ని ఆకట్టుకొంది. దానిపై 96 పేజీల నోట్సు కూడ రాశాడు. దానికి తన పరిశోధనల నుండి కొంత సమాచారం జోడించి ఒక పుస్తకం రాయాలనుకొన్నాడు. కాని ఆ పని పూర్తిచేయకుండానే మరో ఏడాదికి మరణించటంతో ఆ బాధ్యత ఎంగెల్స్ తీసుకొన్నాడు. 'జీవశాస్త్రానికి డార్విన్ పరిణామ సిద్ధాంతం ఎంత ముఖ్యమో, అర్థశాస్త్రానికి మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతం ఎంత ముఖ్యమో, పితృస్వామ్యానికి పూర్వం మాతృస్వామ్యం వుండేదని మోర్గన్ కనిపెట్టిన అంశం కూడ అంతే ముఖ్యం' అని మోర్గన్ గ్రంథంపై ఏంగెల్స్ వ్యాఖ్యానిస్తాడు.

ఇరాక్వ్యూ తెగల కుటుంబ వ్యవస్థలో మోర్గన్ రెండు అంశాల్ని గమనించాడు.

ఒకటి : కుటుంబ పద్ధతి (ఒక భార్య, ఒక భర్త పద్ధతి అమలులో వుంది. వారికి కలిగిన సంతానం ఏ జంటదో గుర్తించవచ్చు.)

రెండు : రక్తసంబంధాలు

ఒక మగవాడు తన బిడ్డల్నేగాక తన సోదరుల బిడ్డల్ని కూడ కొడుకులు, కూతుళ్లు అని పిలుస్తాడు. వారు పెదనాన్న, చిన్నాన్న అంటారు. కాని అతడు తన తోబుట్టువుల బిడ్డల్ని మాత్రం మేనల్లుళ్లు, మేనకోడళ్లు అని అంటాడు. వారు 'మేనమామ' అంటారు. అలాగే ఒక స్త్రీ తన బిడ్డల్నేగాక తన సోదరీమణుల బిడ్డల్ని కూడ కొడుకులు, కూతుళ్లు అని పిలుస్తుంది. వారు పెద్దమ్మ, చిన్నమ్మ అంటారు. కాని ఆమె, తన సోదరుల బిడ్డల్ని మాత్రం మేనల్లుళ్లు, మేనకోడళ్లు అంటుంది. వారు 'మేనత్త' అంటారు.

ఇలాంటి రక్తసంబంధాల బంధుత్వం అమెరికాలోని అన్ని తెగలలోను వుంది. వారితో ఏమాత్రం సంబంధంలేని భారతీయులలో, ఇతర ఆసియా ప్రజలలో వుంది. కొద్ది మార్పులతో ఆఫ్రికా, ఆస్ట్రేలియా తెగలలోనూ వుంది.

కనుక ఇది ఉత్తుత్తి పిలుపులు కాదు. వీటివెనుక చారిత్రక నేపథ్యం వుందని మోర్గన్ భావించాడు.

ఇరాక్వ్యూ తెగల కుటుంబ పద్ధతిలో జంట పెళ్లి వుంది. రక్త సంబంధాల వ్యవస్థలో ఉమ్మడి దాంపత్యం రేఖామాత్రంగా కనపడుతుంది.

ఈ రెంటికి మధ్య లింక్‌ను పట్టుకొంటే కుటుంబ పరిణామం అవగత మవుతుంది. ఈ దిశగా మోర్గన్ అమెరికన్ తెగలలో, హవాయి ద్వీపవాసులలో తన పరిశోధనలు కొనసాగించాడు.

## కుటుంబం పుట్టుక

కుటుంబం సమాజంలో ఒక భాగం. సమాజానికి సంబంధం లేకుండా అది మనలేదు. కుటుంబ పరిణామం సామాజిక పరిణామంలో అంతర్లీనంగా వుంటుందని మోర్గన్ ప్రామాణికంగా నిరూపించాడు.

సమాజ మనుగడకి 'ఉత్పత్తి' కావాలి.

ఉత్పత్తి 2 రకాలు.

ఒకటి : వస్తూత్పత్తి. జీవితావసరములైన కూడు, గుడ్డ, గూడు లాంటివి.

రెండు : సంతానోత్పత్తి. ఒకజాతి సజీవంగా కొనసాగాలంటే తన సంతానాన్ని నిరంతరం వృద్ధి చేసుకోవాలి.

వస్తూత్పత్తికి పనిముట్లు కావాలి. పనిముట్లు తయారీ విధానాన్ని బట్టి సామాజిక దశలను నిర్ణయిస్తారు.

మోర్గన్ ఆహారోత్పత్తి పద్ధతిని బట్టి మానవ సమాజాన్ని ఆటవిక, అనాగరిక, నాగరిక దశలుగా విభజించాడు. వీటినే ఇపుడు పాత, కొత్తరాతి యుగాలుగా, లోహయుగంగా పిలుస్తున్నాం. ఏ దశలో స్త్రీ, పురుష సంబంధాలు, కుటుంబం ఏ రూపం తీసుకున్నాయో ఇపుడు చూద్దాం.

జంతు దశ నుండి పరిణామం చెందిన తొలి మానవులు మనుగడ కోసం గుంపులుగా నివసించేవారు. సంచార జీవితం అనివార్యం. ఈ దశలో స్త్రీ, పురుష సంబంధాలు జంతుస్థాయిని దాటిపోవు. వావి వరుసలు లేవు. అసలు కుటుంబమనే భావన కూడ లేని కాలమది. ఏ నియమాలు లేని స్త్రీ, పురుష సంబంధాల నుండి బీజరూపంలో 'రక్తసంబంధీకుల కుటుంబం (Consanguine family) ఏర్పడింది.

అది పాత రాతియుగం. వేట, ఆహార సేకరణ దశ. మానవ సమాజ చరిత్ర 90 శాతం ఈ యుగంలోనే గడిచింది. పళ్లు, కాయలు, దుంపలు ఏరుకొని బతికేవారు. నిప్పును కనిపెట్టారు. విల్లు, అంబుతో వేటాడారు. ఉత్పత్తి ప్రాథమికస్థాయిలో వుంది. వావి వరుసలు లేని స్త్రీ, పురుష సంబంధాలకు గండి పడింది.

గుంపులో తరాల్ని బట్టి దాంపత్య బంధం అమలులోకి వచ్చింది. మొదటితరం ఒకరికొకరు భార్యాభర్తలు. వారి సంతానం రెండవతరం, మళ్లీ వారి సంతానం మూడవతరం ఒకరికొరకు భార్యాభర్తలు. ఒకతరం వాళ్లు మరోతరం వాళ్లతో దాంపత్యం కూడదు. అంటే తల్లిదండ్రులకు, వారి సంతానానికి మధ్య దాంపత్యం నిషేధింపబడింది. స్త్రీ, పురుష స్వేచ్ఛా సంబంధాలకి ఇది మొదటి హద్దు.

ఈ కుటుంబం అంతా ఒకే జంట సంతానం. ప్రతి తరంలోను స్త్రీ, పురుషులు ఒకరికొకరు సోదరీ, సోదరులు మరియు భార్యాభర్తలు.

ఈ కుటుంబ పద్ధతికి దాఖలులేవు కాని రూపురేఖలు హవాయి ద్వీపంలోని రక్తసంబంధీకుల వ్యవస్థలో మోర్గన్ కనుగొన్నాడు. అక్కడి వ్యవస్థలో సోదరీ సోదరుల బిడ్డలు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళుగా, బిడ్డలు మేనల్లుళ్లు, మేనకోడళ్లుగా వరుసలు లేవు. సోదరీ, సోదరుల మధ్య దాంపత్య సంబంధం హవాయిలోని రక్తసంబంధీకుల వ్యవస్థలో కనపడుతుంది. కనుక ఇలాంటి కుటుంబ పద్ధతి ప్రాచీన కాలంలో వుండి వుంటుందని ఖచ్చితంగా చెప్పవచ్చు.

పాత రాతియుగం చివరిదశలో ఉత్పత్తిలో కొంత పురోగతి కనపడింది. సంచార జీవితం గడుపుతూనే మధ్య మధ్యలో తాత్కాలిక స్థిర నివాసాలు వుండేవి. ఈ సామాజిక అభివృద్ధికి తగ్గ కుటుంబ నిర్మాణం జరిగింది.

అది పూనలాన్ కుటుంబం. అత్యున్నత దశకు చెందిన గుంపు పెళ్లి.

సోదరీ, సోదరుల మధ్య దాంపత్యం నిషేధించబడింది. కుటుంబ పరిణామంలో ఇది పెనుమార్పు. కష్టంగా, క్రమక్రమంగా అమలులోకి వచ్చింది. ఆ తర్వాత తరాలలోని సోదరీ, సోదరులకు కూడ ఈ నిషేధం విస్తరించబడింది.

ఈ నిషేధాలు ఎందుకు?

ఇలాంటి కామ సంబంధాలు జుగుప్సాకరంగా వున్నాయని ఓ శుభోదయాన ఏ మహాత్ముడైనా బోధించాడా? గుంపు మొత్తం ఏకగ్రీవ తీర్మానంతో నిషేధం విధించుకుందా? లేదు.

కాలం, అనుభవం పాఠాల్ని నేర్పుతుంది.

రక్తసంబంధం గల వారికంటే రక్తసంబంధం లేనివారి సంతానం శారీరకంగా, మానసికంగా బలంగా, దృఢంగా వుండటం చూశారు. సోదరీ, సోదరుల మధ్య దాంపత్యం అనుసరింపబడుతున్న తెగలకన్నా ఆ ఆచారాన్ని నిషేధించిన తెగలు అభివృద్ధి చెందటం గమనించారు. బలమైన తెగల మార్గాన్నే బలహీనమైన తెగలు ఎంచుకున్నాయి. వేనవేల వత్సరాలలో వచ్చిన మార్పు యిది.

ఒకే తల్లి సంతానం మధ్య దాంపత్యం నిషేధింపబడగానే పాత కుటుంబం స్థానే నూతన కుటుంబ వ్యవస్థ ఏర్పడింది.

ఈ నూతన వ్యవస్థలో తోబుట్టువులంతా సొంత కుటుంబం లోనివారు. వారి భర్తలు బయటి కుటుంబాల నుండి వస్తారు. అందరూ ఉమ్మడి దాంపత్యం కలిగి వుంటారు. అన్నదమ్ములంతా ఇతర కుటుంబాలలోకి పోతారు. ఆయా కుటుంబాలలోని అక్క చెల్లెండ్రతో ఉమ్మడి దాంపత్యం కల్గి వుంటారు. మోర్గన్ దీనికి 'ప్యూనలాన్' కుటుంబం అని పేరు పెట్టాడు. 'ప్యూనలా' అంటే సహచరి, సహచరుడు అని అర్థం. సోదరీ, సోదరుల మధ్య దాంపత్యం నిషేధించబడింది గనుక మేనల్లుళ్లు, మేనకోడళ్లు, మేనమామలు, మేనత్తలు అనే కొత్త రక్తబంధుత్వాలు పుట్టుకొచ్చాయి. ఈ కుటుంబ నిర్మాణం హవాయి ద్వీపంలోని కుటుంబ పద్ధతిని, ఇరాక్యూ తెగల, భారతీయుల రక్త సంబంధ వ్యవస్థని పోలి వుంటుంది.

## మాతృస్వామిక గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థ

గుంపు పెళ్లి ఏ రూపంలో వున్నా సంతానానికి తండ్రి ఎవరో తెలియదు. తల్లి మాత్రమే తెలుస్తుంది. అందువల్ల ఆ గుంపు తల్లివైపు నుండి మాత్రమే గుర్తింపబడుతుంది.

ప్యూనలాన్ కుటుంబంలో ఒక తల్లి, ఆమె తోబుట్టువులు, వారందరి పిల్లలు, తల్లివైపు నుండి సోదర బంధుత్వం వున్న మగవాళ్లు ఒక ప్రధాన శాఖగా వుంటారు. ఈ కుటుంబం విస్పష్టంగా వుంది. విస్తృతంగా అభివృద్ధి చెందే లక్షణం కలిగి వుంది.

కుటుంబం సంతానం కోసమే కాదు. సామాజిక ఉత్పత్తి కోసం కూడ. ఉత్పత్తి నిర్వహణకి ఒక వ్యవస్థ కావాలి. ప్యూనలాన్ రక్తసంబంధీకుల శాఖ నుండి ఆ వ్యవస్థ పుట్టింది.

అదే గణ వ్యవస్థ.

మానవ సమాజ చరిత్రలో ప్రప్రథమ సామాజిక వ్యవస్థారూపం ఇదే.

గణం అంతటికీ పూర్వీకురాలు ఒకామె వంశకర్తగా గుర్తింప బడుతుంది. ఆమె వంశీకులు గణంగా ఏర్పడతారు. రక్తసంబంధం గలవారే గణంలో వుంటారు. గణసభ్యులెవరూ గణంలోనివారిని పెళ్లిచేసుకోగూడదు. గణమూల సూత్రం యిదే. మనుగడ అదే.

ఆడవారు పుట్టినిల్లయిన తల్లి గణంలోనే వుండిపోతారు. మగవారు మెట్టినింటి గడప తొక్కాల్సిందే. గణంలో భార్యాభర్తలంతా ఉమ్మడి దాంపత్యం గనుక తండ్రి ఎవరో తెలియదు. స్త్రీలవైపు నుంచే గణ నిర్మాణం జరుగుతుంది. అందుకే దీనిని 'మాతృస్వామిక గణవ్యవస్థ' అన్నారు.

రక్తసంబంధాల్ని బట్టి కుటుంబం ఆదిరూపాల్ని నిర్ధారించిన మోర్గన్ ఇరాక్వూ తెగలలోని గణ నిర్మాణాన్ని కూడ తొలిసారి ప్రపంచానికి వెల్లడించాడు. అంతేకాదు, ప్రాచీన అనాగరిక తెగలన్నింటిలోను గణవ్యవస్థ వుందని నిరూపించాడు.

గణాలని గుర్తింపుకోసం తోడేలు, ఎలుగుబంటి, దుప్పి, డేగ, కొంగ తదితర జంతువుల, పక్షుల పేర్లతో పిలిచేవారు. గణనాయకులుగా ఒక శాంతికాలపు పెద్ద, ఒక సేనాపతిని ఎన్నుకుంటారు. గణంలోని స్త్రీ పురుషులందరికి ఓటింగ్ చేసి ఎన్నిక చేస్తారు. ఆ పదవి ఖాళీ అయితే తల్లి పరంపర వారసులనే ఎన్నుకుంటారు. అంటే తమ్ముడు, మేనల్లుడు గాని కొడుకు వారసుడు కాదు. నాయకులది నైతికాధికారమే. వారి చేతిలో సొంత బలగం వుండదు. గణం తనకు ఇష్టం లేకుంటే నాయకుల్ని రీకాల్ చేయవచ్చు. తొలగింపబడినవారు సాధారణ వ్యక్తులుగా పరిగణింపబడతారు.

గణంలోని యుక్తవయస్కులైన స్త్రీ, పురుషులందరూ గణకౌన్సిల్‌ను ఎన్నుకుంటారు. ఇది సుప్రీం కౌన్సిల్. సర్వం సహాధికారం కల్గి వుంటుంది. గణనాయకుల్ని ఎన్నుకునేందుకు, తొలగించేందుకు, నూతన సభ్యులను జేర్చుకొనేందుకు, ప్రతీకారదాడులు చేసేందుకు పూర్తి అధికారం కల్గి వుంటుంది.

అందరికీ ఆయుధాలుంటాయి. యుద్ధాలలో ఓడినవారిని చంపివేస్తారు. నోటిని పోషించే శక్తి ఆనాటి చేతులకు లేదు. రాతి పనిముట్లతో ఉత్పత్తి సాధనాలు అతి ప్రాథమిక స్థాయిలో వున్న ఆ కాలంలో యుద్ధ ఖైదీలను చంపటం మినహా మరో మార్గం లేదు.

సొంత ఆస్తి వుండదు, పనిముట్లు, ఆభరణాలు తప్ప. చనిపోయిన వారి కొద్దిపాటి ఆస్తి గణంలోపలే వుండిపోవాలి. తల్లివైపువారే పంచుకోవాలి. తండ్రి ఆస్తికి బిడ్డలు వారసులు కాదు. భార్యాభర్తలు ఒకరి ఆస్తికి మరొకరు వారసులు కాదు.

కర్మకాండలు సాధారణ స్థాయిలో గణాలకు సంబంధించినవిగానే వుండేవి. గణనాయకులే పురోహితుల పాత్రను నిర్వహించేవారు. గణం మొత్తానికి ఉమ్మడి స్మశానం వుండేది.

శ్రమ విభజన చాల ప్రాథమిక దశలో వుండేది. స్త్రీ, పురుషుల మధ్యనే శ్రమవిభజన. యుద్ధాలు, వేటాడటం, ఆహార సంపాదనకి, పనిముట్లు తయారీ మగవాడి పని. పిల్లల్ని కనటం, పాలిచ్చి పెంచటం బాధ్యతలతో స్త్రీలను ఇంటికి పరిమితం చేసింది. వంట, కుట్టుపని, నేతపని, కాయలు, పండ్లు, దుంపలు సేకరించటం స్త్రీలే చేసేవారు. ఇల్లు, తోట, పడవ లాంటి వాటిని సమష్టిగా చేసుకొనేవారు. ఆనాటికే తమ శక్తితో స్వయంగా సంపాదించుకున్న ఆస్తిని స్వంతానికి కలిగి వుండటం, సమష్టి ఆస్తి, సమష్టి అనుభవం అమలులో వుంది.

గణసభ్యులందరూ స్వతంత్రులు, స్వేచ్ఛాజీవులు. గణసంస్థకి కట్టుబడి వుండే ప్రజాస్వామ్యవాదులు, స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరత్వం గణ ప్రజాతంత్ర వ్యవస్థకు మూలస్తంభాలు.

## గుంపు పెళ్లి నుండి జంట పెళ్లికి

సుమారు 10 వేల సంవత్సరాల క్రితం. ఆహార ఉత్పత్తి దశ లేదా కొత్త రాతియుగం ప్రారంభమైంది. పశువుల్ని మచ్చిక చేసి పెంచటమూ, మొక్కా-మొలికా పెంచడమూ ఈ యుగం ప్రత్యేక లక్షణాలు. ప్రకృతి నుండి తమకు కావాల్సిన ఆహారాన్ని శ్రమించి ఉత్పత్తి చేయటంతో చరిత్ర కొత్త మలుపుకు మళ్లింది.

ఈ మార్పు మధ్యప్రాచ్యంలో మొదలైంది. క్రీ.పూ. 10200 - 8800 మధ్య జోర్డాన్ నదీతీరాన నేటి పాలస్తీనాలోని జెరికో వద్ద ఆహారోత్పత్తికి బీజాలు పడినాయి. వ్యవసాయ పనులకి కొత్త పనిముట్లు వచ్చాయి. వాటిల్లో రాతి గొడ్డలి అతిముఖ్యమైనది. రాతిగొడ్డళ్లతో చెట్లు, దుబ్బులు నరికి నేలను చదును చేసేవారు. రాతి పారలతో నేలను త్రవ్వేవారు. కొయ్యనాగలితో భూమిని దున్నారు. ఎముక పిడి గల రాతి కొడవళ్లతో పంటను కోశారు. ధాన్యంపై పొట్టు తీయటానికి రోళ్లు, రోకళ్లు తయారుచేశారు.

పచ్చిక బయళ్లున్న చోట్ల పశుపెంపకం జరిగింది. ఆవులు, మేకలు, గొర్రెలు, పందులు లాంటి జంతువుల్ని చేరదీస్తే మందలు మందలుగా వృద్ధి చెందటంలోని ప్రయోజనాల్ని గ్రహించారు.

ఆహారం కొంత మిగులు ఏర్పడింది. దాచుకోవాల్సిన అవసరం కలిగింది. కుండల్ని తయారుచేశారు. తోళ్లు, ఆకులతో శరీరాన్ని కప్పుకోవటం తెలుసు. ఇపుడు నార, ఉన్ని, బొచ్చుతో దుస్తులు చేయటం నేర్చుకున్నారు.

ఆహారోత్పత్తితో సంచార జీవితానికి సుదీర్ఘ విరామం దొరికింది. ఆర్థిక, సామాజిక, సంబంధాలేగాక, అనుబంధాలు కూడా పెరిగాయి.

ఈ మార్పు గుంపు పెళ్లిపై పడింది. ఇప్పటికే ఎన్నో కట్టుబాట్లతో గుంపుపెళ్లి చిక్కి శల్యమైంది. మొదట తరాల మధ్య దాంపత్యాన్ని నిషేధించారు. తర్వాత సోదరీ, సోదరుల మధ్య, క్రమంగా దగ్గర బంధువుల మధ్య కూడ ఈ నిషేధం వర్తింపబడింది. ఈ విధంగా గుంపు పెళ్లి ఆచరణలో కష్టసాధ్యమైంది. ఇక మిగిలింది జంటపెళ్లి.

నిజానికి జంటగా వుండటం కొత్తేమీకాదు. గుంపుపెళ్లి, అంతకు ముందు కూడా జంటలుగా కొద్దికాలమో, ఎక్కువకాలమో కలిసి వుండేవారు. జంటపెళ్లి ఇలాంటి లైంగిక ప్రేమ వలన వచ్చిందికాదు. అనేక నిషేధాల మధ్య అవసరంగా, అనివార్యంగా వచ్చిన ఆచారం.

జంటపెళ్లిలో ఒక పురుషుడు, ఒక స్త్రీ కావాలనుకుంటే కలిసి వుంటారు. వద్దనుకొంటే విడిపోతారు. పర్మిషన్లు అక్కరలేదు. అంత సులువైన వివాహం. పిల్లలుంటే తల్లి దగ్గరే వుంటారు. మళ్లీ పెళ్లికి ఆటంకాలు లేవు.

ఇలాంటి బలహీనమైన, అస్థిరమైన జంటపెళ్లి మాతృస్వామ్య కుటుంబ వ్యవస్థను రద్దుపరచలేకపోయింది.

ఒకే భర్త, ఒకే భార్య కావాలని కోరుకొన్నది, పోరాడిందీ స్త్రీలే. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెంది, ఆర్థిక పరిస్థితులు మెరుగవటంతో ఆలోచనాసరళిలో మార్పు వచ్చింది. అనాదిగా, ఆచారంగా వస్తున్న ఉమ్మడి దాంపత్య జీవితం అవమానకరంగా, జుగుప్సాకరంగా తోచింది. కొత్తరాతియుగంలో జంటపెళ్లి ఎక్కువగా కన్పిస్తుంది.

## గణ వ్యవస్థ నుండి తెగ వ్యవస్థకి

గణంలోపల దాంపత్యంపై అనేక నిషేధాలు ఖచ్చితంగా అమలులోకి వచ్చాయి. మరోవైపున గణ జనాభా అధికమవుతోంది. వివాహ పరిధి విస్తృతం కావాలంటే గణాల సంఖ్య పెరిగితీరాలి. ఒక గణం రెండు లేదా మూడు గణాలుగా విభజింపబడేవి. మొదట్లో విడిపోయిన గణాలు సోదర కూటమిగా వుండేవి. ఇతర కూటాల్లో వున్న గణాలు వివాహ పరిధిలోకి వచ్చేవి.

కొన్ని గణాలు ఒక కూటమిగా, కొన్ని కూటాలు ఒక తెగగా నిర్మాణమైనాయి. తెగ వ్యవస్థ అవతరించాక, మానవ సమాజంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

ప్రతి తెగకు గుర్తింపుకోసం ఒక పేరు వుంటుంది. నివసించడానికి కొంత ప్రాంతం వుంటుంది. వేటకి, చేపలకు మరికొంత ప్రాంతం అదనంగా వుంటుంది. నదులు, కొండలు, కోనలు, పర్వతశ్రేణులు తెగల మధ్య సహజ సరిహద్దులుగా వుంటాయి. భూమిపై తొలిసారిగా ఒక ప్రాంతాన్ని అధీనంలో వుంచుకోవటం ప్రారంభమైంది.

కొన్ని ప్రాంతాలలో రక్తసంబంధాలున్న తెగలు సమాఖ్యగా ఏర్పడేవి. గణవ్యవస్థ వలె తెగ వ్యవస్థ కూడ పూర్తి ప్రజాస్వామికంగా వుండేది. సొంత ఆస్తిలేదు. నీ, నా భేదం లేదు. అంతా తెగే. తెగ మినహా మరోటి లేదు. శరీరానికి అంటి వుండే ఆభరణాలు, జంతు చర్మాలు, కుండలు, బుట్టలు, ఆయుధాలు మినహా అన్నీ తెగకి చెందినవే.

భూమి అందరిదీ. దాన్ని సొంతం చేసుకోవాలనే స్పృహ కూడ లేదు. నీరు, నిప్పు, గాలి, ఎలాంటివో, భూమి కూడ అలాంటిదే.

వస్తువులకు మార్కెట్ విలువలేదు. గాజు పూసలైనా, బంగారు సుద్దలైనా ఒక్కటే. అవినీతి ఎరుగరు.

వర్గాలు లేవు. రాజరికం లేదు. ప్రభుత్వాలు లేవు. సైన్యం లేదు. చట్టాలు లేవు. న్యాయాధిపతులు లేరు. జైళ్లు లేవు. దోపిడీ లేదు. అణచివేత లేదు. తగాదాల్ని సంప్రదింపులు, సంప్రదాయాల ప్రకారం పరిష్కరించుకొనేవారు. ఏ పనిచేయాలన్నా సమష్టిగా పాల్గొనేవారు. సమానంగా పంచుకొనేవారు.

ఇక్కడోవిషయం చెప్పాలి.

ఆదిమ సమసమాజం అంటే ఈనాడు మనం చెప్పుకొనే కమ్యూనిస్టు సమాజం కాదు. ఆదిమ సమాజంలోని రాతి పనిముట్లు, బాణం తదితర ఉత్పత్తి సాధనాలు అతి సామాన్యమైనవి. ఎవరికి వారు తయారు చేసుకొనవచ్చు. కనుక ఉత్పత్తి సాధనాలు ప్రజలందరి యాజమాన్యంలో వుండేవి. సమిష్టి కృషి, సమిష్టి యాజమాన్యం వలన ఉత్పత్తి సమానంగా పంచబడేది.

ఆదిమ సమసమాజంలో ఉత్పత్తిశక్తులు అతిహీనంగా వుండటం వలన అరకొర ఆహారం మాత్రమే దొరికేది. ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిందే లేదా పస్తులుండాల్సిందే. అందరూ కలిసి పనిచేసినా కనీస అవసరాలు తీరటం కష్టంగా వుండేది. తినగా మిగులు వుండదు. పంచుకోవటానికి, దోచుకోవటానికి ఏమీ వుండదు.

ఆధునిక కమ్యూనిస్టు సమాజంలో ఉత్పత్తిశక్తులు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతాయి. సైన్సు అప్రతిహతంగా పురోగమిస్తుంది. ప్రణాళికాబద్ధంగా ఉత్పత్తి సృష్టించబడుతుంది. ప్రజలందరూ సామర్థ్యానికి తగ్గట్టు పనిచేస్తారు. అవసరానికి తగ్గట్టు అనుభవిస్తారు. వర్గాలుండవు. వర్గదోపిడీ వుండదు.

## ఉత్పత్తి శక్తుల సాంకేతిక పురోగతి

### శ్రమవిభజన - మారకం

క్రీ.పూ. 4000–3000 రాగిని వెలికితీశారు. కరిగించి, పోతపోసి పనిముట్లు, ఆయుధాలు తయారుచేశారు. ఇది సాంకేతికంగా గొప్ప విజయం.

వ్యవసాయంలో వినూత్న మార్పులొచ్చాయి. ఎడారులగుండా నదులు ప్రవహించే ప్రాంతాలు వ్యవసాయానికి అనువైన భూములు. వరదలలో కొట్టుకొచ్చే ఒండ్రుమట్టి ఆ మెత్తని భూముల్ని సారవంతం చేశాయి. వ్యవసాయంలో రాగి పనిముట్లను వుపయోగించారు. చిట్టడవులు, దుబ్బులు నరికి నేలను చదును చేశారు. కాలువలు త్రవ్వి నీటిని పారించారు. దుక్కి దున్ని, నీరుపోసి, విత్తనాలు చల్లి, పంటల్ని పండించారు. వ్యవసాయం అభివృద్ధి చెందటంతో స్థిరనివాసాలు పెరిగాయి.

కొన్ని తెగలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడ్డాయి. వ్యవసాయానికి అనుకూలత లేని మరికొన్నిచోట్ల పశుపెంపకాన్ని చేపట్టాయి. పాలపదార్థాలు, తోలు, ఉన్ని వస్తువులను తయారుచేశారు. ఈ వృత్తిలోని తెగలు శారీరకంగా ధారుఢ్యమైనాయి. పశుగ్రాసం కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను, అడవుల్ని కేటాయించాయి.

చేతివృత్తులు బయలుదేరాయి. స్థిరనివాసం ఇళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించింది. ఇటుకల తయారీ పెరిగింది. వడ్రంగి వృత్తికి ఊతమిచ్చింది. మగ్గంలో మార్పులు చేసి నేతను అభివృద్ధి చేశారు. చక్రాల బళ్లు, కుమ్మరిసారెను కనిపెట్టటం, జంతువుల్ని పనులకు ఉపయోగించటం ఈ కాలం సాధించిన గొప్ప పురోగతి.

ఆనాటి భౌగోళిక, వాతావరణ పరిస్థితులకనుగుణంగా కొన్ని పురాతన తెగలు వ్యవసాయాన్ని, కొన్ని తెగలు పశుపెంపకాన్ని ఎంచుకున్నాయి. ఇది సామాజికంగా వచ్చిన మొదటి శ్రమవిభజన. ఆహారోత్పత్తిలో ముందడుగు పడింది. తినగా 'మిగులు' ఏర్పడింది.

చేతివృత్తులలో సాంకేతిక పరిజ్ఞానం సాధించాలంటే పూర్తికాలం పనిచేయాలి. ఆహారంలో 'మిగులు' ఈ వృత్తులవారిని పోషించటానికి

వుపయోగపడింది. చేతివృత్తులు నేరుగా అభివృద్ధి చెందాయి. ఇది రెండవ శ్రమ విభజన.

శ్రమ విభజన వస్తుమార్పిడికి ఊపిరి పోసింది.

మొదట వ్యవసాయం, పశుపెంపకం తెగల మధ్య మారకం జరిగింది. ఒక తోలుసంచి యిచ్చి ధాన్యం, ఒక గొర్రెనిచ్చి రెండు నాగళ్లు, నాలుగు కుండలనిచ్చి పాలు, ఇలా మారకం చేసుకొనేవారు. వస్తువుకు ఉపయోగపు విలువ వుంటుంది. మార్కెట్ విలువలేదు. ఇది బార్టరు పద్ధతి.

చేతివృత్తులు అభివృద్ధి చెందిన తర్వాత మారకంలో అనూహ్య మార్పులొచ్చాయి. ఉత్పత్తిని తమ కోసం గాక, ఇతరుల కోసం సృష్టించాలి. కొడవళ్లు, కుండలు, నాగళ్లు ఉత్పత్తి చేశారంటే ప్రధానంగా మారకానికే.

క్రమంగా వస్తువుల సంఖ్య పెరిగింది. ఒక వస్తువును మరొక వస్తువుతోగాక అనేక వస్తువులతో మార్చడానికి వీలు కలిగింది. అలాంటి అవసరం కూడ ఏర్పడింది. ఒక బస్తా ధాన్యాన్ని బట్టి రెండు ఉన్ని దుస్తులు, మూడు తోలు సంచులు లేదా ఒక పడవ, ఇలా శ్రమించి సృష్టించిన ఏ వస్తువుతోనైనా మార్చుకోవచ్చు. ఒక వస్తువుకు ప్రామాణికంగా తీసుకొని దానికి సమమగు ఇతర వస్తువులను లెక్కించడం మొదలైంది. ఉప్పు, తోలు, ముఖ్యంగా పశువులు ప్రామాణిక వస్తువులుగా చలామణి అయినాయి.

సామాజిక శ్రమవిభజన, మారకం గణవ్యవస్థ నిర్మాణంలో పెనుమార్పుల్ని తీసుకొచ్చాయి.

## అదనపు ఉత్పత్తి - గణవ్యవస్థ సంక్షోభం

ఇంతవరకు రాతి పనిముట్లతో తింటానికి, వుంటానికి బొటాబొటిగా సరిపడే వెనుకబడిన ఉత్పత్తి విధానం కొనసాగింది. రాగి పనిముట్లు, నాగలి – ఎద్దు, చక్రం, నీటిపారుదలతో వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి పెరిగింది. పశుమందలతోపాటు పాల ఉత్పత్తులు రెట్టింపయినాయి. చేతివృత్తులకు సాంకేతికత సమకూరింది. అదనపు ఉత్పత్తి సృష్టించబడింది.

పనిచేసే మనిషి తనకు సరిపోగా ఎంతోకొంత మిగులు ఉత్పత్తి చేయగల్గుతున్నాడు. తన కనీస అవసరాలకు పోను మిగిలిన ఉత్పత్తిని 'అదనపు ఉత్పత్తి' అంటారు. ఈ అదనపు ఉత్పత్తిని సృష్టించటానికి అవసరమైన శ్రమను 'అదనపు శ్రమ' అంటారు.

శ్రమవిభజనకి అదనపు ఉత్పత్తి అనివార్యం. వ్యవసాయం, పశుపెంపకం వృత్తులవారికి వ్యవసాయేతర వస్తువులు అవసరం. వ్యవసాయేతర వృత్తులవారికి ఆహారం కావాలి. ఇవి సమకూరాలంటే అదనపు ఉత్పత్తి జరిగి తీరాలి. అందుకు అవకాశాలు కూడ అందుబాటులోకి వచ్చాయి.

శ్రమ సాధనాల పురోగతి ఉత్పత్తి కార్యకలాపాల రూపురేఖల్ని మార్చివేసింది. కనీస అవసరాల కోసం అందరూ ఒకే పని చేయాల్సిన అవసరం ఇంకెంతమాత్రమూ లేదు. రాతిపనిముట్లతో పొలం సాగు చేయాలంటే తెగ అంతా సామూహికంగా పాల్గొనాలి. నాగలి, ఎద్దు, చక్రం రాకతో అదే పనిని కొందరు వ్యక్తులే మరింత శక్తిమంతంగా చేయగల్గు తున్నారు. కుమ్మరిసారె, మగ్గం, తెరచాప పడవ, లోహపు పనిముట్లు తదితర నూతన ఉత్పత్తి సాధనాలతో ప్రత్యేక పనుల నైపుణ్యత పెరిగింది. వ్యక్తుల శక్తి సామర్థ్యాలకు ప్రత్యేక విలువ, ప్రాముఖ్యత ఏర్పడింది. తెగలోనివారంతా ఉమ్మడిగా ఒకే పని చేయటం అభివృద్ధికి సరిపోకపోగా, దానిని కుంటుపరిచే విధంగా వుంది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఆటంకంగా వుంది.

ఇప్పుడో వైరుధ్యం తలయెత్తింది.

అభివృద్ధి చెందిన ఉత్పత్తి శక్తులు, వాటికి సరిపోని ఉత్పత్తి సంబంధాలకు మధ్య ఘర్షణ ప్రారంభమైంది.

రాతి పనిముట్లు అందరివీ. వాటిపై ఉమ్మడి యాజమాన్యం వుంది. అందరూ కలిసి పనిచేస్తారు. సమానంగా అనుభవిస్తారు. మిగులు వుండదు. అభివృద్ధి చెందిన కొత్త పనిముట్లతో కొందరే పనిచేయగలరు. అవసరాలకు పోను అదనంగా ఉత్పత్తి చేయబడుతోంది. ఈ అదనపు ఉత్పత్తి ఎవరికి చెందాలి? అదే ఇపుడు చూడబోతున్నాం.

## బానిసత్వం

పూర్వం యుద్ధాలలో ఓడినవారిని చంపేసేవారు. మంత్ర తంత్ర విద్యలు, మూలికావైద్యం తెలిసినవారిని తెగలో కలుపుకొనేవారు. యుద్ధ ఖైదీలను చంపటం మినహా మరోమార్గం లేదు. వారిని పోషించగల సత్తా తెగకు లేదు. కనీస అవసరాలు అతి కష్టం మీద సంపాదించుకొనే దశ అది. అదనంగా ఉత్పత్తి చేయగల సామర్థ్యం లేని కాలమది.

ఇపుడు పరిస్థితులు మారాయి. ఉత్పాదకశక్తి పెరిగింది. అదనపు ఉత్పత్తికి అవకాశాలు మెండుగా వున్నాయి. పెద్ద పెద్ద పశుమందల్ని మేపటానికి మంది కావాలి. కాలువలు త్రవ్వటానికి, కరకట్టలు వేయడానికి, పొలం పనులకి, ఇంటి పనులకి పనివాళ్లు కావాలి. ఎంత ఎక్కువమంది దొరికితే అంత ఎక్కువ సంపదలు. ఈ పనులకు యుద్ధ ఖైదీలు పనికొస్తారు. కొద్దిగా తిండి పడేస్తే చాలు, పనిచేస్తారు. పిల్లల్ని కంటారు. పెద్దవారవుతారు. ఇంటా బయటా అంతా పనివాళ్లే – బానిసలే.

యుద్ధాలలో ఓడినవారిని చంపటానికి బదులు, వారి శ్రమను దోచుకోవటానికి, సంపదలు కూడబెట్టటానికి కొత్తమార్గం దొరికింది. అదే బానిసత్వం.

బానిసత్వం కొన్ని దశలుగా అభివృద్ధి చెందింది. ప్రారంభంలో బానిసలు తెగకు ఉమ్మడి ఆస్తిగా వుండేవారు. వారిని ఇంటిచాకిరీకి వినియోగించారు. తర్వాతి కాలంలో కుటుంబాల ఆస్తిగా ఉత్పత్తి క్రమంలోకి వారు లాగబడ్డారు.

ఉత్పత్తిలో మిగులు లేనపుడు బానిసల అవసరం లేకపోయింది. ఉత్పత్తి సాధనాల సాంకేతికత అభివృద్ధి చెందటంతో అదనపు ఉత్పత్తి సృష్టింపబడింది. బానిసలను పోషించి, వారి శ్రమను దోపిడీ చేసి, సంపదలు పెంచుకొనే కొత్తమార్గం దొరికింది.

మనిషిని మనిషి దోచుకొనే ఒక కొత్త అధ్యాయం మానవ సమాజ చరిత్రలో ప్రారంభమైంది.

**మాతృస్వామ్యానికి ఓటమి. పితృస్వామ్యానికి జయకేతనం.**

ఇది అదనపు ఉత్పత్తి తెచ్చిన మరో మౌలిక మార్పు.

ఈ మార్పు మొదట ప్రాచ్య ప్రపంచంలో ప్రారంభమైంది. పశు మందలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. టైగ్రిస్ – యుఫ్రటిస్, నైలు, సింధు, గంగానదీ తీరాలలో పశుపోషణ తెగలు అభివృద్ధి చెందాయి.

స్త్రీ, పురుష శ్రమ విభజనలో ఇంటి పని స్త్రీలది, బయటపని పురుషులది. మగవాళ్లు మొదటి నుంచి వేటగాళ్లు, పశుపోషకులు. పాలు, మాంసం సమృద్ధిగా లభించే మగవాళ్ల పశుపోషణ వృత్తికి ఇపుడు ప్రాముఖ్యత పెరిగింది. ప్రధాన వనరుగా నిలబడింది. మగవాళ్ల పరపతి పై అంతస్తుకు జేరింది. ఆర్థిక ఆధిపత్యం చేజిక్కింది.

ఇది క్రమంగా వ్యవసాయ తెగలకి ప్రాకింది, అయితే ఆలస్యంగా.

నాగలికి ఎద్దు జత కలిసింది. పశుపోషకుడైన మగవాడు దున్నే రైతుగా మారాడు. పశుపాలనతోపాటు, పచ్చని పొలాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. కాడెద్దుల రాకతో స్త్రీ, పురుషుల పని తారుమారయింది. అంతకు ముందు వ్యవసాయం స్త్రీలు, పశుపెంపకం పురుషుల అధీనంలో వుండేది. వ్యవసాయం పనులకు పశువులను వుపయోగించటంతో, స్త్రీలకు కాడెద్దుల భారం తగ్గింది. కాని ఒక ప్రధాన ఆదాయ వనరు పురుషుల చేతిలోకి పోయింది. కుండల తయారీని కనిపెట్టింది స్త్రీలే అయినా కుమ్మరి సారె మగవాళ్లదే అయింది. చక్రం, తెరచాప, పడవ, ఇసుకబట్టీ రవాణారంగాలలో మగవాళ్ల ఆధిపత్యం చలామణి అయింది. ఆర్థికంగా కీలకమైన వృత్తులన్నీ మగవాళ్లవే అయినాయి.

ఇలా అని ఆడవాళ్ల పనిపాటలు తగ్గలా. ఇంటిపని, వంటపని, పాచిపని, బట్టలపని, దంపుడు పని, పిల్లల పని అన్నీ మామూలే. క్షణం తీరిక లేదు.

ఆర్థికంగా వచ్చిన ఈ మార్పు స్త్రీ, పురుష సంబంధాలలో ప్రతిబింబించింది. గణంలో జంటపెళ్లి స్థిరపడింది. తల్లితోపాటు తండ్రి ఎవరో స్పష్టంగా తెలుస్తోంది. జంటలు, వారి పిల్లలు ఒక యూనిట్‌గా ఏర్పడుతున్నారు. పశుమందలు, ఇతర ఆర్థికవనరులు పురుషుడి అధీనంలో వృద్ధి పొందుతున్నాయి. కుటుంబంలో మగవాడి పాత్ర, ప్రాముఖ్యత, ఆధిక్యత పెరిగింది.

అంగడిలో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని వున్నట్టు ఆదాయ వనరులున్నా వారసత్వ హక్కు మగాడికి లేదు. గణసంస్థ రూల్స్ ప్రకారం తల్లివైపు రక్తబంధువులే వారసులు. అతని కొడుకులు వారసులు కారు. మాతృస్వామ్య సమాజంలో తల్లి పరంపర కొనసాగుతున్నంతకాలం ఈ ఆచారం వుండి తీరుతుంది. ఈ పద్ధతి మారాలి. తల్లి హక్కులు రద్దు చేయాలి. తన సంతానానికి వారసత్వ హక్కు కలిగించాలి. ఇది గణాలలో వచ్చిన అంతర్గత విప్లవం. ఒక 'చట్టం'తో అంతా అయిపోయింది. కుటుంబంలో మగవాళ్ల సంతానం కుటుంబంలోనే వుండాలి. ఆడపడుచుల సంతానం వారి తండ్రి గణానికి చెందాలి. తిరుగులేని తీర్పు. మాతృస్వామ్యానికి చావుదెబ్బ. పితృస్వామ్యానికి జయకేతనం.

"తల్లి హక్కు రద్దు చేయడం స్త్రీజాతికి సంబంధించిన పరాజయం అని చెప్పాలి. ప్రపంచ చరిత్రనే అది మార్చింది. ఇంట్లో కూడ మగవాడే పెత్తనం పట్టుకున్నాడు. స్త్రీ పరాభవం పొందింది. మగవాని కామానికి బానిస చేయబడింది. పిల్లల్ని కనే యంత్రంగా మార్చబడింది" (ఎంగెల్స్)

## దంపతీవివాహం - పితృస్వామిక గణవ్యవస్థ

జంటపెళ్లి తర్వాతి మెట్టు దంపతీవివాహం. జంట పెళ్లిలో భార్యాభర్తల బంధం అత్యల్పం. ఎవరికి యిష్టం లేకపోయినా విడిపోవచ్చు. ఇది అలాంటిది కాదు. గట్టి బంధం. ఆచరణలో మగవాడికి అనుకూలంగా ఇప్పటికీ కొనసాగుతోంది. తండ్రి ఆస్తికి బిడ్డ వారసుల్ని చేయటం దీని అంతిమ లక్ష్యం. ఇది తల్లి హక్కును రద్దుచేసింది. స్త్రీ జాతిని మగవాడి నిరంకుశత్వానికి బానిసను చేసింది. పాతివ్రత్యమనే సంకెళ్లను ఆడవాళ్లకేసి, మగవాళ్లను వదిలేసింది. భౌతికంగానే గాక మానసికంగా కూడ పితృస్వామిక భావజాలాన్ని మనిషి నరనరాన ఎక్కించింది. చివరికి స్త్రీని మనసా, వాచా, కర్మణా మగవాడికి బానిసను చేసింది.

దంపతీవివాహం గణనిర్మాణానికి గండి కొట్టింది.

గణం చిన్న చిన్న గ్రూపులుగా పితృస్వామిక సమష్టి కుటుంబాలుగా విడిపోయింది. ఒక భార్య, భర్త, వారి సంతానంతో కుటుంబం ఒక స్వతంత్ర ఆర్థిక యూనిట్‌గా రూపుదిద్దుకుంది. తండ్రి హక్కు స్థిరపడింది. పురుష సంతానానికి వారసత్వహక్కు వచ్చింది. గణాల మధ్య మారకం కుటుంబాల మధ్యకు మారింది. గణం ఉమ్మడి ఆస్తులైన పశుమందలు, లోహాలు, విలాస వస్తువులు కుటుంబం వ్యక్తిగత ఆస్తులుగా మారాయి. దానితో కుటుంబంలో ఆస్తి పోగుపడింది. ఆ ఆస్తి బలంతో గణం కన్నా కుటుంబం దృఢ పడింది. మాతృస్వామ్యం స్థానే పితృస్వామ్యం, రక్తసంబంధాల స్థానే ఆస్తి సంబంధాలు అమలులోకి వచ్చాయి.

గణనిర్మాణంలో కీలక మార్పులొచ్చాయి.

గణం నామమాత్రంగా అలాగే కనపడుతుంది. కాని నియమాలు మారాయి. అపుడు వంశానికి మూలం మాతృమూర్తి. ఇపుడు వంశానికి మూలం పురుషుడు. దేవతలకంటె మగదేవుళ్లకు ప్రాధాన్యత పెరిగింది. ఉమ్మడి మత కర్మలను నిర్వహించటానికి పురోహితవర్గానికి ప్రత్యేక హక్కు లభించింది. ఆదిమ మూలపురుషుడిగా ఒక ప్రత్యేక దేవుడ్ని పురోహితులు పూజించేవారు. తండ్రివైపు నుంచే ఇంటిపేరు, వారసత్వ హక్కు పొందే ఏర్పాటు జరిగింది.

గణసభ్యులెవరూ గణంలో వారిని పెళ్లి చేసుకోగూడదు. గణం మూలసూత్రం ఇది. సొంత ఆస్తి రాకతో ఈ సూత్రం గాలికెగిరిపోయింది. ఒక భాగ్యవతియైన యువతిని పెళ్లాడిన భర్తకు ఆమె సంపద దఖలు పడుతుంది. అంటే పితృస్వామ్యహక్కు ప్రకారం ఆమె ఆస్తి తన సొంత గణం నుండి భర్త గణంకు తరలింపబడుతుంది. ఇది మింగుడు పడక పెద్ద ఆస్తులకు వారసులయ్యే యువతులకు కొన్ని మినహాయింపులిచ్చారు. ఆ యువతి గణంలోని వారినే వివాహమాడుటకు అనుమతి యిచ్చారు. అది గణసూత్రానికి విరుద్ధం. గణపునాదినిది బద్దలు కొట్టింది.

ఆస్తుల వ్యవహారాలు తెరపైకి వచ్చినాయి గనుక గణంలో ఒక న్యాయాధిపతిని, కోశాధికారిని నియమించుకున్నారు.

పితృస్వామ్య వ్యవస్థలో కూడ తెగ సమితి వుంది. దానిదే శాశ్వతమైన పెత్తనం, అంతిమ అధికారం. మొదట్లో గణనాయకులు సమితి సభ్యులుగా వుండేవారు. కాలక్రమేణా సమితిలోకి కొందరు సభ్యుల్ని ఏరి కోరి తీసుకునేవారు. ఇది సంపద కల్గినవారి కోసం చేసిన పని. భవిష్యత్‌లో ఈ సమితే రాజ్యాంగాన్ని, శాసనసభను ఏర్పాటుచేసింది.

పితృస్వామ్య వ్యవస్థ ఏర్పడినాక తెగల ఉమ్మడి ఆస్తి శిథిలమైంది. కుటుంబాలకు కొంత వ్యవసాయ భూమి, ఇంటి స్థలం కేటాయించారు. పశువుల మేతకు బీళ్లు, జంతువుల వేటకు అడివి, స్మశానాలు తెగ ఉమ్మడి ఆస్తిగా వుండేవి.

ఆస్తి పంపకాలలో సమానత్వం తలక్రిందులైంది. పితృస్వామ్యంలో వచ్చిన ఆర్థిక మార్పులు కుటుంబ ఆస్తికి పెద్దపీట వేశాయి. తెగ

నాయకులు, యుద్ధవీరులు, పూజారులు, మంత్రగాళ్లు, తమ పరపతిని, పలుకుబడిని సొంత ఆస్తి కూడబెట్టుకోవటానికి సోపానంగా చేసుకున్నారు. సారవంతమైన భూముల్ని, లోహాలను, విలాస వస్తువులను కాజేశారు. ఒక కొత్త భావజాలానికి మార్గం వేశారు.

## సొంత ఆస్తి

పితృస్వామిక వ్యవస్థ వస్తూనే సొంత ఆస్తిని వారసత్వ హక్కుగా పట్టుకొచ్చింది.

సొంత ఆస్తి అంటే గోచి గుడ్డ, చింకి చీర, తట్ట బుట్ట, గాజు, పూసలు కాదు. ఒక మనిషి కలిగి వుండే కనీస అవసరాలు కాదు. సొంత ఆస్తి అంటే ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం. ఆర్థిక వనరులపై ఆధిపత్యం. భూమి, గనులు, పశువులు, యంత్రాలు మొదలైనవి.

సొంత ఆస్తి అనాదిగా వుందని, ఇపుడు, ఎపుడూ ఇలాగే వుందని అంటారు. తాతముత్తాతలు యిచ్చిందనీ, పూర్వజన్మ సుకృతమని చెబుతుంటారు. పవిత్రమైనదని, రక్షణ కల్పించాలని గగ్గోలు పెడతారు.

ఆధునిక కాలంలోని ఆటవిక, అనాగరికత గల ఆచారాలు, అలవాట్లను పరిశీలించి ప్రాచీన కాలంలోని ఆస్తి రూపాల్ని అంచనా వేయగలం. వేటలో దొరికినవీ, పండించిన పంటను ఆదివాసీలు సమంగా పంచుకుంటారు. భూమి సొంత ఆస్తిగా వుండటం వారికి తెలియదు. నీరు, నిప్పులాంటిది భూమి అని, అది మనదేకాదు, భవిష్యత్ తరాలది అనికూడ నమ్ముతారు.

వ్యవసాయక తెగలలో అతి ముఖ్యమైనది భూమి. అది సుదీర్ఘకాలం ఉమ్మడి ఆస్తిగానే వుండిపోయింది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో అలెగ్జాండర్‌తో ఇండియాపై దాడిలో పాల్గొన్న నియార్కస్ అనే సేనాధిపతి ఇక్కడి పరిస్థితులను చూసి ఇలా రాశాడు. “ఇండియాలోని తెగలు భూముల్ని సాముదాయకంగా సాగుచేసుకుంటారు. ఏడాది చివరన పంటను అంతా కలిసి పంచుకుంటారు.”

అదనపు ఉత్పత్తిలో బానిసత్వం వచ్చింది. పితృస్వామికం వచ్చింది. ఈ రెండింటిపై ఏంగెల్స్ ఇలా అన్నాడు. “దంపతీవివాహంలో స్త్రీ, పురుషుల మధ్య పెంపొందిన వైషమ్యమూ, మొదటి వర్గవైషమ్యమూ చరిత్రలో ఏకకాలంలో తలెత్తాయి.”

వర్గదోపిడీకి పుట్టిన బిడ్డ సొంత ఆస్తి. దంపతీవివాహం ఆ బిడ్డకి సొంత ఆస్తిపై వారసత్వహక్కునిచ్చింది.

## తెగ నుండి ప్రాంతీయ వ్యవస్థకి

క్రీ.పూ. 3000–1000 కంచుయుగం. రాగి, తగరం, కలిపి కంచు పనిముట్లు, ఆయుధాలు తయారుచేశారు. నైలు, టైగ్రిస్ – యుఫ్రీట్, సింధు నదీ తీరాలలో మానవ నాగరికత వికసించింది. వ్యవసాయం అభివృద్ధి చెంది అదనపు ఆహారాన్ని రుచి చూపింది. దాంతో వ్యవసాయేతర వృత్తులు విస్తృతమైనాయి. లోహపరిశ్రమకు పునాది పడింది. ఎక్కడ వ్యవసాయం, వృత్తులు నిలదొక్కుకున్నాయో, అక్కడ నగర నాగరికతకు అంకురార్పణ జరిగింది.

జీవితావసరాల కోసం గణాలు, తెగలలోని ప్రజలు, వివిధ వృత్తులవారు నగరాలకి జేరారు. ఒకే ప్రదేశంలో అనేక తెగల ప్రజలు పరస్పరం కలిసి జీవించడం సరికొత్త పరిణామం. ఏకశిలా సదృశ్యంగా వుండే గణవ్యవస్థకి ఈ విభజన పొసగదు. పాతకాలంనాటి రక్తసంబంధీకుల గణ, తెగ వ్యవస్థకు కాలం చెల్లింది. ఒక నిర్దిష్ట ప్రదేశంలో వివిధ గణాలు, తెగలు ఇష్టానుసారం కలిసిపోయి స్థిరనివాసం వుండటం వలన ప్రాచీన సమాజంలోని అడ్డుగోడలు బ్రద్దలైనాయి. తెగల హద్దులు చెరిగిపోయాయి. రక్తసంబంధాలు తెగిపోయాయి. ఆర్థిక సంబంధాలే ప్రధానమైనాయి. ప్రాదేశిక సరిహద్దులు పుట్టుకొచ్చాయి. ప్రాంతాలవారీగా సమాజం విభజింపబడింది. సుదీర్ఘ పోరాటాల తర్వాతే ఈ మార్పు సాధ్యమైంది.

## వినిమయ వస్తువు - వ్యాపార సరుకు

లోహం రాకతో వస్తుమార్పిడి వెనుకడుగు వేసింది. దేనినైనా విలువకట్టే సామాన్య వర్తకపు సరుకుగా లోహాలు మార్కెట్‌లోకి వచ్చాయి. ధనంగా రూపం పొందాయి.

వస్తువుల ఉత్పత్తి తన కోసం, తనవారి కోసం కాదు. అమ్మకం కోసం, ధనం కోసం, సంపదల కోసం. మారకం అమ్మకంగా మారింది. వినిమయ వస్తువులు వర్తకపు సరుకులుగా మారాయి. ఇక్కడ ఉత్పత్తిదారులు తాము వాడుకోగా వస్తువుల్ని మార్కెట్‌లోకి వదిలారు. అవి వారి చేయి జారిపోయాయి. అవి ఏమవుతాయో, ఎక్కడికి పోతాయో వారికి తెలియదు. ఇదివరకెన్నడూ కనివిని ఎరుగని కొత్త ఆర్థిక పరిస్థితి. ఒకప్పుడు కూడు, గుడ్డ కోసం తపించిన సమాజంలో ఇపుడు సంపదల కోసం పెనుగులాట ప్రారంభమైంది.

మార్కెట్‌లో అమ్మటం, కొనటం సాధారణమైపోయింది. వ్యాపారం వృద్ధి చెందింది. వర్తకులనే కొత్త సామాజికవర్గం పుట్టింది. ఇది మూడవ శ్రమవిభజన. వీరికి ఉత్పత్తితో ప్రత్యక్ష సంబంధం వుండదు. మారకంలో చురుకైన పాత్ర వహిస్తారు. ఆహారధాన్యాలు, లోహాలు, ఆభరణాలు, విలాస వస్తువుల ఎగుమతి, దిగుమతులన్నీ వీరే నిర్వహిస్తారు. కొండలు, కోనలు, సముద్రాలు దాటి దూరదేశాలతో వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారం సైన్సును, అక్షరాల్ని, అంకెలను సృష్టించింది. నాగరికతా వ్యాప్తికి, మిశ్రమ సంస్కృతికి తోడ్పడింది. ఇంతవరకు బానిసలు, బానిస యజమానులు, సామాన్యులుగా వర్గవిభజన జరిగింది. ఇపుడు నూతనంగా నగర నాగరికతకు పుట్టిన ఈ కొత్త వ్యాపారవర్గం ఉత్పత్తితో ఎలాంటి సంబంధమూ లేకుండానే మార్కెట్‌నంతటినీ గుప్పెట్లో పెట్టుకొంది. ఉత్పత్తిదారుడికి, కొనుగోలుదారుడికీ మధ్య దళారీగా వ్యవహరించి, ఇద్దర్నీ దోచుకుంటుంది. అదనపు ఉత్పత్తిలో కొంతవాటాను స్వాహా చేస్తుంది.

తెగ నుండి ప్రాంతీయ వ్యవస్థకు సాగిన ఈ మహాప్రస్థానం ఒక నూతన సామాజిక నిర్మాణానికి ప్రాతిపదిక అయింది. తెగ ఉమ్మడి భూములు సొంత ఆస్తిగా మారిపోయాయి. ఉత్పత్తి సొంత వుపయోగానికి గాక, సంపదల్ని ప్రోగుజేసుకొనే సరుకుగా మారింది. వ్యాపార వస్తువులకి గిరాకీ ఏర్పడింది. వ్యవసాయంలోకి వ్యాపార పంటలు ప్రవేశించాయి. లోహపు పనిముట్లు, చేతివృత్తుల ఉత్పత్తులు వర్తకపు సరుకుగా మారాయి. సముద్ర వ్యాపారం, ఎగుమతి, దిగుమతులు పెరిగాయి. ఈ నూతన మార్పులు తెగ జీవితాన్ని ఛిన్నాభిన్నం చేశాయి. సామాజిక జీవనశైలిని మార్చివేశాయి.

ప్రాచీన గణవ్యవస్థలో ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం ఒక సమితి ఉండేది. దాని అవసరం తీరిపోయింది. ప్రాదేశిక ప్రాతిపదికపై ఒక సార్వజనీన సమితి ఏర్పడింది. ఇది నిర్దిష్ట ప్రదేశంలోని జనులందరికి చెందిన సమితి. దానికో సేనాధిపతి, ప్రధాన పూజారి నియమింపబడి, వారసత్వహక్కునిచ్చారు. దీనితో రక్తసంబంధం గల గణవ్యవస్థకి కాలం చెల్లింది. దాని అంత్యక్రియలు పూర్తయినాయి.

## వాడిన పూవులా రాలిన గణవ్యవస్థ

అదనపు ఉత్పత్తిలో మానవ సమాజంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. శ్రమశక్తితో అపార సంపదలు సృష్టించే అపూర్వ అవకాశాలు ఒకవైపు, ఆ సంపదల్ని దోచుకొని సమాజాన్ని శాసించే మైనార్టీవర్గం మరోవైపు ఆవిర్భవించాయి.

అదనపు ఉత్పత్తి లేనిదే సామాజికాభివృద్ధి లేదు. ప్రజల అవసరాలు తీర్చలేని గణవ్యవస్థ సంక్షోభంలో పడింది. దీని నుండి బయటపడాలంటే ఉత్పాదక శక్తి పెరగాలి. చౌకగా దొరికే బానిసలు కావాలి. వారిని బలిపీఠం ఎక్కించి సామాజికాభివృద్ధి ముందుకు సాగాలి.

ఇందుకు పెద్ద ప్రతిబంధకం ఆనాటి గణవ్యవస్థ. ఆ వ్యవస్థలోని ఉత్పత్తి సంబంధాలు.

ఆర్థిక వనరులు కొందరి చేతులలోకి పోయాయి. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెంది, అదనపు ఉత్పత్తికి ముంగిట నిలిచాయి. శ్రమను ఎంతగా దోచుకొంటే అంతగా అదనపు ఉత్పత్తి, అంతగా సంపదలు. కాని గణవ్యవస్థ పునాది లేదా ఉత్పత్తి సంబంధాలు సమిష్టి యాజమాన్యం సమపంపకంపై ఆధారపడి వున్నాయి. ఇది అదనపు ఉత్పత్తికి ఆటంకం. శ్రమదోపిడీకి బద్ధ విరోధం. ఉత్పత్తిశక్తులు అభివృద్ధి చెందాలంటే ఉత్పత్తి సంబంధాలలో మార్పు వచ్చి తీరాలి. పురోగమిస్తున్న నూతన ఉత్పత్తి శక్తులకు, సమష్టి యాజమాన్యంలో వున్న వెనుకబడిన పాత ఉత్పత్తి సంబంధాలకు మధ్య తీవ్ర వైరుధ్యం ఏర్పడింది. పరిష్కారం కోసం రంగం మీదికొచ్చింది.

సామూహిక పనికి శ్రమవిభజన గండికొట్టింది. కొత్తరాతియుగం నాటి స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ బీటలుబారింది. అదనపు ఉత్పత్తితో శ్రమదోపిడీ ప్రారంభమైంది. బానిసలు, బానిస యజమానులుగా వర్గవిభజన వచ్చింది. ఆర్థికవనరులపై పురుషుల ఆధిపత్యం స్థిరపడి పితృస్వామికం అమలులోకి వచ్చింది. లోహం వచ్చింది. వ్యవసాయోత్పత్తులతో నగర నాగరికత, వ్యాపారం వృద్ధి చెందింది. వినిమయ సరుకు వ్యాపార వస్తువయింది. తెగలు ప్రాదేశిక సరిహద్దులతో ప్రాంతీయ సమాజాలుగా రూపుదిద్దుకున్నాయి.

గణవ్యవస్థ కుప్పకూలింది. అది సహజ మరణం. అందుకు విచారపడవలసిన అవసరంలేదు.

ఉత్పత్తిశక్తులు ప్రాథమిక దశలో వున్నప్పుడు, ప్రకృతి శక్తుల ముందు మానవుడు నిస్సహాయ స్థితిలో నిలబడినపుడు, అజ్ఞానం, భయంతో మతవిశ్వాసాలు మనస్సు కెక్కినపుడు, నూతిలో కప్పవలె తెగే సర్వస్వంగా వున్నంతకాలం గణవ్యవస్థ వర్ధిల్లింది. వికసించిన పువ్వులా కనపడింది. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెంది శ్రమ విభజన, మారకం, అదనపు ఉత్పత్తి సృష్టించడంతో తెగ సరిహద్దులు చెరిగిపోగా, ఆర్థిక వనరులపై పితృస్వామ్య వారసత్వ హక్కు స్థిరపడటంతో ఆ పువ్వు వాడిపోయి రాలిపోయింది.

## రాజ్యాంగ యంత్రాల పుట్టుక

రాజ్యాంగ యంత్రం ఎలా పుట్టిందో మన పాఠశాల పుస్తకాలు ఇలా చెబుతున్నాయి.

"చెరువు నిండా నీళ్లున్నాయి. చుట్టూ గట్టుంది. గట్టే లేకపోతే..... ప్రభుత్వం కూడ గట్టులాంటిదే"

"రాజ్యాంగం పరమ పవిత్రమైనది. అది దైవ ప్రసాదం. అనాదిగా మానవ సమాజం పుట్టిననాటి నుండి వుంది."

"రాజు దైవాంశసంభూతుడు. దేవుడి ప్రతినిధి."

"ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కోసం" ప్రభుత్వం.

ఎంగెల్స్ ఏమి చెప్పాడో చూడండి.

గణ వ్యవస్థ పతనమైంది. వర్గాలు పుట్టాయి. శ్రమదోపిడీతో సంపదలు సృష్టింపబడుతున్నాయి.

"సంగ్రహంగా చెప్పాలంటే సంపదలకు మెప్పు లభించింది. ధనం సర్వసామాన్యమైంది. సంపదలను బలాత్కారంగా దోచుకొనేందుకు వెనుకటి గణసంఘ అంగాలనే వుపయోగించుకున్నారు. అప్పటికున్న లోపం ఒక్కటే. గణసంఘంలో సామూహిక పద్ధతులకు వ్యతిరేకంగా వ్యక్తులు పోగుజేసుకున్న ఈ కొత్త సంపదలను కాపాడే వ్యవస్థ కావాలి. గతంలో ఎంతో చులకనగా చూసే వ్యక్తిగత ఆస్తిని పవిత్రమైనదిగా స్థిరపరచాలి. ఆ పవిత్రతను కాపాడటమే మానవ సమాజం యొక్క ప్రధానగమ్యంగా ప్రకటించాలి. అంతేకాదు ఆస్తులు సంపాదించేటందుకు అనుసరిస్తున్న నవీన పద్ధతులకు సంపదల నిరంతరాభివృద్ధికి సమాజం ఆమోదం లభించాలి. సమాజంలో కొత్తగా తలెత్తుతున్న వర్గ విభజనే కాకుండా, ఆస్తిపరులవర్గం, ఆస్తిలేని వర్గాలను దోచుకొని పాలించే హక్కును కూడ శాశ్వతంగా సాగనిచ్చే సంస్థ కావాలి. ఈ మాదిరి సంస్థ ఏర్పడింది. రాజ్యాంగం సృష్టింపబడింది."

రాజ్యాంగ యంత్రం అంటే ఏమిటి?

ఒక నిర్దిష్ట భూభాగంలోని ప్రజలను పాలించే ప్రభుత్వం, దాని నిర్వహణలోని నిరంకుశ ఉద్యోగవర్గం, పోలీసు, సైన్యం, కోర్టులు, జైళ్లు, అన్నిటిని కలిపి 'రాజ్యాంగ యంత్రం' అంటారు. ఏ ఒక్కటీ విడిగా రాజ్యాంగ యంత్రం కాజాలదు.

ఒక క్రమ పద్ధతి ప్రకారం బలాన్ని ప్రయోగించి ప్రజల్ని అణచి వుంచే ఒక ప్రత్యేక యంత్రాంగమే రాజ్యాంగ యంత్రం.

"సమాజ పరిణామ క్రమంలోని ఒక ప్రత్యేక దశలో రాజ్యాంగం సమాజంలోంచే పుడుతుంది. రాజ్యాంగం ఏర్పడిందీ అంటే ఆ సమాజంలో సమన్వయించటానికి సాధ్యపడని వర్గ వైరుధ్యాలు వచ్చాయని అర్థం."

ప్రాచీన కాలంనాటి గణనిర్మాణానికి, ఈ రాజ్యాంగానికి తేడా ఏమిటి? అంటే

1. రాజ్యాంగంలో సభ్యుల్ని ప్రాంతీయ పద్ధతిపై నిర్ణయిస్తారు. ప్రాచీన గణ సంస్థలు రక్తసంబంధీకులతో ఏర్పడ్డవి.

2. ప్రభుత్వ సైన్యం – గణవ్యవస్థలో ప్రజలందరూ సాయుధులే. ప్రజలు వర్గాలుగా విడిపోవటంచేత ప్రజలందరూ అనే మాటకి

అర్థంలేదు. కనుకనే ప్రత్యేకంగా ప్రభుత్వాధీనంలో సైన్యం వుండటం అవసరమైంది. సైన్యంతోపాటు పోలీసులు, జైళ్లు వుంటాయి. ఇవేమీ గణసంస్థలో వుండవు.

ఈ ప్రభుత్వ సైన్యాన్ని పోషించటం కోసం రాజ్యంలోని ప్రజల నుండి పన్నులు వసూలు చేస్తారు. గణ సమాజంలో పన్నులు ఎరుగరు.

ప్రజల్ని అణచివేసి, పన్నులు వసూళ్లు చేసే అధికారులు సమాజానికి దూరమవుతారు. అందుచేత ప్రత్యేక శాసనాలు చేసి వారికి గౌరవం కట్టబెట్టారు. గణసమాజంలోని పరిపాలనాంగాలన్నింటికీ వున్న అధికారంకన్నా, నాగరిక రాజ్యంలోని పరమ నీచుడైన వాడైనాసరే పోలీసు ఉద్యోగికి వుండే అధికారం ఎక్కువ.

వర్గాల మధ్య పోరాటం ముమ్మరంగా సాగుతున్న కాలంలో వర్గ వైషమ్యాల్ని అదుపులో వుంచటం కోసమే రాజ్యాంగం పుట్టింది. అందుచేతనే అది సమాజంలో మంచి శక్తి, ఆర్థిక బలమూ వున్న వర్గం యొక్క ప్రభుత్వంగానే వుంటుంది. రాజ్యాంగం సహాయంతో ఆ వర్గం రాజకీయంగా బలపడుతుంది. ఆ విధంగా పీడితవర్గాల్ని అదిమిపెట్టి, దోచుకొనేందుకు నూతన పరికరాల్ని సంపాదించుకుంటుంది.

రాజ్యాంగ యంత్రం ఆయా దేశ కాల పరిస్థితులకనుగుణంగా రకరకాల రూపాల్ని సంతరించుకుంటుంది. బానిస, ఫ్యూడల్ వ్యవస్థలో రాచరికంగా, పెట్టుబడిదారీ వ్యవస్థలో రిపబ్లిక్‌గా అవతరించింది. పెట్టుబడిదారీ దేశాలలోని ఎన్నికలపై ఎంగెల్స్ "సార్వజనిక ఓటుహక్కు శ్రామికవర్గం యొక్క పరిణితిని కొలిచే సాధనం అవుతుంది. ఆధునిక రాజ్యాంగంలో అది చెయ్యగలిగేదంతే. అంతకంటే చెయ్యలేదు, చెయ్యదు. అయితే అదే చాలు. ధర్మామీటరులాగ సార్వజనిక ఓటుహక్కు కార్మికులలో పొంగులువారే దశను చూపిస్తుంది."

ముగింపుగా నాగరికత మీద మోర్గన్ రాసిన తీర్పును ఎంగెల్స్ ఉదహరిస్తాడు. "నాగరికత ఆరంభం నుండి ఆస్తి చాల విశేషంగా అనేక రూపాలలో పెరిగిపోయింది. దాని వుపయోగాలు విస్తరించాయి. దాని స్వంతదారులు కోసం అది ఎంతో మెలకువతో నిర్వహింపబడుతూ వుంది. ప్రజలకు సంబంధించినంతవరకు లొంగదీయలేని మహాశక్తిగా అది తయారైంది. తాను సృష్టించిన మహాశక్తి ఎదుటనే మానవ మేధస్సు కర, చరణాలాడకుండా అయింది. అయినా మానవుని బుద్ధి ఆస్తి మీద ఆధిపత్యం సంపాదించగల రోజు వస్తుంది."

"ప్రాచీనకాలపు గణాలలో వుంటూ వచ్చిన స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరభావం ఒక నూతన ఉన్నత రూపంలో పునరుజ్జీవం అవుతాయి."

ఈ పుస్తకంలో సుదీర్ఘ ఉపోద్ఘాతం తర్వాత తొమ్మిది అధ్యాయాలు వుంటాయి. చరిత్ర పూర్వదశలో పనిముట్ల వాడకంలో వచ్చిన మార్పుల్ని మొదట వివరిస్తారు. స్త్రీ, పురుష సంబంధాలు, మాతృస్వామ్యం నుండి పితృస్వామ్యానికి పయనం, కుటుంబం పుట్టుపూర్వోత్తరాల గురించి తర్వాత చెబుతారు. ఇరాక్వ్యాలలోని గణతంత్ర వ్యవస్థను విపులీకరించి, అది గ్రీకు గణాలలో పితృస్వామ్యానికి మారే క్రమాన్ని చూపెడతారు. రక్తసంబంధీకుల తెగలు ప్రాంతీయ తెగలుగా మారటాన్ని రాజ్యాంగం పుట్టుకను ఏథెన్స్‌ను వేదికగా ఉదహరిస్తారు. పాట్రీషియన్లు, ప్లెబియన్లు మధ్య, జర్మనీ అనాగరిక దండయాత్రల తర్వాత రోమ్ రాజ్యాంగం పాలకవర్గానికి ఎలా అండగా నిలిచిందీ చివరి అధ్యాయాలలో అర్థమవుతుంది.

"కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక" ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సిన విలువైన పుస్తకం. మోర్గన్ రాసిన 'ప్రాచీన చరిత్ర' కూడా తెలుగులోకి అనువదింపబడింది. మహీధర రామమోహనరావుగారి అనువాదం అద్భుతంగా వుంటుంది. ✤

కవిత

# విష..వలస విలయం

– సహచరి

వాళ్ళు విమానాల్లో విహరించే వాళ్లకు
రన్‌వేలు నిర్మించే వలస జీవులు....
వాళ్ళు రైలు బోగీలకు పట్టాలేసి
రహదారుల్ని నిర్మించిన బడుగుజీవులు
వాళ్ళు కాళ్ళు తడవకుండా బడాబాబుల్ని
సముద్రాలు దాటించగల శ్రమజీవులు....
ఫ్యాక్టరీల పొగగొట్టాలే ఊపిరితిత్తుల్లా
ఉఛ్వాస నిశ్వాసాల్లో విషవల(స)యంలో రాలిపోయి..
తెగిపడిన విగత జీవులు వాళ్ళు
కళ్ళు తడుపుకుంటూ కడుపు కాల్చుకుంటూ
సకల సంపదల సృష్టికర్తలు వాళ్ళు..
తాజ్మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీల్లా
గ్రేట్ ఇండియా విల్లాలకు చెమటోడ్చిన
కష్టజీవులు వాళ్ళు....
వాళ్లేసిన రహదారులే వాళ్ళ
కాలినడకను నిషేధిస్తే
వాళ్ళు నిర్మించిన ఆకాశ హర్మ్యాలే
నిలువనీడనీయక గెంటేస్తే
వాళ్ళ చెమటే పెట్టుబడులుగా నడిచే ఫ్యాక్టరీలు
లాక్ ఔట్లలో విషం చిమ్మితే..
విశాఖ తీరంలో ఒరిగిపోయినవాళ్లు....
రైలు పట్టాలమీద తునకలైనవాళ్లు..
వాళ్ళే దేశ సంపదకు రక్తం దారపోసినవాళ్లు
వాళ్ళు వలసజీవులే కాని.. వలసపోయి
దేశానికి రోగం తెచ్చిన వాళ్ళుకాదు..
వలసలతో కాలినడకన కరోనా దేశానికి
అంటకుండా 'సామాజిక' దూరంలో
పేగుబంధాలను పెనవేసుకోడానికి వేలమైళ్ళు
నడుస్తున్న వాళ్ళు.. రాళ్లు రప్పలు రైల్వే
పట్టాల మీద నెత్తుటి కాళ్లతో నడుస్తున్నవాళ్ళ
నర(డ)క యాతనకు రైళ్ళు.. వాళ్ళను
ఊళ్లకు చేర్చకున్నా.... నడిచి నడిచి అలసిన
దేహాల్ని చీల్చకుంటే చాలు!! ✤

గల్పిక

# అయినోల్లకి కంచాలు కానోల్లకి ఆకులు

– గౌరీశంకర్

**'నారాయణా** ఏవైందిరా అందరూ అలా గాభరా పడతన్రు?' ఆదుర్దాగా అడిగాడు గోపాలం.

మన కిష్ణగాడు పురుగుల మందు తాగీసేడ్రా!

అమ్మమ్మ! అంత కష్టం ఏటొచ్చిందిరా ఆడికి!

"నీకెప్పుడూ సెప్పనేదేటి? ఈడు గాజువాకలో ఒక ఆసామీ దగ్గిర సీటీ కట్టేవోడు. ఆడీ కరోనా అడావిడ్లో జెండా ఎత్తీసి, కరోనా కంటే పెద్ద జబ్బులొచ్చీలా సేసి ఎల్లిపోండట...."

'అయితే.... సచ్చిపోడవేనేట్రా అన్నిటికీ మందు.....?'

'కూతురు పెల్లి సెయ్యనీకి అయిదు లచ్చలకి సీటీ ఏసినాడంట, మన బతుకులేపాటిరా అయిదు లచ్చలంటే....!'

అయిదు లచ్చలే.... పెద్ద దెబ్బేరా.... పోలీసు కంప్లైంటివ్వలేదా మరి?

'అదీ అయ్యింది.... పారిపోయినోడు అంత బేగ దొరుకుతాడేట్రా? దొరికినా ఐపి పెట్టీసినోడు ఎక్కడ్నించి తెచ్చిత్తాడ్రా?.... ఒకేల దొరికినా పోలీసులు నొక్కెత్తారు....'

అదీ నిజవేలే.... ఇంతకీ ఇప్పుడెలగుందాడికి?

'కడుపులోది కక్కించేరు.... ఇంకా సుహ రానేదు.... ఏటవుద్దో మరి.... అయినా ఇట్టా మంది సొమ్ము నొక్కీసి పారిపోయే దొంగనా కొడుకుల్ని ఉరిదీస్సినా తప్పునేదురా.... పాపం ఇంకా ఎంతమంది ఉసురు దీస్కుంటారో....?'

పాపం! ఆడుగానీ, ఆడి పెల్లంగానీ ఓ మంచి గుడ్డ ముక్కేసుకోడం నానెప్పుడూ సూడ్నేదురా.... కడుపు కట్టుకోని పైసా, పైసా కూడగట్టి ఆడికి ముడుపు గట్టేసినారు....

'అదే అంతన్నాను నానూను.... గుంటల్ని సదవించుకోనీకో, సిన్న బూమ్ముక్క అమర్సుకోడానికో, సిన్నా సితకా కొంప గట్టుకోనీకో ఎంతమందో ఆడికాడ సీటీలు గట్టుంటారు.... యింతమందిని ముంచీసి ఆడు ఏటి బావుకుంటాడ్రా?....' అయినా నాకు దెలీకంటన్నాననుకో గానీ మన్లాంటి సిన్నసిన్నోల్నే అందరూ మోసం జేత్తారేట్రా....?'

'కాకపోతే! సొమ్ములున్న గొప్పోల్లు ఇలా సిన్న సిన్న సిటీలు గట్టుకుంటారేట్రా? ఏ బంగారాలమీనో, ఏ బూవుల మీనో నేకపోతే సేర్లు మీనో ఎట్టుకుంటారు గానీ....'

డ్యూటీ ముగించుకొని అప్పుడే అటుగా వచ్చిన ఫారెస్టు వెంకటరావు వీళ్ళతో కలిసాడు. "మీరన్న మాటలన్నీ నిజమేరా, ఇప్పుడు చూడండి మన్లాంటోల్ల పరిస్థితి ఏటయ్యిందో, రోడ్డు పక్కన చిన్నా చితకా యాపారాలు చేసుకునీవోల్లు, రకరకాల కూలిపన్లకెల్లీవోల్లు, రిక్షాలు తొక్కీవోల్లు, చెప్పులు కుట్టుకునీవోల్లు, దుకాణాల్లో పన్జేసీవోల్లు.... ఇలా ఎన్ని కోట్లమంది ఈ మహమ్మారి పుణ్యమా అని పనుల్లేకుండా, కడుపుకి కనీసపాటి తిండి లేకుండా అగోరిత్తన్నాం. నా కాంటాక్టు ఉజ్జోగం ఉంటాదో, ఊడుతాదో, పీకమీద కత్తిలాగుంది. ఇతర దేశాలు పేదల్ని, వలస కార్మికుల్నీ ఆదుకోడానికి పెద్ద పెద్ద మొత్తాల్లో నిధులు విడుదల చేస్తుంటే మన వస్తాదులు సూసీ సూడనట్టు విదిలిస్తున్నారు. మనకి తెలీడం లేదుగానీ పంటలమ్ముడుపోక, ఆకలికి తట్టుకోలేక, రోగానికి వైద్యం అందక ఎంతమంది కాటికెల్లిపోతన్నారో? మరీల్లందరూ మన కిష్ణగాడిలాగే ఎవురో ఒకర్ని నమ్ముకొని మోసపోయినట్టే గదరా.... ఏటంటారు?"

"మీరెన్నైనా సెప్పండిగానొరే, మామూలు ముడుసుల్లోనే అబిమానం, జాలి ఉంటాయిరా.... అందుకనే పెతిపోటా ఎవలో ఒకలు దిక్కూ మొక్కూ లేనోల్లకి ఏదో ఒకటి అందిత్తా వున్నారు.... ఓటుకి నోటిచ్చి కొనుక్కున్న నాయాల్లకి జనం మీద జాలెందుకుంటదిరా?"

"అమ్మమ్మ, అలగనీకు! ఆల్లకీ మనసులున్నాయి అందులో అబిమానాలు కూడా ఉన్నాయి. అందుకనే జాలిపడి మొన్ననే ఓ యాబైమంది పెద్దమనుషులు బ్యాంకుల్నుండి తీస్కున్నప్పులు చెల్లించలేక తలెత్తుకోని తిరగలేక, ఇక్కడి జనాలకి మొకాలు సూపించలేక ఇమానాలెక్కి, అంటే ఎక్కించి అంపీసినారనుకో, విదేశాలకి పోయినోల్లయ్యి తక్కువలో తక్కువ ఒక డెబ్బై వేల కోట్లు మాఫీ చేస్సేరు. పాపం పువ్వులమ్ముకున్న సోట కట్టెలమ్ముకోలేక విదేశాలకెల్లిపోనారూ, యింత సిన్న మొత్తాలు దీర్సలేక అక్కడెన్ని అగసాట్లు పడతన్నారో, అసలే విదేశాల్లో కరోనా పెట్రేగిపోతంది, ఇలగైనా మందేశానికి ఎలిపొచ్చెత్తారు అని ఆలోసించి ఆలోసించి, కొంతమంది పెద్దమనుసులు బాగుపడాలంటే ఎంతమంది సిన్నోల్లు, అంటే మన్లాంటోల్లు, పోయినా పర్వాలేదని ఎక్కడో పెద్దోరు సెప్పిన్రంట గదా.... అదన్నమాట సంగతి. ఇప్పుడాల్ల కోసరం విమానాల్ని అంపించి మరీ దీస్కొత్తారు!"

'సెబ్బాసురా ఎంకట్రావా! మొన్న దేవరాపల్లి సంతకి దెచ్చిన కూరగాయలిక రేట్లు పడిపోనాయని రైతులు ఆటినక్కడే పారీసి పోనారు.... మాయదారి వరసమొచ్చి అర్టితోటల్నీ, మావిడి తోటల్నీ, కోతకొచ్చిన వరిపంటల్నీ నాశినం జేసి పోనాది. లచ్చలమంది ఉన్నసోట బతకదారినేక కొంపా గోడూ, పెల్లాం పిల్లల్నీ ఒగ్గేసి దేశింకాని దేశాలట్టుకోని పనీపాటూ, తిండీ తిప్పలూ నేకుండా గుండిలవిసిపోయినాగ మైల్లకి మైల్లు నడుసుకొని ఎలిపొచ్చెత్తన్రు, సత్తే నా మట్టిలోనే సత్తాననుకొని. ఈల్లనెవ్వల్నీ పట్టించుకోని నాయాల్లు మంది సొమ్ముతో జల్సాల్జేసుకొని కోట్లకి కోట్లు ఎగనామం ఎట్టీసినోల్లకి మాఫీ

జేసినారన్నమాట, గొప్పగుందరా! మరి ఆరుగాలం గొడ్డుల్లా కష్టపడి ఎండనక, ఓననక పెజల కడుపుల్నింపే రైతులికి మాపీ జెయ్యరేవిరా?"

"అంతదాకా ఎందుకురా, అసలు మనకి అప్పులివ్వడానికే ఎన్ని పుర్రాకులు ఎడతన్నారు? ఒకేల అప్పిచ్చినా, నేకపోతే మాపీలు జేసినా సవాలచ్చ కండిసన్లు. సొంత బూవున్నోల్లకే ఇత్తాం.... లచ్చవరకే మాపీ జేత్తాం.... అతనా మాపీ జేత్తారు కదాని బేంకీకెల్తే పాత బాకీ కింద జమ కట్టీసుకున్నాం అంతన్నారు.... బేంకీలు అప్పులివ్వకే కదరా వడ్డీ మీన వడ్డీకి అప్పుల్దెచ్చి పంటలు పండినా రేటు సరిగ్గా పలక్క ఉసురుల్దీస్కుంటన్నారు...."

"ఓరి మీ పిచ్చిగానీ ఈ వస్తాదులందర్కీ ఓట్లేలచ్చన్లో కోట్లు దెబ్బ ఎవురిత్తార్రా.... నీకాడా, నాకాడా ఏటుందివ్వడానికి బొచ్చె? బేంకీలకెగ్గొట్టిన మారాజులంతా ఏడుకొండలవాడికి ముడుపు గట్టినట్టు ఈల్లకి సమర్పించుకుంతారు. అట్టాంటప్పుడు మాపీలు ఆల్లకి జెయ్యపోతే నీకూ, నాకూ జేత్త్రర్రా....!

"ఇసిత్రవేటంటే అన్ని పేపర్లూ రైతు, యవుసాయం, గ్రేమాలూ బాగుంటేనే దేశం బాగుంటాదని కోడై కూత్తన్నాయి. అయినా ఈ వినాయకులికి ఎంత పెద్ద సెవులుంటే ఏం నాబం, అంతా సెవిటోడి ముందు శంకం ఊదినట్టుంది."

ఇంతకీ పెద్దోల్లంతా ఆల్లకి అయినోల్లు.... మనం కానోల్లం.... అంతేమరి! అందకేన్రా అయినోల్లకి కంచాలు, కానోల్లకి ఆకులు!! కరోనా కూడా ఆల్లకే కలిసొచ్చింద్రా. పదండి, పదండి.... కిష్ణగాడికెలగుందో.... మనకి మనవే దిక్కు!! ✤

కవిత

# ప్రదర్శన

- పల్లిపట్టు

ప్రదర్శించడం బాగానే వుంటాది
అన్నీ అంగట్లో సరుకైన కాలంలో
అన్నిటికీ అమ్ముడుపోవడం అలవాటైన రోజుల్లో
దేన్నైనా పేరుపెట్టిపిలిచి
పెద్దపెద్ద మాటల్లో పొగిడి
ప్రదర్శించడం గొప్పగానే వుంటాది

రంగురంగుల బొమ్మలాటనో
రకరకాలబురిడీల గారడీ మాటనో
నలుగురు మెచ్చుకునేలా
నాలుగు రూకలు మూటకట్టుకునేలా
నాటకాన్ని ప్రదర్శించడం నాటకీయంగానే వుంటాది

లోపాలు కనిపించకుండా
దీపాల వెలుగులో నటించే ముఖాలమై
నవ్వో ఏడుపో పులుముకుని
దీపంచుట్టూ పేడబురగలా తిరిగే వీరభక్తినో
ఏ దేముడేమీ చేయలేని రోగభయాన్నో
వొంటినిండా కప్పుకుని
ఇళ్లముందు ప్రదర్శించడం భలేగానే వుంటాది

చూరుకిందో
వసారాలోనో
జిగేల్మంటూ కులికే వరండాలోనో
అద్దాలుపొదిగిన అంతస్తుల భవంతుల బాల్కనీల్లోనో
ఏదో ఒకటి ప్రదర్శించడం బ్రహ్మాండంగానే వుంటాది

ఇల్లూ వాకిలున్నోడూ
ఇంటిలో కాలు బయటబెట్టకుండా
మూడుపూటలా ముద్దపై చెయ్యేసి
ఏదైనా పైకెత్తి నలుగురిలో చూపెట్టి
చప్పట్లు కొట్టించుకోవడం చాలా బాగానే వుంటాది

చెత్తకుప్పల తానా
మురుగు కాల్వల వొడ్డున
జుమ్మని మోగేదోమల వంతపాటని
మూగిన ఈగలకింద దిక్కులేని శవాన్ని

ఉరిసే ఇళ్లకాడా
కురిసే కన్నీళ్ల ఆకాశం కిందా
ముడ్డిమీద గుడ్డలేక నగరాల వంతెనల కింద
నెత్తిన నీడలేని దేశదిమ్మర దారులను కూడా
దేశం బొమ్మగీసి బాగానే ప్రదర్శించవచ్చు

ఎన్ని ప్రదర్శనలు చూడలేదని
ఎన్ని ప్రదర్శనలు కాలేదని
అలవాటైపోడ్సిన ప్రదర్శనలు కదా
మరీ అంత వెగటుగావులే....

ఖాళీ చేతులతో
కాలుతున్న పేగులతో
నగరాలు విసిరేసిన రోడ్లకి వారగా
మిణుకు మిణుకుమంటున్న మన్నుదీపాలను
బతుకెండిపోతున్న బహుముఖాల వొత్తులను
చేతులు పైకెత్తి
చేయి చేయి కలిపి తాళం వేస్తూ
భజనపాటగా ప్రదర్శించడం బాగానే వుంటాది
ఏదైనా ప్రదర్శించడం బాగానే వుంటాది. ✤

వ్యాసం

# అంతర్యుద్ధం సృష్టిస్తున్న వేదనను చిత్రిస్తున్న సిరియా కవులు, కవయిత్రులు

– కొత్తపల్లి రవిబాబు

**పశ్చిమ** ఆసియాలోని దేశం సిరియన్ అరబ్ రిపబ్లిక్ – దీనికి నాలుగు దిక్కులా లెబనాన్, టర్కీ, జోర్డాన్, ఇజ్రాయేల్ దేశాలున్నాయి. విభిన్న తెగలు, వివిధ మతశాఖలవారు సిరియాలో వుంటారు. వారిలో అరబ్బులు, కుర్దులు, టర్క్‌మన్స్, అసీలియన్స్, ఆర్మీనియన్లు, గ్రీకులు మొదలగువారు ముఖ్యులు. సున్నీలు, క్రిస్టియన్లు, ఇస్మాయిల్స్, మాండనీస్, షియాలు, యూదులు మొదలగు మతశాఖలు వున్నాయి. అత్యధికులు సిరియన్ అరబ్బులు.

ఫ్రెంచివారి వలస పాలన నుండి సిరియా 1965 అక్టోబరు 24న స్వేచ్ఛ పొందింది. ఫ్రెంచి సైన్యం ఆ దేశం నుండి ఏప్రిల్ 1946లో నిష్క్రమించింది. 1949–1971 మధ్యకాలంలో పాలకులపై ఎన్నో ఆకస్మిక తిరుగుబాట్లు జరిగాయి. 1931 నుండి 2000 వరకు హాఫీజ్ ఆల్ అస్సాద్ పరిపాలించగా, 2000లో అతని కొడుకు బషార్ ఆల్ అస్సాద్ పాలన చేబట్టాడు. ఇతని బాతిష్ట్ పార్టీ మానవ హక్కులను ఉల్లంఘిస్తూ, పౌరులకు, రాజకీయ ఖైదీలకు మరణశిక్షలు విధిస్తోంది. సెన్సార్‌షిప్ అమలు చేస్తోంది.

ప్రస్తుతం సిరియా అంతర్యుద్ధంలో నాలుగు గ్రూపులు వున్నాయి. 1. సిరియా సైన్యం – దాని మిత్రులు; 2. టర్కీ వత్తాసుతో వున్న స్వతంత్ర సిరియా సైన్యం; 3. కుర్దిషల ఆధిపత్యంలో వున్న సిరియా ప్రజాతంత్ర శక్తులు; 4. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాన్ & సిరియా (ఐఎస్ఐఎస్). సిరియా ప్రభుత్వానికి ఇరాన్, రష్యా, లెబనాన్ సహకరిస్తున్నాయి. సిరియన్ తిరుగుబాటు దళాలకు అమెరికా, టర్కీ సౌదీ అరేబియా, ఖతర్, బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయేల్, నెదర్లాండ్స్ సహకరిస్తున్నాయి.

ఈ అంతర్యుద్ధంలో సిరియా వారసత్వ సంపదగా ఉన్న దేవాలయాలు, కట్టడాలు అత్యధికంగా ధ్వంసమయ్యాయి. మ్యూజియంలు, ప్రాచీన జ్ఞాపక చిహ్నాలు – క్రీ.పూ. 1వ శతాబ్దం నాటివి నాశనమయ్యాయి. విచక్షణా రహితంగా జరుగుతున్న బాంబుదాడుల వల్ల లక్షలాది పౌరులు జోర్డాన్, టర్కీ, ఇరాన్ దేశాలకు వలసపోయారు. 2015 నాటికే టర్కీలోని శరణార్థుల 12 శిబిరాలలో 17 లక్షలమంది వున్నారు.

ఈ సంక్షుభిత వాతావరణం సహజంగానే కవులు, రచయితలను స్పందింపచేసింది. శాంతియుత వాతావరణాన్నీ, ప్రజాస్వామ్యయుత పరిపాలననూ, నిర్బంధరహిత జీవితాలనూ ఆశిస్తూ వారు రచనలు కొనసాగించారు. కొందరు ఇతర దేశాలకు పోయి అక్కడి నుండే మాతృదేశపు కడగండ్లను వర్ణించారు. మరికొందరు దేశంలో వుండే నిర్బంధ వాతావరణంలో వారి నిరసన వ్యక్తపరుస్తూ రాజ్యం చేతిలో శిక్షలు అనుభవిస్తున్నారు.

అక్కడి సాహిత్యమంతా రక్తప్లావితమైన సంఘటనల గురించే. శ్మశానాల గురించీ – విరిగిపోయిన ఎముకల ధ్వనితో నిండినదే ఆ సాహిత్యం. విచ్ఛిన్నమైన కుటుంబాలు, బాంబుల బెల్టులూ, ఎకె47లు ధరించిన వయోజనులుగా ఎదిగిన ప్రతీకారవాంఛతో రగులుతున్న బాలుర గురించీ ఆ సాహిత్యంలో చూస్తాం. నల్లజెండాలు వూపుతున్న ఉన్మాదుల దేశం శరణార్థుల ప్రవాహాలతో, ధ్వంసమైన నగరాలతో నిండి వుంది.

ఇతర దేశాలలో తలదాచుకొన్న సిరియన్ రచయితలు, డాక్టర్లు, మాతృమూర్తులు, క్రియాశీల కార్యకర్తలు తమ తాతలనాటి దేశంలోని బాధామయ గాథలను చెప్తున్నారు. టర్కిష్ శరణార్థి శిబిరంలోని ఒక వృద్ధుడు తాను రాసిన కవితల కాగితాలను చూపెడతాడు. సిరియా – అమెరికన్ జాతికి చెందిన కళాకారుడు ఓమర్ అఫెండమ్ తన పాటల ద్వారా జరిగిన నష్టాన్ని తెలుపుతూ తన పాటల ద్వారా ప్రచారం చేస్తున్నాడు. అమల్ కాస్సిర్ అనే రచయిత్రి బొబ్బలెక్కిన చేతులనూ, చెల్లాచెదరైన తన అమ్మమ్మ వ్యవసాయ క్షేత్రాన్ని జ్ఞప్తి చేసుకుంటూ ఇలా :

అందరికంటే బాగా తెలుసు
మా అవ్వకు సిరియా గురించి
ఆమె మోకాళ్ళనొప్పులే సిరియా!
ఆమె వ్యవసాయ క్షేత్రంలోని మట్టిపేరామెకు తెలుసు
నియంత కూడా ఆమెకు తెలుసు
అక్కడి దుమ్ము వాడికోసం వేచి వుంది
మనందరిలాగానే
తన సమాధి గురించి తెలుసుకుంటాడు
అతని గుండెలపై ఈ దేశపు భారాన్నంతటినీ
అనుభవిస్తుంటాడు!

20 ఏళ్ళ వయసు గల ఈ కవయిత్రి కాస్సిర్ తన కుటుంబ సభ్యులతో డమాస్కస్ బయట 2002–05 మధ్య నివసించారు. ఆ కాలమంతా ఆమె ప్రపంచవ్యాప్తంగా పర్యటించి సిరియా గురించి ప్రదర్శనలు, కవితా పఠనాలు నిర్వహించింది. ఆమె చెంత ఒక పుస్తకాల సంచి ఎప్పుడూ వుంటుంది. హిజాబ్ ధరిస్తుంది.

'నా కవిత్వం నిండా యుద్ధ దృశ్యాలే!'

2011లో విప్లవం ప్రారంభమైన కాలం నుండీ 2 లక్షలమంది మరణించారు. 40 లక్షలమంది పైగా శరణార్థులు సిరియా సరిహద్దు దేశాలకు వలసపోయారు. 70 లక్షలకు పైగా తమ ఇళ్ళు కోల్పోయారు. రోజువారీ జీవితమంతా వైమానిక దాడులు, రసాయనిక దాడులు, తిరుగుబాటుదార్లు, ఇస్లామిక్ మిలిటెంట్లు – అమెరికా రష్యాల కుట్రలతో నిండిపోయింది.

క్రియాశీల కార్యకర్త, కవయిత్రి ఖావ్లాదునియా, నటి ఫద్వాసులేమాన్ సమకాలీన సిరియాపై ప్రతిభావంతమైన రచనలు రచించారు. సులేమాన్ ఐతే అస్సాద్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలకు నాయకత్వం వహించారు. దునియా తన ఫేస్‌బుక్‌లో సిరియా జైళ్ళ నుంచి అదృశ్యమైన స్త్రీల గురించీ, స్త్రీల దయనీయ పరిస్థితుల గురించీ రాశారు. "పూర్తికాని విప్లవ దినచర్యలు : టునీస్ నుంచి డెమాస్కస్ వరకు వినిపిస్తున్న గొంతులు" అనే పుస్తకంలో ఒక వ్యాసం రాస్తూ ఆమె, "తుపాకీ ధ్వనుల మధ్య ఎవరి గొంతూ వినపడటంలేదు" అన్నారు. అర్కన్సాస్ విశ్వవిద్యాలయంలో సాహిత్యశాఖ ఆచార్యులు, అరబ్ అమెరికన్ కవయిత్రి మోహ్‌జా కాఫ్, ఖావ్లా దునియా, కవితలను ఇంగ్లీషులోకి అనువదించారు. ఆమె కవిత "దొంగ కాల్పులు" ఇలా సాగింది.

ట్రిగ్గరపై ఆ వేలికి విశ్రాంతి లేదు
విధిపై ఆధారపడిన అవయవాల
మూగరైఫిల్ పాలనలో వుంది విధి
నేనెవరో నీకు తెలిసిందా
నా పట్ల నీ ప్రవర్తన ఎవరు నేర్పారు నీకు?
ఎవరు నిన్ను ఇంత కఠినంగా మార్చింది?
ఈ క్షణం మనల్ని కలుపుతోంది
నీ కన్ను
ఒక తూటా
ఇటు నేను
ఈ క్షణం
మనలను ఐక్యం చేస్తోంది
నా కలల నుండి దూరం చేస్తోంది
నీకు పేరు తెచ్చిపెడుతుంది.
దొంగ కాల్పుల ద్వారా!

30 ఏళ్ళపాటు పరిపాలించిన హఫీజ్ హయాంలోనూ, ఇప్పుడు పరిపాలిస్తున్న అస్సాద్ కాలంలోనూ ఎంతోమంది రచయితలు, మేధావులు మరణశిక్షలకు గురయ్యారు. 2011లో వెల్లువెత్తిన అరబ్‌స్ప్రింగ్ (అరబ్ వసంతం) ప్రజాస్వామిక ఆందోళనా ఉద్యమం టునీసియా, ఈజిప్ట్, యెమన్, బహ్రైన్, సిరియాలను చుట్టుముట్టింది.

ఫుడా అలాట్రాష్, కెనడాలో నివసిస్తున్న పూర్వ సిరియా రాయబారి కూతురు. ఆమె యుద్ధభూమి నుండి వస్తున్న కవితలను ఇంగ్లీషులోకి అనువదిస్తున్నారు. "ఈ కవులు కొత్త భాషను వాడుతున్నారు. ఎంతో శక్తిమంతమైన కవితలు రాస్తున్నారు. సిరియన్ పౌరులందరినీ అవి ఆకర్షిస్తున్నాయి. ఎంతో ధైర్యాన్నీ నింపుతున్నాయి." అని ఆమె అభిప్రాయపడింది.

సిరియాలో వుంటూ కవిత్వం రాస్తున్న నజాత్ అబ్దుల్ సమద్ ఒక డాక్టరు. ఆమె దక్షిణాన గల స్వేదా నగరంలో వుంటారు. ఒక కవితలో ఆమె ఇలా అంటున్నారు. "నిన్ను నీరసం ఆవహించినపుడు, ప్రతికూల పరిస్థితుల్లో స్త్రీలు చూపే సంయమనంతో నా హృదయానికి కట్టు కడతాను."

"ఆమె విస్థాపన అనే మృత్యుకుహరం నుండి బయటపడి, తన జీవితాన్ని కొనసాగిస్తోంది. శోకమూ, పేదరికమూ, విస్థాపన ఆమెను కృంగదీయలేవు. ఆమె హుందాగా నిటారుగా నిల్చుని పోరాడుతోంది. ఆమె పోరాటస్ఫూర్తితో నా గుండె గాయానికి కట్టు కడతాను. ఎముకలు కొరికేసే చలిని తట్టుకోడానికి ఆమె ఎంతో వంట చెరకును సేకరిస్తుంది. ఆమె చెట్లను నరకదు. వంట చెరకును దొంగిలించదు. విసుగును దరికి రానీయదు. ఎవరి దయా దాక్షిణ్యాలకూ చేయి చాపదు. బరువుకు వంగిపోదు. తన ప్రయాణాన్ని మధ్యలో ఆపదు. దేనికీ లొంగదు. ఈ కవితను ఈ క్రింది వాక్యంతో ఆమె ముగించింది.

"నా గుండె గాయానికి కట్టు కడతాను
నా నినాదం మృత్యువే, అవమానం కాదు"

తమ దేశానికి ప్రపంచంలోని ఇతర దేశాలన్నిటితోనూ సంబంధం లేకుండా పోయిందనీ, అది ఒక బీడు భూమిగా మారిపోయిందనీ, సిరియన్లలో అత్యధికులు వ్యథ చెందుతున్నారు. "శాంతికోసం ఆకాంక్ష నా మతం అలాగే మానవత్వమూ నా మతం" అని సమద్ రాశారు. "ఈనాడు నా దేశంలో ప్రపంచంలోని ఏడు ఖండాల వాసనా వుంది – కాని అది ఒక అనాథగా మారింది" – అని కూడా ఆమె రాశారు.

మరికొందరు అజ్ఞాతకవులు తమపై నిర్బంధం విరుచుకు పడుతుందన్న భయంతో తమ పేర్లు బయట పెట్టకుండా రాస్తున్నారు. సిరియాలో వాస్తవంగా జరుగుతున్న అత్యంత విషాద పరిస్థితిని కేవలం రేఖామాత్రంగానే వారి రచనలున్నాయని చెప్పారు.

ఓమర్ అఫెండమ్ సిరియన్ అమెరికన్ హిప్–హాప్ కళాకారుడు. అంటే నృత్యం చేస్తూ పాట పాడే కళాకారుడు. అతని కుటుంబసభ్యులు సిరియా నుండి పారిపోయి వచ్చేవరకూ, తన నిరసన గేయాలను పాడకుండా మౌనం వహించాడు. అస్సాద్ వ్యతిరేక గేయం "సిగ్గుపడదాం"లో యుద్ధం ప్రజల మనస్సులను ఎలా స్థంబింపచేస్తుందో చెప్పాడు.

సిరియా ఇప్పుడొక గందరగోళంలో వుందని
వారంటున్నారు
ఏ పక్షంవైపు వుండాలో
నిర్ణయించుకోలేని దుస్థితిలో వుంది
ఆలోచించండి
మనం సర్వస్వం కోల్పోతున్నామని
గుర్తిస్తున్నారా –
యుద్ధంలో ఏ మర్యాదా వుండదు
పసిబిడ్డలను కత్తులతో పొడిచి చంపేస్తారు
తల్లులను వంట ఇంట్లోనే గొంతులు పిసికేస్తారు"

సిరియా నుండి లక్షలాదిమంది ప్రజలు బోటుల ద్వారా, కాలినడక ద్వారా, కార్లు, రైళ్ళద్వారా లెబినాన్, జోర్డాన్‌లకు, టర్కీ ద్వారా యూరప్ దేశాలకు పారిపోయారు. ఒక శరణార్థి ఇలా అన్నాడు. "కత్తి అంచులపైన, వాచిపోయిన పాదాలతో నేను నడుస్తున్నాను."

అమల్ కాస్సిర్ టర్కీలోని ఒక శరణార్థుల శిబిరంలో వున్న అసంఖ్యాక సిరియన్లనూ, ప్రవాసంలో వారి దుర్భర జీవితాన్ని చూచి చలించి ఇలా వ్రాశారు. "యువకులు లేరు. పసిపిల్లలు, బాలలు, స్త్రీలు, వృద్ధులు మాత్రమే వున్నారు. ఒక వృద్ధుడు గుడారంలోకి పోయి మూడు కాగితం ముక్కలు తెచ్చాడు. దానిలో స్థిరనివాసం కోల్పోయిన వారి గురించి రాస్తూ, "యుద్ధమనేది ఒక రాక్షసి, పచ్చదనాన్నంతా మింగేసింది." అన్నాడు.

మధ్యప్రాచ్యమంతా వలసపోయిన సిరియన్ కవులు కన్పిస్తారు. అరిఫ్ అక్రెజ్, అమ్మార్ తీబ్బాబ్ అనే కవులు ఇద్దరూ విప్లవం తొలిదశలో క్రియాశీల కార్యకర్తలు. ఇద్దరూ ఒక ప్రజాస్వామిక సిరియా కోసం కృషిచేశారు. "శాంతిని సృష్టించే కవిత్వం రాయడం నా ఆకాంక్ష" అంటాడు అమ్మార్. కుర్దిష్ సిరియన్ నవలా రచయిత, కవి సలీమ్ బారాకట్, సిరియా నుండి బహిష్కరింపబడిన, నోబెల్ బహుమతికి ఎదురుచూస్తున్న ఎడ్యునిస్ (Adunis), పాలస్తీనా రచయిత మహమ్మద్ దర్వీష్ తాను మెచ్చిన రచయితలంటాడు అరెఫ్ అక్రెజ్. అమ్మార్ తబ్బాబ్, అరెఫ్ అక్రెజ్‌ల కవితావస్తువు అంతర్యుద్ధం, అది సృష్టిస్తున్న నష్టం. ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్ఐఎస్) అనే తీవ్రవాద సంస్థ అలెప్పోలో అత్యధిక భాగాన్ని చేజిక్కించుకున్న ఫలితంగా, అరెఫ్ సిరియాను సంవత్సరం క్రితం వదలివెళ్ళాడు. విప్లవకారుల్లో ప్రముఖ కవి అమ్మార్ ఒకటిన్నర సంవత్సరం క్రితం డమాస్కస్‌కు పారిపోయాడు. అతనికి పాలకుల నుంచి హెచ్చరికలు వచ్చాయి. ప్రవాసంలో వుండి రచనలు చేయడంపై స్పందిస్తూ అరెఫ్ "ఇక్కడ వుండి నాకిష్టమైనది నేను రాసుకోవచ్చు. ఇక్కడ మేం స్వేచ్ఛాజీవులం" అన్నాడు. అయితే "సిరియా లేకుండా సిరియన్ కవిత్వం వుండదు" అని కూడా అన్నాడు. అరెఫ్ తన మణికట్టు నుండి మోచేయి వరకు అరబిక్ లిపిలో ఒక వాక్యాన్ని పచ్చబొట్టుగా రాయించుకున్నాడు. అది ప్రముఖ కవి మహమ్మద్ దర్వీష్ రాసిన కవితలో ఒక పాదం "రేపటి వరకు సమయం లేదు" అనే అర్థం ఇస్తుంది.

"సిరియా కోసం శోకగీతం" అనే కవితకు 2017 బెట్జ్మాన్ కవితాబహుమతి లభించింది. 10-13 ఏళ్ళ వయసు రచయితలకు ఇచ్చే ఈ బహుమతి 2017లో అమినెఅబు కెరిచ్ అనే 13 ఏళ్ళ సిరియన్ శరణార్థి బాలికకు లభించింది. దీనిని ఆమె సగం ఇంగ్లీషులోనూ, సగం అరబిక్‌లోనూ రాసింది. ఈ జాన్ బెట్జ్మాన్ (1906-1984) ఇంగ్లండ్‌లో 1972 నుండి 1984 వరకు ఆస్థాన కవి - జాతీయ కవి (Poet Laureate)గా వున్నారు. ఆయన పేరుతో స్థాపించిన కవితా ఫౌండేషన్ ప్రతి ఏడాదీ ఈ బహుమతులు ప్రకటిస్తుంది.

## సిరియా కోసం శోకగీతం

మా సిరియా పావురాళ్ళ కువకువలు
నా తలపై వినబడుతున్నాయి
వాటి అరుపులు
నా కళ్ళను పిలుస్తున్నాయి
నా కవితతోపాటు
ఒక దేశాన్ని చిత్రించాలన్నదే నా ప్రయత్నం
నా ఆలోచనలకు అడ్డురాని దేశాన్ని
సైనికులు తమ బూటుకాళ్ళతో నా ముఖాన్ని
పచ్చడి చేయని దేశాన్ని
చిత్రించాలని ప్రయత్నిస్తున్నా
నేనొక దేశాన్ని,
నేనే కవినైతే, నాకు సరిపోయే దేశాన్ని
కన్నీటి ప్రవాహమైతే నన్ను భరించే దేశాన్ని
గందరగోళాలు, యుద్ధం, ధ్వంసం, దైన్యం లేకుండా
ప్రేమ, శాంతి, సుగుణాలతో నిండిన
నగరాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తున్నా!
ఓ సిరియా! నా ప్రియతమా!
ద్వేషంతో చీలిపోయిన నీవు
శాశ్వతంగా స్వేచ్ఛ పొందాలి
చమురు కోసం
అసత్యాలతో చెలరేగే యుద్ధాలు జరుగుతుంటే
నీవు స్వేచ్ఛగా వున్నట్లు భావించడం తెలివితక్కువ
వ్యక్తిగతంగా, మతపరంగా నీవు
స్వార్థపూరితంగా ప్రవర్తిస్తున్నావు
ఇలా ఎందుకు జరుగుతోందో
నీకు నీవే ప్రశ్నించుకో
నీ మానవత్వం
అక్కడ సమాన దృష్టితో వుందా?

అంతర్యుద్ధం సిరియా కవిత్వ రంగంలో ఒక నూతన వెల్లువను సృష్టించింది. సాంఘిక మాధ్యమాలలోనూ, వీధుల్లోనూ అది ఎల్లెడలా విన్పిస్తోంది. రోజురోజుకూ పెరిగే మరణాలను సృష్టిస్తున్న అంతర్యుద్ధం కాలంలో సిరియా ప్రజల గొంతు లోతుల్లో నుంచి వస్తున్న కవిత్వం సిరియా సాహిత్య చరిత్రలో ఎన్నడూ లేదు. కొన్నేళ్ళ క్రితం కూడా ఇటువంటి సాహిత్యం వస్తుందని ఎవరూ వూహించలేదు. మధ్యప్రాచ్యంలో వాక్స్వాతంత్ర్యంపై జరిగే దాడులపై పరిశోధించిన సిరియన్ రచయిత ఘియాస్ ఆల్ జుండి ప్రకారం సిరియన్ బూడిద నుండి ఎంతో బలమైన, అందమైన కవిత వస్తోంది. విప్లవానికి ఉన్న సాంస్కృతిక కోణం చాల ప్రకాశవంతంగా వుంది.

అర్కన్సాస్ విశ్వవిద్యాలయంలో తులనాత్మక సాహిత్యంపై అసోసియేటెడ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సిరియన్ అమెరికన్ రచయిత మోహ్జా కొహఫ్ 2001లో "సమకాలీన సిరియన్ సాహిత్యంలో స్థబ్దత" అనే వ్యాసం రాస్తూ, భయమూ, ప్రభుత్వ సెన్సార్‌షిప్, నిర్బంధం వారిని ఆ స్థబ్దతలోకి నెట్టాయని రాసింది. కాని ఇప్పుడు ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల వల్ల గత కొన్ని సంవత్సరాలుగా ఒక నూతన సిరియన్ వ్యక్తిత్వం, సాహిత్య సంప్రదాయం బయటకు వచ్చాయి.

ఈనాడు కవిత్వం సిరియాలో ఒక పెద్ద పాత్ర నిర్వహిస్తోంది. అన్ని ప్రదర్శనలలో, వీధుల్లో ఈ కవితలను ప్రజలు పాడుకుంటున్నారు.

హింస తీవ్రం కావడంతో శాంతియుత ఆందోళనల సంఖ్య తగ్గింది కాని పూర్తిగా అదృశ్యం కాలేదు, కవులు, రచయితలు దేశవ్యాప్తంగా అదృశ్యమౌతున్నారు. వారు ఒకవైపు పాలకులు, మరోవైపు ఇస్లామిస్టుల మధ్య చిక్కుకొని పోయారు. వారికి వ్యతిరేకంగా రాయడం, మాట్లాడటం అపాయకరంగా మారింది. 2011 జులైలో కవి ఇబ్రహీం ఘఫీస్‌ను కిడ్నాప్ చేసి చంపేశారు. డియా అల్ అబ్దుల్లా, తాల్-తీ-మల్లొహి అనే ఇద్దరు కవులు జైల్లో వున్నారు. వారిని కలుసుకోడానికి లాయర్లకు అనుమతినీయడంలేదు. ఖలేద్ ఖాలిఫా అనే రచయితపై 2012 మే లో దమాస్కస్‌లో దాడిచేసి, ఆయన ఎడమచేతిని నరికివేశారు. కవులు, రచయితలకు ప్రాణభయమూ, జైలుకో ప్రవాసానికో వెళ్ళాల్సిన స్థితీ వుంది. వారు దేశం విడచి పారిపోయినా విదేశాల్లోనైనా వారిని చంపేస్తారు.

మాస్రి అనే కవయిత్రి "స్వేచ్ఛ : నగ్నంగా వస్తోంది" అనే కవితా సంపుటి ఇటీవల ప్రచురించారు. దీనిని ప్రచురించినందుకు ఆమెను చంపేస్తామని బెదిరింపులు వచ్చాయి. సిరియాలో ఆమె బంధువులు, మిత్రులు రహస్య జీవితంలోకి వెళ్ళారు.

మరికొందరు కవులు, ఇతర పేర్లతో రాయడం ద్వారా నిర్బంధాన్ని తప్పించుకుంటున్నారు. 2011 మే ముందు కవి సమ్మేళనాలను కూడా ప్రభుత్వం అదుపు చేసింది. కాని ఇప్పుడు సిరియన్ రచయితలు ఈ నిబంధనలను ధిక్కరిస్తున్నారు. బహిరంగసభల్లో పాల్గొని తమ కవితలు, గేయాలు చదువుతున్నారు. ✤

కవిత

# సకల జీవుల పూదోటరా నేల

- వంగర లక్ష్మీకాంత్

తెల్ల తుమ్మ తంగేడు కరక్కాయ ఊటలో
ఊరివచ్చిన తోలు చెప్పులా
వైరస్సు ధూళి మహా సముద్రంలో
మునిగి - నాని - ఈదివచ్చిన వాడా
వీరుడా - శూరుడా - మానవుడా!

కాష్టంబూడిద వళ్ళంతా పులుముకున్న శివుడిలా
సూక్ష్మక్రిమి సున్నం లోపలా - బయటా
తాపడం వేసుకుని ఊరేగుతున్న
నవ్య రుద్రుడివిరా నువ్వు
వీరుడా - శూరుడా - మానవుడా!

'కరోనా' ఓ చిన్న దుమ్ము కణం
దాన్ని చూసి కటకట - గడబిడ, యెబ్బే!
నిలబడి కట్టడి పెట్టలేక 'బేర్' మని
నిన్ను నువ్వే కట్టేసుకున్నావా ?
వీరుడా - శూరుడా - మానవుడా!

సకల జీవులకు -ఏక కణులకంటె ముందే పుట్టిన
నీ తాతకు తాత - ముని ముత్తాత
ఈ 'అల్ప - నిర్జీవ - జీవి', ఒట్టు! నీ తోబుట్టువే
నీకెందుకు ఖేదం మిగిల్చింది?
వీరుడా - శూరుడా - మానవుడా!

మట్టిని మట్టిగా - జీవిని జీవిగా జీవించనిచ్చావా?
ఆకలి - అడవి - ఆకాశంలోని చందమామ
నీ లాభాల పరుసవేది అయిన వేళ
నీవొక్కడివే సుఖంగా ఎలా బ్రతుకగలవు ?
వీరుడా - శూరుడా - మానవుడా!

స్వేచ్ఛగా పుట్టి సంకెళ్ళలో ఉన్నవాడా
బహిరంగ జైళ్ళలో మగ్గుతున్న మానవుడా
స్వగృహ నిర్బంధం - భౌతిక దూరం
పిరికి మందు - ఇప్పుడు నీకెందుకు?
వీరుడా - శూరుడా - మానవుడా!

రేచువలె - త్రాచువలె తరిమికొట్టి
మిసైలు వలే ధ్వంసించి - కణం కణానికి
శత్రు దుర్భేధ్య దుర్గం కట్టి కరోనాకి బహిరంగ ఖైదు
ఇవ్వగల ఏకైక 'శక్తి' ఎందుకు నీలో నిదురిస్తున్నది ?
వీరుడా - శూరుడా - మానవుడా!

లాభాల దండుకు ఆరోగ్యం అంగడి సరుకు
అందుకే నీతోబుట్టువును నీకే శత్రువుగా నిలబెట్టింది
నువ్వు మునకలేసిన మహాసముద్రం
విషపు క్రిముల పుట్టగా ముందుకు నెట్టింది
వీరుడా - శూరుడా - మానవుడా!

సార్సు - మెర్సు - ఎబోలా - కరోనా పేరేదైనా వైరస్సే
అది 'అల్ప - నిర్జీవ - జీవి' జీవనయాత్రే
దాన్ని నిలేసేది - తోకలు కత్తిరించేది
రోగ నిరోధక శక్తి - ప్రజారోగ్య యుక్తి
వీరుడా - శూరుడా - మానవుడా!

ఈ శక్తి - యుక్తులను హరించిన లాభాల దండు
అడ్డమై నిలిచి ఉన్నది, దాని నడ్డి విరుచు
వైరస్సు దండు కట్టింది - నువ్వు భుజం కలుపు
వైరస్సుల - సూక్ష్మజీవుల - సకల జీవుల పూదోటరా నేలా
వీరుడా - శూరుడా - మానవుడా! ✤

సంభాషణ

# కేపిటలిజం గుట్టు!

స్వేచ్ఛానువాదం : బి.ఎస్.రాజు

**కార్మికుడు** : అయ్యా! సోషలిస్టు గారు! ఈ భూమ్మీద యజమానులనే వారే లేకపోతే, నాకు పని ఎవరిస్తారు?

సోషలిస్ట్ : అవును మిత్రమా! నన్ను తరచుగా నలుగురు అడిగే ప్రశ్నయే ఇది. దీని సంగతేమిటో చర్చించాల్సిందేసుమా! పనిచేయాలంటే మూడు వ్యవస్థలు అవసరం – కర్మాగారం, యంత్రాలు, ముడిపదార్థాలు. అవునా ?

కార్మికుడు : అవును.

సోషలిస్ట్ : కర్మాగారాన్ని ఎవరు నిర్మిస్తారు ?

కార్మికుడు : తాపీ పనివారు, ఇతర భవన నిర్మాణ కార్మికులు

సోషలిస్ట్ : మరి యంత్రాలను ఎవరు తయారు చేస్తారు?

కార్మికుడు : ఇంజనీర్లు, టెక్నీషియన్లు, సాంకేతిక పనివారు

సోషలిస్ట్ : నువ్వు ఇప్పుడు నేస్తున్న బట్టకు అవసరమైన పత్తిని ఎవరు పండిస్తారు? నీ భార్య వడుకుతున్న ఉన్ని దారానికి కావాల్సిన ముడి ఉన్నిని గొర్రెల మందల నుండి ఎవరు సేకరిస్తారు? నీ కొడుకు పనిచేస్తున్న లోహ తయారీ, కమ్మరి పనిలో సమ్మెట దెబ్బల వాతపడే ఖనిజాలను వెలికితీసేదెవరు?

కార్మికుడు : వ్యవసాయదారులు, గొర్రెల కాపరులు, గని కార్మికులు – ఇంకా నాలానే పనిచేసే వారెందరో కదా! ఈ పనులు చేసేది.

సోషలిస్ట్ : మరి పలు విధాలుగా శ్రామికులు ఇప్పటికే కర్మాగారాలు, యంత్రాలు, ముడిసరుకులు సమకూర్చి పెట్టడం మూలంగానే కదా! నీవు, నీ భార్య, నీ కుమారుడు వీటిని ఉపయోగించుకుని పనిచేస్తున్నారు అవునా?

కార్మికుడు : ఔను కదా! నేసే మగ్గం, పండిన పత్తి లేకపోతే నేనెట్లా ముడి బట్ట నేయగలను?

సోషలిస్ట్ : ఐతే, నీకు పని కల్పించేది ఓ పెట్టుబడిదారుడో, ఓ యజమానో కాదుగా మరి. తాపీమేస్త్రి, భవన నిర్మాణ కార్మికులు, ఇంజినీర్లు, పొలం దున్నే రైతులు వీరు నీకు పని కల్పిస్తున్నది. ఇంతవరకు బాగానే ఉంది. కాని నీ యజమాని, నీ చేత పని చేయించుకునేందుకు కావాల్సిన సరంజామా అంతా ఎలా సేకరించినట్లు?

కార్మికుడు : అతడు అవన్నీ అతని సొంత డబ్బుతో కొన్నాడు.

సోషలిస్ట్ : అతనికి ఆ డబ్బెవరిచ్చారు?

కార్మికుడు : నాకెలా తెలుస్తుంది ఈ విషయం? అతని తండ్రి ఇతని కోసం కొంత సొమ్ము వదిలి వెళ్ళుండాల, దానితో ఇతను ఇప్పుడు కోటీశ్వరుడై ఉండవచ్చు కదా!

సోషలిస్ట్ : అతనేమైనా యంత్రాలపై పనిచేసి, నూలు ఒడికి, బట్టలు నేస్తాడా?

కార్మికుడు : అబ్బే! అలా కాదు స్వామీ! మాచేత పని చేయించడం ద్వారానే అతను కోట్లు సంపాదించాడు.

సోషలిస్ట్ : అయితే అతను గాలికి బలాదూర్‌గా తిరిగి కోట్లు గడించలేదు. ధన సంపాదనకు అదే ఏకైక మార్గం. అవునా? పనిచేసేవారికి పూటగడవటమే కనా కష్టం కదా! ఇప్పుడు చెప్పు మరి, నువ్వు, నీ తోటి కార్మికులు పని చేయకపోతే, మీ యజమాని యంత్రాలు తుప్పు పట్టిపోవా? గోదాముల్లో అతను నిలువబెట్టిన పత్తి, ఉన్ని బూజుపట్టిపోదా? పురుగులు పట్టి పాడైపోదా?

కార్మికుడు : అవును, మేము పనిచేయకపోతే కర్మాగారంలో సమస్తం గబ్బు పట్టిపోతుంది, సర్వం మూలనపడి కుప్ప కూలిపోతుంది. ఇదే వాస్తవం.

సోషలిస్ట్ : నిజానికి నువ్ పనిచేయడం ద్వారానే ఉత్పత్తి శ్రమకు కావాల్సిన యంత్రాలను, ముడిసరుకును నీవు సజావుగా కాపాడుతున్నావు.

కార్మికుడు : ఇది పచ్చి నిజం. కాని దీని గురించి నేనెప్పుడు ఆలోచించలేదు సుమా!

సోషలిస్ట్ : మీ కర్మాగారంలో ఏం జరుగుతుందో ఎల్లవేళలా మీ యజమాని చూసుకుంటాడా?

కార్మికుడు : అస్తమాటు కాదు గాని, మా యజమాని, రోజూ ఓ మారు మమ్ములను గమనించేందుకు ఓ చెక్కర్ కొడతాడు. ఐతే, చేతులు ఎక్కడ మైల బడతాయోనని, వాటిని పాంట్ జేబుల్లో కుక్కుకొని తిరుగుతాడు. నా భార్య, నా కొడుకు పనిచేసే నూలు ఒడికే పెద్ద మిల్లుల్లోనైతే యజమానులెప్పుడు కనిపించరు. యజమానులెవరో, ఎలా ఉంటారో కూడా పనివాళ్లకు తెలియనే తెలియదు. వారి నీడ కూడా ఎవరికి కనిపించిన దాఖలాలు లేవు. ఈ పరిశ్రమ 'డీ లిమిటెడ్' కంపెనీది. ఒకవేళ నువ్వు నేను ఓ 500 ఫ్రాంకులు (సొమ్ము) ఆదా చేసుకోగల్గితే, మనం కూడా కంపెనీలో వాటాదార్లం అయి యజమానులైపోవచ్చు! అలా, అసలు మనం ఫ్యాక్టరీలో కాలు మోపకుండానే యజమానులైపోగలం తెలుసా?

సోషలిస్ట్ : ఐతే, ఒక్క ప్రశ్న. వాటాదారుల లిమిటెడ్ కంపెనీ యజమానులకు చెందిన మిల్లులో గాని, నువ్వు పని చేస్తున్న సొంత వ్యక్తి యాజమాన్య కర్మాగారంలో గాని రోజు వారి పనులు ఎవరు తనిఖీ చేస్తారు? ఎవరు ఈ పనులు నిర్వహిస్తారు? నిర్వహణ వ్యవహారాలు ఎవరు చూస్తారు?

కార్మికుడు : ఇంకెవరు ఫార్మెన్లు, మేనేజర్లు.

సోషలిస్ట్ : పనివారు కర్మాగారాన్ని కడితే, యంత్రాలను తయారుచేస్తే, వాటిని నడిపిస్తుంటే, ముడిపదార్థాలు వెలికితీస్తే, మేనేజర్లు, ఫార్మెన్లు పని పురమాయింపు, తనిఖీ, నిర్వహణ బాధ్యతలు చేపడుతుంటే మీ మాస్టర్, మీ యజమాని పని ఏమిటి మరి!

కార్మికుడు : ఆ! ఏమి లేదు! ఉత్తనే చేతులూపుకుంటూ లెక్చర్లు దంచటమే!

సోషలిస్ట్ : ఇక్కడి నుండి చంద్రమండలానికి రైలు మార్గముంటే (1903 నాటికి చంద్రమండలంపై మానవుడు కాలు మోపలేదు) ఈ యజమానులను తిరుగు టిక్కెట్ లేకుండా అక్కడకు పంపించేస్తే కొంపమునిగేదేమైనా ఉందా? నీ భార్య పనిచేసే నూలు మిల్లుకు కానీ, నీ కొడుకు పనిచేసే ఫౌండ్రికీ గాని వచ్చే నష్టమేమి ఉండదు సరిగదా, అవన్నీ సజావుగానే నడుస్తాయి. క్రితం ఏడాది నీ యజమాని సొమ్ము చేసుకున్న లాభమెంతో నీకు తెలుసా?

కార్మికుడు : మా లెక్క ప్రకారం ఓ లక్ష ఫ్రాంకులనైనా అతను గడించి ఉంటాడు.

సోషలిస్ట్ : ఎంతమంది పురుషులను, స్త్రీలను, పిల్లలను మీ యజమాని పనిలోకి తీసుకున్నట్టు?

కార్మికుడు : ఓ 100 మందిని

సోషలిస్ట్ : వారికిచ్చే సాలుసరి కూలీ సొమ్మెంత?

కార్మికుడు : మేనేజర్లు, ఫోర్మెన్లు వేతనాలు కూడా లెక్క కడితే సాలుకు సరాసరి మనిషికి కూలి ఓ 1000 ఫ్రాంకులు ఉంటుంది. (ఇది 1903 సంగతని గుర్తుంచుకోవాలి)

సోషలిస్ట్ : అంటే, ఏడాది పొడుగునా రెక్కలు ముక్కలు చేసుకుంటే మీ 100 మందికి కలిపి వచ్చే మొత్తం కూలి వేతనం లక్ష ఫ్రాంకులు. బొటాబొటిన పొట్ట నింపుకోడానికైతే, ఆకలితో చావకుండా బ్రతికి వుండడానికైతే, ఏ ఉత్పత్తి శ్రమా చేయని మీ యజమాని సునాయాశంగా ఓ లక్ష ఫ్రాంకులు నొక్కేసాడు గదా! అసలు ఈ రెండు లక్షల ఫ్రాంకులు ఎక్కడి నుంచి వచ్చాయి?

కార్మికుడు : ఆకాశంనుండైతే కాదు. డబ్బు వాన కురవడం నేనైతే ఎప్పుడు చూడలేదు.

సోషలిస్ట్ : కర్మాగారంలో పనిచేసే కార్మికులు జీతాలుగా పొందిన లక్ష, యజమాని జేబులోకి చేరిన లక్ష మొత్తం కలిపి రెండు లక్షల ఫ్రాంకులు కార్మికుల శ్రమ ఫలితమే కదా! యజమాని ఆయాచితంగా గడించిన లక్ష ఫ్రాంకుల సొమ్ము నుండే కొంత భాగం తిరిగి కొత్త యంత్రాలు కొనడానికి వినియోగిస్తాడు.

కార్మికుడు : అంతేకదా మరి! ఇందులో కాదనేదేముంది?

సోషలిస్ట్ : కార్మికుడు సొమ్మే నూతన యంత్రాలు, పరికరాలు కొనడానికి వినియోగించి వాటిని నడిపిస్తుంటే, మీలానే వేతన బానిసలైన ఫోర్మెన్లు, మేనేజర్లు ఉత్పత్తిని నిర్వహిస్తుంటే మరటువంటప్పుడు ఈ యజమాని ఎక్కడి నుండి ఊడిపడ్డాడు? ఇక దేనికోసమతను?

కార్మికుడు : దేనికోసమంటే, శ్రామికులను మరింత పిండటానికే.

సోషలిస్ట్ : అలా అనకు, అది సరికాదు. కార్మికున్ని నిలువెల్లా దోచుకోవటానికి అను, అదే సరైన ఖచ్చితమైన పదం మరి.


**(రచనా కాలం : సెప్టెంబర్, 1903,**
**'ది సోషలిస్ట్' అనే పత్రికలో ముద్రితం.**
**సేకరణ : మార్క్సిస్ట్ ఇంటర్నెట్ పత్ర (గ్రంథాలయం నుండి) ✤**

కవిత

# బాటసారులు

మూలం : అరవిందసిన్హా    అనువాదం : వి. రాధిక

బీదా బిక్కీ
సాదాసీదా జనం మేం.
ఈ దేశంలో!
బహుదూరపు బాటసారులమై
కాలినడకన బేగు సరాయ్ చేరగలిగినప్పుడు
కాలే కడుపులతో బెనారస్ చేరగలిగినప్పుడు
నడిచి నడిచి మేం బిడ్డా పాపలతో
మాన్సర్, రాంచీ, బస్తర్.... దేశంలో ఏ
మూలకైనా
దూరదూర తీరాలకు మేం చేరగలిగినప్పుడు
గుర్తుంచుకోండి మీరంతా!
మా కళ్ళముందు తెరలు తొలగుతున్నాయి
నేడు
వెల్లువలా ముందుకు సాగే పోరాట తరంగాలమై
కాలం కట్టిన కత్తుల వంతెనలను దాటి
తప్పక ఏదో ఒకనాటికి
దూరాలన్నిటినీ అధిగమించి
సామ్యవాద గమ్యాన్ని మేం చేరడం తథ్యం! ✤



# బాల సాహితి

## ప్రకృతి పాఠాలు

**- 'బాలబంధు' అలపర్తి వెంకట సుబ్బారావు**

ప్రకృతే చెబుతోంది
పాఠాలు మనకు !
సారాంశమును తెలిసి
సాగించు బ్రతుకు ॥

సూర్యుడే శ్రమశక్తి
సూచించు మనకు !
చంద్రుడే సౌమ్యతకు
కేంద్రమ్ము మనకు ॥

సముద్రం ధైర్యాన్ని
సమకూర్చు మనకు !
చేరు పై స్థాయికని
చెప్పేను నింగి ॥

ఓర్పుగా ఉండమని
నేర్పేను నేల !
పరులకై తను తానె
బలియగును అగ్ని ॥

పరుల మేలునుకోరి
కురిసేను వాన !
విశ్వహిత మాశించి
వీచేను గాలి ॥

కూత నేర్పెను కోడి
ఈత నేర్పెను చేప
పాట నేర్పెను పికము
ఆట నేర్పెను నెమలి ॥ ✤

## భవిష్యత్తుకు మార్గం చూపించిన కుందేలు

**- అక్షర, 3వ తరగతి**

**అది** నల్లమల్ల అడవి. అక్కడ జంతువులు ఎప్పుడు సంతోషంగా ఉండేవి. అన్ని జంతువులతో పోలిస్తే కుందేలు అందరికన్నా తెలివిగా, ఉపాయంగా ఉండేది. అంతే కాదు భాషలు తెలిసినది. అంటే మనుషుల భాష ఇంకా 24 భాషలు కూడా వచ్చు. ఒక రోజు అది తిరుగుతూ ఉంటే అది కొంతమంది మనుషులు మాట్లాడుతుండగా వినసాగింది. ఒక మనిషి ఏమని చెప్పాడంటే, ఇక్కడ యురేనియం బాగా ఎక్కువగా ఉంది, ఇక్కడ మనం తవ్వడం మొదలుపెడదాం అని. సరేనని అందరు కలిసి అన్నారు. ఈ కుందేలుకు మానవుల భాష కూడా తెలుసు కదా. యురేనియం తవ్వితే నీళ్ళు కలుషితం అయ్యి, క్యాన్సర్ వచ్చి అన్ని జంతువులు చచ్చిపోతాయి అని తన స్నేహితులకు వివరించింది అందరు కలిసి సింహం రాజు దగ్గరకు పోయి ఈ విషయం చెబుదామని నిర్ణయించుకున్నాయి. అవి రాజు దగ్గరకు పోయి యురేనియం తవ్వుతారు అని చెప్పింది. అప్పుడు సింహం వాళ్ళు తవ్వితే మనకేంటి అనింది దానికి కుందేలు వెంటనే యురేనియం తవ్వితే అన్ని జంతువులు చచ్చిపోతాయి అని వివరంగా చెప్పింది. సింహం వాళ్ళని ఒకసారి బెదిరించి చూద్దాం అని చెప్పింది. సరేనని అందరు కలిసి వెళ్ళి, వెళ్ళిపోమని చెప్పాయి. దానికి మనుషులు ఏమన్నారంటే మీరు ఏమి చేయలేరు. మా దగ్గర పెద్ద, పెద్ద గన్నులున్నాయి కాల్చామంటే అందరు ఒక్కసారికి చచ్చిపోతారు మీరే వెళ్ళిపోండి అని చెప్పారు. అప్పుడు జంతువులు సమావేశం పెట్టుకున్నారు. కుందేలు మనం ఇంకొక్కసారి చెబుదాం విన్నారా ! సరే, లేదంటే మనం ఒక లోతు గుంట తవ్వి దానిపైన మట్టిరంగులో ఉండే పట్టా పెడదాం అని చెప్పింది. మళ్ళీ ఇంకొక్కసారి అడిగారు. దానికి వాళ్ళు ఒక్కసారి చెప్పితే అర్థం కాదా ! అన్నారు అంతే గన్నులు తీసుకున్నారు దూరం నుంచి కాల్చుతే ఏమి కాదు అందుకని దగ్గరకు వచ్చారు. గుంటలో పడ్డారు. అప్పుడు వాటికి సంతోషం వచ్చింది. ఆ తర్వాత రాజు కుందేలుని మంత్రిగా ప్రకటించాడు. ✤

# ఎన్నాళ్ళీ అన్యాయం

**- ఎస్. అశ్వని**

**ఆడది** అమ్మ వంటిది. కాని ఇప్పుడు ఆమె మీద ఎన్నో అన్యాయాలు అక్రమాలు జరుగుతున్నాయి. ఎలా అంటే పూర్వం రామాయణంలో రాముడు సీతమ్మను అడవులపాలు చేశాడు కదండి. రామాయణంలో రాముడు దేవునిగా పేరు పొందినా కాని సీతమ్మను మాత్రం అగ్నిప్రవేశం చేయించాడు. అయినా చెప్పుడు మాటలు విని రాముడు అలా చేశాడు. కానీ మన తాత, నాయనమ్మలు మాత్రం అతన్ని ఇప్పటికీ దేవునిగానే కొలుస్తున్నారు. ఇది నిజమేనంటారా? రాముడు నిజంగా దేవుడా? అసలు దేవుడు ఉన్నాడంటారా? దేవుడు ఉన్నాడే అనుకుందాం ఆడవాళ్ళపై ఇన్ని అన్యాయాలు, అక్రమాలు జరుగుతుంటే చూస్తూ ఉన్నారని అంటారా? సరే అదే అనుకుందాం. పాండవులు కౌరవుల మధ్య జూదంలో ద్రౌపదిని పాండవులు ఫణంగా పెట్టారు కదండి. ఎంతో శక్తిసామర్థ్యాలు ఉన్న పాండవులు ఆడదాన్ని అడ్డుగా పెట్టుకోవచ్చుండి. పోనీ ఆ దుర్యోధనుడు, దుశ్శాసునుడు వాళ్ళ అమ్మలాంటి వదినను ద్రౌపదిని వస్త్రాపహరణం అనే నిచమైన పని చేయాలనుకున్నారు. ఇలా ఆనాటి నుండి ఈనాటి వరకు ఆడపిల్లలపై హత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునేవారే లేరు. కష్టాలలోనూ, కన్నీళ్ళలోనూ మగవాళ్ళ పట్ల ఆడది అమ్మవలే ఉంటుంది కదండి. అటువంటి ఆడదాన్ని ఎందుకండీ ఇంత నీచమైన ఆలోచనలతో ఆమె శరీరాన్ని దక్కించుకోవాలనుకుంటున్నారు. 3 సంవత్సరాలు అయిన పసిబిడ్డ అని కూడా చూడకుండా ఆ బిడ్డకు చిన్న వయస్సులోనే మారణాపాయస్థితికి తెప్పిస్తున్న ఈ మూర్ఖపు ఆలోచనలు మానరా?

ఈ సమాజం ఆడదాన్ని అమ్మలా చూసేది ఎప్పుడు ? తరాలు మారినా, యుగాలు మారినా ఆడదానిపై అన్యాయాలు, అక్రమాలు జరుగుతూనే ఉండాలా? ఈ అలవాటు మార్చేవారు ఎవరూ లేరా? మగ, ఆడ, అనే భేదం చూపిస్తున్న ఈ సమాజం మారదా ? లేకపోతే ఇవన్నీ మారాలంటే మరికొందరు ఆడవాళ్ళు అన్యాయాలతో చనిపోవాల్సిందేనా: ఆడపిల్ల ఇల్లు దాటాలంటే బాధ. ఎక్కడ ఈ మగపురుగులు వాళ్ళను చిత్రవధలు చేస్తారోమోనని భయం ఉన్నా, బాధ ఉన్నా ఆమె బయటకువచ్చి ఇది తప్పు అని ఎదిరిస్తే ఆమెను నీచమైన మాటలతో హింసిస్తుంది ఈ సమాజం. ఇలా ఆడవాళ్ళపై అన్యాయాలు పెరిగితే అప్పుడు ఆడది ఇలా ఉండేదట అని మ్యూజియంలో చూడాల్సివస్తుంది. కాబట్టి మనం మారుదాం. రేపటి ఈ సమాజాన్ని మార్చుదాం. ✤

# కరోనా కవిత

**- సంఘమిత్ర, బాలసంఘ సభ్యులు**

**కరోనా** వచ్చింది
ముక్కుకు మాస్క్ వేసింది
మనుషులను దూరం పెట్టింది
షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవద్దంది
దండాలు పెట్టుకోమనింది
లాక్‌డౌన్ పెట్టారు
ఇంట్లో ఉండమన్నారు
బయటికి రావద్దన్నారు
వలస కూలీలకు కష్టాలు
లాభదారులకు నష్టాలు
మంచి తిండి తినమన్నారు
తిండి దొరకక చస్తున్నారు ✤

# పిల్లల కవిత

**- సంఘమిత్ర, బాలసంఘ సభ్యులు**

పిల్లలూ పాలపిట్టలు
పిల్లలూ తాటిముంజలు
పిల్లలూ చింపిరి గుడ్డలు
పిల్లలూ ఆణిముత్యాలు
పిల్లలూ వెన్నముద్దలు
పిల్లలూ పంచదార చిలుకలు
పిల్లలూ శిల్పి చెక్కిన బొమ్మలు
పిల్లలూ మీరు పిడుగులు
పిల్లలూ వాన చినుకులు
పిల్లలూ శ్రమజీవుల చెమట చుక్కలు
పిల్లలూ సముద్రపు ఆలుచిప్పలు
పిల్లలూ మట్టిలోని మాణిక్యాలు
పిల్లలూ చీపురుకట్ట పుల్లలు
పిల్లలూ టపాకాయలు
పిల్లలూ సంఘమిత్ర మొగ్గలు ✤

కథ

# మే నెల మొదటిరోజున

(స్వతంత్ర రచన 1947)

పి. లక్ష్మికాంత మోహన్

పమిడిముక్కల లక్ష్మికాంత మోహన్ పాతతరం సాహితీ ప్రపంచానికి షేక్స్పియర్స్ మోహన్‌గా పరిచయం. 8వ తరగతి (థర్డ్ ఫారం) వరకే చదివి, ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ సభ్యుడై, బుర్రకథ లాంటి ప్రజాకళారూపాలపై పట్టు సాధించి, ప్రజాకళాకారునిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో నిబద్ధ కార్యకర్తగా కృషిచేశాడు. తెలంగాణలో నిజాంకు, భూస్వాములకు వ్యతిరేకంగా ఆ కాలంలో జరిగిన పోరాటాన్ని పోరాటకాలంలోనే 'సింహగర్జన' అదే నవలను రచించాడు. దీనినే ఇంగ్లీషులో 'తెలంగాణ థండర్స్' అనే పేరుతో తానే అనువదించగా, దీనికి ముందుమాట ప్రముఖ కవి, వామపక్షవాది హరీంద్రనాథ్ చటోపాధ్యాయ (హరీన్) రాశారు. ఎన్నో కథలు స్వయంకృషితో రచించాడు. జానపద సాహిత్యాన్ని సృష్టించాడు. షేక్స్పియర్ నాటకాలపై పట్టు సాధించి, వాటిలో 22 నాటకాలను సరళమైన తెలుగులోకి అనువాదించాడు. అవన్నీ ప్రస్తుతం ప్రజాశక్తి ప్రచురణాలయంలో దొరుకుతున్నాయి. అంతేగాక షేక్స్పియర్ పాత్రలపై ఆయన రాసిన విమర్శనాత్మక పుస్తకాన్ని నాగపూర్ విశ్వవిద్యాలయం తన ఎం.ఎ (ఇంగ్లీషు) విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా నిర్ణయించింది.

లక్ష్మీకాంత మోహన్ రేపల్లే తాలూకా వెల్లటూరు గ్రామానికి చెందినవాడు. బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఆయన వద్ద కొన్ని మెళుకువులు నేర్చుకున్నారు.

1949లో త్రిలింగ పబ్లిషింగ్ హౌస్, విజయవాడ వారు 'ఆత్మబలి' పేరుతో ప్రచురించిన లక్ష్మీకాంతమోహన్, 17 చిన్న కథల సంపుటి (క్రౌన్‌లో 140 పుటలు) ఇటీవల 'జనసాహితి' కార్యాలయానికి చేరింది. ఆ సంపుటి నుండి మే నెల మొదటిరోజున కథను పునర్ముద్రిస్తున్నాం. విదేశీయుల పేర్లుగల పాత్రలతో కూడిన ఈ కథ అనువాదం కాదు. లక్ష్మికాంతమోహన్ సొంతంగా రాసిన కథ.

ఆయన 1928లో జన్మించారు. 1995 మే 5న హైదరాబాదులో మరణించారు. ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా 1996 మే లో 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచికను ప్రచురించి వెల్లటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ఆవిష్కరించింది. ఈ సభకు వామపక్షవాది, ఉపాధ్యాయ నాయకుడు ఎం.జె.మాణిక్యరావు. బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ వక్తలుగా హాజరయ్యారు.

- సం ॥

అది అమెరికాలోని చికాగో నగరం; ఒకనాడు ఆ నగరంలోని పెద్ద బజారుగుండా యొక ముసలి కార్మికుడు పరుగెత్తుతున్నాడు. ఆ పరుగెత్తటంలో అతనొక గుర్రపుబగ్గీ కింద పడేవాడయ్యేడు; కాని కొద్దిలో తప్పిపోయింది. 'తాగుబోతు ముండాకొడకా' అంటూ బండితోలే మనిషి కాండ్రించి వూసి గొణుక్కుంటూ బండి తోలుకుపోయేడు.

అతను యిదేమీ వినకుండా పరుగెత్తుతున్నాడు. పక్కనే జర్ మంటూ కార్లు దూసుకు పోతున్నాయి. అతను తొడుక్కున్న లాగు ఆ తొందరలో పిర్రల కిందకి జారుతోంది. పాత బూట్లు తాళ్లు తెగి కాళ్ళ నుండి జారిపోతూ తపతప కొట్టుకుంటున్నాయి. వుండివుండి అతను ఆ రోడ్డుమీద బోర్ల పడ్డాడు. పక్కనే ఒక షాపులోని లావాంటి స్త్రీ యిది చూసి పక పక మనింది. అతను లేచి, ఆ స్త్రీ వంక గుడ్లురిమి చూసి, తిరిగి పరుగు లంకించుకొన్నాడు. కాని, మోచిప్పలు కొట్టుకొని పోనియ్యేమో అతను బాధతో పరుగెత్తలేక, కొంగనడక పుచ్చుకున్నాడు.

కొంతసేపటికి యెలాగైతేనేం ఫ్యాక్టరీ వద్దకి చేరుకున్నాడు. అప్పుడే గేటు తలుపులు గటుక్కున మూసుకున్నాయి! ఆయాసంతోనూ, ముసలితనపు బలహీనతవల్లా అతను నీరసంగా అక్కడే కూలబడినాడు.

ఆ ఫ్యాక్టరీ ఇనుప పరిశ్రమకి సంబంధించింది. అక్కడ రకరకాల యినుప సామాగ్రి తయారుచేస్తారు.

* * *

1880 నాటికి అమెరికాలో చాలా మిల్లులూ, ఫ్యాక్టరీలూ యేర్పడినాయి. యెన్నో వస్తువులు గుట్టలుగుట్టలుగా తయారుచేసేరు. అంతకు చాలా పూర్వమే అమెరికాకి యితర దేశాలకీ వ్యాపార సంబంధమయిన రాకపోకలుండేవి. ఈ సౌకర్యాన్ని బాగా ఉపయోగించుకొని, లాభాలు తియ్యాలనే రాక్షసి దాహం అప్పుడప్పుడే వృద్ధినందుతూన్న ఆ పారిశ్రామికులకి గలిగింది. దాంతో రేయింబవళ్ళు స్త్రీలతోనూ, ఆఖరికి పిల్లలతో గూడా పనిచేయించ నారంభించేరు. గడ్డివామిలో పడిన నిప్పురవ్వ యెలాంటిదో వృద్ధిపొందుతూన్న పారిశ్రామికుల ఆశ అలాంటిది.

* * *

ఆ ముసలి కార్మికుని పేరు విల్లియం; అతను పొడగరి; కాని లావుపాటి మనిషి. అతని ముఖం కోలగా వుంది; వొత్తుపాటి కనుబొమలు; బట్టతల; గడ్డం వుంది. వాటిలో అక్కడక్కడా తెల్లని వెంట్రుకలున్నాయి. యెండచేతా, పనివల్లా అతని చర్మం బిరుసెక్కి గోధుమరంగుగా వుంది. అతని చిన్నని నీలివర్ణపు కళ్ళు యెర్రబడి వున్నాయి. వొత్తుగా వుండి పెదిమల్ని పూర్తిగా కప్పివేసిన మీసాల గుండా బుష్‌మనే ఆయాసం బయటికి వస్తోంది.

విల్లియం కాళ్ళుజాపి, పిర్రమీద కూచుని, నడుం బలహీనతవల్ల రెండు చేతుల్నీ వెనుక భాగాన నేలకానించి, మూసివున్న గేటువంక చూస్తో రొప్పుతున్నాడు.

ఇంకా పొద్దన్నా సరిగా పొడవలేదు. అప్పుడే గేటు మూసేరు. రోజుకి పన్నెండు గంటల పని! లోపల నుంచి కార్మికుల సుత్తిదెబ్బలూ, గుసగుసలూ, కరిగి పోతపోయ బడుతూన్న యినుము యొక్క బుస్సుమనే ధ్వనీ, మేస్త్రీల కస్సుబుస్సులూ – వినవస్తున్నాయి. బైటవున్న పెద్ద గొట్టాల నుండి వేస్తూన్న నల్లని పొగ ఆకాశాన్ని కప్పేస్తోంది.

కాసేపటికి ఆయాసంపోగా, విల్లియం లేచి గేటు వద్దకి తూలుతుపోయి, తలుపు మీద మెల్లగా చేత్తోకొట్టి దీనంగా 'అయ్యా యీ యేసుప్రభువు దాసుడికి తలుపు తియ్యండి బాబూ, అయ్యా తలుపు యేసునాధుడ్ని మరవమాకండి. అయ్యా....' అంటూ మొరపెట్టుకొన్నాడు.

ఆవిధంగా అతను చాలాసేపు అతి దీనంగా ప్రార్థించేడు, వుహూం – యెవరూ వినుపించుకోలేదు. లోన పనిచేసే ఒక కార్మికుడు సానుభూతితో గేటు కంతలోనుంచి తొంగిచూసేడు, అతన్ని చూచి విల్లియం అసూయతో ముఖం చిట్లించాడు.

వున్నకొద్దీ అతని వోర్పు తగ్గిపోతోంది. చిరాకూ, ఆవేదనా, భుగభుగలాడే కోపము పెరుగుతున్నాయి. ఇక ఆగలేక విల్లియం దభీదభీ ఆ గేటు తలుపుల్ని బాదసాగేడు, చేతులు నొప్పి పుడుతున్నాయి. దాంతో అతనికి కోపం హెచ్చుతోంది.

'తియ్యండి తలుపు. లేకపోతే తలుపులు పగలగొట్టేస్తా ఏమనుకున్నారో? నాకసలు కోపం రానేరాదు ఇక రాక రాక వచ్చిందంటే నన్ను బ్రహ్మరుద్రాదులు గూడా ఆపలేరు! తెల్సిందా? మర్యాదగా తియ్యండి తలుపు? అని బొబ్బరించేడు.

భౌవ్ వెవ్' మేనేజరు పెంచుతున్న బొచ్చుకుక్క లోపలనుంచి గేటు కంతలోగుండా మూతిపెట్టి మొరిగింది. విల్లియం దాని మూతిమీదొక చిన్న రాయి బెట్టి నూకేడు. ఖయ్యోం ఖయ్యోం అంటూ అది లోనికి పరిగెత్తింది.

మరుక్షణంలో పొట్టిగా దున్నపోతుకుమల్లే బలిసివున్న ఒక పోలీసు ఒక తెల్లగుర్రంమీదెక్కి వచ్చేడు. విల్లియం ఆ పోలీసుకి సాల్యూట్ చేసి 'సార్. ఏసుప్రభు భక్తుణ్ణి తలుపు తియ్యమనండి' అని వేడుకొన్నాడు. దానికి జవాబుగా ఆ పోలీసు చేతిలోని కొరడా విల్లియం వీపుమీద ఛెళ్ళుమంది. మెలికలు తిరుగుతూ చాపచుట్టగా విల్లియం పడిపోయేడు. గుర్రాన్ని పోలీసు అదలించేడు. టకటకమంటూ గుర్రం పరుగెత్తింది.

తర్వాత అనేకమంది కార్మికులు యితనిలాగే రొప్పుతూ రోజుతూ పరుగెట్టుకొచ్చేరు. మూసివున్న గేటునుచూచి మొదళ్లు నరికిన చెట్లకిమల్లే కూలబడిపోయేరు. సారాసీసా చేత్తో పట్టుకొని అందరికంటే ఆఖరున ఒక నడివయస్సు కార్మికుడొచ్చేడు. అతడు మస్తుగా తాగివున్నాడు. నెత్తిమీద టోపీ మెడవెనకాల వేలాడుతోంది. గుండీలు లేని చొక్కా చేతులు వూగులాడుతున్నాయి. అతని నోటిమూలల చొంగ కారుతోంది.

అతనన్నాడు; 'హేయ్, యీ షారాసీసా తాగండి, స్వర్గం చేరండి. అక్కడ ఆకలిబాధ లేదు.... పెళ్ళాంపోరు లేదు.... అక్కడిగూడా ఫ్యాక్టరీ మేనేజరొస్తే బుర్ర పగలగొడదాం.... అక్కడ గేట్లు మూసివుండవ్'

ఈ వాగుడికి కొంతమంది నవ్వేరు; మరికొంతమంది అసహ్యించుకొన్నారు; కొందరు మామూలుపనిగా చూసేరు.

ఆ కార్మికులంతా తలుపులు తియ్యండని బతిమాలారు; కేకలు బెట్టేరు; తిట్టేరు. తిమ్మేరు తలుపులు మాత్రం తెరుచుకోలేదు. ఆ తాగుబోతు కార్మికుడు సీసాలోని సారా చప్పగా తాగేసి, సీసాని గేటుకేసి కొట్టేడు; కొద్దికాలంలో తీవ్రమైన మత్తుతో అతను నేలమీద బోర్లగా పడిపోయేడు.

కార్మికులు అసంతృప్తితో, ద్వేషంతో తమలో తాము యిలా ఆవేశంతో మాట్లాడుకున్నారు.

'పాడు జీవితం!'

'మనకంటే యింకా మేనేజరెంబటుండే ఆ కుక్క మెరుగు, యేం ఛార్లెస్'?

'యిదుగో స్టూవర్ట్. యిదంతా యెందుకొచ్చిందో తెలుసా? మనకర్మ'!!

'ఆపు. యికనాపు. వోరినీ ముసలాడు తగలెయ్యా మెదిల్తే వేదాంతం యెత్తుతాడు. కర్మలూ గిర్మలూ తర్వాత చూడొచ్చు ముందు ముద్ద సంగతేంటో చూడు తాతా'

'తెల్లారుజామున లేస్తే పొద్దుగూకేదాకా యిక్కడే వుండాలయ్యే'

'యిక యింటికాడ పనిచేసుకునే తీరిక వుండదు'

'పైగా చాలిచాలని జీతం'

'నీగ్రోవాళ్లకంటే మనబతుకు కనాకష్టం'

'యెట్టాగోయ్‌మరీ? బతికేదెట్టా?'

'యెట్టాగేముంది? తూర్పుకు తిరిగి దణ్ణం పెట్టటమే!'

వోరేయ్ మాట. యీ గేటు కాపర్ని నాలుగు తన్నుదామంటారా?'

'వాడేం చేశాడు? అంతా మేనేజరు యిష్టం. వాడిదేముంది?'

'మరి అయితే యింకో ఫ్యాక్టరీలోకి పనికి పోదామా?'

'యెక్కడైనా యిదే యేడుపు!!'

'వొరెయ్ నామాట వింటారా? భో అని బిగ్గరగా అరుద్దాం పట్టండి'

యీ సలహా అందరికీ నచ్చింది. భోమని అంతా బొబ్బలు పెట్టేరు కాని తలుపులు తెరుచుకోలేదు. యీ మ్రోతకి త్రాగుబోతు కార్మికుడు లేచి, యేదో తానుగూడా అరిచి, వాళ్లని తిట్టి తిరిగి పడుకొన్నాడు. విల్లియం యీ గొడవేమీ పట్టించుకోకుండా పరధ్యానిగా వున్నాడు.

రోజూ యిదేవరస టైముకి వొక్క నిముషం ఆలస్యంగా వచ్చినా ఫ్యాక్టరీలోనికి రానియ్యరు; లోనికొచ్చినవాళ్లని పొద్దుకూకముందే పోనియరు.

యీ కార్మికులు పగలల్లా పనిచేయటం వల్ల బడలికతో మత్తుగా పడుకొంటారు, ఇంతలో తెల్లారుజాము అవుతుంది. భోమని ఫ్యాక్టరీకూత వేస్తూంటుంది. కార్మికులు యిది వింటూనే వుంటారు. కాని లేవబోతే నరాలు నీరసంగా వుంటాయి; నడుము నొప్పిపెడుతూ వుంటుంది; తల దిమ్ముగా వుంటుంది; లేవలేరు, యెలాగో లేవగల్గినవాళ్ళు బూతులు తిట్టుకుంటూ వెళ్తారు. ఇక లేవలేనివారి గతి ఫ్యాక్టరీదాకా ఆశతో వచ్చి, మూసిన గేటుని చూసి నిరాశతో కొంపలకి చేరటమే వీరికి సరైన తిండి, బట్ట, యిళ్ళు, వైద్యసౌకర్యం యేమీలేవు.

అందరికిమల్లే విల్లియం కాళ్లీడ్చుకుంటో యింటికొచ్చేడు. అదొక చిన్న యిల్లు; రెండు గదులు మాత్రమే వున్నాయి; అవిగూడా యిరుకువి. వొక గదిలో ఇక్ష్వాకులనాటి పాత సామగ్రి వుంటుంది. రెండొదాంట్లో నెగడీ (వోవెకా) కుక్కిమంచాలూ వుంటాయి. ఆ యింటి చుట్టూ పందుల గూడుల్లాంటి కార్మికుల కొంపలు క్రిక్కిరిసి వుంటాయి.

విల్లియం రెండోగది తలుపుతీసి లోనికి బోయేడు. వొక కుక్కిమంచంలో అతని కూతురు (ఆమెపేరు జీనెట్) కొడుకు – పదినెలల పసిగందు – నిద్రిస్తూన్నాడు, విల్లియం కూతురు జీనెట్, అతని భార్యా ఫ్యాక్టరీలోకెళ్లేరు.

కిందకూచుని మనుమడిమీదికి వొంగి నుదురు మీద విల్లియం ముద్దు పెట్టుకున్నాడు. ఆ పసిపాప వొంటినిండా దద్దుర్లున్నాయి. మందిచ్చే దిక్కులేదు. ఆ పసిబిడ్డ తండ్రి విల్లియం అల్లుడు ఒక కార్మికుడు. క్షయవ్యాధితో అతను కాలంచేసేడు. అల్లుడు యెలాంటివాడు! అతడు వుంటే తనకి యే దిగులూ వుండేదిగాదు. అల్లుడు చనిపోయేప్పుడు ఆ పసిపాపకేసి చేత్తో దీనంగా చూపుతూ ప్రాణాలు వదిలేడు. ఇది తల్చుకోగానే ఆ ముసలివాని కళ్ళు నీళ్లతో నిండేయి.

విల్లియం భార్యపేరు మేరీ. ఆమె సన్నట్టి రోగిష్టి మనిషి ముక్కోపి, తక్కిన కార్మికులమల్లే ఆమె పొద్దుకూకినాక కూతురుతో యింటికొచ్చింది.

'లెగువ్ ముసిలితొక్కూ, పొద్దున్నే లెగిసి చావకుండా, యింకా నిద్రపోతున్నావా? దున్నపోతల్లే నువ్వు కూచుంటే, ఆడాళ్ళం నీకు చాకిరీచేసి పెడతామా? లెగవ్వేం యింకా?' అని మేరీ భర్తని లెగ్గొట్టింది. తాను తిండిలేమి వల్లా, బడలికతోనూ పొద్దుగూకేదాకా నిద్రపోయిన సంగతి విల్లియంకు తెలీదు. కళ్ళు నులుముకొంటూ లేచి, యెందుకని భార్య నడిగేడు.

'యెందుకా? నా బొందకి! నీతో మనాళ్లు మాట్లాడాలంటున్నారు. అందుకూ' మేరీ గుంజుకొంది. జీనెట్ తన పసివాడికి పాలిస్తోంది.

"యెందుకబ్బా?"

'యేమో'

కాసేపటికి బిలబిలమంటూ అనేకమంది కార్మికులు అతని యింటికొచ్చేరు. విల్లియం బేటికొచ్చి యేమిటని అడిగాడు.

'నువ్వు మేనేజరుతో మాటాడాలి తాతా'

'అమ్మో' మేరీ భయంతో తన యెదురు రొమ్ముమీద క్రాస్ చేసుకుంది.

"యేమని మాట్లాడాలి?"

'రోజుకి ఎనిమిదిగంటల పనే వుండాలని'

'నేనా? అమ్మో మేనేజరుతోనే!!!'

'ఫరవాలేదులే తాతా'

వెనకోసారి ఒకర్ని పంపించితే, అతడు మేనేజరు వద్ద నీళ్ళు నమిలేడు. కనక ఈసారి నమ్మకస్తుణ్ణి, ధైర్యంగలాణ్ణి పంపాలనుకున్నారు. అందుకు తగినవాడు విల్లియం అనుకొన్నారు.

చికాగో నగరంలోని అనేక ఫ్యాక్టరీల్లో పనిచేసే వేలమంది కార్మికులు యిలాగే సంప్రదించుకొని తమతమ ప్రతినిధుల్ని మేనేజర్ల వద్దకి పంపించేరు, వాళ్ల కోర్కెలు పూర్తిగా నిరాకరించబడినాయి.

తర్వాత యిక యిదిగాదని, ఆ ప్రతినిధులంతా కల్సుకొని 1886 మే 1వ తేదీన పనులు మానేసి తమ నిరసన తెల్పాలనుకున్నారు.

మే 1వ తేదీ దగ్గరకొస్తోంది. కాల్పులు జరుగుతాయని కార్మికుల గుండెల్లో గుర్రాలు పరుగెత్తుతున్నాయి, విల్లియం యింట్లో ఆడవాళ్లిద్దరూ భోరుమని యేడ్చారు.

ఐనప్పటికి ఒక నూతనోత్సాహం బయలుదేరింది. వీధి మొగల్లోనూ సారా దుకాణాలలోను, హోటళ్లలోనూ, యిళ్ళలోనూ – యెక్కడ కార్మికుడుంటే అక్కడ – వుద్రేకమైన చర్చలు జరుగుతున్నాయి.

చికాగో నగరానికి ప్రత్యేకమైన మిలిటరీ, పోలీసు సిబ్బందులొచ్చినాయి. బజార్లలో వీళ్లు విచ్చలవిడిగా తిరగసాగారు. యెక్కడచూచినా తుపాకీల చివర వుండే కత్తుల తళతళలే! గుర్రపు డెక్కల టకటకలే!!

మే 1వ తేదీ! ప్రభాత సమయం; ఒక యెర్రటి నిప్పుగోళం తూర్పున వుదయిస్తోంది, అప్పటికప్పుడె వీధులలోకొస్తూన్న వేలమంది కార్మికుల ముఖాల మీద ఆ యెర్రటి కాంతిరేఖలు నాట్యమాడుతున్నాయి. నగరానికి తూర్పున వున్న మిచిగాన్ సరస్సు నుండి గిజగిజలాడించే చలిగాలి రాసాగింది. బోనులలోనుంచి వదల బడిన పులుల్లాగ కార్మికుల ముఖాలు భీకరంగా వున్నాయి.

విల్లియం, మేరీలు గూడా ఆ గుంపులలో వున్నారు. వద్దన్నకొందీ. వుత్సాహంలో జీనెట్ తన పది నెలల పసికందుని చంకనేసుకొని వచ్చింది.

అనేక వేలమంది కార్మికులు – స్త్రీలు, పురుషులు, పిల్లలు – చికాగో వీధుల్ని నింపేశారు. ట్రాఫిక్ అంతా బందయింది. హోటళ్ళూ షాపులు, మోటారుశాలలూ – అన్నీ మూసుకున్నాయి, మేడల పై అంతస్తులలోనూ, కిటికీలవద్దా యెవరెవరో నుంచుని యీ చిత్రం చూడబోతున్నారు.

వీధి మొగలలో గుర్రపుదళాలూ, పదాతిసేనలూ వున్నాయి. మెయిను రోడ్డుకి వచ్చే కార్మికుల గుంపుల్ని ఆ దళాలు అడ్డుకున్నాయి. 'యెనిమిది గంటల పని! సరైన జీతం – కావాలి!!' ఆ గొంతుకలు గర్జించాయి చికాగో నగరం బ్రద్దలైపోయేట్లు ఆ గర్జన ప్రతిధ్వనించింది. జవాబుగా మిలిటరీవాళ్ళ తుపాకులు నోళ్ళు తెరుచుకొని వున్నాయి; ధన్, ధన్, ధన్, ధన్ వీధులు దద్దరిల్లిపోయాయి.

ముందుకు తోసుకొస్తూన్న కార్మికులలో, కొందరు మెలికలు తిరుగుతూ నేలమీద పడిపోయేరు, స్త్రీలు ఘొల్లుమన్నారు.

ఒక గుంపు విల్లియంతో పెద్దబజారుకి తోసుకొస్తోంది – అతని ముఖం గంభీరంగా వుంది; దవడలు బిగబట్టివున్నాయి. ఆ గుంపుని వొక ఫిరంగిదళం అడ్డుకొంది, కార్మికులు తటపటాయిస్తూన్నారు.

'పదండి ముందుకి' విల్లియం గాండ్రించేడు. కార్మికులంతా ముందుకు సాగేరు. పెంగ్.... పెంగ్.... పెంగ్.... ఫిరంగులు అగ్నిగోళాల్ని చిమ్ముతున్నాయి.

వొక గుండు విల్లియం మెదడుకి తగిలింది; తల పగిలి మెదడు బైటికి వచ్చింది. అతను పడిపోతూ 'పదండి ముందుకి' అని గర్జించేడు.

కార్మికులావేశంతో రెచ్చిపోయేరు. ఆజానుబాహుడైన ఒక కార్మికుడు, విల్లియంను కాల్చిన గుఱ్ఱపురౌతు పైకి లంఘించి, గుఱ్ఱాన్ని ముందుకాళ్ళు పట్టి యెత్తిపడేసి, ఆ రౌతుని పచ్చడిపచ్చడి చేసేడు. యెక్కడినుంచో వొక గుండు దూసుకొచ్చి అతని పొట్టకి తగిలింది. అతను దాన్ని లక్ష్యపెట్టలేదు.

'పదండి ముందుకి' మేరీ ముందుకు వురికింది. పెంగ్.... పెంగ్.... ఆమె పడిపోయింది.

'పదండి ముందుకు' జీనెట్ చంకలోని పసిబిడ్డతో సహా వుద్రేకంతో ముందుకు దుమికింది. వొక గుండు ఆమె గుండెకు తగిలింది; ఆమె పడిపోయింది. చంకలో పసిపాప దూరంగా పడిపోయాడు. ఆ పసిగందు తల పగిలింది ఎర్రని పసినెత్తురు నేలమీద చారికలు గడుతోంది. ఆ బిడ్డ కేరుమన్నాడు. దానిలో 'పదండి ముందుకి' అనే ధ్వని వుంది. గుఱ్ఱం మీద యెక్కిన వొక పోలీసు తన గుఱ్ఱంతో పసిపాపని తొక్కించేడు. ఆ పదినెలల నెత్తురుగుడ్డు చితపలు చితపలుగా చితికిపోయింది.

చికాగో నగర వీధులన్నిటా కార్మికుల వేడిరక్తం ప్రవహించుతోంది. 'పదండి ముందుకి' కార్మికులు గర్జిస్తూనే వున్నారు; కాల్పులు జరుగుతూనే వున్నాయి. ✤

## గోరంట్ల మధుబాబు

### 17వ వర్ధంతి



జననం : 25-9-1960 | మరణం : 30-6-2003

**ఎం.టెక్** చదివిన గోరంట్ల మధుబాబు, ముంబాయిలోని సిడ్కో (CIDCO)లో సీనియర్ సూపరిండెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తూ, ఒక ప్రమాదంలో ముంబాయిలో 2003 జూన్ 30న తన 43వ ఏట మరణించారు. ఆయన 10వ వర్ధంతి సందర్భంగా (30.6.2013) వారి తండ్రి కీ.శే.గోరంట్ల వెంకటేశ్వరరావు, తల్లి గోరంట్ల వాణీదేవి, భార్య కల్యాణి, కూతురు మేఘ, కొడుకు సుహాస్ 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి 25 వేల రూపాయలు విరాళం ఇచ్చారు. గోరంట్ల మధుబాబును 17వ వర్ధంతి సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాం.

ప్రజాసాహితి

## గుత్తి సుందరమ్మగారు

### 7వ వర్ధంతి



**ప్రకాశంజిల్లా,** వేటపాలెం మండలం పందిళ్ళపల్లి గ్రామస్తులు గుత్తి నాగేశ్వరరావుగారి భార్య గుత్తి సుందరమ్మగారు 17 జూన్ 2013న పందిళ్ళపల్లిలో తన 68వ ఏట మరణించారు. వారి జ్ఞాపకార్థం భర్త గుత్తి నాగేశ్వరరావుగారు 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి 50 వేల రూపాయలు సుందరమ్మగారి మొదటి వర్ధంతి సందర్భంగా ఇచ్చారు. వారికి మా కృతజ్ఞతలు.

గుత్తి సుందరమ్మగారి 7వ వర్ధంతి సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాం.

ప్రజాసాహితి




# ‘ది గ్రేట్ హ్యాక్’ [2019]

– బాలాజీ (కోల్‌కతా)

“మీ ఫోన్లో మీకో ప్రచారం కన్పించినపుడు మీ ఫోను మిమ్మల్ని వింటోందని మీలో ఎంతమంది కనిపించింది?” – ప్రశ్నిస్తాడు డేవిడ్ కరోల్ తన క్లాసులోని విద్యార్థులతో. అమెరికాలోని పార్సన్స్ స్కూల్ ఆఫ్ డిజైనింగ్‌లో డిజిటల్ మీడియా అడ్వర్టైజ్‌మెంట్ల గురించి బోధిస్తుంటాడాయన. డేవిడ్ వేసిన ప్రశ్నకు విద్యార్థులంతా గొల్లున నవ్వుతారు. ఆయన కూడా వారితో కలిసి నవ్వేసి, ‘మన ఫోను మనల్ని కనిపెడుతూ వుండడం ఏమంత నవ్వులాట విషయం కాదు’ అని వివరిస్తాడు. మన స్వభావాన్ని, మన ఇష్టాఇష్టాల్ని కనిబెట్టి మన మీదికి గురిపెట్టి విసురుతున్న ప్రచారాలివి. ఇవి పెట్టుబడిదారుడి లాభాల కోసం ఉద్దేశించినవి. కానీ అంతకు మించి ‘వేసేది మీరు, వేయించెడిది మేము’ అన్న చందంగా మీ చేత బలవంతంగా ఒక ప్రత్యేక రాజకీయ పార్టీకి వోటు వేయిస్తేనో? అలా గెలిచిన పార్టీ మీ జీవితాలను ఛిన్నాభిన్నం చేసే నిర్ణయాలతో ముందుకు దూసుకుపోతేనో? ఇటువంటి భయంకర పరిస్థితిని పరిచయం చేస్తుంది ‘ది గ్రేట్ హ్యాక్’ (2019) అనే డాక్యుమెంటరీ సినిమా. ఆ సినిమాలోనిదే పైన చెప్పిన సన్నివేశం.




“పరస్పర సంబంధిత ప్రపంచం అన్న కలతోనే మొదలైంది ఈ కథంతా. ఒకరి అనుభవాలు మరొకరు పంచుకోవచ్చు. ఎవరూ ఒంటరితనంతో బాధపడరు అని కలగన్నారు. ఈ (సోషల్ మీడియా ఇంటర్నెట్) ప్రపంచం మన పెళ్లిళ్లు కుదిర్చింది, దేని గురించైనా తెలుసుకోవాలంటే సహాయపడింది, వినోదాన్నిచ్చింది, మన జ్ఞాపకాల సంరక్షకురాలైంది, అవసరమైనవేళ వైద్యుడిగా కూడా ఉపయోగపడింది. కానీ డిజిటల్ మీడియా గురించి బోధిస్తున్న నేను మరింత శోధించగా నాకో సంగతి తెలిసింది. మన ఆన్లైన్ యాక్టివిటీ అంతా ఎక్కడికో ఆవిరైపోవడం లేదనీ, అది నేడు మన మీదే ఏడాదికి ట్రిలియన్ డాలర్ల వ్యాపారం చేసే పరిశ్రమగా మారిపోయిందని నాకర్థమైంది. ఫ్రీ కనెక్టివిటీ అనే ఉచిత బహుమానం మనల్ని ఎలా దోపిడి చేస్తోందో మనకు సాధారణంగా అర్థం కాదు” – అని చెబుతాడు డేవిడ్.

కేంబ్రిడ్జ్ అనలిటికా అనే బ్రిటీష్ సంస్థ అమెరికన్ ఓటర్ల డేటాను ఫేస్ బుక్ ద్వారా సేకరించి, దాన్ని విశ్లేషించి, టార్గెటెడ్ పొలిటికల్ అడ్వర్టైజ్‌మెంట్ల ద్వారా అమెరికన్ ఎన్నికలను ప్రభావితం చేసి ట్రంప్‌ను గెలిపించిందని 2018లో పెద్ద దుమారం చెలరేగింది. ఇది కేంబ్రిడ్జ్ అనలిటికా కుంభకోణంగా ఖ్యాతి గాంచింది. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ యునైటెడ్ స్టేట్స్ ప్రత్యేక కమిటీ ముందు ముద్దాయిలా నిలబడి సెనేటర్ల ప్రశ్నలకు బదులు చెప్పాల్సిన స్థితి కూడా వచ్చింది. ఆ నేపథ్యంలో తయారైన పరిశోధనాత్మక డాక్యుమెంటరీ ‘ది గ్రేట్ హ్యాక్’. కంప్యూటర్‌ను ఉపయోగించి అనుమతి లేకుండా అక్రమంగా సమాచారం దొంగిలించడాన్ని ‘హ్యాకింగ్’ అంటారు. అటువంటిది సోషల్ మీడియా నడుపుతున్న సోషల్‌మీడియా సంస్థే తన వినియోగదారుల సమాచారాన్ని భారీ ఎత్తున హ్యాకింగ్ చేసిందన్న మాట! అందుకే ఈ సినిమాకు ఆ పేరు. జరిగిన ఉదంతాన్ని వెలికితీసి విప్పిచెప్పిన ప్రధాన పాత్రధారులు ఈ సినిమాలో కొందరున్నారు. వారి వివరాలు చెప్పేముందు కేంబ్రిడ్జ్ అనలిటికా పూర్వాపరాలు కొంచెం చూద్దాం.

## కేంబ్రిడ్జ్ అనలిటికా సంక్షిప్త చరిత్ర :

టీవీ ప్రచారాలు రూపొందించే పనిలో భాగంగా సమూహాల మనస్తత్వాలను మలిచే పరిశోధనలు చేసే ఎస్ సి ఎల్ గ్రూప్ (అనగా స్ట్రాటజిక్ కమ్యూనికేషన్ లేబరేటరీస్ (గ్రూప్) అనే ప్రైవేటు సంస్థను 1993 లో నిగెల్ ఓక్స్ అనే బ్రిటీష్ దేశస్థుడు ఏర్పరచాడు. సమూహాల ప్రవర్తనను అధ్యయనం చేస్తూ, దాన్ని ప్రభావితం చేసే వ్యూహాలు రూపొందించే వ్యాపార ప్రచారరంగాన్ని దాటి, 1990లలోనే ప్రపంచ వ్యాప్తంగా సైనిక రాజకీయరంగాల్లో కూడా పనిచేయడం ప్రారంభించింది ఈ సంస్థ. అమెరికా ఎన్నికల వ్యవహారం చూడడం కోసం కేంబ్రిడ్జ్

అనలిటికా అనే అనుబంధ సంస్థను 2012 లో ఏర్పరిచింది. 'ఏజెంట్ ఆరెంజ్'ను తయారుచేసిన మన్సంటో విత్తనాలు, ఎరువుల కంపెనీగా ఎదిగిన లాంటి చరిత్రే 'ఎస్ సి ఎల్ – కేంబ్రిడ్జ్ అనలిటికా'ది కూడా అని మనకర్థమౌతుంది. 2016లో యుఎస్ రిపబ్లికన్ నామినేషన్ను గెలుచుకోవటానికి టెడ్ క్రజ్ కేంబ్రిడ్జ్ అనలిటికా సేవల్ని వినియోగించు కుంటూ వచ్చాడు. ఫేస్‌బుక్ డేటా సహాయంతో ఓటర్లపై నిఘా కొనసాగించింది ఈ సంస్థ. కానీ ఆ తర్వాత క్రజ్ ఆ రేసు నుండి తప్పుకున్న తరువాత, కేంబ్రిడ్జ్ అనలిటికా అదే వ్యూహాలను ఉపయోగిస్తూ డోనాల్డ్ ట్రంప్ 2016 యుఎస్ అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి సహాయ పడింది. 'ప్రాజెక్ట్ అలమో'లో భాగంగా అమెరికన్ ఓటర్ల డేటాను తవ్వితీసి, బ్రిటన్‌లోని అనలిటికా కేంద్రకార్యాలయానికి చేర్చి, అక్కడ ప్రాసెసింగ్, పరిశోధనలు చేసి, టార్గెటెడ్ మెసేజులు, వీడియోలు పంపిస్తూ అమెరికన్ వోటర్లను ప్రభావితం చేశారని ఈ సినిమా వివరిస్తుంది. యురోపియన్ యూనియన్ నుండి బ్రిటన్ వైదొలగడానికి ముందు జరిగిన బ్రెగ్జిట్ ఎన్నికలను కూడా ఇలానే హైజాక్ చేశారన్న విషయం కూడా వెలుగులోకొస్తుంది. ఊగిసలాటలో వున్న కొంతమంది అతి కీలకమైన ఓటర్లను తమ అభ్యర్థి వైపుకు తిప్పుకోవడంలోనే వుంటుంది అసలు కిటుకంతా.

ఈ సినిమా కొంతమంది ప్రధాన పాత్రధారుల చుట్టూ, వారి పరిశోధనలూ, పోరాటాల చుట్టూ సాగుతుందని ముందే చెప్పుకున్నాం. వారి కథల ద్వారా ఈ సినిమా కథ సాగుతుంది. ఆ పాత్రల వివరాలు చూద్దాం –

**1. డేవిడ్ కరోల్ :** ఈయన గురించి ముందే కొంత చెప్పుకున్నాం. ప్రతి అమెరికన్ ఓటరుపైనా తన వద్ద 5,000 డేటా పాయింట్లు ఉన్నట్లు కేంబ్రిడ్జ్ అనలిటికా మాజీ సీఈఓ అలెగ్జాండర్ నిక్స్ ఛానల్ 4 స్టింజ్ ఆపరేషన్‌లో బహిర్గతం చేసినప్పుడు డేవిడ్ కారోల్ దాన్ని సీరియస్‌గా పట్టించుకున్నాడు. ఇంగ్లాండులో డేటా గోప్యతపై నిపుణుడైన న్యాయవాది రవి నాయక్ సహాయంతో దొంగిలించిన తన డేటాను తనకు తిరిగి ఇవ్వమని డిమాండు చేస్తూ లండన్ హైకోర్టులో కేసు వేస్తాడు. ఇన్ఫర్మేషన్ కమిషనర్ కార్యాలయానికి పిర్యాదు చేస్తాడు. ఎస్ సి ఎల్ – కేంబ్రిడ్జ్ అనలిటికా సరైన జవాబు ఇవ్వనందుకు ఆ సంస్థపై ఇన్ఫర్మేషన్ కార్యాలయం 15,000 పౌండ్ల జరిమానా విధిస్తుంది. అంతేకాకుండా, ఈ కుంభకోణంలో 'పారదర్శకత లేకపోవడం, డేటా దొంగతనానికి సంబంధించిన భద్రతా సమస్యల' కారణంగా ఫేస్‌బుక్ కూడా 500,000 పౌండ్లు జరిమానా చెల్లించాల్సి వస్తుంది.

**2. కరోల్ కాడ్వల్లాడర్ :** మరో ముఖ్యమైన పాత్ర 'ది అబ్జర్వర్' కోసం పనిచేస్తున్న ప్రముఖ జర్నలిస్ట్ కరోల్ కాడ్వల్లాడర్. ఆమె మొదట కేంబ్రిడ్జ్ అనలిటికాపై దర్యాప్తు ప్రారంభించినప్పుడు, ఆమె పనిని కించపరిచేలా వైరల్ మీమ్‌లతో దాడి చేశారు. కానీ దేనికీ తల వంచకుండా కరోల్ తన అద్భుతమైన పరిశోధనాత్మక రిపోర్టింగ్ కొనసాగించింది. వాస్తవానికి బ్రెగ్జిట్ ఉదంతం ట్రంప్ 2016 కోసం ఉపయోగపడ్డ 'ప్రయోగ పాత్ర' (పెట్రి డిష్) అని అంటుందామె. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తులో ఎన్నడైనా స్వేచ్ఛాయుతమైన స్వచ్ఛమైన ఎన్నికలు జరుగుతాయా అని ప్రశ్నిస్తారావిడ. అనేక కోణాల నుండి వస్తున్న బెదిరింపులను లెక్కచేయకుండా ఆమె తన దర్యాప్తును కొనసాగిస్తుంది. ఆ ప్రయత్నాల్లో భాగంగా ఆమె క్రిస్టోఫర్ వైలీ అనే విజిల్–బ్లోయర్‌ని (మోసాన్ని బహిర్గతం చేసిన వ్యక్తిని) కలుస్తుంది.

**3. క్రిస్టోఫర్ వైలీ :** ఈయన కేంబ్రిడ్జ్ అనలిటికాను ఏర్పాటు చేయడంలో సహాయపడిన ఒక యువ డేటా శాస్త్రవేత్త. ఫేస్‌బుక్ నుండి స్క్రాప్ చేసిన యూజర్ డేటాతో సైకోగ్రాఫిక్ ప్రొఫైలింగ్ వ్యూహాలు తయారుచేశాడు. ఈ పనిలో ఆయనకు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అలెక్జాండర్ కోగన్ సహాయపడ్డాడు. "ఫేస్‌బుక్ యాప్స్ అందించే ప్రత్యేక పర్మిషన్ల ద్వారా వ్యక్తుల భోగట్టా అంతా రాబట్టే వాళ్లం. మీ స్నేహితుల జాబితాలోని ఒక వ్యక్తి మా ఉచ్చులో పడితే, మీరు కూడా మా ఉచ్చులో ఉన్నట్టే"అని చెబుతాడు వైలీ. "మేము మీ అప్‌డేట్స్, మీ ఇష్టాఇష్టాలు, కొన్ని సందర్భాల్లో మీ ప్రైవేట్ సందేశాల వంటివీ సేకరించాం. మేము మిమ్మల్ని కేవలం ఓటర్లుగానే లక్ష్యం చేసుకోలేదు, మీ వ్యక్తిత్వాన్నే దోచేశాం" అని వైలీ చెబుతాడు. 50 మిలియన్లకు పైగా వినియోగదారుల డేటా గోప్యతను ఉల్లంఘించినట్లు వైలీ వెల్లడిస్తాడు. అంతర్జాతీయ పరిశీలనను ఎదుర్కోవడమంటే మార్క్ జుకర్‌బర్గ్‌కు చెడ్డ భయమని వైలీ గేలి చేస్తాడు. తను చేసిన దానికి ప్రాయశ్చిత్తంగా కేంబ్రిడ్జ్ అనలిటికా కుంభకోణంలో సాక్షిగా మారి బ్రిటన్, అమెరికా విచారణల్లో నిర్భయంగా పాల్గొన్నాడు. తదనంతర కాలంలో 'మైండ్..క్' అనే పుస్తకంలో మరిన్ని విషయాలు రాసి ప్రజాసమక్షంలో పెట్టాడు.

**4. బ్రిటనీ కైజర్ :** ఈ సినిమాలో ఆమాటి కొస్తే ఈ కుంభకోణంలో ఈమెది చాలా ముఖ్యమైన పాత్ర. ఈమె కేరీర్ గ్రాఫ్ చూస్తే చాలా విచిత్రంగా అన్పిస్తుంది. మొదటి దృశ్యంలోనే ఒబామా అధ్యక్ష ఎన్నికల కోసం ప్రచారం చేస్తూ కన్పిస్తుంది. నిజానికి ఆ కాలంలోనే కేంబ్రిడ్జ్ అనలిటికా ఒబామా కోసం మొదటిసారి ఎన్ని(కలలో) పనిచేసింది. ఆ తర్వాత కైజర్ అమ్నెస్టీ ఇంటర్నేషనల్‌లో మానవ హక్కుల కోసం కూడా పనిచేసింది. 2015–18 మధ్య సి.ఇ.ఓ అలెగ్జాండర్ నిక్స్ ఆధ్వర్యంలో కేంబ్రిడ్జ్ అనలిటికా బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ హోదాలో పనిచేసింది. కాబట్టి ఈవిడ ఆ లోగుట్టులు బాగా తెలిసిన ఆవిడే. అనలెటికా కుంభకోణం బట్టబయలైనపుడు థాయ్‌ల్యాండ్ పారిపోయి, తన లొకేషన్ డివైసులు ఆపేసి దాక్కుంది. థాయిలాండ్‌లోని ఓ కొలనులో ఈత కొడుతున్న కైజర్ మనకు సినిమాలో కనిపిస్తుంది. గడ్డు పరిస్థితి వలన తీసుకున్న నిర్ణయమో లేక నిజంగానే హృదయ పరివర్తనో చెప్పలేం గానీ ఆమె కూడా విజిల్ బ్లోయర్‌గా మారుతుంది. సినిమా ఆరంభంలోనే ఆమె ఒక వెదురు శిల్పానికి విజిల్ కడుతుండే దృశ్యం చాలా ప్రతీకాత్మకంగా నిజమౌతుంది. పాల్ హిల్డర్ సహాయంతో ఆమె వాషింగ్టన్‌కు వచ్చి విచారణకు సహాయపడుతుంది. సెనేట్ జ్యుడీషియరీ హియరింగ్ కోసం మార్క్ జుకర్‌బర్గ్‌కు వేయాల్సిన ప్రశ్నలను

రూపొందిస్తుంది. 'యూజర్ల వ్యక్తిగత డేటాను తాకట్టు పెట్టడం ద్వారా ఫేస్‌బుక్‌కు ఎంత ఆదాయం వస్తుంది?' అని అడిగినప్పుడు, 'మొత్తం ఆదాయమంతా దాన్నుంచేగా' అని బదులిస్తుంది. "మా సృజనాత్మక బృందం మేము టార్గెట్ చేసుకున్న వ్యక్తులను ప్రేరేపించడానికి వారికి మాత్రమే ప్రత్యేకమైన కంటెంట్‌ను రూపొందిస్తుంది. మేము కోరుకున్న విధంగానే అవతలి వారు ప్రపంచాన్ని చూసేంత వరకూ మేము వారిపై (పర్సనలైజ్డ్ మెసేజింగ్ ద్వారా) దాడిచేస్తూనే వుంటాం" అని వివరిస్తుందామె. 2018లో ఈమె 'ఓన్ యువర్ డేటా' (మీ డేటాను మీరు స్వాధీన పరచుకోండి) అనే ఫేస్‌బుక్ ఉద్యమాన్ని ప్రారంభించింది.

**5. అలెగ్జాండర్ నిక్స్ :** ఈయన కేంబ్రిడ్జ్ ఎనలిటికా వ్యవస్థాపక సీఈఓ. ఒబామా తన ఎన్నికల్లో సోషల్‌మీడియాను షా వినియోగించాడు. ఆదిలో రిపబ్లికన్ అభ్యర్థులకు తమ ప్రచారాల కోసం సోషల్‌మీడియాను ఉపయోగించడం చేతనయ్యేది కాదు. కానీ ట్రంప్ ఎన్నికల కాలంలోనైతే ఈ పార్టీ అతి పెద్ద మోసకారి ఎత్తులే వినియోగించింది అనలిటికా సహాయంతో. ట్రినిడాడ్ – టొబాగో ఫుటేజిని చూస్తే ట్రంప్‌లానే నిక్స్ కూడా జాత్యహంకారి అన్న సంగతి మనకర్థమౌతుంది. ట్రంపూ, నిక్సూ దొందు దొందే. ఆ ఫలితాలు నేటి అమెరికాలో కన్పిస్తున్నాయి. విచారణ జరుగుతున్న సమయంలో ఎదురైన ప్రశ్నలకు నిక్స్ మహాశయుడు నీళ్లు నములుతున్న దృశ్యాలు మనకు పరమానందంగా వుంటాయి.

## ఎన్నికలను మలుపు తిప్పిన విధానం :

చాలాచోట్ల ఎన్నికల ఫలితాలు కొద్దిపాటి మార్జిన్లతోనే నిర్ణయమౌతుంటాయి. 2016 అమెరికన్ అధ్యక్ష ఎన్నికల విషయానికి వస్తే, కేవలం మూడు రాష్ట్రాలలోని 70000 మంది ఓటర్లు కీలక పాత్ర వహించారు. గాలివాటు ఓటర్లు కొందరుంటారు. వారిని 'పర్సుయేడేబుల్స్' (నచ్చజెప్పబడగలవాళ్లు) అని అభివర్ణిస్తుంది కైజర్. వారిని ఎలా మాయ చేశారో చెప్పే ఉదాహరణ ఒకటి సినిమాలో చూపారు. ట్రినిడాడ్ – టొబాగోలో చాలా మంది ఆఫ్రో-కరేబియన్ నల్లజాతి యువకులు, భారతీయ యువ వోటర్లు వున్నారు. నల్లజాతి వారిలో పైలా పచ్చీసుగా తిరుగుతూ ర్యాప్ పాడేవారూ, బ్రేక్-డాన్సు చేసేవారూ వున్నారు. అన్యథా వీరంతా డెమాక్రటిక్ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌కు వోటు వేసేవారే! వీరిని కేంబ్రిడ్జ్ అనలిటికా "దు సో" అనే నాన్-పొలిటికల్ ప్రచారంతో ఆకర్షించి ఓటును తిరస్కరించేలా చేసింది. నాన్-పొలిటికల్‌గా కనిపిస్తున్నదంతా హైలీ పొలిటికల్ అన్నది అవతలివారు తెలుసుకోలేక పోయారు. అందుకని ఓటు వేయకపోవడమే పెద్ద ప్రతిఘటనా చర్య అనుకున్నారు. ఇక, భారతీయ యువకుల విషయానికి వస్తే 'మీరు మీ తల్లిదండ్రులతో కలిసి ఓటు వేయడం ద్వారా మీ పెద్దలను గౌరవించండి' అన్న ప్రచారాన్ని చేరవేశారు. ఇవన్నీ మొబైల్ సెట్లలోకి వచ్చే మెసేజ్‌లు, వీడియోల రూపాల్లో వుంటాయి. ఈ విధంగా 18-35 సంవత్సరాల వయస్సు గల ఓటర్ల శాతాల్లో 40% తేడాను తెచ్చి మొత్తం ఓట్లలో 6% శాతం సమతూకాన్ని మార్చి ట్రంప్‌ను గెలిపించారు. ప్రజాస్వామ్యం అనే మేడిపండు పొట్టలోని పురుగుల ఆధునిక రూపం ఇలా వుంటుందని ప్రపంచానికి తెలిసివచ్చింది.

## నా డేటా నా హక్కు :

'డేటా ఈజ్ ది న్యూ ఆయిల్' అని అన్నాడు క్లయివ్ హంబీ. నూనె బావుల అవసరం తెలిసొచ్చిన తరువాత నూనె కోసం యుద్ధాలు జరిగేవి. ఈనాడు డేటా కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. డేటా వ్యాపారం కోసమే కాదు రాజకీయం కోసమూ అవసరమే. అందుకే ఇప్పటికే ప్రపంచంలోని అత్యంత ధనికుల జాబితాల లిస్టులో వున్న రిలయెన్స్ అంబానీకి తన దేశీయుల డేటా విదేశీయుల చేతుల్లో వుండడం నచ్చడం లేదు. ఆ డేటా తన కందితే మొత్తం వ్యాపారమంతా ఎంచక్కా తనే చేసుకోవచ్చు. డేటా కోసం ఓ సరికొత్త స్వాతంత్ర్య పోరాటమే అవసరం అనంటున్నాడు ముఖేశ్ భయ్యా. ఆయన మరోచోట చెప్పిన ప్రకారం – *"In this new world, data is the new oil. And data is the new wealth. India's data must be controlled and owned by Indian people and not by corporates, especially global corporations."* కేవలం ముడిచమురుతో పని కాదు. దాన్ని శుద్ధి చేసి ప్రయోగ యోగ్యమైన పెట్రోలియం ఉత్పత్తులు తయారు చెయ్యాలి. అలానే ఉత్త డేటాతో పని సాగదు. దాన్ని మనస్తత్వశాస్త్ర పనిముట్లతో సాగుచేసి, ఈ సినిమాలో చెప్పినట్టు 'సైకోగ్రాఫిక్ ప్రొఫైల్స్' ('మనస్తత్వాన్ని వివరించే జాతకాలు') తయారుచెయ్యాలి. దీనికి తోడుగా కృత్రిమ మేధస్సును వినియోగిస్తూ **సరుకుగా మారిన మనతో** ట్రిలియన్ డాలర్ల వ్యాపారాలూ, వారు కోరిన పార్టీకి ఓట్లేయించడాలూ చేయగలరు. ఇంకా మున్ముందు ఇంకెంత భయంకర కార్యక్రమాలు రూపొందిస్తారో ఇప్పుడే ఊహించలేము. అందుకే అన్నీ తెలిసిన డేవిడ్ కరోల్ లాంటి ప్రొఫెసర్లు **'నా డేటా నా మానవహక్కు'** అంటూ ఖండాంతరాలు దాటి కోర్టుకెక్కారు. కేంబ్రిడ్జ్ అనలిటికా 2018 లో దివాలా తీసెయ్యడంతో ఆయన డిమాండు చేసిన డేటా ఆయనకేనాడూ దొరక్క పోవచ్చు. కానీ భవిష్యత్తులో మరో భయంకర పరికల్పనతో మరో సంస్థ ముందుకురాదన్న గ్యారంటీ లేదు. మన డేటాతో మరో పన్నాగానికి వ్యూహరచన జరక్కమానదు. నేడు బహుళజాతి కంపెనీల కళ్ళన్నీ మన డేటాలపైనే!

## ఎన్నో దురాగతాలకు కారణమైన ఫేస్‌బుక్ :

కేంబ్రిడ్జ్ అనలిటికా వంటి సంస్థ తను చురుకుగా పనిచేసిన రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఏటా పది ప్రధాన మంత్రుల లేదా అధ్యక్షుల ఎన్నికల్లో పాల్గొనేది. ఆమెరికా, బ్రిటన్లే కాకుండా మలేషియా, రుమేనియా, ఘనా, నైజీరియా, ఇండియాల్లో కూడా ఎన్నికలను ప్రభావితం చేసింది. ఈ సంగతే కాకుండా ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాలు విభిన్న దేశాల్లో హింసలకూ, హత్యలకూ కారణమైన విషయాలను కూడా ప్రస్తావిస్తుందీ సినిమా. హానికరమైన కంటెంట్‌ను సకాలంలో తొలగించకపోవడం వలన ఈ మాధ్యమాలు బర్మాలో రోహింగ్యాల వూచకోతకు, 7 లక్షలమంది రోహింగ్యా ముస్లింల

ప్రవాసాలకూ కారణమయ్యాయి. అలానే శ్రీలంకలో ముస్లింల వూచకోతలకు, ఫిలిప్పీన్స్‌లో ప్రైవేటు హత్యలకు దోహదపడ్డాయి. బ్రెజిల్, కాంబోడియాల్లో దుష్ప్రచారాల ద్వారా బోల్సనారో, హున్‌సెన్ వంటి నియంతల గెలుపుకూ, ఆగడాలకూ కారణమైనాయి. సామాజిక మాధ్యమాల దుర్వినియోగాలకూ, ప్రపంచ వ్యాప్తంగా నియంతృత్వాల స్థాపనకూ మధ్య ఏదో అవినాభావ సంబంధం వున్నట్టనిపిస్తుంది. భారతదేశం గురించి రాయాలంటే ఒక ప్రత్యేక అధ్యాయమే అవసర మౌతుంది. ఆసక్తి వున్న వారు **'ది రియల్ ఫేస్ ఆఫ్ ఫేస్‌బుక్ ఇన్ ఇండియా'** (సిరిల్ సామ్, పరంజయ్ గుహా ఠకుర్తా), **'ఇండియా మిస్‌ఇన్ఫోర్మ్‌డ్ – ది ట్రూ స్టోరీ'** (ప్రతీక్ సిన్హా, డా. సుమయ్యా షేక్, అర్జున్ సిద్ధార్థ్), **'హౌ టు విన్ ఎన్ ఇండియన్ ఎలక్షన్'** (శివమ్ శంకర్ సింగ్) వంటి పుస్తకాలు చదువుకోవచ్చు.

ప్రపంచంలో ఎవరూ దేన్నీ ఫ్రీగా ఇవ్వరు అన్న విషయం అర్థమైతే మనకు ఫ్రీ కనెక్టివిటీ, ఫ్రీ వైఫై, ఫ్రీ జియోల మాటున వున్న మర్మం అర్థం అవుతుంది. మనుషుల్ని కలుపుతానంటూ ముందుకొచ్చిన సోషల్‌మీడియా మనుషుల్ని విడదీస్తోంది. సరుకుల ప్రపంచంలో మనల్నీ సరుకుగా మార్చేసి, మనల్ని వాణిజ్యపరంగా, రాజకీయంగా కొల్లగొట్టడమే కాక, మానవ సంబంధాలను తీవ్ర వొత్తిడికి గురిచేస్తూ, నూతన మానసిక రోగాలకు కారణమౌతోంది సోషల్ మీడియా. మరోసారి ఆండ్రాయిడ్ ఫోను చేతిలోకి తీసుకున్నప్పుడు, మరో కొత్త యాప్ డౌన్లోడ్ చేసినపుడు ఆ మాత్రం మన వెన్నులో వొణుకు పుడితే ఈ సినిమా ఉద్దేశం కొంత ఫలించినట్టే! చాలా నామినేషన్లు, అవార్డులు పొందిన ఈ చిత్రానికి దర్శకులు కరీమ్ ఆమిర్, జెహానే నౌజైమ్. నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో వుంది. ✤

కవిత

# ఆయుధం లేని

**– రవి నన్నపనేని**

కిరీట క్రిమి కంటే
అత్యంత భయంకరమైంది యుద్ధ క్రిమి

మనిషి లోపల విస్తరించే మహమ్మారో
మనిషిని మానసికంగా
శారీరకంగా హింసించే మరో అమానవుడో
నేలమీద
దుఃఖం లేని స్థలాన్ని చూడగలమా ?
పీడితులూ పీడకులూ లేని కాలాన్ని
ఊహించగలమా ?
ఎల్లలు లేని ప్రపంచ పటం గీయగలమా?

మనిషి పుట్టుక - జీవితం
వేయి రేకుల పుష్పవికాసం కావాలి కదా!
మనిషిని ధ్వంసించే
విష జీవుల కంటే
వింత విచిత్ర రోగాల కంటే
అత్యాశతో
ఆయుధ బలంతో
మరో మనిషిని వేటాడే క్రూరుడే
క్రిమి కంటే అత్యంత దుష్టుడు
యుద్ధ క్రిమి వ్యాధిగ్రస్తుడే
అసలైన కిరీట క్షుద్రుడు.....
భూ భారకుడు ......

పరాన్న జీవి కంటే అత్యంత ప్రమాదకారి
ప్రకృతి విధ్వంసకుడు ....

చెట్టు నాశనం పిట్ట నాశనం
జంతు జాతి నాశనం
ఊరూ ఉనికీ అంతా దుంప నాశనం....

ఏ శవానికీ ఏ రాజ్యం బాధ్యత వహిస్తుంది ?
గాలీ నీరు నేల కలుషితానికీ
ఏ సింహాసనం జవాబు చెబుతుంది ?
ఏ మంత్రం ఏ క్రిమిని చంపుతుంది ?

నిండు నూరేళ్ళు జీవించాల్సిన దేహాలు
ప్రశాంతంగా నిష్క్రమించాల్సిన దేహాలు
ఇక్కడ ఇన్నేళ్ళు ఇన్ని తీసుకున్నందుకు
తనదైనది
ఇవ్వాల్సినది ఇంకేదో ఉందనీ
స్వప్నించిన దేహాలు
ఆ అనుభవాల శరీరాలు
అనాథ శవాలైపోవడం
లేలేత ఉదయాలు
ఇవాళ ఇలా ....ఇంత అర్థాంతరంగా
అస్తమించి పోవడం.....దేశమేదైతేనేం?

ఒకానొక సూక్ష్మజీవికి సమస్త లోకం
సలాం కొట్టి
చావు ముందు తలొంచి మిగిలిపోవడం
మృత్యువుకి లొంగి పోవడం
భయంతో వంగిపోవడం... కుంగిపోవడం...
విషాద శోకం - విషపు పరిహాసం....

యుద్ధ క్రిమి చేతిలో
పళ్ళు నూరుతున్న
మారణాయుధానికి గాయం చేయడం
తెలుసు
బుద్ధి జీవి తలకాయలో
రూపొందుతున్న
సూదిమందుకి గాయం మాన్పడం తెలుసు
నెత్తుటి పొత్తైన నడకలో
లిఖించబడుతున్న చరిత్రకి
మనిషి విలువ తెలుసు......

యుద్ధ క్రిమి విజయం కంటే
కిరీట క్రిమిని విధ్వంసించే అన్వేషణే
పుడమి మీద
అత్యంత ప్రేమ పూర్వకమైనది
సదా అది స్వేచ్ఛాయుతమైనది
నిజమైన మేధో శ్రమ అది...

విష క్రిమిని యుద్ధ క్రిమిని
జయించే
మానవుడే మహోన్నత జీవి....
అతడు
భూగోళం చుట్టూ అల్లుకున్న
రెండు చేతుల పూలతీగ
ఆమె
వెన్నెల శాంతి చంద్రిక - ✤

# నరమేధాలూ - నియోగాలు - మహాభారతం పరిశీలన

బి. విజయభారతి

(మహాభారతం – ఆదిపర్వం పరిశీలించి విజయభారతి గారు రాసిన 'నరమేధాలూ – నియోగాలూ' పుస్తకానికి ముందుమాట ఇది. – సం॥)

'మహాభారతాన్ని' భారతదేశ సంస్కృతికి ప్రతీకగా పరిగణిస్తుంటారు. ఇందులోని అంశాలు, ఒకప్పటి సామాజిక రాజకీయ సంఘటనల ఆధారంగా గ్రంథస్తమైన కథనాలే. అవి ఇప్పటికీ సమాజాన్ని శాసిస్తున్నాయి.

'మహాభారతం' దాయాదుల పోరాటగాథగా కనిపిస్తున్నప్పటికీ ఇందులో రెండు వ్యవస్థలకు చెందిన హక్కుల పోరాటాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా కనిపించేది దుర్యోధనాదులకూ పాండు పుత్రులకూ మధ్య జరిగిన రాజ్యాధికార వివాదం. పరోక్షంగా కనబడేది దేవాసుర వర్గాల పోరాటం. వీటిని ఆర్య ఆర్యేతర ఘర్షణలుగానూ – స్థానికుల ప్రతిఘటన పోరాటాలుగానూ చెప్పుకోవచ్చును. కురు రాజులు దేవగణాలకు సహకరించిన సందర్భాలూ, స్థానిక వర్గాలలోని నాగ, దైత్య, గంధర్వ, రాక్షస సమూహాలతో తలపడి వారిని అంతం చేసిన సంఘటనలూ భారతంలో ఉన్నాయి. నరమేధాలనూ నియోగాలనూ వర్గ, వర్ణ ఘర్షణలనూ ధార్మిక, తాత్విక చర్చలతో శ్రవణపేయంగా భారతం వినిపిస్తున్నది. ద్విజ, ద్విజేతర అంతరాలనూ, బ్రాహ్మణ, క్షత్రియ వివాదాలనూ – వాటిని ప్రతిబింబించే మనస్తత్వాలనూ భారతపాత్రలలో చూడవచ్చును. పురోహితవ్యవస్థను సమర్థిస్తూ వర్ణధర్మ చట్రాలను బిగించటం 'మహాభారత' రచన లక్ష్యం.

'మహాభారతం' చెప్పిన ధర్మోపదేశాలను గతితార్కిక దృష్టితో విశ్లేషించుకుని మూల్యాంకనం చేసుకోవటం నేటి సామాజిక అవసరం.

పరశురాముని కాలపు శమంతపంచకం నుండి జనమేజయుడు చేసిన సర్పయాగం వరకూ జరిగిన కొన్ని నరమేధాలను భారతం నమోదు చేసింది. రాచరికవ్యవస్థలో శాంతచిత్తులుగా చెప్పబడే మునుల ప్రేరణతో నరమేధాలు జరిగాయి. ఆధిపత్యవర్గాలకు అధికారాన్ని కట్టబెట్టటానికీ కొన్ని నరమేధాలు జరిగాయి. మునులే సంకల్పించిన రాక్షసమేధమూ, మునులు ప్రేరేపించిన సర్పయాగమూ సామూహిక హత్యలే. అర్జునుడు నివాతకవచులనూ, కాలకేయాదులనూ చంపటం కూడా ఒక జాతి మీద జరిగిన హత్యాకాండకు నిదర్శనం. ఈ మేధాలలో బలి అయిన రాక్షసులూ గంధర్వులూ నాగులూ యక్షులూ అసురవర్గాలూ మానవులే. వారిని వారి గణచిహ్నాలతో ప్రతీకాత్మకంగా పేర్కొనటం కావ్యశిల్పం. అప్పటి ఆ నరమేధాలు ఇప్పటి ప్రజాస్వామ్యంలోనూ కొనసాగుతున్నాయి. మంచి గతమున కొంచెమే – అని తెలిశాక గతంలోని చెడు సంస్కృతిని సరిదిద్దుకోవలసిన అవసరం ఉన్నది.

'మహాభారతం'లో కనిపించే చాలా వివాహాలు స్వయంవరాలుగా చెప్పబడినప్పటికీ అవి బలవంతపు వివాహాలే. పురుషాధిక్యాన్ని పితృస్వామ్యవ్యవస్థనూ సూచించేవే. భారతంలో వర్ణాంతర వివాహాలు కూడా కనిపిస్తాయి. వాటి విషయంలో అప్పటి సమాజం ఉదారదృష్టితో ఉన్నదని గమనించాక అప్పటి సంస్కృతిలోని కొన్ని విషయాలను గుణాత్మకమైనవిగా నేటి సమాజం అంగీకరించవలసే వస్తుంది.

ఒక మహారాజు ఒక బెస్తనాయకుని (దాశరాజు) కూతురిని కోరి వివాహం చేసుకుంటానని వస్తే ఆ దాశరాజు తన కూతురికి పుట్టే కొడుకుకే రాజ్యవారసత్వం ఇవ్వాలని షరతు పెట్టగలిగాడంటే అప్పటి సామాజిక నిర్మితి ఎలా ఉండేదో ఊహించవచ్చు. ఆ బెస్త కన్య (సత్యవతి) కురువంశం వర్ధిల్లటానికి ఏ విధంగా దిశానిర్దేశం చేసిందో మహాభారతం చెబుతున్నది. ఆర్య ఆర్యేతర సంస్కృతుల సమ్మేళనాల ఫలితంగా భారతజాతి ఏర్పడటాన్నీ ఇది సూచిస్తుంది.

భారతంలోని స్త్రీ పాత్రలు సహనానికి కార్యదక్షతకు ప్రతీకలు. అంబ ఆత్మాభిమానమూ, సత్యవతి రాజనీతి వైదుష్యమూ, ప్రశస్తమైన చిత్రీకరణలు. శర్మిష్ఠ తన జాతిశ్రేయస్సుకు తనను తాను తగ్గించుకున్న ఉదాత్త చరిత. దేవయాని కులాహంకారానికి ప్రతీక. కథాకాలంనాటికి లేని కులవివక్ష భారత రచనాకాలం నాటికి బహుముఖంగా వ్యాపించి ఉన్నందున కథలో అడుగడుగునా చర్చలు చేర్చారు.

గుణశీలాలను పుట్టుకకూ జాతికీ ముడిపెట్టటం అనంతర కాలపు సామాజిక పరిణామం. ప్రతి పాత్రకూ పూర్వ వృత్తాంతాలు – పూర్వజన్మల కథలూ తయారు చేసి సమాజగమనాన్ని నియంత్రించారు. కీచకుని వృత్తాంతం ఇందుకు ఉదాహరణ. కులాంతర సంతానానికి చెడ్డ గుణాలు వస్తాయని చెప్పటం అక్కడి లక్ష్యం. ఇలాంటి కథలు భారత రచన రెండో దశలో చేరి ఉండవచ్చును. శుకమహర్షి పరీక్షిత్తుకు వినిపించిన కథలూ, జనమేజయునికి వైశంపాయనుడు వినిపించిన కథలూ ఆయాకాలపు ఆలోచనల ప్రభావాలతో విస్తరించాయి.

భారత కథ వింటున్న జనమేజయుడు కథ వినిపిస్తున్న వైశంపాయనుడిని "అయ్యా కీచకుడు ఏ వంశంవాడు ఎవడు – అని అడిగితే ఆయన ఆ వివరాలు ఇలా చెప్పాడట. బ్రాహ్మణికి క్షత్రియుని వల్ల పుట్టిన వాడిని సూతుడు అంటారు. సూతులు అద్విజులు.

క్షత్రియులకంటె కొంచెం తక్కువ. వైశ్యుని కంటె కొంచెం ఎక్కువ స్థాయిలో ఉంటారు. రాజసంబంధాలకు అర్హులయిన సూతులు కొందరున్నారు. అలాంటి వంశంలో సూత విషయానికి (రాజ్యానికి) చెందిన రాజూ – రాజకన్యకు పుట్టిన వాడూ అయిన కీచకుడు ఒకడున్నాడు అని చెప్పాడు (సూత విషయాలూ ప్రత్యేకంగా అప్పట్లో ఉన్నాయి). ఆ కీచకునికి మాళవి అనే భార్యవల్ల నూట ఆరుగురు కీచకులు పుట్టారట – మాళవి చెల్లెలి కూతురు సుధేష్ణ విరాటరాజు భార్య.

ఇక్కడ బ్రాహ్మణికి క్షత్రియునికి పుట్టినవారు సూతులన్నారు. చాలా సందర్భాలలో అలా కాలేదు. క్షత్రియునికి బ్రాహ్మణ స్త్రీకి పుట్టినవారు క్షత్రియులయ్యారు. క్షత్రియుడైన యయాతికీ బ్రాహ్మణస్త్రీ అయిన దేవయానికీ పుట్టినవారు రాజులై రాజ్యాలు పాలించారు. ఆదిత్యుని కూతరు తపతికీ కురువంశపు సంవరణనికీ పుట్టినవారూ క్షత్రియులయ్యారు. శ్రుతశ్రవసునికి నాగస్త్రీ వల్ల కలిగిన కుమారుడు ముని అయ్యాడు. వారికి తండ్రి కులం వచ్చింది.

అది జాంబవ పురాణం ప్రకారం, సత్యలోకం నుంచి వచ్చిన శ్యామలాదేవి అనే బ్రాహ్మణ స్త్రీ క్షుర మహామునికి భార్య అయింది. వారికి మతంగమహాముని పుట్టాడు. అతడు బ్రహ్మను ప్రార్థించి కర్దమ ప్రజాపతి అయ్యాడు. అనులోమస్థాయి నుంచి ప్రజాపతుల స్థాయి పొందటం ఒకప్పుడు ఉండేది. కొన్ని వర్గాల స్త్రీలను ముఖ్యంగా అగ్రవర్ణాల స్త్రీలను కట్టడి చేయటానికి అనంతర కాలపు ధర్మశాస్త్రాలు కొన్ని నియమాలు ఏర్పరచాయన్నమాట. ఇలా నియమాలు పెట్టడం ద్వారా బ్రాహ్మణ మేధావులు తమ స్త్రీలను తామే అవమానించుకున్నారని డా. అంబేద్కర్ విచారం వ్యక్తం చేశారు.

అనులోమ విలోమ వివాహాల గురించి మను ధర్మశాస్త్రం చెప్పినవన్నీ అనంతరకాలపు నిషేధాలు.

చతుర్వర్ణాల విభజనను పాటించే ఆర్యులు మొదట త్రైవర్ణికులు. నాలుగో వర్ణం తర్వాత ఏర్పడింది. దేవాసురులలో అసురులు చతుర్వర్ణాల పరిధిలో లేరు. అసురులూ ఆదివాసీలూ పంచమవర్ణాల వారూ వర్ణవ్యవస్థకు వెలుపలివారే. దేవాసుర – ఆర్య ఆర్యేతర సంబంధాలను భారతం చెప్పిన విధంగా చూస్తే మొదట్లో ఇది చలనశీలతగల సమాజం అని అర్థమవుతుంది. ఆ చలనశీలతను అడ్డుకునే ప్రయత్నాలు అనంతర కాలంలో జరిగాయి. (వైశంపాయనుని సమాధానాలలో వాటిని గమనించవచ్చు).

ఇండియాలో మూలవాసులు అసురులు. ఇక్కడి నీటి వనరులు – భూనిక్షేపాలు – అటవీసంపద వారిదే. వాటిని కాపాడుకునేందుకే వారు ఆర్యులతో పోరాడారు. ఇప్పటికీ పోరాడుతున్నారు. కురు వంశపు రాజు చిత్రాంగదుడు అదే పేరు గల గంధర్వరాజుతో మూడు సంవత్సరాలు యుద్ధం చేసి యుద్ధంలో మరణించాడు. స్థానికులైన గంధర్వులు కురు రాజుల దురాక్రమణను అడ్డుకున్న సంఘటన అది. తమ జలాశయంలోకి దిగినందుకే అంగార పర్ణుడు అర్జునునితో యుద్ధానికి దిగాడు. తమ సరోవరం దగ్గర క్రీడాగృహం నిర్మించబోతున్న దుర్యోధనుడిని గంధర్వులు కట్టిపడేశారు. యక్షుని ప్రశ్నలకు సమాధానం చెప్పిన తర్వాతనే ధర్మరాజు అతని కొలనులోని నీళ్ళు తాగగలిగాడు.

చరిత్రలోకి వెళ్తే ఇండియా అలెగ్జాండరు దండయాత్రను మొదట ఎదుర్కొన్నది గిరిజనులూ – ఆదివాసీలూను. ఆధునిక యుగంలో ఈస్టిండియా కంపెనీ పాలననూ, బ్రిటిష్ పాలననూ మొదట ప్రశ్నించినది స్థానికులే. గోలుకొండ ఏజన్సీ ప్రజలు – ఛోటా నాగపూర్ కోలీయులు (1837), బెంగాల్ సంతాల్ తెగలు (1855), రంప గిరిజనులు, బీహార్‌లో చంపారన్ నీలిమందు రైతులూ తమ తమ వనరుల రక్షణ కోసమే పోరాటాలు చేశారు.

ఆధునిక యుగంలో ఆత్మగౌరవ పోరాటాలలో పాల్గొన్నవారు అధిక సంఖ్యాకులు స్థానికులే. రాంజీగోండ్ (1860), బిర్సాముండా (1899), కొమరం భీం ల పోరాటాలు ఈ కోవలోనివే. పురాణాలు చెప్పిన అసురుల పోరాటాలను ఈ కోణంలోనే చూడాలి.

"జయ" ఇతిహాసం చెప్పిన వ్యాసుని ప్రకారం భిన్న గణాల మధ్య వివాహ సంబంధాలున్నాయి. స్పర్థలూ సాగుతూనే వచ్చాయి. కురు వంశపురాజైన ప్రతీపుని భార్య సునంద, శిబికూతురు. శిబి దానవ చక్రవర్తి. రాక్షస కన్య హిడింబను భీముడు పెళ్ళి చేసుకోవటం – అర్జునుడు నాగ కన్యలను పెళ్ళి చేసుకోవటం – బాణాసురుని కూతురు ఉషను యాదవ వీరుడు అనిరుద్ధుడు వివాహం చేసుకోవటం – ఇలాంటి గణాంతర, జాత్యంతర వివాహాలు భారతకథలో కనిపిస్తున్నాయి.

అసురుల వైదుష్యాన్నీ, తత్వజ్ఞానాన్నీ భారతకథలు ప్రస్తావించాయి. మహాపద్మనందుడు (పద్మనాభుడు) అనే నాగుడు ఒక బ్రాహ్మణునికి తత్త్వాన్ని – జీవాత్మ – పరమాత్మల కలయికను బోధపరచటం శాంతిపర్వంలో ఉన్నది. వ్యాసుని శిష్యుల ద్వారా 'జయ' ఇతిహాసం ప్రచారమవుతూ ఉన్న దశలో కుల భావన సమాజాన్ని కలవర పరచటం, విదేశీ జాతులు ఇండియాలో ప్రవేశించి స్థానికులతో సంబంధాలు ఏర్పరచుకోవటం వంటివి జరిగాయి. జైన బౌద్ధ ధర్మాల ప్రభావమూ స్థానిక రాజ్యాలపై పడింది. ఆ క్రమంలో ఒక అవసరంగా కుల చట్రాలను బిగించటం అంతర్వివాహాలను బలపరిచే విధంగా శాస్త్రాలు తయారు చేయటం జరిగింది. ఆ విధంగా వర్ణధర్మాలూ, బ్రాహ్మణుల ఆధిక్యతను చెప్పే కథలూ ప్రధాన ఇతిహాసంలో చేరాయి. పాత్రలు శీల స్వభావ చిత్రణలలోనూ మార్పులు చోటు చేసుకొని ఉండవచ్చును. అసుర జాతులను నేర స్వభావులుగా చూపటమూ, శ్రమణ కుల ధర్మమైన భిక్షావృత్తిని గౌరవ ప్రదమైనదిగా యాయావరవృత్తిగా ఒక వర్గానికి ఆపాదించటమూ జరిగింది. ఇలాంటి మార్పులు – చేర్పులు వైశంపాయునుడు చెప్పిన భారత కథలో గమనించవచ్చును.

ప్రస్తుతం లభిస్తున్న 'మహాభారతం'లో ఒకప్పటి విశాలదృష్టి మరుగుపడిపోగా సంకుచితమైన వర్ణధర్మాలు, స్త్రీ ధర్మాలు వ్రత నిష్ఠలూ చేరి సమాజ పురోగతిని అడ్డుకుంటూ ఉన్నాయి. ఆ విశ్వాసాలు శూద్రులలోను, స్త్రీలలోనూ బలంగా పాతుకుపోయాయి. వారికి వాస్తవాలు తెలియవలసి ఉంది. అందుకే ఈ రచన.

ఈనాడు హిందూమతం గురించి, హిందూత్వం గురించి సమాజంలో – దేశంలో ఎన్నెన్నో విభిన్నమైన ఆలోచనలు ప్రచారంలో ఉన్నాయి. హిందూత్వాన్ని అర్థం చేసుకోవటం కొంత కష్టం – కొంత ఇష్టం అన్నట్టుగా ఉంటుంది. 1949లో హిందూకోడ్ బిల్లు పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు హిందువులంటే ఎవరు ? హిందూత్వం అంటే ఏమిటి అనే ప్రశ్న వచ్చింది. అప్పటి సభ్యులలో చాలామందికి హిందూత్వంపట్ల స్పష్టత ఉన్నది. అయినా ఆ బిల్లును వారు అడ్డుకున్నారు.

"క్రైస్తవం, జోరాష్ట్రియం, ఇస్లాం మాదిరిగా హిందూత్వం ఒక మతం కాదు" అని ఒక సభ్యుడు అన్నప్పుడు "మరి మతమంటే ఏమిటి" అని మరొక సభ్యుడు ప్రశ్నించాడు. అప్పుడు హెచ్.వి పటాస్కర్ ఇలా సమాధానం చెప్పారు.

"క్రైస్తవం అంటే క్రీస్తును నమ్మి బైబిలును ఆచరించే వారి మతం. జోరాస్టర్‌ను అనుసరించేవారిది జోరాష్ట్రియం. ఇస్లాంను నమ్మి మహమ్మద్‌ను ఆరాధించి ఖురాన్‌ను అనుసరించే వారు ముస్లిములు. మరి హిందుత్వం అంటే ఏమిటి? హిందుత్వం అంటే కేవలం వేదాలను నమ్మటం కాదు. రాముడు, కృష్ణుడు, శివుడు ఇంకా రకరకాల రూపాలలో ఉన్న అనేక దేవుళ్ళనూ, ప్రకృతిని ఆరాధించేవారూ, దేవుడి పట్ల నమ్మకం లేనివారూ – దేవుడు ఒక్కడే అని ఒప్పుకోనివారూ ఇలా రకరకాల అభిప్రాయాలు కలిగిన వారు ఈ సమాజంలో హిందువులుగా ఉన్నారు. "హిందువులు ఆరాధించే దేవుళ్ళు వేర్వేరు. ఆరాధించే తీరు కూడా ఒక్కో ప్రదేశంలో ఒక్కో విధంగా ఉంటుంది. హిందూత్వమంటే శతాబ్దాలుగా వస్తున్న అనేక రకాల సంస్కృతులనూ మత విశ్వాసాలను తనలోఇముడ్చుకుంటూ పరిణతి చెందిన సమాజం. రకారకాల జీవన విధానాల ప్రవాహాన్ని తనలో కలుపుకున్న అభివృద్ధి" అన్నారు పటాస్కర్.

శాస్త్ర నియమాల పేరుతో పూర్వజన్మ కర్మల మిషతో నియంత్రించ బడుతున్న వర్గాల నుంచి వచ్చాను గనక ఆయా విషయాలు నాకు అర్థమైనంతవరకు చెప్పటం నా బాధ్యత. ఆ విషయంలో నాన్నగారు బోయి భీమన్నగారి రచనల ప్రభావం నాపైన ఉన్నది.

వర్తమాన సమాజంలో దళిత గిరిజనవర్గాలలోనూ శూద్ర వర్గాలలోనూ బ్రాహ్మణీయ భావజాలం బలంగా కుదురుకుంటున్నది. రాజకీయాలు ఆ భావజాలం చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు ఆయా కాలపు మానవ సమాజాలకు సంబంధించిన చిత్రణలు. అప్పుడు జరిగిన కొన్ని సంఘటనలను అవి కళాత్మకంగా చెబుతున్నాయి. ఒక్కొక్కసారి అతిశయించి చెప్పాయి. ఒక్కోసారి వక్రీకరించాయి. వాటిని ఇప్పటి సమాజం ప్రామాణికంగా గ్రహిస్తున్నది. వాటి పూర్వాపరాలను సంయమనంతో పరిశీలిస్తే చారిత్రకాంశాలెన్నో అవగతమవుతాయి. నమ్మకాలకూ వాస్తవాలకూ ఉన్న తేడాలను తెలుసుకోవటం సాధ్యపడుతుంది.

రామాయణంలో రాముడు వనవాస సందర్భంగా అసురులను చంపాడన్నారు. భారతంలోనూ పాండవుల వనవాస సందర్భంలో అసురుల వధ జరిగింది. దేవగణాలకు హితం చేయటానికే కొన్ని సంహారాలు జరిగాయి. ఇవి యాదృచ్ఛికాలు కావు. ఒక వర్గంవారు తమ విజయాలనే చెప్పుకుంటూ వచ్చిన కథలు. పురాణ కథల ప్రపంచం ఏ సమాజం కోసం ఏర్పడిందో ఏ వర్గాలను అణచిపెట్టటానికి ఉద్దేశించబడిందో స్పష్టంగా తెలుసుకోగలిగినప్పుడు వర్తమాన నియంతృత్వాన్ని ఎదుర్కోగలుగుతాము.

తారకంగారు ఆ దిశలోనే ఆలోచించేవారు. రామాయణ మహాభారతాల పూర్తి పరిశీలన జరగాలనేవారు. సంస్కృతమూలమూ ఇంగ్లీష్ అనువాదమూ ఉన్న గ్రంథాలను పరిశీలించాలనేవారు. ఆ క్రమంలో ధర్మశాస్త్రాలనూ ఇతిహాసాలనూ పరిశీలించి ఆయన ఎంతో నోట్సు రాసుకున్నారు. రామాయణ పరిశీలన పూర్తి చేశారు. అవి అచ్చుకావలసి ఉంది.

పరిమల్ పబ్లికేషన్స్ (ఢిల్లీ) వారు ప్రచురించిన మహాభారత సంపుటాలను డా. వార కృష్ణశాస్త్రి మాకు బహూకరించారు. అవి ఈ నా పరిశీలనకు ఉపకరించాయి. మూలంలోని కొన్ని ప్రాథమిక అంశాలనే – ముఖ్యంగా కులం – జండర్ వంటి వాటినే పరిశీలనలోకి తీసుకున్నాను. అవి ఆలోచింపదగినవే.

**నరమేధాలూ – నియోగాలూ** : రచన – **బి. విజయభారతి**

**హైదరాబాద్ బుక్ ట్రస్టు, బొజ్జా తారకం ట్రస్టు ప్రచురణ.**

ప్రథమ ముద్రణ : **ఆగస్టు 2019**

**1/8 డెమ్మీలో 388 పుటలు,** వెల : **రు. 250/-**

ప్రతులకు : **హైదరాబాద్ బుక్ ట్రస్టు, ప్లాట్ నెం. 85, బాలజీనగర్, గుడి మల్కాపూర్, హైదరాబాద్ – 500006**

ఫోన్ : **040-23521849.**



గల్పిక

# రాజు, రాక్షసి, ఒక రెట్ట వేసిన చిలుక

- ఓవీవీయస్

**దేశ** రాజధానిలో అది ఒక పూలతోట. మామూలు తోటకాదు. ఎంతో చక్కనైన తోట. సాక్షాత్తూ దేశాన్నేలే చప్పన్నాంగుళి స్వామివారు విహరించే...., ఇంకా చెప్పాలంటే సమావేశాలు వగైరాలు నిర్వహించే చోటది. ఎటుచూసినా పచ్చికబయళ్ళు. ఎన్నో విశాలమైన చెట్లు. ఎన్నెన్నో రంగురంగుల పూల మొక్కలు. పచ్చికే మెత్తనిదనుకుంటే..., అంతకన్న సుతిమెత్తనైన తివాచీలు యోగాసనాలు వేసేందుకు, అంతేనా.... ఎలా కావలిస్తే అలా వంగి మరీ ఆసనాలు వేసేందుకు మెత్తని పెద్ద బాహుబలి బంతులు. చప్పనాంగుళీ స్వామివారి కనుసైగకే తక్షణం స్పందించి, వారి హావభావసహిత మనోహర మృదువాక్కులను చిత్రించి, దేశ ప్రజలకు నయనానందకరంగా, శ్రవణానందకరంగా బెదిరించి మరీ నివేదించుటకై సిద్ధం చేసిన వాహన, విహంగ (డ్రోన్) కెమేరాలు. ఆరోజు కూడా ఎప్పటిలాగే చప్పన్నాంగుళి స్వామివారికి సుఖాసనం ఒక రావిచెట్టు నీడలో ఏర్పాటు చేయబడింది. ఆ చెట్టుపైన రెండు రామచిలుకలున్నాయి. ఆనాటి వాతావరణం కోలాహలంగా, ఉత్సాహ భరితంగా ఉండడంతో చిలుకలు కుతూహలం కొద్దీ ఎటూ పోకుండా చెట్టుకింద జరిగే తంతును గమనిస్తున్నాయి.

రాజాధిరాజు..... రాజమార్తాండ తేజ..... అపరిమిత మతసహనశీల.. శ్వేతసౌధాధీశ ప్రియబాంధవ.. మహామృత్యుంజయ మంత్రోపాశక శక్తిశాలీ.... అరివీర భయంకర పౌరగణక ధీశాలీ.... బహుపరాక్.... బహుపరాక్.... అంటూ భట్రాజులు స్తుతిపలుకులు పలుకుచుండగా సమావేశ స్థలికి ఏతెంచారు చప్పనాంగుళి స్వామివారు. అనగా రాజావారు.

ఇటీవల శ్వేతసౌధాధీశులవారి ఈ దేశ పర్యటన విజయవంతమైన సందర్భంగా ఏర్పాటు చేయబడిన సమీక్ష మరియు సత్కార సమావేశమని నిర్వాహకులకు మాత్రమే తెలిసిన విషయం. శ్వేతసౌధాధీశుల వారంటే మన చప్పన్నాంగుళీస్వామివారికి ఎనలేని గౌరవం. మీదు మిక్కిలి భయభక్తులు రంగరించిన స్నేహము. వారి స్నేహం మృగరాజు మూషికముల స్నేహం వంటిదని పరదేశ రాజులు అపహాస్యము చేయుదురు. కానీ మన ప్రభువులవారు లెక్ఖచేయరు.

శ్వేతసౌధాధీశులు ఇచ్చట నడయాడిన ప్రదేశములెల్ల సుఖశాంతులు, ధనవిలాసాలు పొంగరించునట్లు తీర్చిదిద్దాలని ముందుగానే ఆదేశాలున్నాయి. ఆ ఆదేశాలకు లోబడి పేద జనాలను తరిమేసి, కూలి జనావాసాలు కనబడకుండా తక్షణ కుడ్య నిర్మాణాలు చేపట్టి, శ్వేతసౌధాధీశులకు ఆహ్లాదాన్ని కలిగించిన ప్రభు విధేయులు సత్కరించబడ్డారు.

చప్పన్నాంగుళీస్వామివారు కూడా యధాశక్తి దేశీయ పరిశ్రమలకు వీడ్కోలు పల్కి, శ్వేతసౌధాధీశులకు వినయ విధేయతలతో కూడిన అనేక ఒప్పందములను సమర్పించి మనస్సులు రంజింపజేశారు. ఆకలి, నిరుద్యోగము, కరువుకాటకముల వంటి ప్రజలను పీడించే అనేకానేక సమస్యలు పరిష్కరించవలసిన విధి, బాధ్యతా ప్రభువులదే అయినా.... అలా చేయకుండా.... శ్వేతసౌధాధీశులవారికి నచ్చని దేశాలన్నీ మన శత్రువులుగా, మన రాజావారి నిర్ణయాలను, విధానాలను వ్యతిరేకించే గొంతులవారిని దేశద్రోహులుగా ఎంచి, యుద్ధం మబ్బులు కమ్మించి ఉంచడం.... ప్రజల సమస్యలను పక్కదారి పట్టించడం ఏలినవారికి వెన్నతో పెట్టిన విద్య. అందుకే మన చప్పన్నాంగుళీ స్వామివారు సర్వసమస్త తంత్రానాం - యుద్ధం ప్రధానం అని సింహాసనం మీద కూడా చెక్కించారు.

ఇంకా.... శ్వేతసౌధపు రాణివారినీ, యువరాణివారిని ఆనందింపజేసిన ప్రభువిధేయులనూ సత్కరించాలనీ,.... తదుపరి రాబోతున్న శ్వేతసౌధాదేశం వారి ఎన్నికలలో యీ శ్వేతసౌధాదీశుడినే మరల గెలిపించాలనీ,.... అలా గెలిపించేందుకు తాను చేయాల్సిన పర్యటనలూ, ఉపన్యాసాలూ విజయవంతమై.. ఈ శ్వేతసౌధాదీశుడు మరల గెలిచి తనపై కనపరిచే దయను, వాత్సల్యాన్నీ తలుచుకుంటూ చప్పరిస్తూ ఉండగా.... వేగుల వార్త.... అంటూ ఎవరో ఆటంకపరచారు. స్వామివారు విసుగు ముఖాన్ని గంభీర ముద్రలోకి సాధ్యమైనంత మార్చి త్వరగా చెప్పమన్నారు.

కంటికి కనరాని క్రిమి రాక్షసి ప్రభూ.... ఏదో కోవిడ్ 19 అట. దేశదేశాలనూ కబళిస్తున్నదట. ఇప్పటికే మన పొరుగుదేశాన్ని ఒక చూపు చూసి వదిలేసింది.... అతని మాటలు పూర్తికాకముందే ఆ సమావేశంలో వారంతా చప్పన్నాంగుళీయస్వామివారితో సహా ఫక్కున నవ్వేశారు. క్రిమి రాక్షసైతే ఏంటి?.... దానమ్మ మొగుడైతే ఏంటి?!.... లంఖిణిలూ, శంఖిణుల చరిత్రలు మనకు తెలియవా?!.. మనం ప్రపంచానికే గురువులం. మహా మృత్యుంజయ మంత్రం చదివామా.... ఎంతటి క్రిమిరాక్షసైనా పటాపంచలు కావలసిందే. అన్నారు స్వామివారు చిద్విలాసంగా.

లేదు ప్రభూ.... ఇంతవరకూ ఏ దేశంవారూ మందు కనిపెట్టలేకపోయారట.... అన్నాడతను బేలగా....

ఎవరూ కనిపెట్టకపోతే మనం కనిపెడతాం.... ఐనా కొత్తగా కనిపెట్టడమేంటి.... అంటూ చప్పన్నాంగుళీయస్వామివారు మాట పూర్తిచేయకముందే....

రాజావారి ముందే ఎక్కువ మాట్లాడుతున్నావ్.... నీకు గోమూత్ర మహత్యం తెలియదట్రా.... హుంకరించేడొక దేశ(స్వామి)భక్తుడు.

గోమయాన్ని ఒళ్ళంతా పూసుకుంటే.... సకల చరాచర ప్రపంచంలో ఏ దుష్టశక్తీ దరిచేరదని తెలియదూ.... మరింతగా హుంకరించేడు మరో భక్తుడు.

కోవిడ్ సంగతి దేవుడెరుగు.... ముందు ఈ భయంకర ప్రభుభక్తి ఎంతటి భీతావహమైనది కదా! అంటూ బిక్కచచ్చి.... ఎవరే చిన్న మాట అన్నా తల ఊపడం మొదలుపెట్టాడా అమాయకుడు.

దైవదత్తమై.... అమృతతుల్యమైన ఇంతటి ఔషధ ఘన వారసత్వ సంపద గో మల మూత్రాల రూపంలో మన వద్దనే ఉండగా.... అంటూ చెప్పసందేహించాడొక ఔత్సాహిక భక్తుడు.

అతని వైపోసారి ఓరకంట చూసి పర్వాలేదు చెప్పు.... అన్నట్టు కొంచెం ముందుకు వంగారు చప్పన్నాంగుళీయస్వామి.

పారాసిటమాల్ మాత్ర వేసుకోమని ఒకడు,.... బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఒకడు.... మన సామంతులు ఏవేవో చెబుతున్నారు ప్రభూ....

ఔనౌను వింటున్నాం.... మెల్లగా అంటూ తల పంకించారు స్వామి.

ఇంతలో.... శ్వేతసౌధాధీశులు ప్రభూ.... అంటూ ప్రభువులకు చరవాణిని అందించారు.

అంతవరకు సుఖాశీనుడైయున్న ప్రభువు ఠక్కున లేచి నించున్నారు. పరివారమంతా పరివేష్ఠించి ఉన్నారనే సంగతే మరచి, చరవాణిని తన ఆసనంపైన ఉంచి ఎదురుగా అమాంతం సాష్టాంగపడ్డారు ప్రభువులవారు.

సెలవీయండి స్ఫూర్తిదాతా.... అన్నారిటునుండి

.....................................................

అయ్యో! అగ్రజా! నిన్ననే ఆ ఔషధం ఎగుమతులు నిషేధించానే....

.....................................................

వొద్దు అగ్రజా.. మాపై కినుక వహించవద్దు. మీరడిగిన ఔషధం తప్పక పంపిస్తాం....

.....................................................

మా ప్రజలా.... వారి వారి పాప పుణ్య ఖర్మలను అనుభవించక తప్పదు కదా!....

విధిలిఖితాన్ని వారు మార్చలేరుగా అగ్రజా!!....

చరవాణిని అపివేసి తిరిగి సుఖాసీనులైన వెంటనే చప్పన్నాంగుళ స్వామిరాజావారు తమ ఆజ్ఞల జాబితాను ప్రకటించేరు.

★ అగ్రజుల (శ్వేతసౌధాధీశుని) ఆదేశాలమేరకు వారికి కావలసిన ఔషధాన్ని తక్షణమే పంపాలి.

★ ఎవరి గృహాలలో వారే స్వీయ గృహ నిర్బంధంలో ఉండి తీరాలి. (గృహములు లేనివారో.... నంటూ ఎవ్వరైనా వితర్కమునకు పాల్పడిన దేశద్రోహులగుదురు)


★ రాత్రివేళల విద్యుద్దీపములనార్పివేసి, చమురు లేక కొవ్వు దీపాలు వెలిగించి చప్పట్లు చరుస్తూ క్రిమిరాక్షసితో యుద్ధం చేయాలి.

పై ఆదేశములలో, ప్రజలెవరైనా 2వ, 3వ ఆదేశములను పాటించకపోయినా, ఇతరేతరాలు ఆలోచించినా, చర్చించినా, విమర్శించినా తక్షణ ప్రాతిపదికపై దేశద్రోహులుగా నిర్ధారించబడెదరు. సమావేశాన్ని పూర్తిచేసి బయలుదేరుతున్న వీరిని చూసి చిలుకలు ఇలా అనుకొన్నాయి.

ఛీ.... ఛీ.... ఏమిటీ ఘోరం.... అజ్ఞానమా.... అహంకారమా.... రాజ్యానికి రాబోతున్న ఉపద్రవమేమిటి?.... ఎలా ఎదుర్కోవాలి? ప్రజలను, వైద్యులను ఎలా రక్షించుకోవాలి?!.... రెక్కాడితేగాని డొక్కాడని ప్రజలనెలా కాపాడాలి?!.... ఇవేమీ కనీసం ఆలోచించలేదే.... అంటూ కీచుకీచుమంటూ ఎగిరిపోయాయి.

కానీ ఆ చిలుకలలో ఒక కొంటె చిలుక వెళుతూ వెళుతూ వెనుకకు వచ్చి చప్పన్నాంగుళిస్వామివారు ధరించిన ఖరీదైన పైజమపై లటుక్కున రెట్టవేసేసి ఎగిరిపోయింది. చప్పన్నాంగుళిస్వామి రాజావారిని పరివేష్ఠించియున్న సకల పరివారమూ...., దేశద్రోహి చిలుకను పట్టండి.... అంటూ వెంటబడ్డారు. ✤

## 'నాస్తిక కేంద్రం' నాయకులు డా॥ విజయం మరణం



**అంటరానితనానికి** వ్యతిరేకంగా, జోగిని – బసివిని దురాచారాలకు వ్యతిరేకంగా, కులాంతర వివాహాలను, నాస్తికత్వాన్ని ఒక ఉద్యమంగా కొనసాగించిన గోరాగారి కుమారుడు. డా॥ విజయం తన 84వ ఏట 22 మే 2020న అనారోగ్యంతో విజయవాడలో మరణించారు. ఆయన 1 డిసెంబరు 1936న జన్మించారు.

నాస్తికత్వం అంటే ఒక జీవన విధానం అనీ, శాస్త్రీయ దృక్పథం అని నిరంతరం ప్రచారం చేసిన ఆయన ఇతర దేశాలలోని నాస్తిక సంఘాలతో నిత్య సంబంధాలు పెట్టుకొని, అక్కడి జర్నల్స్‌కి ఆర్టికల్స్ రాసేవారు. 'నాస్తికమార్గం' పత్రికను క్రమం తప్పకుండా నిర్వహించారు. అందరితోనూ సత్సంబంధాలు నెరపుతూ ప్రజాసంఘాల కార్యక్రమాలలోనూ భాగస్వాములయ్యేవారు. విజయవాడలో ప్రపంచ నాస్తిక మహాసభలను పలు పర్యాయాలు నిర్వహించారు. విజయంగారి మృతికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియచేస్తూంది. ✤


ధారావాహిక

# ముక్కానీ నవల (16)

## (Three Penny Novel)

ఇంగ్లీషు : బెర్టోల్డ్ బ్రెహ్ట్

తెలుగు అనువాదం : జి.వి.భద్రం, కె.గౌరీశంకర్




(గత సంచిక తరువాయి)

**ఆరోజు** ఉదయం నిద్రలేచినప్పటి నుండి ఏవేవో పనుల మీద విశ్రాంతి లేకుండా తిరుగుతూ ఉన్నందువల్ల మేక్ కొద్దిపాటి అప్రసన్నంగా ఉన్నాడు.

ఇద్దరూ కలిసి ముందుగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్ళారు. మేడపైనున్న బ్రౌన్ ఆఫీసు గదిలోకి మెక్‌హీత్ వెళ్ళారు. ఆ సమయంలో బ్రౌన్ కూడా కాస్త అస్తిమితంగా ఉన్నాడు. ఇప్పటికే మెక్ బ్రౌన్‌ను కలుసుకొని త్వరలోనే మేమిద్దరం (మెక్, పాలీ) కలిసి రాబోతున్నట్టుగా చెప్పి ఉన్నాడు.

పెళ్ళి విందు ఇవ్వడానికి అనువైన భవనం కోసం వెదికి వెదికి సరైనదాన్ని సంపాదించలేకపోయాడు. అందువలన అప్పటికప్పుడు వెదికి పట్టుకున్న మరొక భవంతి అడ్రస్ బ్రౌన్‌కు ఇచ్చాడు. దాంతో బ్రౌన్ మూడ్ కాస్త దెబ్బతింది. వారి వివాహానికి హాజరవ్వాలనే ఆతురత ఏమీ అతడు కనబరచలేదు. కానీ వారి వివాహానికి తప్పకుండా హాజరవుతానని మాటిచ్చాడు. ఒకవిధంగా మెక్‌హీత్ ఇచ్చే పెళ్ళి విందు విజయవంతం కావడానికి బ్రౌన్ హాజరు తప్పనిసరి. నాకు అండగా పెద్ద పోలీసు ఆఫీసర్ ఉన్నాడని మిల్లర్, హాథార్న్‌లకు మాత్రమే గాకుండా విందుకు వచ్చే మరికొందరు అతిథులకు కూడా తెలియపరచాలనే ఉద్దేశంతో మేక్ ఉన్నాడు.

కాన్వెంట్ గార్డెన్ దగ్గరున్న ఒక హోటల్లో పాలీని కూర్చోబెట్టి మెక్ ఒక్కడే కెన్సింగ్‌టన్లోని ఒకింటికి వెళ్ళాడు. ఉదయం మరొకచోటికి వెళ్ళాడుగానీ అక్కడేమంత సదుపాయంగా లేదు. ఇప్పుడీ ఇంటిని తన పనివాళ్ళు పెళ్ళికి ముస్తాబు చేస్తున్నారు. లండన్‌లో దక్షిణంవైపు మేక్ సొంతిల్లు ఉందిగానీ పెళ్ళి విందుకు సరిపడేటంత పెద్దది కాదది.

ఇల్లంతా చిందరవందరగా ఉంది. మొదటి అంతస్థులో సర్దాల్సిన ఫర్నిచర్ ముందే వచ్చేయడంతో, గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఫర్నిచర్ దానికి అడ్డంకిగా ఉంది. ఫర్నిచర్‌ని సర్దడంలో అతని మనుషులకు తగినంత నైపుణ్యం లేదు. దానికి తోడు మద్యం పుచ్చుకుని ఉన్నారు. ఇంకేంపని జరుగుతుంది? కొంత ముందుకెళ్తే కొంత వెనక్కు వెళ్తోంది. ఆ పనులన్నిటినీ పర్యవేక్షిస్తున్న ఓహరా, ఇందులో నా తప్పేమీ లేదండీ, ఇప్పటివరకూ వీళ్ళందరూ పోట్లాడుకుంటున్నారు అన్నాడు.

ఈ ఇల్లు డిల్‌వాటర్ దొరగారి టౌను నివాస గృహం. ఆయన సాధారణంగా నది ఒడ్డునున్న పెద్ద భవంతిలో ఉంటారు. అయితే అది చాలా అట్టహాసంగా ఉంటుంది దాంతోపాటు అక్కడ ఫర్నిచర్ కూడా చాలా ఎక్కువ. ఈ చిన్న ఇల్లైతే ఇంచుమించు బట్లర్ గది తప్ప అంతా ఖాళీగానే ఉంటుంది. అదీ గాకుండా ఇంతకుముందు మేక్ వలన బట్లర్ కొంత సహాయం కూడా పొంది ఉన్నాడు.

ఆ సమయానికి అక్కడ తనకు పెద్దగా పని లేనందున మేక్ మరొకసారి బ్రౌన్‌ని కలవడానికి వెళ్ళాడు. అయితే ఇతను వెళ్ళేటప్పటికి ఆఫీసులో బ్రౌన్ లేడు. దాంతో వాటర్లూ బ్రిడ్జి వద్దనున్న బ్రౌన్ ప్రైవేట్ హౌస్‌లో అతనిని కలుసుకోవడానికి వెళ్తూ పాలీని వెంటబెట్టుకు రావలసిందిగా ఫేనీని పంపించాడు. తీరాచూస్తే అక్కడ కూడా లేడు బ్రౌన్.

హోటల్ వద్దనున్న పాలీని ఇట్టే గుర్తుపట్టగలిగింది ఫేనీ, మేక్ వివరించిన ఆమె ఆకారాన్ని బట్టి వెంటనే తనని తాను పరిచయం చేసుకుంది. తనని హోటల్ వద్ద వదలి వెళ్ళిపోయిన మేక్ ఎంతసేపటికీ రాకపోవడంతో పాలీ చాలా ఆందోళనగా ఉంది. అప్పటికి మూడు టీలు తాగింది, కాకపోతే బిల్లు చెల్లించడానికి ఆమె వద్ద డబ్బు లేదు.

ఫేనీ వచ్చి ఆమెను పరిచయం చేసుకున్న తర్వాత పాలీ కొంత స్థిమితపడింది. అయితే అది కొంతసేపే! ఈమెకు, మేక్‌కూ మధ్య ఎటువంటి సంబంధముందో అనే కొత్త ఆందోళన మొదలైంది. ఈమెకు ముప్ఫైకి కొద్దిగా అవతల ఉండొచ్చు.... చూడడానికి అనాకారిగా లేదు. పాలీ మనసులో ఈ ఆలోచనలు సుడులు తిరుగుతుండగానే వాటిని పసిగట్టినట్టు ఫేనీ పెద్దగా నవ్వి తనకు వివాహమైనదనీ, ఒక రోగిష్టి భర్త, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని చెప్పింది. హమ్మయ్య అని పాలీ మనసు కొంత కుదుటపడింది.

మరో చిక్కు వచ్చి పడింది – అప్పటికింకా వివాహానికి కావాల్సిన డ్రెస్ కొనుక్కోలేదు. ఉదయం నుండీ సాయంత్రం వరకూ రోజూ వేసుకునే సాధారణమైన డ్రెస్‌లోనే ఉండడం పాలీకి చాలా అసంతృప్తిగానూ, చికాకుగానూ ఉంది. పైపెచ్చు వివాహానికి గొప్ప గొప్ప అతిథులు వస్తారని మేక్ చెప్పాడు.

పోలీస్ ఆఫీసర్ బ్రౌన్ లేకుండానే మేక్ తిరిగి వచ్చాడు. ఆడవాళ్ళిద్దరినీ వాహనంలోకి ఎక్కించుకున్నాడు. పెళ్ళి దుస్తులు లేనందుకు పెళ్ళిలో ఎలా ఉంటుందో అనే ఆలోచనతో మౌనంగా కూర్చుంది ఆమె.

మేక్ టైమ్ చూసుకున్నాడు, అప్పటికే చాలా ఆలస్యమైంది, ఇదంతా బ్రౌన్ వల్లనే కదా అనుకున్నాడు. అప్పటికే షాపులన్నీ మూసేసి

ఉన్నాయి. పాలీ ముఖ కవళికలను బట్టి ఆమె పాత డ్రెస్‌తో పెళ్ళింట్లోకి ప్రవేశించకూడదని నిర్ణయించుకున్నట్టుగా అతనికి అర్థమైంది. ఆమె ఏమీ చెప్పకుండానే బండివాడిని పార్కులో ఆగమని చెప్పి, ఒక వంద గజాల దూరంలో నున్న ఒక గృహంలోనికి వెళ్ళాడు పెళ్ళి దుస్తులు సంపాదించాలనే ఉద్దేశంతో. ఆ పనిని తనకు నమ్మకస్థుడైన, ఫ్యాషన్ల పట్ల మంచి అవగాహన ఉన్న, 'వర్త్' వంటి గొప్ప షాపులో కొనుగోలు చేయగలిగిన ఒక మనిషికి అప్పజెప్పాడు. వాడికి నిజాయితీ తప్ప మిగిలిన అన్ని మంచి లక్షణాలూ ఉన్నాయి. మరుసటిరోజు ఆ పట్టణంలోనున్న స్త్రీల దుస్తులమ్మే ఒక ప్రముఖ షాపులో దొంగతనం జరిగినట్టుగా తెలిసింది. షాపు నిర్వాహకురాలు పోలీసులకు సమాచారమిచ్చింది. పోయిన డ్రెస్సులు తమ షాపులోనున్న మేలు రకానికి చెందినవని. ఈ చర్య ఫలితంగా మన చేతివాటం వ్యక్తి తరువాతి కొన్ని వారాలపాటు చాలా ఇబ్బందిగా గడపవలసి వచ్చింది. ఎందుకంటే అంత మంచి అభిరుచి ఉన్న దొంగ అతడొక్కడేనని చాలామందికి తెలుసు. ఏదేమైనప్పటికీ మేక్ పాలీకి ఒక అద్భుతమైన పెళ్ళి డ్రెస్‌ను కానుకగా ఇచ్చుకోగలిగాడు.

ఫేనీ మిగిలిన నాలుగు డ్రెస్సుల్లో ఒకదానిని తాను ధరించింది. ఈ లెక్కన చూస్తే ఫేనీ కూడా పెళ్ళి డ్రెస్ వేసుకున్నట్టయ్యింది.

పెళ్ళి మండపంలో సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ఓ యాభై మందిని పాలీ కలుసుకుంది. లార్డ్ బ్లూమ్స్‌బరీతో పాటు, ఒక కల్నల్, ఇద్దరు పార్లమెంటు సభ్యులు, ఇద్దరు ప్రముఖ న్యాయవాదులు, పెళ్ళితంతును జరిపించిన వికార్ ఆఫ్ సెంట్ మార్గరెట్ మొదలైనవారు ఆ గొప్పవారిలో కొందరు. బొద్దుగా, గుండ్రంగా వున్న చాలామంది షాప్‌కీపర్స్‌తో కరచాలనం చేసింది, అదేవిధంగా మేక్ ఏజెంట్లు మరియు అతని ఖాతాదారులతో కూడా. వచ్చినవారిలో ఎక్కువమంది తమ భార్యలను కూడా తీసుకువచ్చారు.

అతి కొద్దిమంది 'బి' షాపుల యజమానులను కూడా పెళ్ళికి ఆహ్వానించాడు మేక్. ఖరీదైన సూట్లలో హుందాగా కనబడడానికి ప్రయత్నిస్తూ ఇబ్బంది పడుతున్నారు వాళ్ళంతా. వాళ్ళు కూడా షాపుల్లో అమ్మకానికి అలంకరించిన వాళ్ళలా చుట్టూ నిలబడుతున్నారు.

కొత్త మనుషులూ, కొత్త వాతావరణం కావడంతో ఇంటిని సరిగా చూడలేదు పాలీ. అయితే ఆ ఇంటిని తన స్నేహితుడైన డిల్‌వాటర్ ప్రభువు వద్ద అద్దెకు తీసుకున్నట్లుగా లార్డ్ బ్లూమ్స్‌బరీకి తన భర్త చెబుతుండగా పాలీ విన్నది.

పెండ్లి కుమార్తెకు ఎడమవైపు ముసలి హాథార్న్ కూర్చున్నాడు. పాలీ చిన్నపిల్లగా ఉన్నప్పటి నుండీ అతనికి తెలుసు. ఆమె తండ్రితో కలిసి తరచుగా బ్యాంకుకు వస్తూ ఉండేది. పెద్దవాళ్ళిద్దరూ వ్యాపార వ్యవహారాల గురించి మాట్లాడుతూ ఉండగా, పాలీ చెక్కులతో ఆడుకునేది. నిన్న మిస్టర్ పీచమ్‌గారి ఫ్యాక్టరీలో పనిచేసేవారిని ఎవరినీ తమ పెండ్లికి పిలవడంలేదని చెప్పడంతో పాలీ, మేక్‌లు వారి తల్లిదండ్రులతో గొడవ పడినట్లుగా పాలీ హాథార్న్‌తో చెప్పింది. ఆ సోది వినడం చాలా కష్టమనిపించింది హాథార్న్‌కు. కానీ భరించక తప్పలేదు.

మొదట పెండ్లికొడుకు కుడివైపు ఎవరూ కూర్చోలేదు. బ్రౌన్ ఇంకా రాలేదు. భోజనం మధ్యలో మెక్‌హీత్ చాలాసార్లు బయటకు వెళ్ళి బ్రౌన్ వస్తున్నదీ లేనిదీ చూసాడు. బ్రౌన్ రాకపోవడంతో ఆ పెళ్ళి శుద్ధ దండగనిపించింది అతనికి. ఒక పోలీస్ అధికారి తన పక్కనుండడం ఖచ్చితంగా ముసలి బ్యాంకు నిర్వాహకులిద్దరిపై చాలా ప్రభావాన్ని పడవేస్తుందని అతనికి ప్రగాఢ విశ్వాసం.

అయితే బ్యాంకు ముసలాళ్లిద్దరూ భోజనానికి కూర్చొనకముందే బ్రౌన్ వచ్చాడు. రావడమైతే వచ్చాడు కానీ మనిషి హుషారుగా లేడు. మరొకటేంటంటే యూనిఫామ్ ధరించకుండా కేజువల్ దుస్తుల్లో వచ్చాడు. బయటకు ఏమీ అనలేకపోయాడుగానీ లోలోన చాలా బాధపడ్డాడు.

పాలీ కళ్ళకు అతడు చాలా అందంగా కనబడుతున్నాడు. ఆమె అతడిని విపరీతంగా ఆకర్షించింది. ఆమె గులాబీ వర్ణంలోనున్న చెక్కిళ్ళతో తన ఆసనంలో నిటారుగా కూర్చొని, మొత్తం పెళ్ళి విందునంతా నడిపించింది. అక్కడ వడ్డించిన వంటకాలలో ప్రతిదానినీ కొద్దికొద్దిగా రుచి చూసింది, పెండ్లికుమార్తె ఎలా నడుచుకోవాలో అలా. అలా కాకుండా ఏదిపడితే అది ఎలాపడితే అలా తినేస్తుందనుకుందాం.... చూసేవాళ్ళకు ఎలా ఉంటుంది? అమ్మాయి చూస్తే నాజూకుగా ఉంది, తిండి చూస్తే రాక్షసుల్లా కోళ్ళు, చేపలు లాగించేస్తోంది అనుకుంటారు కదా!

క్రిందనున్న టేబుళ్ళ వద్ద కూర్చున్న అతిథులకు తమకు చేసిన సీట్ల ఏర్పాటు నచ్చలేదు. అయినప్పటికీ ఆ విషయంగా ఎవరూ పెండ్లికుమార్తెను తప్పుపట్టలేదు. ఆమె మెరిసిపోతున్న తన రూప లావణ్యాలతో అందరినీ మైమరచిపోయేలా చేసింది.

తన అతిథుల ప్రవర్తన మెక్‌హీత్‌కు ఏమీ నచ్చలేదు. లోలోన బాధపడసాగాడు. 'బి' షాపుల యజమానులు చాలా వినయంగా భోజనం చేస్తున్నారు, ఏమీ మాట్లాడకుండా. పెద్దపెద్ద అతిథుల ముందు వాళ్ళ సర్దుబాటు చేసుకోలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే సరుకులు కొనుగోలు చేసేవారు అంతగా ఇబ్బంది పడలేదు. భోజనానంతరం స్వీటు తినేందుకు వారితో కలిసి కూర్చున్నాడు మేక్. అయిష్టంగానే వారి మాటలు వింటున్నాడు. ఒకరినొకరు అసహ్యించుకునే వారి భార్యల మాటలు అతనిని చాలా బాధించాయి. తట్టుకోలేక ఒకరిని బాహాటంగానే మందలించాడు.

మొత్తంమీద తన సంబంధీకుల నుండి ప్రస్తుతం తన వివాహానికి తాను ఎంపిక చేసిన అతిథులు అందరూ గౌరవస్థులే. ఒక్క గ్రూచ్‌పై తప్ప మిగిలినవారెవరిపైనా స్వదేశంలోగాని, విదేశాల్లోగానీ ఎటువంటి క్రిమినల్ రికార్డులూ లేవు. గ్రూచ్ విషయంలోనైనా సరే అతని వేలిముద్రలు సంపాదించకుండా స్కాట్‌లాండ్ యార్డు పోలీసులు అతనినేమీ చేయలేరు. వచ్చినవాళ్ళలో ఎక్కువమంది షాపుల యజమానులే, వారిపై ఎలాంటి రిపోర్టులూ లేవు. దీనంగా, అతి వినయంగా ఉండేవాళ్ళ ముఖాలు చూస్తే వాళ్ళ గురించి వ్యతిరేకంగా ఎవరూ అనుకోలేరు. అయితే 'జెన్నీ' ఆహ్వానింపబడింది అనే వాస్తవం 'ఓహరా' వాళ్ళ అహంకారాన్ని సూచిస్తుంది. వ్యభిచారిణులు కుటుంబ స్త్రీలుగా పరిగణింపబడలేరు.... పైగా కల్నల్‌కు ఆమె ఖచ్చితంగా తెలిసే

ఉంటుంది. 'ద ట్రావెలర్' వంటి సంభాషణా చతురుడు, యుక్తిపరుడు వంటి వ్యక్తుల గురించి కథనాలు చదివిన జెన్నీ వంటివారు సమాజంలో తమ స్థాయిని పెంచుకోగలుగుతున్నారు.

కాఫీ త్రాగడమైన తర్వాత బ్రౌన్ ఆఫీస్ పని ఉందని చెప్పి వెళ్ళిపోయాడు. హాథార్న్, మిల్లర్‌లతో కలిసి మేక్ పక్కనున్న మరొక గదిలోకి వెళ్ళాడు. పెండ్లికి సంబంధించిన వస్తువులన్నీ అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. లిక్కర్ తీసుకుంటూ ముగ్గురూ బి.షాపులకు నేషనల్ క్రెడిట్ బ్యాంకు నుండి ఏవిధంగా ఫైనాన్సింగ్ చేయవచ్చో సాధ్యాసాధ్యాలను గురించి చర్చించుకున్నారు.

ముసలాళ్ళిద్దరూ పెద్దగా వివరాల్లోకి వెళ్ళలేదు. పాలీ తల్లిదండ్రులు పెండ్లికి రాకపోవడం తమకు బాధించిందని ఒక్కమాట కూడా అనలేదు. ఈ విషయంగా వాళ్ళిద్దరూ కాస్త నిరాశకు గురైన విషయం మేక్ గుర్తించాడు. అయితే మిస్టర్ పీచమ్ వాస్తవాన్ని అర్థం చేసుకుని ఎప్పటికైనా దిగివస్తాడని మేక్ విశ్వాసం. ముసలాళ్ళ మౌనం కూడా వాళ్ళు మరీ ఎక్కువగా దాన్ని గురించి ఆందోళన చెందడంలేదని మేక్‌కు హుషారునిచ్చింది.

చర్చలు ముగించుకొని మేక్ తిరిగి వచ్చేటప్పటికి అతిథులంతా డాన్సు చేస్తున్నారు. పాలీ ఓ'హరాతో డాన్సు చేస్తోంది. గది పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. అత్యంత అధునాతన పద్ధతిలో గది అలంకరణ జరిగింది.

(ఇంకావుంది) ✤

పాట

# తల్లీ కన్నీరు పెడుతుందో....

- పాలేరు

తల్లీ కన్నీరు పెడుతుందో - కనిపించని కుట్రల
భూ తల్లీ బావురుమన్నాదో - ఈ కరోన కాటుకు ॥ తల్లీ ॥

చైనాలోనా కరోన వచ్చెను
ఊహానంతా ఉడికిపోయెను
మనుషులందరూ పిట్టలులాగా
ఊపిరి అందక కూలిపోయినరు
కరోన ఎట్లా వచ్చిచేరినాదో - ఈ చైనాలోకి
ప్రపంచికరణతో ఎల్లలుదాటిందో - ఆ కరోనభూతం
"అయ్యో..... ఓ..... ఓ...... ఓ......" ॥ తల్లీ ॥

బస్సులు రైళ్ళు ఆగిపోయినవి
మార్కెట్లన్నీ కూలిపోయినవి
తుమ్మితె దగ్గితె వ్యాపిస్తుందని
లాక్డౌనంటూ మూసేసారు
ఈ అంటురోగమే విస్తరించినాదో - ఆ చైనా నుంచి
అరె ప్రపంచమంతా చుట్టు ముట్టినాదో - ఆ కోరన భూతం॥ తల్లీ ॥

కరోన కాటుకు ప్రపంచమంతట
స్టాకుమార్కెట్టు కుప్పకూలెరా
మధ్యతరగతి లక్షల కోట్లను
ఎలుగుబంటులూ జుర్రుకు తాగెర
కరోన వైరసు వరముఆయె గదరా - ఈ దోపిడిగాండ్లకు
ఈ కరోన వైరసు శాపమాయె గదరా - ఈ పుడమీతల్లికి॥ తల్లీ ॥

లాక్‌డౌనుతో పనులు లేకమరి
వలసలు పోయిన కూలిలందరూ
రోజుల తరబడి పస్తులతోటి
పిల్ల పాపలతో సొంతగూటికి
కాలినడకన బయలుదేరినారో - నా పల్లెల్లోకి
బువ్వలేకమరి డొక్కలెండె గదరా - నా కూలి తల్లికి
పొట్ట కూటికి ఎల్లలు దాటరూ - నా దేశం నుంచి
వలస జీవుల వెతలు తీరునెపుడో - నా దేశంలోన ॥ తల్లీ ॥

అంటురోగముకు మందులు లేవని
తెలిసిందొక్కటె లాక్‌డౌనంటూ
పరిశ్రమలన్నీ మార్కెట్లన్నీ
రోజుల తరబడి మూసేసారు
కార్మికులందరు వీధుల పాలాయే - నా దేశంలోన
అరె! ఉద్దీపనలతో బొజ్జలు నింపారా - ఈ యజమానులకు॥ తల్లీ ॥

అంబానీలూ ఆదానీలూ వేదాంత య సెల్లుగ్రూపులు
యస్సు బ్యాంకునే మింగేశారు
చోక్సీమాల్యా డీసిల్లాంటి కార్పొరేటు గజదొంగలెందరో
వేలకోట్లు ఎగ్గొట్టిన సొమ్మును - మోడీషాలే రద్దుచేసిరి
సిఏఎలను వ్యతిరేకిస్తూ పోరుచేసెగదరా - నా దేశంలోన
అరె అణచివేయుటకు కుట్రజేసినారో - ఈ మోడీషాలు॥ తల్లీ ॥

ఆ పత్కాలు చుట్టుముట్టెను
మందులు ఇంకా రాకపోయెను
శాస్త్రవేత్తలను ప్రోత్సహించక
విద్యావైద్యం సరుకును జేసిరి
ప్రజారోగ్యమూ గంగలపాలాయే - నా దేశంలోన
శాస్త్రవేత్తలు ఎల్లలు దాటారా - నా దేశం నుంచీ ॥ తల్లీ ॥

అమెరిక చైనా ట్రేడు వారుతో
ప్రపంచ పోటీ పెరిగిపోయెను
ఆర్థిక మాంద్యం హద్దులు దాటెను
సంక్షోభాలూ చుట్టుముట్టెను
మార్కెటు యుద్ధం వద్దనుకున్నారా - సామ్రాజ్యవాదులు
ఈ మహమ్మారికి పురుడు పోసినారా - సామ్రాజ్యవాదులు॥ తల్లీ ॥

ప్రపంచ మార్కెటు కొల్లగొట్టను
బహుళజాతులు చేతులు కలిపిరి
పరిశ్రమలన్నీ ఆక్రమించెను
పాడిపంటలను కబ్జా చేసెను
పాలకులంతా లొంగిపోయె గదరా - సామ్రాజ్యవాదులకు
మరి వర్గపోరుకు సిద్ధం కావాలి - నాదేశంలోన
ఈ మహమ్మారులను తరిమి కొట్టుదాము - ఈ పుడమీ నుంచీ
॥ ఈ మహమ్మారులను ॥ ✤

# నికారుగ్వా వామపక్ష కవి, రాజకీయవేత్త, కేథలిక్ మతాచార్యుడు ఎర్నెస్టో కార్డినల్ మరణం

**తన** జీవితాంతం క్రూర పరిపాలకులకు, నియంతలకు వ్యతిరేకంగా ప్రతిఘటనా పోరాటాలలో క్రియాశీలంగా పాల్గొన్న, నికారుగ్వా దేశానికి చెందిన వామపక్ష కవి ఎర్నెస్టో కార్డినల్ 2020 మార్చి 1వ తేదీన తన 95వ ఏట మరణించారు. ఆయన 1925 జనవరి 20న ఒక ఉన్నత వర్గ కుటుంబంలో గ్రనడా పట్టణంలో పుట్టారు.

నికారుగ్వా సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో కార్డినల్ ఒక ప్రతిఘటనా వ్యక్తిగా కొనసాగారు. రాజకీయంగానూ, కవిత్వపరంగానూ నేటి లాటిన్ అమెరికాకు చెందిన ఒక అత్యంత ప్రముఖ కవిగా పేర్గాంచారు. ఆయన ఇండియాలో పర్యటించిన సందర్భంగా 'హంగ్రీ జనరేషన్' (ఆకలితరం) అనే హిందీ కవుల బృందం ప్రభావితం అయింది. ఆయన రాసిన చాలా కవితలను ఇంగ్లీషు నుంచి హిందీలోకి వారు అనువదించారు. హిందీ సాహిత్య పత్రికలలో వాటిని ప్రచురించారు. ప్రభాతి నౌతియాల్ వంటివారు జె.ఎన్.యులో స్పానిష్ భాష నేర్చుకుని, ఆయన కవితలను స్పానిష్ నుంచి నేరుగా హిందీలోకి అనువదించారు.

కార్డినల్ రోమన్ కేథలిక్ తెగకు చెందిన క్రిస్టియన్ మతాచార్యుడు. ప్రతిపక్షంవారిని చిత్రహింసలకు, హత్యలకు గురిచేస్తూ అధికారం చలాయిస్తున్న సొమోజా వంశీకుల నియంతృత్వ పాలనను వ్యతిరేకిస్తూ సాగిన సాండినిస్టా విప్లవ పోరాటంలో క్రియాశీలంగా ఆయన పాల్గొన్నాడు. ఆయన మార్క్సిస్టు. దేశ విముక్తికై కృషిచేసిన మత శాస్త్రవేత్త (Liberation Theologist). మత వారసత్వాన్ని ప్రజాపోరాటాలలో ఎలా ఉపయోగించుకోవాలో క్రియాశీలంగా చూపించిన కవి కార్డినల్. మత కీర్తనల (Psalms) సాహిత్య బాణీలో విప్లవ కవితలను, గేయాలను ఆయన రచించారు.

ఎర్నెస్టో కార్డినల్ మనగ్వాలోనూ, 1942 నుండి 1946 వరకు మెక్సికోలోనూ, 1947-49లో న్యూయార్కులోనూ సాహిత్య విద్యార్థిగా వున్నారు. జులై 1950లో నికరాగ్వేకు తిరిగివచ్చి, సొమోజాగార్సియా పాలనకు వ్యతిరేకంగా 1954 ఏప్రిల్‌లో జరిగిన విప్లవంలో పాల్గొన్నారు. ఆ ఆకస్మిక తిరుగుబాటు విఫలమైంది. ఆయనతోపాటు పనిచేసిన అనేకులు ఆ పోరాటంలో మరణించారు. తర్వాత కాలంలో ఆయన మెక్సికోలో మతశాస్త్రం చదివారు. 1965లో గ్రెనడాలో ఆయన కేథలిక్ మతాచార్యునిగా (Priest) నియమింపబడ్డాడు. సోలెంటినేమ్ ద్వీపానికి వెళ్ళి అక్కడ ఒక క్రిస్టియన్ పీఠాన్ని స్థాపించాడు. దానిలో సభ్యులు ఎక్కువమంది పేద రైతులే. ఆ తర్వాత అక్కడొక చిత్రకారుల శిల్పుల కాలనీలు ఏర్పాటు చేయడంలో కృషి చేశాడు.

ఈ ద్వీపంలోని అత్యధికులు గెరిల్లా యుద్ధ తంత్రాన్ని పాటించిన విప్లవంలో పాల్గొన్నవారే! 1977లో ఈ ద్వీపంపై సొమోజా సైన్యం దాడిచేసి, అక్కడ వున్న విప్లవ స్థావరాలను ధ్వంసం చేసింది. దీనితో కార్డినల్ అక్కడి నుండి కోస్టారికాకు పారిపోయారు.



సాండినిస్టా ప్రభుత్వం 19 జులై 1979లో................ సాంస్కృతిక శాఖా మంత్రిగా పనిచేశారు. మతాధికారిగా రాజకీయాల్లో పాల్గొనడం నిషిద్ధమంటూ, నికారుగ్వాకు 1983లో వచ్చిన పోప్ జాన్‌పాల్ II కార్డినల్‌ను రాజీనామా చేయమని ఆదేశించాడు. దానిని పాటించని కార్డినల్‌ను 1984 ఫిబ్రవరి 4న సస్పెండ్ చేశాడు. 1987లో సాంస్కృతిక శాఖను ఆర్థిక కారణాల వలన రద్దు చేసేంతవరకు ఆ శాఖ మంత్రిగా ఆయన కొనసాగారు. ఆయనపై విధించిన సస్పెన్షన్‌ను 2019 ఫిబ్రవరి 18న పోప్ ఫ్రాన్సిస్ రద్దు చేశాడు.

సొమోజా ప్రభుత్వాన్ని కూల్చివేసిన సాండినిస్టా జాతీయ విముక్తి ఫ్రంట్ నుండి 1994లో కార్డినల్ వైదొలగాడు. ఈ ఫ్రంట్ నాయకుడు డేనియల్ ఓర్టెగా ఒంటెత్తు పోకడలకు నిరసన తెలియజేశాడు. ఓర్టెగా ప్రభుత్వం విప్లవ ప్రభుత్వం కాదనీ, అది ప్రజలను దోచుకుంటున్న నియంతృత్వమని ప్రకటించాడు. కుహనా విప్లవం కంటే ఒక అధికారిక పెట్టుబడిదారీ విధానమే మేలని 2006 ఎన్నికలపుడు ప్రకటించాడు. 2011లో అమెరికా పర్యటనలో ఆయన మార్క్సిస్టు కనుక కేథలిక్ పాఠశాలలను సందర్శించడాన్ని అక్కడివారు నిరసించారు.

ఈనాటి పరిపాలకుడు ఓర్టెగాను విమర్శించినందుకు, ఓర్టెగా సమర్థకులు కొందరు కార్డినల్ అంతిమక్రియలు కార్యక్రమంలో గొడవలు చేశారు.

## ఎర్నెస్టో కార్డినల్ కవితలు రెండు

### మన కవితలు


మన కవితలు ఎన్నటికీ
ప్రచురణకు నోచుకోవు
వ్రాతప్రతులూ, ఫొటోస్టాట్‌లుగా
ఒకరి నుండి మరొకరికి
చేరుతుంటాయి.

ఏ నియంతకు వ్యతిరేకంగా రాసామో
ఆ నియంత పేరే మంచిపోటీగా
ఆ కవితలు మాత్రం చదువుతూనే వుంటారు -

## ఖాళీ సీసాలు

నా రోజులు
ఖాళీ బీరు సీసాల్లాంటివి
సిగరెట్టు పీకల్లాంటివి
టీవీల్లో కనబడి మరుక్షణం మాయమయ్యే
చిత్రాల్లాగా కొనసాగింది నా జీవితం
రోడ్లపై పరుగెడుతున్న కార్లలాగా
ఆడపిల్లల నవ్వుల్లాగా
రేడియోలో సంగీతంలాగా....
ఆ కారు మోడల్స్ ఎంత అశాశ్వతమో
అందమూ అంతే అశాశ్వతం
రేడియోలో వినబడే హిట్‌సాంగ్స్‌నూ
మరచిపోతాం -
ఖాళీ సీసాలు, సిగరెట్టు పీకలు తప్ప
వెలిసిపోయిన ఫొటోల్లోని చిరునవ్వులు
చింపేసిన కూపన్లు
పొద్దున్నే బార్ల నుండి వూడ్చేసే దుమ్ము తప్ప
ఆ రోజుల జ్ఞాపకాలేవీ లేవు.

**ఆంగ్లం నుండి అనువాదం : కొత్తపల్లి రవిబాబు** ✤




కవిత

# మేమెప్పుడు ఆగిపోయామని?

**మూలం : నజీవాన్ దర్వీశ్**

**అనుసృజన : నిఖిలేశ్వర్**

వెనక్కి వెళ్ళాలన్నా నాకో దేశం లేదు
నన్ను బహిష్కరించిన దేశమనేదిలేదు
పారుతున్న నీళ్లు
ఆ చెట్టు వ్రేళ్లు
ఆగితే అవి చచ్చిపోతాయి
ఒకవేళ ఆగకపోయినా చచ్చిపోతాయి,
మృత్యువు బాహువుల చెక్కిళ్లలో
గడిపేసాను నా మంచి రోజులన్నీ
ప్రతిరోజూ నేను కోల్పోయిన నేల
నాదేనని అనుకొన్న ప్రతిరోజూ-
పరాయవాళ్ల దగ్గరే-

తిరిగి ఆ ఒంటరి నేల,
నా వోటమితో
ఎన్నో రెట్లు పెరిగినాది నా నేల
దాని వ్రేళ్లు నీళ్లలోనే నాలానే
అది ఆగిపోతే ఎండిపోతుంది
అది ఆగిపోతే చచ్చిపోతుంది,
నడుస్తూనేవున్నాం మేమిద్దరం

మానని గాయాలతో-
ప్రవహించే వేడి బాహుల నదితోపాటు,
మేము ఎప్పుడు ఆగిపోలేదు
మేము పరిగెడుతూనే వుంటాం
ఏనాడు ఆగిపోవాలనే ఆలోచన లేదు
మాదారులన్నీ
పరస్పరం కలుస్తామేమోనని ఆశ,
నన్ను బహిష్కరించిన దేశమనేది లేదు
తిరిగివెళ్ళాలన్నా ఏ దేశమూ లేదు
ఇక ఆగిపోతే.......
.......మరణమే !! ✤

వ్యంగ్యం

# లాక్‌డౌన్ @యమపురి

– మనస్విని

"**ఉహువా....** ఉహువా నారాయణ!

ఉహువాహువా.... నారాయణ! నారాయణ!

ఏమిటబ్బా అన్ని ద్వారాలూ మూసి వున్నాయి? అరెరె వైకుంఠపుర ద్వారానికీ, బ్రహ్మలోక, కైలాసపురాల ద్వారాలకీ నో ఎంట్రీ బోర్డు లున్నాయేమిటి చెప్మా! నిత్యం విందు వినోదాలూ, అప్సరసల నృత్యాలూ, గంధర్వగానాలలో సందడిగా ఉండాల్సిన ఇంద్రసభ నిశ్శబ్దంగా తలుపులు మూసుకొని ఉందేమిటి?

ఉహువా.. ఉహువా.... నారాయణ! నారాయణ!

ఈ వెధవ దగ్గొకటి. భూలోకయాత్ర పుణ్యమాని పట్టుకొని వదలడంలేదు. తీరా ఇక్కడికొస్తినా.... ఇక్కడేమో అన్ని ద్వారాలూ మూసి ఉంటివి! ఇపుడేమిటి దారి!

ఆఁ.... అల్లంతదూరాన ఎవరో ఉన్నట్టున్నారే..... అరెరె యమభటులల్లె ఉన్నారే? యమకింకరులకు ఇక్కడేం పనబ్బా? పోనీలే వాళ్ళయినా కనిపించారు. అసలు సంగతేమిటో వాళ్ళనయినా అడిగి తెలుసుకొందాం!

ఉహువా.... ఉహువా.... నారాయణ! నారాయణ!

నారాయణ! నారాయణ! ఉహువా...." అని దగ్గుకొంటూ భూమిని సందర్శించి అపుడే తిరిగివచ్చిన నారదుడు యమభటులు కన్పించిన దిశగా వెళ్ళసాగాడు. ఇంతలో నారదుడ్ని గుర్తించిన యమభటుడొకడు తన పక్కవాడితో....

"ఒరే! ఆ వస్తున్నది నారదులవారల్లే ఉంది! ఈ సమయానికి ఈయనెక్కడనుండి దాపురించాడురా బాబూ! ఒక దగ్గర ఉండడు కదా మహానుభావుడు! పైగా ఆ దగ్గొకటి! సర్లే ఏంచేస్తాం? ముందు నువ్వు అర్జెంటుగా వెళ్ళి ఈయన్నొక ఐసోలేషన్ వార్డులో ఉంచడానికి వీలుగా ఏర్పాట్లు చేసి ఉంచు. మళ్ళీ తేడా వస్తే పాపులకు వేయాల్సిన శిక్షలు మనకు వేసినా వేస్తారు యముండగారు!" అన్నాడు.

ఇంతలో సంగతేమిటో కనుక్కొందాం అని నారదుడు నోరు తెరిచి అరవబోయేంతలో నారదుడి ముఖానికి ఒక ఎన్95 మాస్కూ, చేతిలో ఇంత డెటాల్ శానిటైజరూ పోసాడు యమభటుడు. మేడిన్ దేవలోకం అనడం మూలానో ఏమోగానీ ఎంత గింజుకొన్నా నారదుడికి మాస్కులోంచి మాట బయటికి రాలేదు. శానిటైజరు రుద్దగానే 'మాయాబజార్' సినిమాలోని లక్ష్మణ కుమారుడికి మల్లే చేతులు రెండూ అతుక్కుపోయాయి. బహుశా సంకెళ్ళేసామని చెప్పకుండానే బంధించే స్పెషల్ ఎఫెక్ట్ అయి ఉంటుంది. ఏం జరుగుతుందో అర్థమయ్యేలోగానే భూలోకంలోని అంబులెన్సులాంటి వాహనంలోకెక్కించి యమలోకంలో ఒక గదిలో దించేశారు.

భూలోకాన్ని ప్రస్తుతం వణికిస్తున్న కరోనా దేవలోకాన్ని కూడా భయపెడుతున్నది అని అర్థమవుతుండగానే అయినా దేవతలకు మరణభయమా? అన్న సందేహం తలెత్తినది నారదుడి మదిలో.... అంతలోనే సమస్త జీవరాశినీ సృష్టించిన బ్రహ్మ, తన ఆజ్ఞలేనిదే చీమనయినా కుట్టనివ్వని లయకారుడు శివుడూ, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ గావించి సమస్తలోకాల్నీ రక్షించే శ్రీ మహావిష్ణువూ ఉండగా దేవతలకేల భయం? బహుశా ఈ జాగ్రత్తలన్నియూ భూలోకము నుండి వచ్చిన మానవమాత్రుల కొరకై ఉంటివి. అని నారదుడు సమాధాన పడడానికి ప్రయత్నించాడు.

అదే సమయానికి ఐసోలేషన్ వార్డుల్లోని వారిని చూడడానికి యమధర్మరాజు తనతోపాటు కొందరు ఎంబిబిఎస్, ఎంఎస్, గోల్డ్‌మెడలిస్ట్ భటులతో రౌండ్స్‌కి బయలుదేరాడు. సాధారణంగా తలకి మోయలేనంత కిరీటం, భుజకీర్తులూ, పావుకోళ్ళూ, పట్టువస్త్రాలతోపాటు చేతిలో గదో, విల్లంబో, కరవాలమో ఉంటుంది దేవతలంటే.... కానీ ప్రస్తుతం కరోనా కాలంలో ముఖానికి పట్టు మాస్కూ, మెడలో బంగారు శానిటైజర్ హారం, 'కరోనా' కవచధారులై దర్శనమిచ్చారు. మాస్కులోని ముఖాన్ని గుర్తుపట్టలేకపోయినా సూట్ మీద ముద్రించిన చిత్రపటాన్ని పోల్చుకొన్న నారదుడు ఇందాక మాస్కు వేసుకోగానే మూసుకొనిపోయిన గొంతు పెగుల్చుకుంటూ "ప్రభూ ఏమిటీ విచిత్రం?!" అని అన్నాడు యముడితో....

మాస్కులో ఉన్న నారదుడ్ని గుర్తుపట్టలేక యముడు "ఎవడురా ఈ అసంధర్భ ప్రలాపి?" అని యస్వీరంగారావు స్టైల్లో అడిగాడు.

"నారాయణ! నారాయణ!! నేను దేవా నారదుడ్ని. భూలోకయాత్ర ముగించుకొని ఇవ్వాళే తిరిగి వచ్చాను"

"ఆఁ నారదుడివా? భూలోకాన్నించి వస్తున్నావా? అక్కడికెందుకెళ్ళావ్? ఎపుడు వెళ్ళావ్? కోపంగా అడిగాడు యముడు.

"ప్రభూ! భూలోకమునందు జనులు కరోనా వ్యాధిగ్రస్తులై పిట్టల్లా రాలిపోతున్నారంటే సంగతేమిటో తెలుసుకొందామని వెళ్ళాను. చీనాలోని వూహాన్ నగరముతో ప్రారంభించి ఆ మహమ్మారి ఏ ఏ రాజ్యాలను కబళిస్తుందో ఆయా రాజ్యాలను సందర్శించుకొంటూ చివరిగా భారతదేశాన్ని కూడా సందర్శించి ఇవ్వాళే వచ్చాను" భయపడుతూ జవాబిచ్చాడు నారదుడు.

"హుఁ! చేశావులే పెద్ద ఘనకార్యం! ఎవరక్కడ? వెంటనే నారదునికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్ష గావించి రక్తనమూనాలు సేకరించుము!" అంటూ ఆజ్ఞాపించాడు యముడు.

"చిత్తం ప్రభూ!" అంటూ శిరసావహించాడొక ఎంబిబిఎస్, ఎంఎస్, గోల్డ్‌మెడలిస్ట్ భటుడు. థర్మల్ స్క్రీనింగ్‌లో నెగెటివ్ రావడంతో "హమ్మయ్య!" అని ఊపిరి పీల్చుకొని శాంతించిన యముడు....

"చూడు నారదా! నెలరోజుల క్రితం దేవలోకవాసులందరికీ భూలోకయాత్ర నిషేధించడం జరిగింది. 3 వారాలనుండే లాక్‌డౌన్ అమలులో ఉంది. అంచేత నీవు జాగ్రత్తగానుండుము" అని యముడనగా కరోనా మహమ్మారి దేవతల్ని కూడా భయపెడుతున్నదా? అన్న ఇందాకటి సందేహం మళ్ళీ మేల్కొన్నది నారదుడిలో....

"కానీ ఇదంతా ఎందుకు ప్రభూ? నాకేమీ అర్థం కావడంలేదు" అన్నాడు నారదుడు.

ఎందుకేమిటి ఎందుకు? కరోనా మహమ్మారి మనల్ని కబళించకుండా ముందు జాగ్రత్త! అధిక ప్రసంగం ఆపి బుద్ధిగానుండుము. మా భటులు కరోనా గైడ్‌ను కాసేపట్లో అందించగలరు. దానిని అనుసరిస్తూ అటు పేషెంటువీ, ఇటు పేషెంటు జీరోవీ కాకుండా నుండుము! అర్థమయ్యిందా? అంటూ యముడు ఆవేశపడుతుండగా....

"ఆ.... ఏవిటీ? కంటికి కనుపించని సూక్ష్మజీవి అయిన కరోనా అంటే దేవతలకి భయమా? సమస్త జీవజాలానికీ అధినాథులైన దేవతలకి, దీనులైన ప్రజల్ని రక్షించాల్సిన దేవతలకి మరణభయమా? నమ్మలేకపోతున్నాను ప్రభూ!" అన్నాడు నారదుడు.

"ఏమిటి నారదా? భూలోకమునందలి శ్వేతరాజ్య అధ్యక్షుడు ట్రంపులా మాట్లాడుతున్నావే? అచటి నుండి ఈ యహంకారమునేనా, లేక కరోనాను కూడా కొంత మూటగట్టుకొని వచ్చితివా?" అంటూ నారదుని మాటలకి ఆగ్రహించిన యముడు కళ్ళెర్రజేశాడు.

వెంటనే నాలిక్కరుచుకొని.... "లేదు ప్రభూ! నా ఉద్దేశ్యం అది కాదు. అసలు మనకీ కరోనా భయమెలా పట్టుకొందో సెలవియ్యండి!" అని ప్రాధేయపడ్డాడు నారదుడు!

"అదేనయ్యా నారదా! అంతకుముందు చీనాలోనూ, ఇతర దేశాల్లోనూ జనులెంతగా మరణిస్తున్నా పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకనగా వాళ్ళంతా వాళ్ళ వాళ్ళ మతానుసారం ఏ "ఈడెన్ గార్డెన్స్"కో అల్లా వద్దకో పోతారు కానీ మన దగ్గరికి రారులే అని ధీమాగా ఉన్నాం. పైగా భూలోకమునందలి మన కలెక్షన్ ఏజెంట్లు (స్వామీజీలు, బాబాలు) "గోమూత్రం, పేడ ఉండగా మనకండగా, కరోనా అంటే భయమెందుకు దండగ" అని ప్రచారం మొదలుపెడితే నిజమే అనుకున్నాం. పుష్కరాలు, కుంభమేళాలపేరిట లక్షలాదిమంది జనం ఒకేచోట గుమిగూడినా రాని జబ్బులు ఇపుడెందుకు వస్తాయిలే అని వాట్సాపు యూనివర్శిటీవారు ధైర్యం చెప్పగా రిలాక్సయిపోయాం! కానీ నెల క్రితం భారతదేశం నుండి కరోనా రోగి చనిపోయి ఇక్కడికి రావడంతోనే మొదలయ్యింది అసలు కథంతా...." నిట్టూర్చాడు యముడు.

"త్రిమూర్తులూ ఇంద్రాది దేవతలూ ఉండగా భయమెందుకు ప్రభూ?" పాతపాటే పాడాడు నారదుడు.

"అదుగో మళ్ళీ! హఁ! అయినా నీకు అర్థంకాదులే.... ఒకప్పుడు తాను చిత్రహింసలపాల్జేసిన దేశాలేదేతే భంగపడ్డా బుద్ధిరాక, ఇప్పుడు ఆ దేశాలే మందులూ, వైద్యసహాయమూ పొందుతున్నా నెత్తికెక్కిన కళ్ళు దిగక ప్రపంచదేశాల్ని బెదిరిస్తున్న ట్రంపులా తయారయ్యావు! అందుకే ఇందాకటి నుండీ దేవతలుకు భయమా? దే....వతలకి భయమా? అని తెగ మిడిసిపడుతున్నావు." అన్నాడు యముడు.

లేదు ప్రభూ! క్షమించండి! తర్వాతేం జరిగింది? అడిగాడు నారదుడు.

"ఏముంది? వెంటనే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి త్రిమూర్తులను ఉపాయం అడిగాం. కరోనా పేరు వినగానే బ్రహ్మగారు 4 రెళ్ళు 8 కళ్ళూ మూసుకొని సమాధి అవస్థలోకి పోయారు. మిగిలిన ఇద్దరేమో రాక్షసులైతే జయించేసాం గానీ క్రిమిరాక్షసిని ఏం చేయగలం అంటూ చేతులెత్తేశారు. దాంతో ఏంచేయాలో తెలియక లాక్‌డౌన్ ప్రకటించేశాం. అప్పటికే కొందరిలో దగ్గూ, జలుబూ మొదలయి, దేవనర్తకి రంభకూ జ్వరమూ, జలుబూను.. అందుచేత అలా చేయాల్సి వచ్చింది." ఓపిగ్గానే వివరించాడు యముడు.

"కానీ ప్రభూ మరణాన్ని జయించే అమృతం ఉండనే ఉందికదా? అందరికీ ఇంకోసారి పంచేయలేకపోయారా?" సందేహించాడు నారదుడు.

"ఆఁ! ఆమాత్రం మాకు తెలీదుటయ్యా?! ఇలాంటి సమయంలో అయితే దేవతలకూ, దానవులకూ సమానంగా "మోహినీ" వంటి కుట్రలేం చేయకుండా పంచాల్సి వస్తుందన్నది ఒక బాధ అయితే అసలే క్షీరసాగర మదనమప్పుడు పుట్టింది కదా? ఇంకా ఫ్రెషుగానే ఉందో, పులిసిపోయిందో? ఎవరికి తెలుసు? తెలిసినవారంతా తలుపులేసుకొని కూర్చున్నారయ్యే!" తల బాదుకున్నాడు యముడు.

"మరి ప్రభూ! హరి హరులిద్దరూ ముఖం చాటేశారంటే పోనీలేగానీ, సృష్టికర్త అయిన బ్రహ్మ కూడా ఈ ఆపత్కాలంలో మనకు మార్గనిర్దేశం చేయడానికి బయటికి రాలేదా?" అనుమానంగా అడిగాడు నారదుడు.

"ఆఁ! వస్తాడొస్తాడు. ఎందుకు రాడూ? వారానికోసారి నాలుగు ముఖాలకీ 4 మాస్కులేసుకొచ్చి రాత్రి 9 గంటల నుండీ పదినిమిషాలు దీపాలన్నీ ఆర్పేసి కొవ్వొత్తి వెలిగించి చప్పట్లు కొట్టండనో, సాయంత్రం 5 గంటలకు గంటలు కొట్టండనో చెపుతూ ఉంటాడు మహానుభావుడు" వెటకారంగా అన్నాడు యముడు.

"దేనికి ప్రభూ?" కుతూహలంగా అడిగాడు నారదుడు.

దేనికా? తెలీదుటయ్యా ఆమాత్రం? మళ్ళీ భూలోకయాత్ర చేశావు పెద్ద?! రాత్రి 9 గంటలకి దీపాలన్నీ ఆర్పేస్తే కరోనా వైరస్‌కి కళ్ళు కన్పించక గోడలకు గుద్దుకొని చచ్చిపోతుందనుకొన్నాడు! అందుకని మా అందరిచేతా చేయిస్తున్నాడు. యముని గొంతులోని వెటకారాన్ని గుర్తించని ఒక ఎంబిబిఎస్, ఎంఎస్, గోల్డ్‌మెడలిస్ట్ వెంటనే ఉత్సాహంగా.

"అంతేకాదు నారదుడుగారూ! చప్పట్లు కొడితే శబ్దతరంగాల నుండి శక్తి ఉత్పత్తి అయి అది న్యూట్రాన్లుగానూ, ఫోటాన్లుగానూ, ఇంకేదోగానూ మారి వైరస్‌ని చంపేస్తుంది" అని పొద్దున్న వాట్సాపు యూనివర్శిటీలో చదివిన పాఠాన్ని అప్పజెపుతూ యముని కనుసైగలకు ఆగిపోయాడు.

"ఆc.. హాc... అదా సంగతీ!" అంటూ దేవతల శాస్త్రపరిజ్ఞానానికి నోరు వెళ్ళబెట్టిన నారదుడు "ప్రభూ! మరి భూలోకంలోకి శ్వేతరాజ్యాధ్యక్షుడు చీనావారే ఈ వైరస్‌ని కనిపెట్టి ప్రపంచం మీదికి ఒదిలారంటూ పళ్ళునూరుతున్నారే? అదంతా నిజమేనంటారా?" అని తన రాజకీయ సందేహాన్ని వెలిబుచ్చాడు నారదుడు.

"ఏడిశారు! చేయాల్సిందంతా చేయడం! తేడా వస్తే పక్కవాళ్ళపై తోసేయడం అలవాటేకదా ఈ రాజులకు?" భవిష్యత్ తరాలకు ప్రకృతిని అందకుండా చేయడానికి మీకెంత ధైర్యం?" అని పదిహేనేళ్ళ పసిపాపతో అడిగించుకొన్నా బుద్ధిరాలేదు వెధవలకి! అన్నాడు యముడు.

"అంటే ఏమిటంటారు ప్రభూ? ఈ వైరస్ జన్మించడంలో చీనాదేశంవారి ప్రమేయం ఏమీ లేదంటారా?" అడిగాడు నారదుడు.

"దేశాలు దేశాలంటావేం నారదా? ఎంత దోచుకున్నా తీరని వ్యాపార దాహంతో వెనకాముందూ చూసుకోకుండా తమ గోతులు తామే తవ్వుకొనే బహుళజాతి కంపెనీలకూడిగం చేసే రాజ్యాంగాలే కదా అవన్నీ! ఆ కంపెనీలు తమ దురాశ కోసం ప్రకృతిలోని సహజ పరిస్థితుల్ని అసహజంగా మార్చేస్తున్నాయి. కేవలం తమ వ్యాపారానికి అనుకూలంగా మొక్కల్ని, జంతువుల్ని జన్యుమార్పిడులకు గురిచేస్తూ ప్రకృతి సహజత్వాన్ని చంపేస్తున్నారు. అటువంటి జన్యుమార్పిడికి గురైన ఆహారాన్ని తినడం వలనే మనుషులూ ఇటువంటి విచిత్ర వైరస్‌ల బారిన పడుతున్నారు. ఈ విషయాలన్నీ మాట్లాడకుండా దేశాలమీదకి సమస్యని నెట్టేయడం కేవలం శవాలమీద రూపాయలు ఏరుకొన్నట్లుగా ఇటువంటి సమయంలోనూ విద్వేషాల్ని రెచ్చగొట్టడమే." అన్నాడు యముడు.

"మరి ప్రభూ తక్షణ కర్తవ్యమేమిటి ఇపుడు?" అడిగాడు నారదుడు.

"ఏముంది నారదా?! ఈ పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకోవాలి! అపుడు వాళ్ళే మార్చుకొంటారు. అంతదాకా మనకీ మాస్కులూ, శానిటైజర్లు తప్పవు మరి!" చెప్పాడు యముడు! ✤

కవిత

# అందరూ సిద్ధంకండి

- అనంతరావు

ఓ పాలకులారా
కళ్ళు తెరవండి
ఇవాళ ప్రపంచం తేరుకోలేని
విషాదంలో ఉంది
మూఢత్వంలో మునిగి ఉంది
ప్రతి మనిషి జీవితం, ఆరోగ్యం
సైన్సు తోనే ముడిపడి ఉన్నాయి
దీపాలు ఆర్పేసి
దీపావళి జరుపుకొని
చప్పట్లు కొడితే
వ్యాధి పారిపోదు
అది నివారించే ఔషధం కావాలి
కోకొల్లలుగా కావాలి
చికిత్స చేసి సేవలందించే వారికి
తగిన సదుపాయం కావాలి
ప్రజా సంక్షేమం అంటే
విమర్శలూ, కొట్లాటలు కాదు
చేతలు లేని మీ మాటల గారడితో
పేద ప్రజలు ఆకలి తీరాలకు
కొట్టుకు పోతున్నారు
అందరం స్వయం ఖైదీలుగా
బతుకులీడుస్తున్నాం
మతం మత్తులో జోగకండి
ఏ మతాన్ని, కులాన్ని తిట్టకండి
ఏ దేవుని మహత్యాలు
ప్రజలని కాపాడలేవు
ఇంత విషాదంలో ఉన్నా
అక్కడక్కడా దేవుడి పెళ్ళిళ్ళు
నాయకుల పిల్లల పెళ్ళిళ్ళు
యధాతధంగా జరిగిపోతున్నాయి
ఇది మూఢత్వానికి పరాకాష్ట
కొన్ని రోజులు ఈ
కార్యక్రమాలు ఆపినంత మాత్రాన
కొంపలంటుకుపోవు
ఏ దేవుడూ మిమ్మల్ని దండించడు
ఏ విభూది ప్రసాదాలు తినకండి
కొత్త రోగాలు కొని తెచ్చుకోకండి
సైన్సుని నమ్మకపోతే
ముదనష్టపు చావులు చస్తాం
ఈ విషాదాన్ని తప్పించుకోవాలంటే
వైద్యో నారాయణో హరి అనుకొని
వైద్యోద్యమంలో ముందడుగు వేయండి
అందుకు అందరూ
సిద్ధంకండి ✤

# ప్రజల గుండెల్లో ప్రతిధ్వనించిన ఆదిధ్వని

- డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు



**నాగరికత** పేరుతో ప్రబలుతున్న పరాయీకరణకు దూరంగా కొండల్లో కోనల్లో బతుకుతూ, స్వేచ్ఛావాయువుల్లో పరిభ్రమిస్తూ, స్వచ్ఛ జీవన ప్రవంతిలో ఊగితూగే ఆదివాసులు అరచినా, అరచేత్తో చరిచినా కృతకం కాని నాదం కొండలు దద్దరిల్లేలా ప్రతిధ్వనిస్తుంది. వారెన్నడూ లక్ష్య లక్షణాలు తెలిసి ఎలుగెత్తి పాడినవారు కాదు. తాళ భరతం నేర్చుకొని లయలు మార్చి విన్యాసాలు పలికించడం తెలిసినవారుకాదు. ఏ ఎండకా గొడుగు పట్టలేని స్వేచ్ఛా జీవులకు లాలనలూ, లావణ్యాలూ ఏం తెలుస్తాయి: అయినా ఆదివాసులు వ్యాపార సౌధాల్లో మాస్క్ మీద మాస్క్ తొడుక్కుంటూ కరుడుగట్టి జీవత్వం నశించిన శిలలు కాదు. ప్రకృతికి పరవశిస్తూ, అందులో భాగమై ఆనందాన్ని అనుభవిస్తూ శుద్ధ సౌందర్యం ఉట్టిపడేలా నాట్యం చేస్తారు. ఆదివాసులు ఆహ్లాదంతో గానం చేస్తే అది స్వచ్ఛసౌందర్య రాగమై ప్రతిధ్వనిస్తుంది. చెట్లల్లో పుట్టల్లో మూర్ఛనలు సాగి ప్రపంచాన్ని పరవశింపజేస్తుంది. అదే ఆనందంలో మెడకు తగిలించుకున్న డోళ్ళ మీద దరువేస్తే అది మేఘ గర్జనతో మమేకమై గంభీరనాదంతో కొండకోనల్లో ప్రతిధ్వనిస్తుంది. కొంచెం హేతుబద్ధంగా పుట్టు పూర్వోత్తరాలు ఆలోచిస్తే, నాగరికుల జీవనంలో ప్రధాన పాత్ర వహించే సంగీతానికి మూలమైన ధ్వనులన్నీ ఆదివాసుల జానపద సంగీతంలోనే ఉన్నాయనేది తెలుస్తుంది.




వర్గపోరాటంలో అగ్రత్వ ఆధిపత్య అవసరాల ఆక్రమణలో రాసుకున్న పురాణాలు పరిణామ జ్ఞానాన్ని విడిచిపెట్టి కుహనా ప్రమాణాలతో నమ్మిస్తూ సంగీతానికి, అందులోని వాద్యాలకీ కూడా సృష్టికర్తల్ని తయారు చేశారుగాని, నిజానికి ఆనందంలో ఆదిమానవుడు అరచిన అరుపులే సంగీతానికి మూలాలు. వేసిన అడుగులే నాట్యానికి పునాదులు. వైద్య, స్థాపక, పాలక, యుద్ధ విద్యలెలా అభివృద్ధి చెందాయో, అలాగే నిసర్గ సౌందర్య శోభితమైన నాద విద్య కూడా అభివృద్ధి చెందింది. సాహిత్యాన్ని ఎలా మార్గ ప్రమాణాలు చేర్చి రెండుగా విడదీసి ఒక వర్గాన్ని సామాన్యుడికి దూరంగా తీసుకెళ్ళారో, అలాగే సంగీతానికి కూడా మార్గ విలువలుకూర్చి ఒక భాగాన్ని వర్గ విద్యగా మార్చారు. ఆ రంగంతో ఆధిపత్య ధోరణితో వ్యవహరించడం మనం చూస్తున్న సత్యం! ఆ నేపథ్యంలో రాసుకున్న శాస్త్రాలు పాండిత్యం మార్గ (classical) సంగీతానికి ఆధారాలుగా నిలిస్తే, సమస్త ప్రకృతి, ఆ ప్రకృతిలో జనించే ధ్వనులూ దేశి (folk) సంగీతానికి ఆధారంగా నిలిచాయి. అయితే ప్రపంచంలోని ఏ జీవరాశి గాని, ఏ ప్రక్రియగాని పరిణామక్రమం నుంచి బైటపడలేవన్న సత్యాన్ని రుజువు చేస్తూ, ఎన్నెన్ని విభజనలు చేసినా అన్ని వైపులా అభివృద్ధిగతమైన మార్పులు జరుగుతూనే ఉంటాయి. మనిషి జీవనం ఏ దిశగా సాగుతుందో అన్నీ అటువైపే నడుస్తాయి. ఆ గమనానికి దేశ, ప్రాంత, వర్గ, వర్ణ భేదాలుండవు. క్రీ.పూ. 3000 సంవత్సరాలకు పూర్వం బాబిలోనియా ప్రాంతంలోని 'ఉర్' నగర శిథిలాల్లో లభ్యమైన ఒక తంత్రీవాద్యం భారతదేశంలోని తమిళనాడు ప్రాంతంలో బైట పడిన 'యాళ్' అనే వాద్యానికి చాలా దగ్గర పోలికలున్నాయి. ఆనాడు ఈ రెండు ప్రాంతాలకీ కనీస రాకపోకలు కూడా లేవు. ఇది చూసే కొందరు పరిశోధకులు ప్రపంచంలో ఒక కాలంలో జరిగే ఒక మార్పు ప్రాంతాన్ని బట్టి కొద్దిగా వేరుగా ఉన్నా ఒకే ప్రమాణంలో ఉంటుందని నిర్ధారించారు.

నగర నాగరికతల మధ్య ఆయా ప్రాంత, మత, జీవన శైలులు చేరి వేరు వేరు మార్గాల్లో, వేరు వేరు పేర్లతో పిలువబడడం మార్గ సంగీతంలో చూస్తాం. ఉదాహరణకి అమీర్ ఖుస్రూ భారతదేశానికి వచ్చే వరకు భారతీయ సంగీతం ఒక్కటే. అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఆస్థానంలో ఖురాన్ చదవడం కోసం పర్షియా నుంచి వచ్చిన సంగీత పండితుడు అమీర్ ఖుస్రూ, గొప్ప ప్రయోగ శీలి. పర్షియన్ సంగీత మూలాల్ని

భారతీయ సంగీతంతో మేళవించి హిందూస్తానీ సంగీతాన్ని రూపొందించాడు. ఉత్తర భారతంలో మహమ్మదీయ ప్రభువుల పాలన వల్ల హిందూస్థానీ సంగీతం బాగా అభివృద్ధి చెందింది. అసలు భారతీయ సంగీతం దక్షిణాదికే పరిమితమై కర్నాటక సంగీతం అనే పేరుతో ప్రసిద్ధమైంది. అలాగే అన్ని దేశాల సంగీత శాఖల్నీ గుర్తించవచ్చు.

ఇలాంటి కలోనియలిస్టిక్ (వలసవాద) స్పర్శ జానపద ఆదివాసీ సంగీతానికి అంటలేదు. కనుకనే ఒక దేశ ఆదివాసి సంగీతాన్ని మరొక దేశ అబారిజాన్ మ్యూజిక్‌కీ పెద్ద వ్యత్యాసం కనిపించదు. అలాగే వాద్య విధానంలోనూ పెద్ద తేడాలుండవు. విశ్వవ్యాప్త సాహచర్యం కనిపిస్తున్నా అది యాదృచ్ఛికమేగాని వ్యాపార దృష్టితో తెచ్చుకున్న అంటు జాడ్యం కాదు. అది మానవుని అంతఃసృజన సామీప్యతకి సంకేతం. ప్రపంచీకరణ చోటు చేసుకున్నాకనే కాదు, మొదటి నుంచీ నాగరిక జీవనుల దృష్టి ఎందుచేతనో ప్రకృతి సిద్ధమైన సౌందర్య సంపద వైపు ఉండేది కాదు. అందరికీ అందని చోట తానుండాలనే స్వార్థ బుద్ధి మూలాలను గుర్తించి వారసత్వ సంపదని కాపాడుకోవాలన్న ఇంగితాన్ని కోల్పోతుంది. ఫలితంగానే ఆదివాసీ, జానపద సంగీత మార్గాలు కులాల, ఉపకులాలను దాటి రాలేక అక్కడే ఆగిపోయాయి. నిన్నటి తమ తమ మూలాలు గుర్తించలేని దశలోకి వెళ్ళిపోయిన సంగీత కళారంగానికి ఈనాడు తన ఉనికినే కాపాడుకోలేని కాని కాలం ఏర్పడింది. ఈనాటి ఈ ప్రపంచీకరణ జీవన ప్రస్థానంలో రాగాలు భోగాలు ఎవరిక్కావాలి ? అందుకే సంప్రదాయ సంగీతం కూడా నగర మూలల్లో తలదాచుకుంటున్నది.

మరొకవైపు పల్లెలూ పొట్ట చేతపట్టుకుని పట్టణాల వైపు ప్రయాణిస్తున్న స్థితి. నగర నాగరికత పేరుతో విష సంస్కృతిని వ్యాప్తి చేస్తున్న దశ. రైతు నుంచి కూలివాడు వరకూ వ్యవసాయం నుండి గెంటివేయబడుతున్న అవస్థలో, జానపద ఆదివాసీ సంగీతం గురించి మాత్రం వేరుగా చెప్పాలా ? నశించి పోతున్న ప్రకృతిలో అడవి బిడ్డల ఆవాసానికే తావు దొరకని పరిస్థితిలో వారి ఆనంద మెక్కడ? వారి సంగీత మెక్కడ ? అడవులు నరికి అంతఃపురాలు వెలసిన చోట ఏ వాదకుడు తనకు మొగిలి కాండం కావాలనీ, జింక చర్మం కావలని, ఉడుం చర్మంతో కంజీరా మూసుకోవాలనీ అడగ్గలడు ? పొద్దంతా అపార్టుమెంట్ నిర్మాణంలో బొచ్చెలు మోసిన చేతులతో ఏ వాద్యం పలికించగలడు ? ఏమానందం అనుభవించగలడు ?

ఇదిలా వుంచి ఒక్కసారి వెనక్కి వెళ్ళి చూస్తే నిచ్చెన మెట్ల సాంఘిక వ్యవస్థలో కులాల అంతరాలను సంగీతానికీ అంటగట్టి ఆదివాసీ గానానికి అస్పృశ్యతని మెడకు చుట్టి, యాచనని అర్హతగా అంటగట్టి నెట్టివేసిన సమాజం మనది. మనిషికి అలవోకగా సిద్ధించే గాయక వారసత్వాన్ని లయాత్మక పారంపర్య లక్షణాన్ని కృతక భేదాల చాటున దూరం చేసుకున్న దౌర్భాగ్యం మనది. అయినా ఆశచావక ఆ కళల్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న జానపదులు లేకపోలేదు. కాని వాళ్ళే ఆ కళలకు ఆఖరి వారసులని వారికి తెలియదు. ఈ కఠోర సత్యం వాళ్ళు జీవించి ఉండగా వారికి తెలియకపోవడమే మంచిదని అనుకుంటాను. అలాంటప్పుడే ఆశ నుంచి, ఆవేశం నుంచి ఆవిర్భవించే వారి కళా నైపుణ్యం కుంటుపడకుండా సాగిపోతుంది.

ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న ఆదివాసీ సంగీత సౌభాగ్యాన్ని భావితరాలకు తెలియజేయడం కర్తవ్యంగా భావించి, ముందుకొచ్చి నాలుగు దశాబ్దాలుగా కృషిచేస్తున్నారు ఆచార్యుడు జయధీర్ తిరుమలరావు. ఇంత వరకూ నేదునూరి గంగాధరం, బిరుదురాజు రామరాజు వంటి ఎందరో జానపద విజ్ఞానం, సాహిత్యం మీద పరిశోధన చేసినా, వారెవరూ ఆదివాసుల జీవన మూలాలను స్పృశించలేదనే చెప్పవచ్చు. తిరుమలరావు ఆ బాధ్యతనే నెత్తినేసుకున్నారు. ఫలితంగా ఆదివాసీ కళారుపాలు, ఆ కళలు వారి జీవనశైలిలో భాగం కావడం, వారి సంగీతం, వారి మౌఖిక సాహిత్యం, అవి గానం చేస్తున్న విధానం, వారి వాద్యసంపద ఆయన పరిశోధనలో భాగమైనాయి.

ఆదివాసీ గిరిజన హృదయ స్పందన తనదిగా స్వీకరించిన జయధీర్ తిరుమలరావు అందులోని ఆధిపత్య నిరసన పట్ల బాగా ఆకర్షితులైనారు. గిరిజనులు ఆధారిత కులాలు తమ తమ ఆవేదనని కళారుపాల్లో వ్యక్తపరచిన విధానం గొప్పగా కనిపించింది. ఒకవైపు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తూనే ఆదివాసీ జీవితాల వైపు తన అన్వేషణ సాగించారు. తెలుగు విశ్వవిద్యాలయ ప్రధాన కేంద్రం హైదరాబాదులో పనిచేస్తున్న కాలంలో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లోనూ, రాజమండ్రి సాహిత్యపీఠంలో పనిచేస్తున్న కాలంలో ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంతల్లోనూ తన పరిశోధన సాగింది.

జయధీర్ తిరుమలరావు అన్వేషణలో 'తెలుగు రాత ప్రతులు', 'నిషేధ గీతాలు', 'ఆదివాసీ జానపద కళలు–సంస్కృతి–ఒక కర్తవ్యం', 'తెలంగాణ సాయుధ పోరాట పాటలు', 'ప్రజాకళా రూపాలు', 'దళిత గీతాలు' మన ముందుకొచ్చాయి. లిపి లేదనుకున్న గోండుజాతి వారి భాషకు ఈయన కృషితో లిపి చేకూరింది. ఆదిలాబాద్ జిల్లా 'గుంజాల' గ్రామంలో దొరికిన పది రాత ప్రతులు గోండుభాష లిపికి ఆధారమైనాయి. "గుంజాల గోండు లిపిలో ఉంది వాచకం' అనే పుస్తకంలో తిరుమలరావు ఆదివాసులే ఆది సాంస్కృతిక వారసులని రుజువుచేశారు. ఆధారిత కులాల అంతరంగాల నుంచి కుల పురాణాలు వెలికితీసి ప్రపంచాని కందించారు. ఇవన్నీ ప్రత్యామ్నాయ పురాణాలు. వీటిలో తలమానికమైన 'జాంబపురాణం' తన సంపాదకత్వంలో సేకరించి ముద్రించడం గొప్ప విషయం. ఈ దేశపు కుల వ్యవస్థ అసలు రంగు చూపించే గొప్ప పురాణం ఈ జాంబపురాణం.

మౌఖిక సాహిత్య సేకరణే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న జయధీర్ తిరుమలరావు ఆదివాసుల సంగీత వాద్యాల పట్ల దృష్టి సారించారు. ఆ వాద్యాలు కేవలం నాదాలు పలకడమే కాదు. అవి ధరించి మ్రోగించే వారి చరిత్రకి సాక్ష్యాలు. స్వయం నిర్మిత దేశీయ వాద్యాలు. సమాజంలో ఒక చోట నిలిచి నివసించడానికి కూడా నోచుకోని సంచార జీవనుల జీవన పోరాటానికి ఆలంబనగా నిల్చిన వాద్యాలు. యాచనే జీవనంగా బ్రతుకు భారాన్ని మోస్తున్న ఆధారిత కులాలకు అస్థిత్వ ముద్రలు. నాగరికత ముసుగులో చొచ్చుకొస్తున్న విదేశీ వాద్య హోరు నుంచి

తన్ను తాము కాపాడుకుంటూ మూలకు ఒదిగి కొన ఊపిరితో నున్న దేశీయ మూలాలకు ప్రతినిధులు. సంచారంలోనే సర్వస్వాన్ని కాపాడు కుంటున్న సత్యవారసత్వాలు. అటువంటి మౌలిక భావనసర్థం చేసుకున్న జయధీర్ అవి సేకరించి భవిష్యత్తరాలకు కనీసం చూపించడం బాధ్యతగా భావించి వాద్య సేకరణకుపక్రమించారు. అంతే ఎక్కడెక్కడ లభించిన వాద్యాలను సంగ్రహించటం మొదలుపెట్టారు. వాటి ఉనికి తెలిసి అవి దొరక్కపోతే, అవి మ్రోగిన తావు కల్లా వెళ్ళి ప్రయత్నించి మరీ, సేకరించారు. ఆదివాసీ వాద్య పరికరాలన్నీ తన యింటి బిడ్డలై మొలచుకొచ్చాయి.

ఆదివాసీ నగార, నగర నగార, గోండీ డప్పులు, తుడుం, ఢమరుకాలు, వీరణాలు, దుబ్బు వాద్యం, రుంజలు, జమిడికలు, రకరకాల కొమ్ములు, కద్దీ వాద్యాలు, సమ్మెట్లు, గిరిజన డోళ్ళు, గిల్లికాయలు, ఏక్‌తారాలు, విల్లు వాద్యం, శారద బుర్రలు, చిన్న చిడతలు, అందెం జోళ్ళు, రకరకాల గజ్జెల కట్లు, అందెల డోళ్ళు, గుజ్జడి మొగ్గలు, బుడికెలు, బుర్రవీణ ఇలా రకాల వాద్యలు ఎన్నెన్నో ఆయన సేకరణలో భాగమైనాయి. ఆ సేకరణలో నాదస్వరం, తవిల్, మృదంగం, కంజీర, ఘటం మోర్సింగ్, తబ్లా వంటి సంప్రదాయ వాద్యాలు కూడా భాగమైనాయి. మొత్తం దాదాపు 220 వాద్యాలు తిరుమలరావు సేకరించి, ప్రదర్శిస్తున్నారు. ఈ కృషిలో ఆయనకి సహకరించినవారు కుటుంబ సభ్యులతో పాటు పాలమూరు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న గూడూరు మనోజ, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఓరియంటల్ మాన్‌స్క్రిప్ట్ లైబ్రరీలో పనిచేసే మెట్టు వెంకట నారాయణ.

ఆ మధ్య ఒక మాస పత్రికలో గూడూరి మనోజ ఈ వాద్యాలను గురించి ఒక వ్యాసం రాశారు. గుంటూరుకు చెందిన, నన్నపనేని పున్నయ్య, లక్ష్మీ నరసమ్మ ట్రస్ట్ వ్యవస్థాపకులు అయ్యన్నరావు ఈ వ్యాసం చూసి స్పందించడమేగాక హైదరాబాదులో జరిగిన 'మూలధ్వని' కార్యక్రమాన్ని గురించి తెలుసుకున్నారు. తిరుమలరావు ద్వారా వివరాలు తెలుసుకొని, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బొమ్మడాల శ్రీకృష్ణమూర్తిని కలిసి వారి సహాయంతోపాటు గుంటూరు కళాపరిషత్ వారి సహయం కూడా స్వీకరించి కార్యరూపంలో పెట్టారు. ఫలితంగా గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పద్మావతి వేదికలో వాద్య ప్రదర్శన (Exhibition), అన్నమయ్య కళావేదికపై ఆదివాసీ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 25 నుంచి 28 వరకూ నాలుగు రోజుల పాటు ఆదివాసీ వాద్య ధ్వనులతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది.

ప్రజాగాయకుడు గోరటి వెంకన్న, డా. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, ఆలయన్స్ ఫ్రాంచైస్ డైరెక్టర్ డా. శామ్యూల్ బెర్త్, ప్రాచీన అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొ. మునిరత్నంనాయుడు, నల్లూరి వెంకటేశ్వర్లు మొదలైన చాలా మంది ప్రముఖులతో పాటు ఈ వ్యాసకర్త కూడా ఆయా వాద్యాల ప్రాశస్త్యాన్ని వివరించారు.

వాద్య ప్రదర్శనని వేలాది మంది తిలకించారు. అన్నమయ్యా వేదికపై అద్భుతమైన కళా ప్రదర్శన జరిగింది. అదిలాబాద్ జిల్లా నుంచి 'గుస్సాడి' అనే ఆదివాసీ నాట్యం ప్రదర్శించడానికి గోండ్లి కళాకారులు వచ్చారు. తలపై నెమలి ఈకలతో చేసిన పెద్ద కిరీటం లాంటి ఆభరణం ధరించి, పిక్కల పైదాకా నల్లటి అంగవస్త్రం ధరించి, శరీరానికంతా విభూతి రాసుకొని, మెడలో పూసల దండలు ధరించి, డప్పుల దరువుతో కలసి వీరు అడుగులేస్తూ నాట్యం చేస్తుంటే ప్రేక్షకులు ఊగిపోయారు. కొత్తగూడెం భద్రాద్రి జిల్లా నుంచి నలుగురు పురుషులు నలుగురు స్త్రీలు కోయ నృత్యం చేశారు. పెద్ద పెద్ద డోళ్ళు ధరించి పురుషులు, శిఖలో నెమలి ఈకలు సింగారించుకొని స్త్రీలు చేసిన నాట్యం అంతరంగాల్లో ఆనందాన్ని పొంగి ప్రవహింపచేసింది.

నల్గొండ జిల్లా షాలిగౌరారం నుంచి వచ్చిన అంగలకుర్తి రామమూర్తి 'రుంజ' వాద్యం వాయిస్తూ గంభీరంగా యక్షగానం (విశ్వ బ్రాహ్మణ పురాణం) ఆలపించారు. రుంజమీద తాను 32 వాద్యాల శబ్దాలు పలికిస్తానంటూ కొన్ని రకాలు పలికించి చూపించాడు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రేపల్లి నుండి వచ్చిన దురిసేటి రామయ్య కద్దీ–తంత్రి వాద్యాన్ని వాయిస్తూ సందరకాండ యక్షగానాన్ని గానం చేశాడు. నాగవల్లి రామయ్య వీరికి సహకార గానం చేస్తూ మృదంగంతో సహకరించాడు. కద్దీ – తంత్రి వాద్యం లయవాద్యం గాను, శృతివాద్యం గాను కూడా ఉపయోగ పడడం గమనార్హం. మరొక విశేషం నారాయణపేట జిల్లా 'దామరగిద్ద' గ్రామం నుంచి పల్లె దాసరి కొండప్ప అనే 75 సంవత్సరాల వయసున్న కళాకారుడు వచ్చాడు. ఆయన బుర్రవీణ అనే తీగ వాద్యం మీద మీటుతూ తత్వాలు అద్భుతంగా గానం చేశాడు. ఆయన కంఠంలో ముసలితనం ఎక్కడా కనిపించలేదు. ఆయన భాష కూడా స్పష్టంగా అర్థవంతంగా పలుకుతుంది. మంచి శ్రుతిజ్ఞానం కలవాడు. ఈ కొండప్ప తరువాత ఈ బుర్రవీణ పలికించే కళాకారుడే లేడని ఈయనే చివరివాడని తెలిసినపుడు బాధనిపించింది.

ఈ కళాకారులంతా నాలుగు రోజులుండి, ప్రతిరోజూ తమ విద్య ప్రదర్శించి వేల మంది ప్రేక్షకుల్ని మంత్ర ముగ్దుల్ని చేశారు. వారి గానం ముగియగానే ప్రేక్షకులు బహూకరించిన వేలాది రూపాయలే దీనికి నిదర్శనం. సంగీతాన్ని విని శ్రోతలు ఎంతగా పరవశించారో, వాద్య పరికరాల ప్రదర్శనని కూడా తిలకించి అంతగా ఆశ్చర్యపోయారు ప్రేక్షకులు. వీరంతా ఏదో ఆశించి వచ్చిన వ్యాపార కళాకారులు కాదు. తమ విద్య ప్రదర్శించడమే భాగ్యమని తలంచి వచ్చిన నిరుపేద కళాకారులు. మన దేశ సాంస్కృతిక మూలాలకు మిగిలిన వారసత్వ రూపాలు. ఆంధ్రదేశం నడిబొడ్డుగా నున్న గుంటూరు నగరంలో ఆదివాసీ వాద్య విన్యాసాలు పలకడం ఒక నూతన ఆలోచనకు దారి ఏర్పడింది. "భారతీయ సంగీత చరిత్ర ఆదివాసీ జానపద సంగీతాన్ని కలిపి లిఖించకపోతే అది సమగ్రమౌతుందా?" అనే ప్రశ్న అతిథుల ఆలోచనల్లోనే కాదు, ఎదురుగా నున్న ప్రేక్షకుల మెదళ్ళలో కూడా కదలాడింది. విశ్వజనీనమైన సంగీతం ఆదివాసీల నుంచే ఆవిర్భ వించిందని గుర్తింప చేసింది. ఈ జానపద సంగీతం సంగీత చరిత్రలో తన హక్కును, తన భాగాన్ని గుర్తించేలా చేసింది. ✤

# రాచపుండు

- సయ్యద్ రసూల్

మండే గుండెల అగ్ని కీలలు
ఉవ్వెత్తున
ఎలా ఎగిసిపడుతున్నాయో
చూసావా ట్రంపూ ..!!?

జనాగ్రహం
జ్వాలా ముఖిలా విస్ఫోటనం చెందితే
దిక్కులు ఎలా ఎరుపెక్కుతాయో
గ్రహించావా ట్రంపూ ..!!?

ఓరిమి నశించిన జనవాహిని
ఉప్పెనలా చుట్టుముడితే
ఊపిరి ఎలా ఆగిపోతుందో
ఉహించావా ట్రంపూ ...!!?

కసితో బిగుసుకున్న పిడికిళ్లు
అసహనంతో పైకి లేస్తే
దిగంతాలు ఎలా దద్దరిల్లుతాయో
అర్థమైందా ట్రంపూ ..?!?

నాడు ..
చేతులు కలిపిన చీమలు
ఒక్కటైన గడ్డిపోచలు
నీ అన్న ..
చరిత్రపుటలలో
ఓ దుర్గంధపు అధ్యాయం ..
జాత్యహంకార రాచపుండు ..
హిట్లర్ గుండె గదులలో
మృత్యు ఘంటికలు మోగించిన
చరిత్ర పాఠాలు
నువ్వు చదవలేదా ...??

నువ్వే గాదు ..
నీ అడుగుల్లో అడుగులు వేసే
వాడెవడైనా ..
కుందేళ్లు కొదమ సింగాలై గర్జించినప్పుడు
అంతఃపురాలు వదిలి
కలుగుల్లోకి
ఎలుకల్లా దూరవలసిందే ..!!
క్షణ క్షణం మృత్యువును కలగంటూ
చస్తూ బతకాల్సిందే ...
బతుకుతూ చావాల్సిందే ..!! ✤

కవితలు

# ఆకలి నడుస్తుంది

- మౌళి

**నడిచినడిచి** బొబ్బలెక్కిన కాళ్లతో..
ఏడ్చిఏడ్చికన్నీళ్లగాయపు కళ్లతో..
చండ్ర చండ్రం ఎండదెబ్బల ఒళ్ళుతో..
తూలితూలి నెత్తురోడు పాదాలతో..
"ఆకలంతా నడుస్తుంది"..

అవిసిఅవిసిన గుండెతో..
జారిపోయిన మనసుతో..
సడలిపోయిన ఆశతో..
అన్నమెండిన కడుపుతో..
నిద్రలేని రాత్రిసెగతో ..
భద్రమెరుగని జాగరణతో..
ఊపిరాడని వయసుతో..
"ఆకలంతా నడుస్తుంది"..

తల్లినేమో మోస్తులేక
తల్లి బాధను చూడలేక
తల్లి ఆకలి తీర్చలేక..
తల్లి కోసం చావలేక..
తల్లినొదిలి పారిపోక..
తూలిపడుతూ తుళ్ళిపడుతూ
"ఆకలంతా నడుస్తుంది"..

రోడ్డు మార్గం, రైలు మార్గం..
అడ్డదారుల రాళ్ల మార్గం..
పొలందారుల పొదలమార్గం
ఒంటిచేత్తో వంటిచెమటతో
స్నానమెరుగని మరకబట్టతో
"ఆకలంతా నడుస్తుంది"..

దిక్కులెతికినా దిక్కుతోచక..
మాటలగిడే హక్కులేక..
ముక్కులుతున్నా మందులేక..
ముక్కుకైనా ముసుగు లేక..
ఏడ్పుఘోషతో, కంటిధారతో
తల్లి జ్వరముకు తాళలేక
ఆకలంతా నడుస్తుంది..
.....
నా దేశం.. "ఆకలంతా నడుస్తుంది".. ✤

కథ

# శ్రీ శ్రీ శ్రీ అలౌకికానందేంద్ర స్వాముల వారికీ..

– శివాజీరావు

**"హు",** అని నిట్టూర్చారు అలౌకికానందేంద్ర స్వాములవారు తన 60 ఏళ్ల ఆధ్యాత్మిక జ్ఞానం నింపుకున్న పొడుగాటి గడ్డాన్ని సవరించుకుంటూ.

పరుపులకు, దిండ్లకు పట్టు గలేబాలు తొడుగుతున్న శిష్యులు ఆ నిట్టూర్పుకి క్షణం ఆగి గురువుగారి వైపు చూశారు. స్టేజి ఎదురుగా స్వామివారి జ్ఞాన బోధ విని తరిద్దామని వచ్చి షామియానాల కింద కూర్చున్న అశేష జన వాహినిలోని ముందు వరుసల జనాలు స్వామి వారి నిట్టూర్పు, వారి అనుంగు శిష్యుల తత్తరపాటు గమనించి తమ పిచ్చా పాటి ఆపి ఈ లీలా విశేషాన్ని గమనించసాగారు. ఈ చిన్ని సన్నివేశం స్వామివారి జీవిత చరిత్రాలంకృతం అవుతుందేమోనని కన్నులు విప్పార్చుకుని వీక్షిస్తున్నారు.

అయితే కాషాయాంబర ధారులైన ఆ శిష్యగణం స్వామివారి చిత్తం గమనించి ఒక్కసారి తమ చేతులు జోడించి ప్రమాణించి మరోసారి స్వామివారి ఆసనం ఆయత్తం చేయడంలో మునిగిపోయారు. భక్తులు యావన్మంది ఏదో గండం గడిచిందని వారు కూడా నిట్టూర్పులు విడిచారు. అంత మంది ఊర్పులకు అక్కడ వేసిన షామియానాలు లబలబ లడాయి. స్వామివారికి పట్టు తల్పం సిద్ధం చేశాక శిష్య బృందం వారిని చేతులు జోడించి ఆసనం మీదకి ఆహ్వానించారు. అలౌకికానందేంద్ర స్వాములవారు కించిత్ అయిష్టంగానే ఒక శిష్యుని చెయ్యి అందుకుని ఆసనం అలంకరించారు. అది కూడా శేషతల్పంపై తలకింద కింద చేయి పెట్టుకొని అర్ధ పవళింపులో ఉన్న మహావిష్ణువు మాదిరిగా కనిపించారు. భక్తులకు కిరీటం, నగలు తీసేసి కాషాయ వస్త్రాలో మహా విష్ణువు సాక్షాత్కరించినట్టయి అప్రయత్నంగానే తమ చేతులు ముకుళించారు. శ్రీ శ్రీ శ్రీ అలౌకికానందేంద్ర స్వాములవారు తమ హస్తాన్ని ఎత్తి భక్తులను దీవించారు.

మరికొంతమంది భక్తులు స్వామివారి ముందు మైక్ అరేంజ్మెంట్లు చేశారు. స్వామివారు అప్పుడు కూడా 'హు' అని నిట్టూర్చారు.

ఈలోగా ఆ ప్రాంతంలో భక్తకోటిని సమీకరించిన వ్యాపారస్తులు మరియు స్వామి వారి శిష్యులు అయినా సేట్ చమన్ లాల్గారు సభను ఉద్దేశించి మాట్లాడారు. ఆ మాటలలో స్వామిగారి వైశిష్ట్యం గురించి, మహిమాన్వితమైన వారి వాక్కుల గురించి అదేవిధంగా సాక్షాత్ శ్రీ మహావిష్ణువు తన అవతారం గా స్వామివారి రూపంలో ఈ భూమ్మీద ఎలా ప్రభవించిందీ సోదాహరణ సైతంగా వివరించారు. స్వామివారికి తమకూ గల అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. కానైతే తాము ప్రతి సంవత్సరం ఇన్కమ్ టాక్స్ ఎలా ఎగ్గొడుతున్నదీ అందుకు స్వామివారు ఎలా సహాయపడుతుంది ఇత్యాది విషయాలు తమ మాటలలో దొర్లకుండా బహు జాగురూకత కలిగి ఉన్నారు. అదేవిధంగా తాము సంపాదించిన కోట్లాది రూపాయల నల్లధనం హవాలా మార్గాలలో విదేశాలు చేరేందుకు స్వామివారు ఎంతగా ఉపయోగ పడుతున్నారో అస్సలు మాట్లాడలేదు. ఇంకా చెప్పాలంటే బాక్సైట్ తవ్వకాలను నిషేధించిన ప్రభుత్వం చేతనే లేటరైట్ తవ్వకానికి అనుమతులు ఇప్పించి ఆ ముసుగులో బాక్సైట్ తవ్వుకొని అమ్ముకొనే వీలు కలిగించినందులకు గాను స్వామివారికి 10 కోట్లు సమర్పించుకొన్న విషయం చెప్పను గాక చెప్పలేదు.

సేట్ చెమన్ లాల్గారు తమ ప్రసంగాన్ని ముగించి స్టేజి ముందుకి వెళ్ళబోతున్న సమయంలో ఆయన్ని స్వామీజీగారు పిలిచారు. చమన్లాల్గారు స్వామివారి ముందు మోకాటి తండా వేసుక్కూర్చున్నారు. స్వామి వారు తమ కుడి చేతిని గాలిలోకి మూడుసార్లు తిప్పి పచ్చ పొదిగి ఉన్న ఒక బంగారు ఉంగరాన్ని తీసి చమన్లాల్ చేతిలో పెట్టారు. చమన్లాల్ వంగి వంగి దండాలు పెడుతూ అలాగే వెనక్కి వెళ్ళిపోయాడు. భక్తుల చప్పట్లతో ప్రాంగణం మారుమ్రోగిపోయింది.

స్వామీజీ తమ దివ్య వాక్కులు ఇవ్వడం ఆరంభించారు.

"నేను ఒక్క రెండు సార్లు నిట్టూర్పులు విడిచాను, మీలో ఎంతమంది గమనించారు", అని ఒక్కసారి జనం అంతటిని కలయ జూచారు స్వామీజీ. కొన్ని వందల చేతులు లేచాయి. తృప్తిగా తలాడించి "నేనెందుకు నిట్టూర్చాను మీకు తెలుసా", అని ప్రశ్నించారు స్వామీజీ.

స్వామివారి లీలా విశేషం తమవంటి మూఢులకు అర్థమవుతుందా అనే భావనలో భక్తులంతా స్వామీజీ వంక చూశారు.

స్వామీజీ చిద్విలాసంగా నవ్వి అంతలోనే భ్రుకుటి ముడిపెట్టి "కటిక నేలపై పరుండే మావంటి సర్వసంగ పరిత్యాగులకు ఈ పట్టుపరుపుల సౌఖ్యాలు అవసరమా?"

భక్తులంతా "లేదు" "లేదు", అని అరిచారు. "మరి నాకు ఇష్టంలేని పనులు ఎందుకు చేస్తున్నారు", అంటూ తన చూపులను స్టేజి నలుమూలలా ప్రసరించారు.

"క్షమించండి స్వామీ. అదంతా మా కోసం".

"అవునవును".

"మా కోసం".

"మా కోసం".

"మీ కోసమే",

"నిజంగా నా భక్తులైన మిమ్మల్ని ఆనంద పరచడానికే నేను అంగీకరించాను. భగవాన్

కృష్ణ భగవానుడు కూడా తన భక్తులను అలరించడం కోసం తాను ఇష్టం లేని పనులను ఎలా చేసాడో ఒక చిన్న లీలా విశేషం చెబుతాను వినండి".

"ఒక ఊర్లో ఒక ముసలామె ఉండేదట. ఆమె తను ఏ పని చేసినా 'కృష్ణార్పణం' అని అంటూ ఉండేదట. ఆవిడ కృష్ణ భగవానునికి ప్రీతి పాత్రమైన భక్తురాలు. ఒకరోజు తన పశువుకి కుడితి వేసి అలవాటు ప్రకారం' కృష్ణార్పణం' అని అన్నదట. దానితో కృష్ణుడు ఆ కుడితిని స్వీకరించి భారమైన పొట్టతో ఆపసోపాలు పడ్డాడట. ఇప్పుడు మీరు వేసిన పట్టు పరుపులు కూడా నాకు అటువంటి ఇబ్బంది నే కలిగిస్తున్నాయి. కానీ నా భక్తులైన మిమ్మల్ని ఆనందపరచడానికి మాత్రమే ఈ ఆసనాన్ని నేను అలంకరిస్తున్నాను".

"జయహో! శ్రీ శ్రీ శ్రీ అలౌకికానందేంద్ర స్వాములవారికీ జయహో".

స్వామివారు జనాల వైపు చూసి చిద్విలాసంగా నవ్వేరు.

పక్కనున్న టర్కీ టవల్‌తో ముఖం తుడుచుకుంటూ మళ్లీ మొదలుపెట్టారు.

"ఈ మైక్‌ని మా ముందు పెట్టారు నా వాక్కులు మీ అందరికీ వినబడాలని, కానీ మీ అందరి ఆత్మలను నా ఆత్మతో అనుసంధానం చేసి మౌన సంభాషణ చేయగల మాకు ఈ మైకుల అవసరం ఉందా?".

భక్తులంతా ఏకమొత్తంగా చేతులు జోడించి మూకుమ్మడిగా

"లేదు"

"లేదు" అని అరిచారు.

స్వామివారు తన ప్రధాన శిష్యుని వైపు నర్మగర్భంగా చూడడం చాలామంది గమనించనే లేదు. స్వామివారి మనోగతాన్ని అర్థం చేసుకున్న శిష్యుడు మైక్ అందుకొని

"గురువుగారూ! మీరు కటిక నేల మీద పరుండి గాలిని మాత్రమే భోంచేసే సర్వసంగ పరిత్యాగులు, మీరు 33 కోట్ల దేవతల ప్రతిరూపాలను మీ ఒక్కరిలోనే నింపుకున్న సాక్షాత్ ఈశ్వర స్వరూపులు, మా ఆత్మలను స్వాధీనం చేసుకుని తరంగ పూర్వకంగా మాట్లాడగలరు, మిమ్మల్ని అగ్ని కాల్చదు మంచు వణికించవు. రోగాలు రొస్టులు అంటని దైవ స్వరూపులు.. కానీ మేము మీ లీలా విశేషాలను అర్థం చేసుకోలేని పాపులం... రాయి, రప్పల మాత్రులమైన మేము మీ దివ్య సందేశాలను... మీ నిర్గుణ తత్వాన్ని అర్థం చేసుకునే శక్తి లేకనే మిమ్మల్ని ఇలా మూర్తి మాత్రంగా, మీ వాణిని శబ్ద రూపంగా కోరుకుంటున్నాము స్వామీ.... మమ్మల్ని అనుగ్రహించండి.. అగ్నిచే కాలని, ఆయుధంచే గాయపడని, భూమిచే నొప్పింపబడని మీ దేహానికి ఐహిక సుఖము అందించాలని అనుకుంటున్న లౌకిక బేహారులమైన మాకు అణువంత జ్ఞానబోధ చేసి తమ దారిలో నడిపించండి. శ్రీ శ్రీ శ్రీ అలౌకికానందేంద్ర స్వాములవారికి జై బోలో. భక్తులారా! ఒక విషయం. మీరు ఎంతో అభిమానంతో స్వామివారికి మరియు మాకు ఢిల్లీ విమానం టికెట్లు కొని ఇచ్చారు. స్వామి వారికి అది కూడా అవసరం లేదు. ఎందుకంటే వారు తమ తపశ్శక్తితో ఆలోచన మాత్రంగానే ఎక్కడికైనా వెళ్లిపోగలరు కానీ శిష్యులమైన మా కోసం విమానంలో ప్రయాణించడానికి అంగీకరించారు. వారు ఏమి చేసినా భక్తుల కోసమే. వారు భక్తుల కొంగు బంగారం. మన మొరాలించే ప్రత్యక్ష వేలుపు.

ఐదు నిమిషాల వరకు భక్తుల జయజయ ధ్వానాలతో ఆ సభ మారుమ్రోగింది.

"స్వామివారి కోసం ఢిల్లీలో ప్రధానమంత్రిగారు వేచి చూస్తున్నారు. రేపు స్వామివారు బసచేసే ప్రాంతానికి ప్రధానమంత్రిగారూ, ఇతర మంత్రులు అధికార గణం అంతా వచ్చి వారి ఆశీర్వాదాలు పొందనున్నారు. మహా భక్తులు సేట్ చమన్ లాల్‌గారి కోరిక మేరకు మీ అందరికీ ఆశీర్వచనములు అందజేయవలెనని ఇక్కడ ఆగారు". అని ప్రధాన శిష్యుడు కూర్చున్నాడు. అక్కడ మరోసారి ఆకాశం దద్దరిల్లింది.

స్వామివారి దివ్య సందేశం మరలా మొదలయ్యింది" భక్తులారా! గీతలో శ్రీకృష్ణ భగవానులు ఏమి చెప్పారు?! మనం నిమిత్తమాత్రులం. చేసెడి వాడు ఆయనే.. చేయించి వాడు ఆయనే.. అందువలన మన ఈతి బాధలు తొలగాలంటే.. ఈ తుచ్ఛ జీవితం నశించి మరుజన్మ లేకుండా ఉండాలంటే దేవదేవుని ప్రసన్నం చేసుకోవాలి.. ఈ ఐహిక సుఖాలు అన్నీ ఆ అలౌకిక సుఖాలతో పోలిస్తే గడ్డిపోచ కన్నా హీనమైనవి..

ఇంతలో సభలో ఏదో కలకలం రేగింది. భక్తులంతా గందరగోళంగా అటూ ఇటూ పరిగెత్తుతూ ఉన్నారు. తన ప్రసంగానికి అంతరాయం కలగడానికి కారణం ఏమిటా అని పరికించి చూశారు స్వామివారు. ఎవరో ఒకతను ముఖానికి మాస్కు తొడుక్కుని, పిచ్చిగా తనవైపు పరుగెత్తి వస్తున్నాడు. అతని వెనక తెల్ల యూనిఫార్మ్‌లు ధరించిన హాస్పిటల్ సిబ్బంది పరిగెత్తుకు రావడం కనిపించింది. భక్తులంతా అతడికి దూరంగా పారిపోతున్నారు.

ఆ భక్తుడు" స్వామీ! నన్ను మీరే కాపాడాలి" అంటూ రెండు చేతులు చాచి స్వామివారి వైపు పరిగెత్తుకు వస్తున్నాడు.

స్వామివారు ఒక భక్తుడ్ని పిలిచి ఆ గడబిడ ఏమిటి అని అడిగారు.

"స్వామి! అతడు కరోనా వైరస్ సోకిన పేషెంట్ అట. మెడికల్ స్టాఫ్ క్వారంటైన్‌కి తీసుకుపోతుంటే తప్పించుకొని మీ దగ్గరకి వస్తున్నాడు. మీ చెయ్యి తగిలితే తన రోగం తగ్గి ప్రాణం నిలబడుతుంది అన్న ఆశ. మీ పిలుపుతో చచ్చినవాడు కూడా లేచి కూర్చుంటాడని చెప్పుకుంటారు. అతను కూడా అదే ఆశతో మీ దగ్గరికి వస్తున్నాడు.

స్వామివారికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. ఏం చేయాలో పాలు పోవటం లేదు. అతగాడిని చూస్తే మరికాసేపట్లో వచ్చి తన మీద పడి పోయేటట్టు ఉన్నాడు. అతన్ని ఆపగల శక్తివంతులెవరూ ఆ టెంట్ల కింద ఉన్నట్టు కనిపించడంలేదు. భక్తులంతా ప్రాణ భయంతో చెల్లాచెదురుగా పరిగెత్తుతూ ఉన్నారు. ఆ మెడికల్ స్టాఫ్ మాత్రమే ధైర్యంగా అతని వెనకాల పరిగెడుతున్నారు కానీ అతను వారికి చిక్కేలా లేదు. ఉన్న భక్తి కొద్దీ ఉన్న శక్తినంతా వినియోగించి పరిగెత్తు వస్తున్నాడు.

స్వామివారికి వైకుంఠప్రాప్తి ఎంతో దూరం లేదు అనిపించింది. తన వల్ల ఎంతో లాభం పొందిన సేట్ చెమన్‌లాల్ వైపు చూశారు స్వామీజీ. కానీ చమన్‌లాల్ తన భారీ కాయాన్ని ఊపుకుంటూ కుర్చీలకి అడ్డంపడి పారిపోతున్నాడు.

"కృతఘ్నుడు", అని పళ్ళు పటపట కొరికారు స్వామీవారు. అందరికీ తనే దిక్కని చెప్పిన స్వామివారికి తన దిక్కు ఏమిటో బోధపడటం లేదు. తన కళ్ళతో సందేశం పంపుదామని ప్రధాన శిష్యులు వైపు చూశారు. కానీ ప్రధాన శిష్యులు వారు గోచీ బిగించి అప్పటికే చాలా దూరం వెళ్ళిపోయారు. ఇక లాభంలేదని అర్థమైంది స్వామివారికి. ఇలాంటి క్లిష్ట సమయంలో తనకు ప్రధానమంత్రికి మధ్య రాయబారం నడపాలి అన్న తమ రాష్ట్ర ముఖ్యమంత్రి మీద ఒళ్లు తెలియని కోపం వచ్చింది స్వామివారికి.

"ఈ తద్దినం నా నెత్తిన పెట్టాడు", అని తిట్టుకున్నారు.

"స్వామీ! రక్షమాం.... రక్షమాం.... ఈ మహమ్మారి నుంచి మీరే కాపాడాలి." భక్తుడు బాగా దగ్గర అయిపోయాడు.

స్వామివారు పంచె ఎగ్గట్టి తటాలున ఆడిటోరియం వెనకనున్న రూమ్‌లోకి పారిపోయి తలుపులు బిడాయించుకున్నారు.

కరోనా భక్తుడిని మెడికల్ సిబ్బంది బలవంతంగా పట్టుకుపోయారు. ఒక అరగంట పోయాక పారిపోయిన భక్తులు పోగా మిగిలిన భక్తులు స్వామివారు తమ దైవ వాక్కులను ప్రవచిస్తారని ఎదురుచూస్తున్నారు. స్వామి వారిని కాపాడే బాధ్యత సేట్ చెమన్‌లాల్ తీసుకున్నాడు.

"దురదృష్టవశాత్తూ ఆ భక్తుడు ఈరోజు అనగా శుక్రవారం స్వామివారిని శరణు వాడడానికి వచ్చాడు. మరొక రోజు అయితే స్వామివారు అతన్ని చేతితో తాకి ఆ రోగం ఇట్టే నయం చేసేవారు. కానీ స్వామివారు ఈరోజు లంకణంలో ఉన్నారు. అంటే ఉపవాసం అన్నమాట. ప్రతి శుక్రవారం వారు ఉపవాసం ఉంటారు అలా ఉన్న రోజు ఎవర్నీ తాకరు. ఒకవేళ తాకితే ఆనాటి వ్రతఫలం పోతుంది. అందువల్లనే ఆయన రూమ్‌లోకి వెళ్ళిపోవాల్సి వచ్చింది".

"స్వామివారు ఎప్పట్లో బయటికి వస్తారు", అడిగారెవరో.

"స్వామివారు వెనుక ద్వారం గుండా విమానాశ్రయం చేరుకున్నారు. వారు లోక కళ్యాణార్థం తమ ఢిల్లీ ప్రయాణాన్ని క్యాన్సిల్ చేసుకుని తమ రాష్ట్రానికి తిరిగి వెళ్ళిపోతున్నారు".

"ఉడాయించినట్టున్నారు", వెనుకనుంచి.

"కళ్ళు పోతాయి. కరోనా వంటి మాయల మహమ్మారి ప్రపంచాన్ని పీడిస్తున్న ఈ సమయంలో ఢిల్లీ వెళ్లేకన్నా వారి ఆశ్రమానికి తిరిగి వెళ్లి దాని పీచమణడానికి యజ్ఞం చేయ తలపెట్టారు. ఆ యజ్ఞగుండంలో ఉద్భవించిన ధాతువులు ఆ కరోనా వైరస్‌ని చంపేస్తాయట".

"శ్రీ శ్రీ శ్రీ అలౌకికానందేంద్ర స్వాముల వారికీ" "జై"

"శ్రీ శ్రీ శ్రీ అలౌకికానందేంద్ర స్వాముల వారికి" "జై".

మరోసారి నినాదాలు మిన్ను ముట్టినవి.✤

కవిత

# నిరీక్షణం

- వై. నేతాంజనేయ ప్రసాద్

**పులిచంపిన** లేడికి సానుభూతిగా
సింహం అహింసావ్రతం చేస్తుంది
అన్యాయం అంటూ ఆక్రోశిస్తుంది -
నిన్నటిదాకా సింహం విదిల్చిన
ఎంగిలి మాంసం పంచుకుతిన్న
అవకాశవాద గుంటనక్కలనేకం
వింత గొంతుకతో వంతపాడుతూ
పస్తులుండలేక పాట్లుపడుతున్నాయి -
దోచుకునే దొంగసాత్తు దక్కడంలేదని
సమన్యాయం అంటూ ఘోషిస్తున్నాయి -

నిన్నటిదాకా సింహం నీడన చేరి
నిస్సిగ్గుగా నీరాజనాలందించిన
వలస జంతువులనేకులంతా
వలపు వలచి పులిని తలచి
నేడు కొండజపం చేస్తున్నాయి

గతం నాస్తి వర్తమానం వాస్తవమంటూ
వేటి పాత్ర అవి మేటిగా పోషిస్తున్నాయి -

రాజకీయ ఋత్విక్కుల సారధ్యంలో
అభివృద్ధి క్రతువు రంజుగా సాగుతోంది
సంక్షేమ హోమంలో సమిధలై కాలుతూ
సంక్షోభ సెగలలో - సంక్షామ పొగలతో
వన్య జీవులన్నిటికి కనులెర్రబారితే....?

భ్రమల తిమిరం తెరలు తొలగి
భ్రమర సమూహం సమరనాదం చేయునా?
దివ్యకాంతుల భానుడొచ్చీ
నవ్యకోకిల భవ్యగానం చేయునా
వన్యజీవులు సంతసించగా
వనమునంతా శాంతి శోభిల్లునా? ✤

కవిత

# మరో మహా ప్రస్థానం

– సూర్యప్రకాశ్

**కంపుగొట్టే** మురికి వాడల దారుల నుండి..
పెచ్చు లూడుతున్న ఫ్లై ఓవర్ల నీడల నుండి..
మొదలయ్యిందొక ప్రస్థానం.

బోర విరుచుకొని నిలుచున్న కార్పొరేటు కోటల
శిఖరాల ముంగిట
శిరసు వంచి మోకరిల్లిన మహానగరాల
మురికి వాడల నుండి..
డొక్కలు మాడి బక్క చిక్కిన బడుగుల పడకల
ఫుట్పాతుల నుండి..
కాళ్ళీడ్చుకుంటూ మొదలయ్యింది
నేటి మహా ప్రస్థానం.

పాపాలను కడిగేసుకునే పుణ్య పురుషుల
తీర్థయాత్ర కాదు..
ప్రజలను దోచుకునే దోపిడీ దారుల
దండయాత్ర అసలే కాదు..
ఆర్చుకుపోతున్న పేగుల్లో ఆకలి మంటను ఆవిరి పడుతూ..
నిరాశల నిశీథుల గుండెల్లో ఆశల రుధిరం వడకడుతూ..
వేల మైళ్ళ తీరాలకు అడుగు దూరాల అంగలతో
అడుగడుగూ జత కలుపుతూ..
సాగుతున్న శ్రమ జీవుల యాగం.
కరోనా కాటుకి బలైపోతున్న కష్ట జీవుల బతుకు పోరాటం..
మా మరో మహా ప్రస్థానం.

నెత్తిన మూటలతో
భుజాన కావడితో
చంకలో బిడ్డలతో
నిండిన గర్భంతో

భగ భగ మండే భానుడి కిందా
సల సల కాగే తారుల మీదా..
కాలుతున్న పాదాల ఊడి వస్తున్న చర్మాల నుండి
కారే రక్తపు చుక్కలతో..

కుంటుతూ.. కూలుతూ..
ముక్కుతూ.. మూల్గుతూ..
బతుకు బరువును మోసుకొస్తున్న బహు దూరపు బాటసారి
చెమట చుక్కలతో చిత్రిస్తున్న
వలస జీవితాల విశ్వరూపం.
దేశం నలు వైపులా పులుముకున్న
నిర్భాగ్యుల నిజ జీవిత ముఖ చిత్రం.

జ్ఞాపకాల దొంతరలలో కష్టాలను మూట కడుతూ..
ఎండిపోతున్న కుత్తుకలను కన్నీళ్ళతో తడుపుకుంటూ..
పగిలిపోతున్న పాదాలలో ఇంకిపోతున్న నెత్తుటితో
వలస జీవి రాస్తున్న అంతులేని చరితం..
మా మరో మహా ప్రస్థానం.

చలువ కళ్ళద్దాల చరిత్రకారుల కలాల కందని
అన్నార్తుల ఆక్రందనం..
ఈ మరో మహా ప్రస్థానం.

కార్మిక, కర్షక, శ్రామిక శక్తుల
శిథిలమైన రెక్కల పునాదుల మీద..
ఆకాశానికి నిచ్చెన లేసే
సభ్య సమాజపు మహారాజుల్లారా..
రెక్కలు విరిగిన వలస పక్షుల
ఆకలి కేకలు వినబడలేదా..?
రాయితీలు, రుణమాఫీలని
లక్షల కోట్లు పాకేజీలెవరికి?
పేదవాడికి పొట్ట నింపని
కష్ట జీవికి దారి చూపని
ప్రగతి రథ చక్రాల పరుగులెక్కడికి?
పాలరాతి మేడల్లోనా
పండుకున్నా పాలకులారా..!
మీ మత్తులు వదిలే వరకు.
మీ బుద్ధులు మారే వరకు
ఆగదు ఈ ప్రస్థానం.

మా గమ్యం చేరే వరకు
మహోదయం వచ్చే వరకు
ఆగదు ఆగదు
మా ఈ మరో మహా ప్రస్థానం. ✤

కవిత

# అమ్మా నాకు ఊపిరాడుతలేదు

- అశోక్ కుంబము

("మానవాళి శోభ కోసం మొత్తం దోపిడీ వ్యవస్థను కాల్చేయాల్సిందే!")

నీ కడుపులో ఉన్న
తొమ్మిది నెలలేనమ్మా
జీవితంలో నేను పొందిన
స్వేచ్ఛా కాలం

ఏ క్షణాన
భూమి మీద పడ్డానో
నా నల్ల రంగే నాకు శాపమయ్యింది
ఊహించని మృత్యుకూపాన్ని
నా చుట్టూ తొవ్వింది

నేను ఎదురుపడితే
నాలో ఒక దొంగనో
మత్తు మందు బానిసనో
పనిచేతకాని సోమరినో
నేరానికి కేరాఫ్ అడ్రస్సునో
చూశారే తప్ప
మనిషిగా ఎవ్వడూ పోల్చుకోలేదమ్మా

ఎవరైనా పలకరిస్తే
"యస్, సర్"
"యస్, మాడం"
అని బదులివ్వాలని మర్యాద నేర్పావే
ప్రతి ఆదివారం చర్చికి తీసికెళ్ళి
"నీది ప్రభువు రక్తం బిడ్డా
మనుషులందరిని ప్రేమించు" అన్నావే
నేను విశ్వమానవుడిని కావాలని కలలు కన్నావే
కాని నేను విషవలయంలో చిక్కుకున్నానని
ఎందుకమ్మా చెప్పనే లేదు

ఇది స్వేచ్ఛా దేశమని
ఎదుగుదలకు ఆకాశమే హద్దని
నా మీద ప్రేమతో ఎన్ని అబద్ధాలు చెప్పావమ్మా
మనవి ఆక్రమిత జీవితాలనే
పరాయీకరణ బతుకులనే
వాస్తవాన్ని ఎందుకమ్మా దాచిపెట్టావు

గడపదాటితే చాలు
ఏ గండం ముంచుకొస్తుందో అనే భయం
అవమానం
అనుమానం
అణిచివేత
ఇవే కదా మన ఆస్తి పాస్తులు
తరతరాల వారసత్వంగా
అభాగ్యులమయ్యాము
బతికే హక్కడిగితే దేశ ద్రోహులమయ్యాము

అమ్మా నీమీద ఒట్టేసి చెబుతున్న
నేను ఏ తప్పూ చేయలేదు
కరోనా కాలంలో కొలువు లేదు
ఆకలి తీరే దారి లేదు
అయినా నీనేమీ దొమ్మీలు, దొంగతనం చేయలేదు
అది చెల్లుబాటు కాని నోటని నాకు తెలియదు
దానిపై పోలీసుల బారినపడ్డాను
అంతే
ప్రపంచ వనరులను, మానవ శ్రమను
దోచుకున్నట్లుగా ఒక్కసారిగా
తెల్ల కావరం నా మీద పడింది

నా చేతులకు సంకెళ్ళు వేశారు
మన జాతిజాతంతా నా కళ్ళ ముందు మెదిలింది
నన్ను భూమి మీద పడేసి అదిమిపట్టారు
భూమిభూమంతా నీ రూపమే కనిపించింది
వాడు నా గొంతు మీద మోకాళ్ళు పెట్టి తొక్కుతుంటే
"అమ్మా, అమ్మా" అని ఏడ్చాను
కాని వాడు మనిషి కాదమ్మా
ఇంకా ఇంకా గట్టిగా తొక్కాడు
నా గొంతు నలిగిపోవడం నాకు తెలుస్తూనే వుంది
ముక్కులోంచి కారుతున్న రక్తం నా కళ్ళముందే పారుతుంది

"అమ్మా నాకు ఊపిరాడుతలేదు
అమ్మా నాకు ఊపిరాడుతలేదు" అని బిగ్గరగా ఏడ్చాను
ప్రాణం పోతుందని అర్థమయ్యింది
"నీ కాళ్ళు మొక్కుత సారు,
నేను చస్తున్న, నన్ను వదిలిపెట్టు" అని వేడుకున్న
"పర్వాలేదు, విశ్రాంతి తీసుకో" అంటూ విషపు నవ్వు నవ్వాడు
వాడు మృగం కదమ్మా

నా గొంతు ఎండిపోయి
"అమ్మా నీళ్ళివ్వమని" బోరుమన్నాను
నాకు తెలుసు నువ్వు రాలేవని
అయినా చెరబట్టిన భూమిని చీల్చుకోని వస్తావనే ఆశ
నాకు ఊపిరి పోసినదానివి
ఆ ఊపిరి ఆగిపోతుంటే నువ్వు తప్ప
ఈ లోకంలో ఇంకెవ్వరు గుర్తొస్తరమ్మా

నీవెక్కడున్నా నీ కన్నపేగు కదిలేవుంటుంది
నా కోసం పరుగెత్తుకొచ్చే వుంటావు
"జార్జ్, నా బేబీ" అని రోదించే వుంటావు
కాని నాకు వినపడలేదమ్మా
కాదు కాదు
వినడానికి నేను లేనమ్మా
అప్పటికే వాడు నా ఊపిరి మీద
విజయం ప్రకటించాడు

చివరిగా ఒక్క మాటమ్మ
ఇంకా మిగిలేవున్న మనుషులందరికి
నా మాటగా చెప్పు
ఇప్పుడు చర్చ చేయాల్సింది
కాలుతున్న కార్లు, భవనాల మీద కాదు
వాటిదేముంది దోపిడీ కొనసాగుతూనే ఉంటది
కొత్తవి పుట్టుకొస్తూనే వుంటవి

ఇప్పుడు చర్చ చేయాల్సింది
రగులుతున్న నీ కడుపు మంట మీద
తీర్చలేని నీ గర్భ శోకం మీద
తిరిగిరాని నా జీవితం మీద
తండ్రిలేని, ఏ అండలేని నా బిడ్డ భవిష్యత్తు మీద
నా బిడ్డకు నేను హామీ పడిన బతుకు మీద
నన్ను ఇంకెప్పుడూ ఆలింగనం చేసుకోలేని
నా అన్నతమ్ములు, అక్కచెళ్ళెల్ల మీద
నిత్యం అణచబడుతున్న
నాలాంటి నల్ల శరీరాల మీద

"దోచుకుంటే కాల్చేస్తాం" అంటుండ్రు కదా
నిజమేనమ్మ కాల్చేయాల్సిందే!
మానవాళి శోభ కోసం
మొత్తం దోపిడీ వ్యవస్థను
కాల్చేయాల్సిందే!

(అమెరికాలోని మిన్నియాపొలిస్ నగరంలో జార్జ్ ఫ్లాయిడ్ అనే 46 ఏండ్ల నల్లజాతి యువకుని మే 25, 2020న తెల్ల పోలీసులు గొంతుమీద కాలు పెట్టి తొక్కి చంపిన సంఘటనకు నిరసనగా) ✤

పాట

# కరోనా భూతం

- డా॥ జి.వి. కృష్ణయ్య

**అమ్మో** కరోన భూతం.... అది
కాటువేసిందంటె కాటికెపోతావు.. ॥ అమ్మో ॥

ఎటునుండి వస్తాదొ యాడపొంచున్నాదొ
ఎవడికి తెలియాదు జాగ్రత్తగుండాలి
పక్కలో బల్లెంల ప్రక్కనె వుంటాది
ఆదమరిచామంటె కాటేసిపోతాది.... ॥ అమ్మో ॥

చెప్పింది వినకుండ వీధుల్లోకొస్తావు
ప్రాణాలమీదికి తెచ్చుకుంటావేర
పోలీసు చెబుతుంటె పెడచెవిన పెడతావు
బుద్ధిలేదా నీకు మందబుద్ధీ వెదవ ॥ అమ్మో ॥

భూలోకమందున్న ప్రాణదాతలు వాళ్ళు
ఆలుబిడ్డలనొదిలి సేవ సేస్తున్నారు
వైద్యులు చెప్పింది శ్రద్ధగ వినుకోర
చావుతో నీకు చెలగాటమొద్దుర.... ॥ అమ్మో ॥

అంటురోగాలకు బంటుల్లా నిలబడి
సందుగొందులు తిరిగి చెత్తతీస్తున్నారు
పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలు బిగపట్టి
కంటిరెప్పలై కాపాడుతున్నారు.... ॥ అమ్మో ॥

దేశదేశాలన్ని దిక్కుతోయక నేడు
బిక్కముఖంతో చుక్కలు చూస్తున్నాయి
ధనిక పేద తేడ వైరస్‌కుండదు
తేలిగ్గ చూశావ తాటతీసి పోద్ది ॥ అమ్మో ॥

అందుకే....
చేతుల్ని కడగండి మాస్కుల్ని పెట్టండి
శానిటైజర్‌తో శుభ్రంగ తుడవండి
భౌతిక దూరాన్ని పాటించితీరాలి
కరోన భూతాన్ని దూరంగ తరమాలి.... ॥ కరోన ॥ 2 ✤

# రచయిత సి.ఎస్.రావు మృతి



**నాటక** రచయిత, నటుడు, దర్శకుడు, నిర్మాత చింతపెంట సత్యనారాయణరావు 14 ఏప్రిల్ 2020న హైదరాబాదులో తన 86వ ఏట అనారోగ్యంతో మరణించారు. ఆయన 20 డిశెంబరు 1935న కడియం దగ్గర మాధవరాయుడుపాలెంలో జన్మించారు.

సి.ఎస్.రావు విద్యార్థి దశ నుండే బ్రహ్మసమాజము, ఆంధ్ర సారస్వత సభల ప్రభావంతో ఎదిగారు. రాజమండ్రిలో డిగ్రీ చదువుకునే రోజుల్లో స్టూడెంట్ ఫెడరేషన్‌లో పనిచేశారు. స్టూడెంట్ ఫెడరేషన్‌తో సంబంధాలు ఉండటంతో చాలాకాలం ఉద్యోగం రాలేదు. ఆ సమయంలో ఆయన వాళ్ళ వూరి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఆ అయిదు సంవత్సరాల పదవి తర్వాత సాగర్ యూనివర్శిటీలో ఎం.ఏ. చదివి, ఉద్యోగాన్వేషణలో హైదరాబాద్ చేరి ఉపాధ్యాయుడిగా కొంతకాలం పనిచేశారు. అక్కడే నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, నగ్నమునిలతో పరిచయం ఏర్పడి విరసం ఆవిర్భావ సభలో ఆ సంస్థలో చేరి, కొన్నేళ్ళపాటు సభ్యుడిగా కొనసాగారు. ఆయన 80 కథలు, 18 నవలలు, 25 నాటికలు, 25 నాటకాలు రాశారు. టి.వి.లో సీరియల్స్‌తోపాటు ఆయన సినిమాలకు కథలను అందించారు. కొన్ని సినిమాలలో నటించారు. 'గుమ్మడి గింజలు' ఆయన మొదటి కథాసంకలనం. 'ఊరమ్మడి బతుకులు' మొదటి నాటకం. దీనినే తర్వాత సినిమాగా తీశారు.

సి.ఎస్.రావు మృతికి సంతాపం తెలియచేస్తున్నాం. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాం. ✤

కవిత

# ఓ! కాలుష్యమా!

– ఎస్. శంకరరావు

**ఆధిపత్య** దురహంకార
అక్రమ సంతానమా!
కాలం కనుసన్నలలో
వికసించిన యమపాశమా!
నగ్న శిధిలీకృత వ్యవస్థ
సృజించిన విష బీజమా!
ప్రకృతిని పట్టిపీడించే
హీన సంస్కృతి రాజసమా!
విషవాయు జ్వాలల
కాలుష్యమా! ఓ కాలుష్యమా!
నీ దుర్నీతి ఫలితం
ప్రతి ఇంటా ప్రతి వాడా
క్షణం క్షణం మృత్యు భయం!
నాడు బోపాల్- నేడు విశాఖ
రేపు కొవ్వాడ చిక్కోలు
అణువణువూ మరణమృదంగం!
కాలం గుప్పెట్లో
నీ స్వార్థం సరుకు మయం
వాడొక సరుకు - వీడొక సరుకు
పరాయీకరణ మాఫియా సరుకు
విజృంభించే విద్వేష సరుకు!
నీ వ్యాపార సంస్కృతి
లాభాలే పరమావధి
అదిగదిగో ప్రమాదకర రసాయనాల
వ్యాపారం
ఇదిగిదిగో శవాల గుట్టల పై కోటలు
కట్టే వ్యాపారం
కాదేదీ నీ వ్యాపారానికనర్హం!
నీవు
కాలము పెంచి పోషించిన
విషతుల్య పర్యావరణ అంగడివు
నీలో దాగి ఉన్నది
నిరంకుశ కర్కశత్వం
ప్రమాదమని తెలిసినా బేఖాతరు-బేఖాతరు!
నేడు
నీ విజృంభణలో
హాహా కారాలు- ఆవేదనలు
మాడి మసిబారుతున్న పచ్చిక బయలు
రాలిపోతున్న ప్రాణాలు
నెత్తురు చిందిస్తున్న శరీర కణాలు
అప్పుడే కాలుష్యంపై నీళ్లు జల్లుతూ
యంత్రాంగ రేటింగులు
ఒక్కసారిగా
వేడి నెత్తురు చల్లబడే దేహాలు!
ప్రపంచీకరణ కనుసన్నలలో
ఎన్నెన్నో మానవ జీవన విధ్వంసాలు!
కాలంపై కన్నెర్ర జేస్తూ
పిడికిళ్లు బిగుస్తున్నాయి
ఊరేగింపులు కదులుతున్నాయి
కాలుష్య రహిత ప్రపంచం దిశగా.....
వర్గ రహిత సమాజ దిశగా........ ✤

# నాస్తికవాది దొడ్డా హరిబాబు మరణం



**అంతరాలులేని,** అంధవిశ్వాసాలు లేని సమాజం కోసం కృషిచేసిన దొడ్డా హరిబాబు మాష్టారు తన 65వ ఏట 3 మే 2020న తెనాలిలో మరణించారు. ఆయన ప్రకాశంజిల్లా యద్ధనపూడి మండలం మున్నంగివారిపాలెంలో 1953లో జన్మించారు.

హరిబాబు మాష్టారు చిన్నప్పటి నుండి అభ్యుదయ భావాలతో వుండేవారు. ఊరిలో యువజన గ్రంథాలయాన్ని నిర్వహించేవారు. భాషాప్రవీణ చదవటం కోసం తాడికొండ సంస్కృత కళాశాలలో చేరటంతో చార్వాక రామకృష్ణగారి శిష్యుడయ్యారు. బాబాల, స్వాముల, అమ్మవార్ల బండారాలను బట్టబయలు చేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రకాశంజిల్లాలో అనేక నాస్తిక హేతువాద కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన ఆదర్శ వివాహమే చేసుకున్నారు. ఆయన పిల్లలకు కుల వ్యతిరేక వివాహాలే నిర్వహించారు. అంటరానితనానికి వ్యతిరేకంగా, రైతాంగ సమస్యల మీద, మూఢ మత సంప్రదాయాలను ప్రశ్నిస్తూ మూడు దశాబ్ధాలకు పైగా అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన ఉపాధ్యాయుడిగా, జర్నలిస్టుగానూ ఉత్తమ విలువలతో ఆదర్శవంతమైన పాత్రను పోషించారు. 'ప్రజాసాహితి' పాఠకుడు, అభిమాని అయిన హరిబాబు మాష్టారుకు సంతాపం తెలియచేస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటిస్తున్నాం. ✤

కవిత

# క్షతగాత్ర శిబిరాల్లో

**- ఏటూరి నాగేంద్రరావు**

**వీళ్ళందరూ**
ఏ దేశపు నేరస్తులూ కారు..
ఓటు హక్కున్న నేల నుండి
విసిరేయబడి ఆకలిని నియంత్రించుకుంటూ
పేగులు కుట్టేసుకొని
యాడేడో తిరిగి తిరిగి
రంగు మారిన ముఖాలు.

ఈ మట్టిలో పుట్టి
ఈ మట్టినే తింటున్న
ప్రగతి కారులు.

ఆశల్ని తాకట్టు పెట్టుకుంటున్న
స్తబ్ధ ప్రపంచాలు.

చెలియలి కట్టను తెంపుకొని పరుగిడుతున్న
ఆవేదనల పాటగాళ్లు.

దుఃఖ గాథల
గ్రంథాల్లో చోటును సాధించుకున్న
అపురూప వజ్రపు తునకలు!

నగరాలు మేల్కొంటున్న
కబుర్లేవి చెవుల్లోకి ఎక్కించుకోని బడుగు జీవులు.

చూపంతా ఊరి పైనే!
ఐనా ఎదురుచూపులు తప్ప ఓదార్చే వాళ్ళు లేరు.
నిత్య నడకంతా
నగ్నపాదాల ఆకలితోనే.

నీడలా కనబడి అదృశ్యమవుతున్న పథకాల
భ్రాంతిని మింగుతూ ఆకలి తీర్చుకుంటున్న వాళ్ళు...

కాలపు వధ్య శిలపై వ్రేలాడుతూ
పోగులు పోగులుగా చీలి పోతున్న వాళ్ళు.
పాకుడు పట్టిన మెట్లమీదే కూలబడిపోతున్న వాళ్ళు.

మీడియా కెమెరాల ముందు దృశ్యాలు దృశ్యాలుగా వెలిగిపోతూ
కవుల అక్షరాల్లో కవిత్వమై జీవం పోసుకుంటున్న వాళ్ళు.

క్షతగాత్రపు శిబిరాల్లో చల్లాచెదురైన వాళ్ళు..
ఈ దేశపు వక్షస్థలం మీద
ఎప్పటికీ మాయని గాయాలైన వాళ్ళు...

నిజంగా వీళ్లు ఓడిపోయారా..!
కూలబడి పోయారా..!

దేశమా..!
నీ చర్మపు పొరల్లో
పగుళ్లొచ్చిన జాతి కాళ్ళ జన్మ రహస్యం దాగుంది.

ఒక్కసారి చరిత్ర పుటలు తిరగేయవూ! ✤

# వరవరరావును విడుదల చేయాలి!

ప్రసిద్ధ తెలుగు కవి, సాహిత్య విమర్శకుడు, సామాజిక కార్యకర్త వరవరరావును వెంటనే బెయిల్ పైన గానీ పెరోల్ పైన గానీ విడుదల చేయాలని అఖిల భారత ప్రజాసాహిత్య సాంస్కృతిక వేదిక (A.I.P.L.C.F) భారత ప్రభుత్వాన్ని కోరుతూంది. విప్లవ రచయితల సంఘం సంస్థాపకులలో వరవరరావు ఒకరు. ఆయన అఖిల భారత విప్లవ సాహిత్య లీగు లోనూ క్రియాశీలంగా పనిచేశారు.

81 సంవత్సరాల వయసు గల వరవరరావును ఒక అబద్ధపు కుట్ర కేసులో ఇరికించి గత 18 నెలలుగా నిర్బంధంలో ఉంచారు. వృద్ధాప్యములో వచ్చే అనేక రుగ్మతలతో వున్న వరవరరావుకు రెండు సార్లు బెయిలు తిరస్కరించారు. రెండు రోజుల క్రితం ఆయనను జె.జె. ఆసుపత్రిలో చేర్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిస్థితిలో ఆయనను వెంటనే విడుదల చేసి మెరుగయిన చికిత్సకు ఏర్పాట్లు చేయవలసిందిగా ఈ వేదిక కోరుతోంది.


పై అబద్ధపు కుట్ర కేసులో ఇంకా 11 మంది సామాజిక కార్యకర్తలను ప్రభుత్వం అరెస్టు చేసింది. కోవిడ్-19 జాగ్రత్తల దృష్ట్యా వీరందరినీ కూడా వెంటనే విడుదల చేయాలని ఈ వేదిక డిమాండు చేస్తోంది.

**గౌతం ముఖర్జీ, (కోల్‌కతా), అధ్యక్షుడు**
**దివికుమార్, (విజయవాడ), ఉపాధ్యక్షుడు**
**కె.రవిబాబు, (విజయవాడ), ప్రధాన కార్యదర్శి**
**శియా శరణ్ శర్మ, (రాంచి), కార్యదర్శి**
**రమణ ప్రసాద్, (హైదరాబాదు) కోశాధికారి**

ఇట్లు
**అఖిల భారత ప్రజా సాహిత్య సాంస్కృతిక వేదిక (A.I.P.L.C.F)**
**31-5-2020**

**ఈ నెల పుస్తకం**

# మైత్రీ బుక్‌హౌస్, విజయవాడ
## అభ్యుదయ, విప్లవ సాహిత్యకేంద్రం
# జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం
**- డా॥ కొడవటిగంటి రోహిణీప్రసాద్**



గతితార్కిక భౌతికవాద దృక్పథంతో కొడవటిగంటి రోహిణీప్రసాద్‌గారు ప్రజాసాహితి, తదితర పత్రికలలో అనేక సైన్సు వ్యాసాలు రాశారు. జీవశాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన వ్యాసాలను ఎన్నుకుని 'జనసాహితి' 53 వ్యాసాల ఈ సంకలనాన్ని ప్రచురించింది.

'అత్యాధునిక జీవనశైలినీ, తెచ్చిపెట్టుకున్న పాశ్చాత్య సంస్కృతినీ అవలంబించే ఈ తరం మానసికంగా ఆటవికదశలో ఉందనేది మనం గుర్తించాలి. సామాజిక రుగ్మతలన్నిటికీ కారణం వర్గసమాజపు దుష్టశక్తులు కాగా వాటికి తోడవుతున్నవి మోడర్న్ వేషంలో ఉన్న మూఢనమ్మకాలూ, అవగాహనా రాహిత్యం, భౌతికవాద దృక్పథం లేకపోవటంవల్లనే' అంటారు రచయిత. 'మనిషి కారణజన్ముడా?' అన్న వ్యాసంతో మొదలైన ఈ సంపుటి విశ్వంలో మనిషి స్థానం, మెదడులోని దేవుళ్ళు, మతాలు - జన్యువులు, సూక్ష్మజీవులు, బాక్టీరియాలు, ప్రపంచవ్యాప్తంగా వైరస్‌ల దాడి వంటి 53 వ్యాసాలగుండా ప్రయాణించి, 'భౌతిక దృక్పథం ఆవశ్యకత' అన్న వ్యాసంతో ముగుస్తుంది. మన రోజువారీ దినచర్యలో ఎదుర్కొనే అనేక సందేహాలకు శాస్త్రీయ సమాధానాలతో సులభమైన భాషలో సాగుతూ భౌతికవాద దృక్పథాన్ని కల్పిస్తుందీ పుస్తకం.

1/8 డెమ్మీ, పుటలు : 207, వెల : రూ.60/- ప్రచురణ : జనసాహితి.

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్‌రోడ్డు,** విజయవాడ - **520002. ఫోన్ : 91779 79622** ✤

# చైతన్యవాహిని

## అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం మార్చి 8 సందర్భంగా సభ

అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం మార్చి 8 సందర్భంగా "మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు కారణమవుతున్న సామాజిక మూలాలను ప్రతిఘటిద్దాం" అని స్త్రీ విముక్తి సంఘటన ఇచ్చిన పిలుపు నందుకొని స్త్రీ విముక్తి సంఘటన, జనసాహితి సంస్థల ఆధ్వర్యంలో 8.3.2020న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం సెల్లార్ హాల్లో సభ జరిగింది. ఈ సభకు స్త్రీ విముక్తి సంఘటన జంటనగరాల శాఖ కన్వీనర్ వి. సృజన అధ్యక్షత వహించారు. శ్రామిక మహిళలు సాగించిన అనేక పోరాటాల నుంచి రూపుదిద్దుకున్న మార్చి 8 ప్రాధాన్యతను వివరించారు.

సభలో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సాధికారత గురించి దశాబ్దాల తరబడి పాలకులు మాట్లాడుతున్నప్పటికీ మహిళల జీవితాలు రోజు రోజుకీ దుర్భరమౌతూనే ఉన్నాయని, ఆడపిల్లల రక్షణ, భద్రతే ప్రశ్నార్థకంగా మారాయన్నారు. ఆడపిల్లలపై, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హింస ఎంత తీవ్రస్థాయికి చేరుకున్నాయో అనేక ఘటనల ద్వారా వివరించారు. స్త్రీలపై హింస పెరగడానికి పాలనా వ్యవస్థ వైఫల్యాలు అడుగడుగునా ఎలా కారణమవుతున్నాయో వివరించారు. తమ లాభాల కోసం కార్పొరేట్ శక్తులు మద్యం, మత్తు పదార్థాలు, సినిమాలు, టీవీ కార్యక్రమాల ద్వారా, ఇంటర్నెట్‌ల ద్వారా వ్యాప్తి చేస్తున్న సాంస్కృతిక కాలుష్యం, యువత మెదళ్లపై దాడి చేస్తున్న పోర్న్ సైట్లు మహిళలపై హింసాత్మక దాడులు పెరగడానికి ప్రధాన కారణంగా ఉన్నాయన్నారు. కానీ పాలకులు, అధికార యంత్రాంగం మాత్రం వీటి గురించి ఒక్కమాట కూడా మాట్లాడకుండా నేరము – శిక్ష చుట్టూ పరిష్కారాలు చూపిస్తూ ప్రజల ఆలోచనల్ని పక్కదారి పట్టిస్తున్నాయని అన్నారు. రోజు రోజుకీ పెరుగుతున్న వలసలు, నిరుద్యోగం, ఆకలి, ఆకలి చావులు, నేరాలు మహిళల్ని లైంగిక సరకుగా మారుస్తున్నా యన్నారు. అసంఘటిత రంగంలో లక్షలాది మంది శ్రామిక మహిళలు పనిచేస్తూ లైంగిక దోపిడీకి ఎలా గురవుతూ ఉన్నారో చెప్పారు. చిల్లర వర్తకంలో కార్పొరేట్ సంస్థలు ప్రవేశించి మహిళలకి తాము చేసుకునే చిన్న చిన్న పనులు కూడా లేకుండా చేస్తున్నాయన్నారు. గుత్త పెట్టుబడిదారీ శక్తులకి, సామ్రాజ్యవాద కంపెనీలకి అనుకూలంగా పాలకులు అనుసరిస్తున్న విధానాలు మహిళల జీవితాల్ని దుర్భరం చేస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ పేరిట, వన్యప్రాణుల సంరక్షణ పేరిట ఆధిపత్య దేశాల అనుకూల విధానాల్ని అనుసరిస్తున్న పాలకులు ఆదివాసీలను అడవుల నుండి వెళ్లగొట్టాలని చూస్తున్నారన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో కాలుష్య నివారణ కోసం వెనుకబడిన దేశాలు కార్బన్ ఫారెస్ట్‌లను పెంచాలని చెబుతూ, అక్కడ నివసించే ప్రజల్ని వెళ్లగొట్టాలని చూస్తున్నారని,అభివృద్ధి పేరుతో జరగబోయే ఈ విధ్వంస చర్యలవల్ల మహిళల జీవితాలపై హింస మరింత పెరుగుతుందన్నారు. అసమానతల్ని తీవ్రతరం చేస్తున్న వ్యవస్థలని మార్చుకోకపోతే స్త్రీలపై హింస తగ్గదని, హక్కుల్ని పరిరక్షించుకోవడం సాధ్యంకాదని, మానవీయ సమాజాన్ని రూపొందించుకోవాలంటే పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రముఖ రచయిత్రి డా॥ బి. విజయ భారతి మాట్లాడుతూ స్త్రీలపై అణచివేతకు కారణమయిన పూర్వం నుంచి వస్తున్న అనేక ఆచారాలు మారాల్సిన అవసరం ఉందన్నారు. అనేక రంగాల్లో స్త్రీలు భాగస్వాము లవుతున్నప్పటికీ ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. వీరేశలింగం పంతులుగారు, ఇంకా అనేకమంది సంఘసంస్కర్తలు స్త్రీ విద్య కోసం, మూఢనమ్మకాల్ని నిర్మూలించడం కోసం కృషి సాగించారని, ఆ దిశగా ఇంకా కృషి జరగాలని అన్నారు. శ్రామిక మహిళకు విముక్తి కలిగించే పోరాటాలు కావాలని, అందుకోసం కమ్యూనిస్టు భావజాలంతో పాటు అంబేద్కర్ భావజాలాన్ని కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి మాట్లాడుతూ స్త్రీలపై హింస పెరగడానికి సినిమాలు, టీవీల్లో వస్తున్న కార్యక్రమాలు, సీరియళ్లు ప్రధాన కారణంగా ఉన్నాయని, సెన్సార్ బోర్డులు ఎందుకు వీటిని అదుపు చేయడంలేదని ప్రశ్నించారు. ఆచారాలు, సంప్రదాయాల పేరిట మూఢత్వాన్ని పెంచే రకరకాల ఫంక్షన్లు కూడా ఎమోషనల్‌గా స్త్రీలను వివక్షాపూరితంగా తయారు చేస్తున్నాయన్నారు.

జనసాహితి జంటనగరాలశాఖ కార్యదర్శి డాక్టర్ భట్టు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మహిళలు అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కుల్ని కూడా ప్రభుత్వాలు సరిగా అమలుచేయడంలేదని అన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, సాంస్కృతిక విధానాలు మహిళల జీవితాల్ని హింసాపూరితం చేస్తున్నాయన్నారు.

స్త్రీ సంఘటన పత్రిక ఎడిటర్ ఎం. లక్ష్మి మాట్లాడుతూ మహిళలు పోరాటాల ద్వారా మాత్రమే హక్కుల్ని సాధించుకున్నారని, నేటికీ మహిళలు తమ జీవితాల్ని విధ్వంసం చేస్తున్న పాలకుల విధానాలకు, దోపిడీకి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో తమ నిరసనల్ని, పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని అన్నారు. ఆచారాలు, సంప్రదాయాల పేరిట సమాజంలో మూఢత్వాన్ని పెంచి పోషించడంలో గల పాలకుల, ఆధిపత్య శక్తుల దోపిడీ ప్రయోజనాల్ని అర్థం చేసుకోవాలన్నారు. స్త్రీలపై హింసని తీవ్రతరం చేస్తున్న వ్యవస్థీకృత మూలాల్ని అర్థం చేసుకొని, స్త్రీలు స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో జీవించగలిగే నూతన ప్రజాస్వామిక సమాజం కోసం ఉద్యమించాలన్నారు.

**8 మార్చి 2020న చోడవరంలో** స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో శ్రామిక మహిళా పోరాటదినం సందర్భంగా సభ జరిగింది. ఈ సభకు స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యులైన శ్రీమతి ఓ.వి.వి.ఎస్. కుమారిగారు అధ్యక్షత వహించగా, జనసాహితి, విశాఖ జిల్లా అధ్యక్షులు శ్రీ ఐ.టి.ఆర్.వి. శివాజీ రావుగారు ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఆయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ శ్రామిక మహిళా దినోత్సవ స్ఫూర్తిని మహిళలకు అందకుండా పెట్టుబడిదారీవ్యవస్థ ఒక ఎంజాయ్‌మెంట్ చేసే రోజుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఫ్యాక్టరీలలో పనిచేసే మహిళా కార్మికులకు ఫ్యాషన్‌షోలు, ర్యాంప్‌వాక్‌లు, ఆటలు మరియు పాటల పోటీలు నిర్వహించడం ద్వారా శ్రామిక మహిళలకు నిజమైన చైతన్యాన్ని, స్ఫూర్తిని అందకుండా చేస్తున్నారన్నారు. ఆర్థిక సంక్షోభం తీవ్రతరం అవుతున్న ఈ సందర్భంలో దాని ప్రభావం అణగారిన వర్గాలపై మరీ ముఖ్యంగా ఆ కుటుంబాలలోని మహిళలపై మరింత తీవ్రంగా పడుతుందని తద్వారా మహిళలు మరింతగా అణచివేతకు గురవుతారని అన్నారు. కార్పొరేట్‌వర్గాలు పేదవర్గాల నుంచి మరింతగా శ్రమను పిండుకోవాలి అనే ఉద్దేశ్యంతో కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఈ కారణంగా శ్రామిక మహిళలు తీవ్రమైన శ్రమదోపిడికి గురవుతున్నారనీ, మహిళలు మరింతగా ఐక్య పోరాటాలు చేయవలసిన సందర్భాన్ని ఈ కాలం డిమాండ్ చేస్తున్నదని, ఆ దిశగా మహిళలు చైతన్యవంతం కావాలని అన్నారు.

**చౌదరి సత్యనారాయణ కాలనీ, శ్రీకాకుళం :**

స్త్రీ విముక్తి సంఘటన, శ్రీకాకుళంజిల్లాశాఖ ఆధ్వర్యంలో శ్రామిక మహిళా పోరాట దీక్షాదినం మార్చి 8న సభను నిర్వహించింది. పాలిటెక్నిక్ కాలేజీ నుండి లక్ష్మీటాకీస్ వరకు ఊరేగింపుగా వచ్చి లక్ష్మీటాకీస్ నుండి 7 రోడ్ల కూడలికి కాగడాల ప్రదర్శన నడిపించారు. 7 రోడ్ల కూడలిలో కాగడాలతో మానవహారంగా ఏర్పడి మహిళలపై దాడులకు నిరసనగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర నాయకురాలు కా॥ టి. అరుణ మాట్లాడుతూ – ఎన్ని చట్టాలు వచ్చినా అవన్నీ నోటితో పొగిడి, నొసలుతో వెక్కిరించే చందమనీ, సాంస్కృతిక కాలుష్యాన్ని వెదజల్లుతున్న వివిధ సామాజిక మాధ్యమాలను అదుపు చేయకుండా, మద్యనిషేధాన్ని అమలుచేయకుండా మహిళల స్థితిగతులు మెరుగుపడవని అన్నారు. స్త్రీ విముక్తి సంఘటన సభ్యురాలు తవిటమ్మ మాట్లాడుతూ ఇంటి నుండి బయటకు వచ్చిన మహిళ ఏ వయస్సువారైనా తిరిగి ఇంటికి క్షేమంగా చేరే సాంస్కృతిక వాతావరణం మనకి లేదని అన్నారు. ప్రజాసాహితి సంపాదకుడు – పి.ఎస్.నాగరాజు మాట్లాడుతూ – ఇటీవల మహిళలపై లైంగికదాడులూ, కుటుంబ రాజ్యహింస పెచ్చుమీరిపోతున్నాయన్నారు. పితృస్వామిక భూస్వామ్య సంస్కృతికీ, విచ్చలవిడి సామ్రాజ్యవాద సంస్కృతికీ వ్యతిరేకంగా పీడిత, శ్రామిక మహిళలంతా నూతన ప్రజాతంత్ర పోరాట సంస్కృతిని బలపరచాల్సిన కూడలిలో వున్నామని అన్నారు. ప్రజాకళాకారులు, జనంపాటలతో చైతన్యపూరిత వాతావరణాన్ని తీసుకొచ్చారు. మహిళా చైతన్యం వెల్లివిరిసే నినాదాలు మిన్నుముట్టాయి.

**విజయవాడ :** మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దీక్షాదినం సందర్భంగా మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు కారణ మవుతున్న సామాజిక మూలాలను ప్రతిఘటిద్దాం! అంటూ విజయవాడ శిఖామణి సెంటర్‌లో వున్న చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో స్త్రీ విముక్తి సంఘటన కృష్ణాజిల్లా శాఖ సభను నిర్వహించింది. ఈ సభకు జిల్లా అధ్యక్షురాలు వి. రాధిక అధ్యక్షత వహించారు. స్త్రీ.వి.సం. రాష్ట్ర అధ్యక్షురాలు సి. విజయ మాట్లాడుతూ మహిళలపై నిరంతరాయంగా సాగుతున్న హింస, అత్యాచారాలు, హత్యలు పరంపరలో స్వప్నిక – ప్రణీతలపై యాసిడ్ దాడి, అయేషా మీరా, నిర్భయ, దిశ ఘటనలు మొదటవీ, చివరవీ కావన్నారు. సమాజంలో హింసను ప్రేరేపించే స్త్రీలను సెక్స్ సింబల్‌గా చూసే దోపిడీ విషసంస్కృతి వ్యవస్థీకృతమై ఉన్నదనీ, సరైన చైతన్యంతో అర్థం చేసుకుంటూ సంఘటితంగా ఉద్యమించా లన్నారు. ఓపిడిఆర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ స్త్రీల రక్షణ కోసం వున్న చట్టాల గురించి వివరించారు. వివిధ సంఘటనల సందర్భంగా అనేక చట్టాలను చేశారు కానీ నిర్భయ, పోక్సో, ఇటీవల దిశ చట్టం వరకూ ఎన్ని చట్టాలు చేసినా స్త్రీలపై హింస, అత్యాచారాలు ఆగటంలేదని, చట్టాలు మాత్రమే సరిపోవనీ, స్త్రీలలో సంఘటిత చైతన్యం కావాలన్నారు. జనసాహితి అధ్యక్షులు దివికుమార్ మాట్లాడుతూ సమాజంలో వ్యవస్థీకృతమై వున్న పితృస్వామిక భావజాలం స్త్రీలకు అడుగడుగునా హింసకు గురిచేస్తుందన్నారు. మత్తుపదార్థాలు, మద్యం, పోర్ను సైట్స్, సినిమా, టీవీల ద్వారా వ్యాప్తిచేస్తున్న హీన విలువలు స్త్రీలపై హింసాత్మక దాడులకు కారణంగా వున్నాయన్నారు. విషసంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం వుందన్నారు. మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దీక్షాదినంగా ఎందుకు ఏర్పాటు చేసుకున్నారో గుర్తుచేస్తూ, ఆ స్ఫూర్తితో మరింత చైతన్యవంతమైన ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం వుందన్నారు. స్త్రీ.వి.సం. ఎస్.లక్ష్మి వేదిక మీదకు ఉపన్యాసకులను ఆహ్వానించారు. ✤






## సాహితి వారి ప్రతిష్టాత్మక ప్రచురణలు

**టాల్ స్టాయ్ సాహిత్యం**

**1. యుద్ధము – శాంతి నవల :** అనువాదం : రెంటాల గోపాలకృష్ణ, బెల్లంకొండ రామదాసు. 1/8 డెమ్మిలో 960 పుటలు. వెల : రు. 600/- ముద్రణ : సెప్టెంబరు 2019.

**2. అన్నా కెరనీన నవల** అనువాదం : ఆర్వియార్. 1/8 డెమ్మిలో 896 పుటలు. వెల : రు. 500/- ముద్రణ సెప్టెంబరు 2018.

**3. నవజీవనం నవల అనువాదం :** పురాణం కుమార రాఘవశాస్త్రి. 1/8 డెమ్మి. 368 పుటలు. వెల : రు. 200/- ముద్రణ: సెప్టెంబర్ 2018

**4. విషాద సంగీతం మరి కొన్ని కథలు.** అనువాదం : ఆర్వియార్ 1/8 డెమ్మిలో 272 పుటలు. వెల : రు. 150/- ముద్రణ : సెప్టెంబర్ 2018

**5. ఇవాన్ ఇవిచ్‌మృతి మరి కొన్ని కథలు :** అనువాదం: బెల్లంకొండ రామదాసు. 1/8 డెమ్మిలో 176 పుటలు. వెల : రు. 100/- ముద్రణ : సెప్టెంబర్ 2018

**6. సంసార సుఖం మరియు మేడిపళ్ళు :** అనువాదం : రెంటాల గోపాలకృష్ణ 1/8 డెమ్మిలో 144 పుటలు. వెల : రు. 75/- ముద్రణ : సెప్టెంబర్ 2018

**7. కోడి గుడ్డంత ధ్యానపు గింజ మరికొన్ని కథలు.** అనువాదం : భమిడిపాటి కామేశ్వరరావు. 1/8 డెమ్మిలో 136 పుటలు. వెల : రు. 70/- ముద్రణ. సెప్టెంబర్ 2018

**8. ఆత్మజ్యోతి** వెల : రు. 30/- ముద్రణ : సెప్టెంబర్ 2018

**9. ఇద్దరు మిత్రులు :** నీతి కథలు. 1/8 క్రౌన్ 160 పుటలు. ఆర్ట్ పేపర్. వెల : రు. 150/- పంచ రంగుల బొమ్మలతో ముద్రణ : సెప్టెంబర్ 2019

ప్రతులకు : సాహితి ప్రచురణలు, 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్. రోడ్డు, చుట్టుగుంట, విజయవాడ-520004. ఫోన్ : 81210 98500. 0866 – 24366402/403

**నా కవితల ఖదరే వేరు :** కవితా సంకలనం

కన్నడమూలం : కె.ఎస్.నిసార్ అహ్మద్, అనువాదం : స.రఘునాథ.

కన్నడంలో నిత్యోత్సవం (1968లో రాసిన) కవిత ద్వారా బహుళ ప్రాచుర్యం పొందిన కవి కె.ఎస్.నిసార్ అహమద్‌గారి అనువదించబడిన 112 కవితలు, మెరుపులుతో కూడిన సంకలనం ఇది.

1/8 డెమ్మిలో 244 పుటలు. వెల : రూ. 275/- ముద్రణ : 2019. ప్రతులకు : నదోజ ప్రొ. కె.ఎస్.నిసార్ అహ్మద్, 341, హమీద్ హైదర్, 7వ క్రాస్, పద్మనాభనగర్, బెంగుళూరు – 560070.

**భీమా కోరెగాం 12 – వివి, వ్యాసాలు, నివేదికల సంపుటి**

– రచయిత : ఎన్. వేణుగోపాల్

భీమా కోరెగాం హింసాకాండ కేసు పూర్వాపరాల గురించి 2018 ఫిబ్రవరి నుండి 2019 ఫిబ్రవరి వరకు వేణుగోపాల్ చేసిన రచనల్లో నుండి ఏర్చి కూర్చిన 12 రచనల సంపుటి ఇది.

1/8 డెమ్మీలో 71 పుటలు. వెల : రూ.50/- ముద్రణ : ఫిబ్రవరి 2019.

ప్రతులకు : వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ 3-6-394, స్ట్రీట్ నెం : 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029. ఫోన్ : 040-66843495 మరియు ప్రముఖ పుస్తక కేంద్రాలలో.

**సహచరులు :** వరవరరావు జైలు లేఖలు

వరవరరావు మొదటిసారి 1973లో అరెస్టయినాడు. ఆ తర్వాత చాలాసార్లు పాలకులు తప్పుడు ఆరోపణలతో నిర్బంధించబడుతూనే వున్నారు. ప్రస్తుతం గత రెండు సంవత్సరాలుగా భీమా కోరెగాం కేసులో నిర్బంధించబడి వున్నారు. గతంలో అరెస్టయినపుడు ఆయన రాసిన కవితామయ లేఖల సంపుటి ఈ 'సహచరుల'ను పునః ప్రచురించారు.

1/8 డెమ్మీలో 120 పుటలు. వెల : రూ.100/- ప్రచురణ : 1989, ఫిబ్రవరి 2019. ప్రతులకు : పి. హేమలత, ఫ్లాట్‌నెం : 419, హిమసాయి హైట్స్, స్ట్రీట్ నెం : 6, జవహర్‌నగర్, గాంధీనగర్, హైదరాబాద్ – 500020.

**అన్వేషణ :** డా॥ పాపినేని శివశంకర్ సాహిత్యశీలన : సంపాదకులు : బండ్ల మాధవరావు

శివశంకర్‌గారి సాహిత్యాన్ని గురించి, వ్యక్తిత్వాన్ని గురించి ప్రముఖులైన 68 మంది సాహిత్యకారులు అందించిన వ్యాసాలు, ఆయన జీవిత విశేషాలు, భగవాన్ కళాశాలవారు రాసిన అక్షరాంజలితో కూడిన సంకలనం.

382 పుటలు. వెల : రూ. 150/- ప్రచురణ : 21 ఫిబ్రవరి 2019. ప్రతులకు : డా॥ పాపినేని శివశంకర్, 3/6, విద్యానగర్, గుంటూరు – 522007. ఫోన్ : 8500884400.

**మోహనస్మృతి,** మిత్రుల జ్ఞాపకాల సంకలనం : సంపాదకుడు సిద్ధార్థ, మోహనరెడ్డి మిత్రులు.

తెలంగాణా సాయుధ పోరాటం ప్రభావపు గ్రామంలో కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన విశ్వవరం మోహనరెడ్డి, నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల ఉత్తేజంతో విప్లవ విద్యార్థి సంఘంలో కోదాడలోనూ అక్కడ నుండి ఢిల్లీ జె.ఎన్.యూ. విద్యార్థిగా ఆ యూనివర్శిటీలోనూ పనిచేశారు. ఆ తర్వాత నూతన అవగాహనతో జాతి విముక్తి పోరాటాన్ని, విప్లవ పార్టీ నిర్మాణాన్ని చేపట్టారు. మోహన్ మిత్రులు ఆయనను స్మరించుకుంటూ రాసిన 23 వ్యాసాల సంకలనం ఇది.

1/8 డెమ్మీలో 100 పుటలు. వెల : రూ.80/- ముద్రణ : ఆగస్టు 2019.

ప్రతులకు : సిద్ధార్థ, నెం.301, మిత్రా టవర్స్, డొంకరోడ్డు, పోరంకి, విజయవాడ – 521137. ఫోన్ : 92475 75436.

**నా కోసం ఎదురు చూడు.... అరుణోదయ రామారావు స్మృతిలో :** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య

అరుణోదయ రామారావు పరిచయం అవసరంలేని విప్లవ గాయకుడు. విప్లవ సాంస్కృతికోద్యమ కార్యకర్త, నాయకుడు. ఆయనను స్మరించుకుంటూ ఆయన సహచరులు, మిత్రులు సాంస్కృతికరంగం, సాహిత్యరంగం, పాత్రికేయరంగం, అధ్యాపక, ఉద్యోగరంగాలు, హక్కులరంగం, ప్రజారంగాలు, రాజకీయరంగం మొదలగు రంగాల నుండి అందించిన వ్యాసాల సంపుటి. ఆయన సంస్మరణ సభలో (17-5-2019)న ఆవిష్కరించబడినది.

1/8 డెమ్మీలో పుటలు : 264, వెల : రూ.150/- ప్రచురణ : మే 2019. ప్రతులకు : మార్క్స్ భవన్, 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ - 44.

**గతితార్కిక భౌతికవాద కోణం నుంచి పదార్థము - ప్రకృతి - పరమాత్మ (పదార్థమే యదార్థము)** - రచయిత : పెండ్యాల లోకనాథం.

లోకనాథం ఈ పుస్తకాన్ని 1981లోనే 'పదార్థమే యదార్థము' పేరుతో రచించారు. ముద్రణ కాకుండానే ఆయన మరణించారు. హేతుబద్ధంగా విషయాలను తర్కించాలి. ప్రశ్నించాలి. అధ్యయనం చేయాలన్న ఉద్దేశ్యంతో వారి అబ్బాయి సత్యనారాయణ ప్రచురించారు.

1/8 డెమ్మీలో 170 పుటలు, వెల : రూ.140/- ప్రచురణ : నవంబర్ 2019. ప్రతులకు : నవోదయ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, 3-3-859/1/బి, మొదటి అంతస్తు, ఆర్యసమాజం ఎదురుగా, కాచిగూడ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ - 500027, ఫోన్ : 040-24652387.

**శాస్త్రీయ దృక్పథం - మానవ మనుగడ (శాస్త్రీయ, వ్యాస సంకలనం) :** రచన, సంకలనం - పసల భీమన్న

ఈ పుస్తకంలో వివిధ పత్రికల్లో ప్రచురింపబడిన 22 వ్యాసాలున్నాయి. శాస్త్రీయ దృక్పథం, హేతువాదం, మార్క్సిజం, మానవవాదం, మతవాదం, శ్రమదోపిడి, విద్యావిధానం మొదలైన వ్యాసాలున్నాయి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, శాస్త్రీయ భావజాలం ప్రచారవ్యాప్తిలో ఉపకరించగల పుస్తకం.

1/8 డెమ్మీలో 152 పుటలు. వెల : రూ.90/- ప్రచురణ : 2019. ప్రతులకు : పసల భీమన్న, ఇం.నెం. 79-8-9/1, పోస్టల్ కాలనీ, శ్యామలా నగర్, రాజమండ్రి - 533103, ఫోన్ : 94901 23276.

**కొత్త క్యాలెండర్ (కవిత్వం)** - డా॥ రావి రంగారావు

రావి రంగారావు తెలుగు సాహిత్య, భాషా, విద్యారంగాల్లో విశేషమైన కృషిచేశారు. మచిలీపట్నం 'సాహితీమిత్రులు' సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులుగా వున్నారు. 'యువ కవిత' త్రైమాసిక పత్రికను ఎనిమిదేళ్ళపాటు నడిపారు. ప్రస్తుతం 'రావి రంగారావు సాహిత్యపీఠం'ను నిర్వహిస్తున్నారు. అనేక కవితా సంపుటాలను ప్రచురించారు. పురస్కారాలు పొందారు. వివిధ పత్రికలలో ఆయన రాసిన 80 కవితలతో కూర్చిన సంకలనం ఇది.

1/8 డెమ్మీలో 112 పుటలు. వెల : రూ. 100/- ప్రచురణ : జూలై 2019. ప్రతులకు : నర్రా ప్రభావతి, కన్వీనర్, రావి రంగారావు సాహిత్య పీఠము, 101 శంఖచక్ర నివాసం, అన్నపూర్ణానగర్, 5వ లైను, తూర్పు గోరంట్ల, గుంటూరు - 522034, ఫోన్ : 92475 81825.

**నాన్నా నీకు నూరేళ్ళు.... :** కవితా సంకలనం : రచయిత - డా॥ సమ్మన్న ఈటెల

సమ్మన్నగారు అమ్మ, నాన్నల మీద రాసిన కవితలతోపాటు సామాజిక సంఘటనల మీద, సందర్భాల మీద రాసిన మరో ఇరవై ఎనిమిది కవితలతో కూడిన సంకలనం.

1/8 డెమ్మీలో 72 పుటలు, వెల : రూ. 80/- ప్రచురణ : ఆగస్టు 2019. ప్రతులకు : డా॥ సమ్మన్న ఈటెల, 207, సిరి రెసిడెన్సీ, వీధి నెం. 2, తార్నాక, హైదరాబాద్ - 17, ఫోన్ : 98852 38654.

**పడమటిగాలి పాట** (ఆంగ్ల కవితల అనువాదం) : అనువాదం - డా॥ ముద్దు వెంకటరమణారావు

14వ శతాబ్ధం నుండి 1940 వరకు వెలువడిన ఆంగ్ల కవిత్వాలలో ఎంచుకుని, అనువదించిన 96 కవితలతో ఈ పుస్తకాన్ని సంకలనం చేశారు.

1/8 డెమ్మీలో 264 పుటలు, వెల : రూ. 150/- ప్రచురణ : ఆగస్టు 2019. ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్ - 500036. ఫోన్ : 98487 87284.

**నీళ్ళగోస,** కవితా సంకలనం : సంపాదకులు - బైస దేవదాసు

'నేటి నిజం' పత్రికలో సాహిత్య పేజీలో నీటి అవసరాన్ని గుర్తిస్తూ వచ్చిన 101 కవితల సంకలనం ఇది.

1/8 డెమ్మీలో 104 పేజీలు, వెల : రూ. 150/-, ప్రచురణ : 2019. ప్రతులకు : 'నేటినిజం' తెలుగు దినపత్రిక, ఎస్.ఆర్.టి - 74, జవహర్‌నగర్, హైదరాబాద్ - 20. ఫోన్ : 040-27662477

**తొవ్వ ముచ్చట్లు (భాగం రెండు) :** రచయిత - జయధీర్ తిరుమలరావు. సంపాదకులు : ఎ.కె. ప్రభాకర్

'ఆంధ్రభూమి' దినపత్రికలో జయధీర్ తిరుమలరావు రాస్తున్న ముచ్చట్లు తొలిభాగం 22 మే 2011లో ప్రచురించారు. దాని కొనసాగింపుగా ఇది రెండవ భాగం. త్వరలోనే మూడవ సంపుటిని కూడా తీసుకొస్తామని సంపాదకులు హామీ ఇచ్చారు. కళాసాహిత్య, సాంస్కృతికరంగాల్లో పనిచేస్తున్న వ్యక్తులు, సంస్థలు, పత్రికలు, సంఘాల 59 తొవ్వలను జయధీర్ తిరుమలరావు ఈ సంకలనంలో పరిచయం చేశారు.

1/8 డెమ్మీలో పుటలు : 252, వెల : రూ. 150/- ప్రచురణ : ఫిబ్రవరి 2017. ప్రతులకు : సాహితీకేంద్రం, 402, ఘరోండా అపార్టుమెంట్స్. ఉస్మానియా యూనివర్శిటీ మెయిన్‌గేట్-1 దగ్గర, డి.డి.కాలనీ, హైదరాబాద్ - 500007. **(ఇంకా వున్నాయి)** ✤

కవిత

# అబార్షన్

- ఓవీవీఎస్ లక్ష్మీకుమారి

మరో ఆరునెలల్లో
నా గర్భంలోని పసిపాపకు జన్మనిచ్చి
చనుబాలతో బుద్ధిని, బలాన్ని రంగరించి
లాలనలో ధైర్యాన్నీ, మురిపెంలో మంచిని పంచి,
అమ్మమ్మల, తాతయ్యల అనుభవాల
జీవితసారాన్ని అందించి పెంచి పెద్దజేసి
ఈ దోపిడి చరిత్రను తిరగరాయించాలన్న నా కలను
ఆ కాళరాత్రి నిర్దాక్షిణ్యంగా తుంచేస్తూ స్టైరిన్ వాయువు
పక్షిగూట్లో చొరబడ్డ పాములాగ పొట్టలో చేరి
జీవం సంతరించుకుంటున్న నా బిడ్డ గొంతు నులిమేస్తుంటే
కాపాడుకోలేని నా నిస్సహాయత ముందు
భ్రూణహత్యలు, మాల్‌న్యూట్రిషన్ల చావులు
శ్రామిక వనాలలో రాలిపోతున్న పసిమొగ్గలన్నీ
నా వైపు జాలిగా చూశాయి.
మా ఫెర్టిలిటీని ఫణంగా పెట్టి
మీ పెట్టుబడుల లాభాలు పిండుకుంటామంటే
ఇంత జరిగాక మేం సహించం
అక్రమ పర్మిట్లు, రాయితీల కోరలు మొలిపించి
విధ్వంస పెట్టుబడుల పడగనీడల్లో
పడి ఉండమంటే అస్సలే సహించం
మేము పురిటినొప్పులు పడేది
మా దేశ భవిష్యత్తరాల అభ్యున్నతి కోసం
మాది కాని అభివృద్ధి మాటున
చెలరేగిపోతున్న మీ చీకటి వ్యాపారం
మా దేశ భవిష్యత్తునే అబార్షన్ చేసే
ఎక్స్‌గ్రేషియాల ఎంగిలిమెతుకులు దులిపేద్దామనుకుంటే
సహించంగాక సహించం.
కోటి రూపాయల చెక్కులు కాదు కావలసింది
మేము నాటిన మొక్కలు
మా కళ్ళముందే మహావృక్షాలై ఎదగాలి
మా వాడలలో మాడిపోయిన పచ్చదనమే
నాటి భోపాల్ నుండి నేటి స్టైరిన్ వరకు
మీ దౌర్జన్యాలకు ఆనవాలు
అభివృద్ధి దొంగజపాలతో విస్తరిస్తున్న
మీ దోపిడీ, అవినీతి పాలనకు
చరమగీతం పాడనున్నాం కాచుకో.











PRAJAA SAAHITHI April-July, 2020 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/0571 Postal Regd. No. Vj/030/2018-2020
No. of Pages : 84 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

పాట

# వలస పాట

– ఆదేశ్ రవి



పిల్లజెల్లా ఇంటికాడ ఎట్లవున్రో
నా ముసలితల్లి ఏమిపెట్టి సాదుతుందో

పూటపూటా చేసుకొని బతికెటోల్లం
పూటగడువ ఇంత దూరం ఒచ్చినోల్లం

దేశమేమో గొప్పదాయే
మా బతుకులేమో సిన్నవాయే
మాయదారి రోగమొచ్చి
మా బతుకు మీద మన్నుబోసె
ఏమిబతుకు ఏమిబతుకు చెడ్డబతుకు చెడ్డబతుకు
చెడ్డబతుకు చెడ్డబతుకు చెడ్డబతుకు

పేదరోగం కంటె పెద్ద రోగముందా
అయినవాళ్ళ కంటె పెద్ద అండవుందా
కష్టకాలం ఇంటికాడ ఉంట సారూ
కలిసిమెలిసి కలోగంజో తాగెటోల్లం

పిల్లగాళ్ళు కన్నులల్ల ఇడువకుండా మెదులబట్టే
ఇంటిదాని దుక్కమేమో ఆగకుండా తరుమువట్టే
ఏమిజేతు ఏమిజేతు ఏమిజేతు ఏమిజేతు
ఏమిజేతు ఏమిజేతు ఏమిజేతు

బస్సులొద్దు బండ్లు ఒద్దు అయ్య సారూ
ఇడిసిపెడితే నడిసి నేను పోత సారూ
బస్సులొద్దు బండ్లు ఒద్దు అయ్య సారూ
ఇడిసిపెడితే నడిసి నేను పోత సారూ

ఇంటికాడ పిల్లజెల్లా ఎట్లవున్రో
నా ముసలితల్లి ఏమిపెట్టి సాదుతుందో
ఇంటికాడ పిల్లజెల్లా ఎట్లవున్రో
నా ముసలితల్లి ఏమిపెట్టి సాదుతుందో

ఇడిసిపెడితే నడిసి నేను పోత సారూ
ఇడిసిపెడితే నడిసి నేను పోత సారూ

ప్రజాసాహితి
30-7-6, అనపర్తివారి వీధి,
అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం
విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010.

ప్రింటెడ్ బుక్ బుక్‌పోస్ట్

To,

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI